
# బహుళ

## త్రైమాసిక అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక

సంపుటి - 2 సంచిక 5 https://www.bahulabyjwalitha.com అక్టోబర్ - డిసెంబర్ 2023

# ద్వితీయ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక
























www.bahulabyjwalitha.com

www.telugutalli.ca

# తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ మహిళా కథల పోటీకి ఆహ్వానం

బహుళ అంతర్జాల అంతర్జాతీయ త్రైమాసిక స్త్రీవాద పత్రిక, తెలుగు తల్లి కెనడా మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే కథల పోటీకి కథలకు ఆహ్వానం.

**అంశం :** తెలంగాణ చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించాలి.

**చివరి తేదీ :** 30 ఆగస్టు 2023.

**నిబంధనలు:** 1. కథలను యునికోడ్ లో కానీ వర్డ్ ఫైల్ కానీ పంపాలి., 2. (ఏ ఫోర్ సైజ్ పేపర్) 7 పేజీలు మించకుండా కథ ఉండాలి లేదా 2200 పదాలకు మించకుండా, అక్షర దోషాలు లేకుండా జాగ్రత్తగా చూసుకొని కథలు పోటీకి పంపండి, 3. ఒక్కొక్కరు ఒక్క కథ మాత్రమే పంపాలి. 4. కథ పై పేరు రాయకూడదు, 5. హామీపత్రంలో మీ కలం పేరు, అసలు పేరు, చిరునామా, ఫోన్ నెంబర్, ఈమైల్ ఐడి, మీ స్వంత రచన అని, ఈ పోటీ కొరకు రాసిన కథ అని రాయాలి. వ్యక్తిగత వివరాలతో పాటు మీ పాస్పోర్ట్ సైజ్ ఫొటో జోడించాలి. 6. పోటీకి పంపిన కథలతో సంకలనం వెలువడుతుంది. అంత వరకు వేరే పత్రికలకు పంపకూడదు.

## తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా (ఆగస్టు 2023)
## తెలంగాణ మహిళా కథల పోటీల ఫలితాలు

బహుళ అంతర్జాల అంతర్జాతీయ త్రైమాసిక స్త్రీవాద పత్రిక, కెనడా తెలుగు తల్లి మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీలో పాల్గొన్న కథకులందరికీ అభినందనలు. విజేతలకు శుభాకాంక్షలు.
కథల ఎంపికకు న్యాయనిర్ణేతల అభిప్రాయం మేరకు ప్రథమ బహుమతికి యోగ్యమైన కథలు గుర్తించబడలేదు. కనుక ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతితోపాటు ప్రత్యేక బహుమతులు ప్రకటించడమైనది.

**ద్వితీయ బహుమతి- ఘటన - వై మంజులత -4000/- తృతీయ బహుమతి- పర్వణి - కళా గోపాల్ -3000/- ప్రత్యేక బహుమతులుగా ఎంపికైన పది కథలకు ప్రతి కథకు 1000/-లు. 1) అసలైన కొడుకు - షహనాజ్ బతుల్ 2) మల్లమ్మ కథ - భవ్య చారు, 3) బతుకమ్మ - మంజితకుమార్, 4) ఇసపు పురుగుతో ఎన్నేళ్ళు సంసారం - తమ్మెర రాధిక, 5) సంతృప్తి - ఎం.టి. స్వర్ణలత, 6) ఒడిబియ్యం - దాసు శ్రీ హవిష, 7) నిమజ్జనం - మామిడాల శైలజ, 8) కెరటం - కే సుమలత, 9) నీటి చెలమ - కామరాజుగడ్డ వాసవదత్త రమణ, 10) లేత మొక్క - టివిఎల్ గాయత్రి**

ఎంతో ప్రయాసకోర్చి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ఫలితాలు వెల్లడించిన ప్రముఖ సాహితీవేత్తలు నాళేశ్వరం శంకరం గారికి, విమల గుర్రాల గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

**సూచన:** అతిత్వరలో జరిపే సభలో కథకులకు బహుమతి నగదులు, సర్టిఫికెట్స్ అందజేయబడతాయి.

# బానిసత్వం వదలాలంటే..?



"ఏ ప్రజల మధ్య జన్మించారో ఆ ప్రజలను ఉద్ధరించాలనే కర్తవ్యం తెలుసుకున్న వారే ధన్యులు. బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని పెంచటానికి ప్రశస్తమైన తమ జీవితకాలాన్ని వెచ్చించినవారు, ఆత్మ దేహదారుఢ్యాలను, తమ శక్తినంతా వినియోగించిన వారే ధన్యులు. మంచేరానీ, చెడే జరగనీ, సుఖమే గానీ, దుఃఖమేగానీ, మర్యాదలే జరగనీ అవమానాలే రానీ విశ్రమించమని శపథం తీసుకున్నవారే ధన్యులు' బాబా సాహెబ్ అంబేద్కర్ 1946లో అన్న మాటలు. కానీ మన దేశపరిస్థితికి ఇవి ఎప్పటికీ అవసరమే.

డిసెంబర్ 6న డాక్టర్ భీమ్ రావ్ రామ్ జీ అంబేద్కర్ 67వ వర్ధంతి సంధర్భంగా వారి మాటలను మనం ఒకసారి మననం చేసుకోవాలి. బాబా సాహెబ్ 55వ జయంతి సందర్భంగా 'జైభీమ్' పత్రిక 1946లో ఒక ప్రత్యేక సంచిక వెలువరిస్తూ వారి సందేశాన్ని ఇవ్వమని కోరింది. ఆ సందేశంలో బానిసత్వం వదులుకోవాలంటే ఏమి చేయాలో చెప్తూ ఒక కథ చెప్పారు.

వారి మాటల్లోనే:

"నా జన్మదినాన్ని జరపటం వ్యక్తిగతంగా నాకు ఇష్టంలేదు. నేను ప్రజాస్వామ్యవాదిని. వ్యక్తి ఆరాధనకు పూర్తి వ్యతిరేకిని. నాయకుని పట్ల ప్రశంస, ప్రేమ, గౌరవ మర్యాదలు తగినవాడయితే నాయకునికి, అభిమానులకూ మంచివే. కాని నాయకుని ఆరాధన మాత్రం ఒప్పుకోవటానికి వీల్లేదు. అది ఇద్దరినీ దిగజార్చివేస్తుంది. ఒకసారి రాజకీయ నాయకుణ్ణి ప్రవక్తగా చేసిన తర్వాత, ఆయన ప్రవక్త పాత్రను నిర్వహించవలసిందే, ప్రవక్తలా ఆయన సందేశం ఇవ్వవలసిందే.

ఈ సందర్భంగా గ్రీకు పురాణాలలో ఒక కథనుచెప్పి దాని నుండి నీతిని మాత్రం చెప్తాను, డెమెటర్ అనే గ్రీకు దేవతను హోమర్ కవి స్తుతిస్తూ వ్రాసిన ఒక పద్యంలో ఈ కథ ఉన్నది. డెమెటర్ కు రాసిన స్తోత్రం. ఆ మహాదేవత తన కుమార్తెను వెతుక్కుంటూ తిరుగుతున్న సందర్భంలో కెవియోన్ రాజదర్బారుకు ఒక ఆయా వేషం వేసుకొని వచ్చింది. ఆమెను ఎవరూ గుర్తుపట్టలేదు. మెటోనీరా మహారాణి అప్పుడే పుట్టిన తన కొడుకుని సాకటానికి ఆ దేవతను నియమించింది. ఆ పసివాని పేరు డెమోఫూన్, అతనినే తర్వాత ట్రిప్లోటోలెమో అని పిలిచేవారు.

ప్రతి రోజూ సాయంత్రం ఇంట్లో అందరూ నిద్రపోతూ ఉండేటప్పుడు దేవత ఆ పిల్లవాణ్ణి సుఖంగా ఉండే ఊయలలో నుంచి తీసి, బట్టలు తీసేసి కణకణమండే నిప్పులమీద పడుకోబెట్టేది. పైకి కఠినంగా కనిపించినా పిల్లవాని పట్ల ఆమెకు అమితమైన ప్రేమ ఉండేది. ఆ పిల్లవాడిని దేవుడిలా చేయాలని ఆమె ప్రయత్నం. ఆ పసివాడు ఆ మంటలను తట్టుకొనేవాడు. ఆ బాధ నుండి అతను శక్తి సంపాదించుకునే వాడు. అతనిలో ఒక మహాశక్తి సంపన్నుడు తయారవుతూ ఉండేవాడు. మహా మనీషిగా అతీతమైన తేజస్సును సంపాదించుకుంటూ ఉండేవాడు. కానీ పిల్లవాని తల్లి అయిన మెటోనీరా ఎంతో అతృత చెందుతూ ఒకరోజు సాయంత్రం తన కొడుకు ఎలా ఉన్నాడు చూడాలని హఠాత్తుగా తలుపులు తోసుకొని గదిలోకి ప్రవేశించింది. ఆయా చేస్తున్న ప్రయోగం చూసి హడలిపోయి, తప్పుగా అర్థంచేసుకొని, వెంటనే నిప్పులమీద కాగుతూ మహా శక్తివంతుడవుతున్న తన కొడుకుని పైకి లేవదీసి తీసుకు పోయింది. దాని ఫలితం ఏమంటే తన కొడుకుని కాపాడుకున్నది. కాని ఒక మహా మనిషిని కోల్పోయింది.

ఈ కథ ఏం చెబుతున్నదంటే గొప్పతనం అనేది కష్టాలు, త్యాగాల వల్లనే వస్తుంది అని. మంటల్లో కాలకుండా మానవత్వాన్ని గాని, దైవత్వాన్ని గాని పొందలేమని అనిపిస్తుంది. అగ్ని శక్తినిస్తుంది. అదేవిధంగా ఇక్కట్లు బాధలు కూడా. అణచివేతకు గురయిన ఏ వ్యక్తి కూడా పోరాటానికి బాధలకు సిద్ధపడకుండా గొప్పతనాన్ని పొందలేడు. సుఖాలను వదులుకోడానికి, భవిష్యత్తును నిర్మించుకోవటం కోసం ప్రస్తుత అవసరాలను సైతం అతను వదులుకోవటానికి సిద్ధమవ్వాలి. జీవన పరుగు పందెంలోకి అందర్నీ ఆహ్వానిస్తారు. కాని కొందరు మాత్రమే ఎంపిక అవుతారు. ఎందుకని? కారణం తెలిసిందే. అణచివేతకు గురైనవారు చాలామంది, ఈ జీవన పరుగు పందెంలో గొప్పతనం సంపాదించలేరు, ఎందుకంటే వారి భవిష్యత్తు అవసరాల కోసం – ప్రస్తుత సుఖాలను వదులుకొనే ధైర్యంగాని, నిశ్చయంగాని వారికి లేవు.

ఈ కథ అందించిన దానికంటే గొప్ప సందేశం ఇంక ఏముంటుంది? 'పోరాటం చేయండి. ఎన్నో పోరాటాలు చేయండి. త్యాగాలు చెయ్యండి. ఇంకా త్యాగాలు చెయ్యండి' అనేదే నా సందేశం. బాధలను లెక్కచేయకుండా పోరాటం చెయ్యండి. పోరాటమొక్కటే విముక్తిని తీసుకువచ్చేది. ఇక వేరే ఏదీ తీసుకు రాలేదు.

మీరంతా కష్టాలకు వ్యతిరేకంగా నిలబడి పోరాటం చేయటానికి ఒక్క ఉమ్మడి ఉద్దేశాన్ని పెంపొందించుకోవాలి. తమ కార్యక్రమం ఎంతో పవిత్రమైనదనే నమ్మకు ఉండాలి. తమ గమ్యాన్ని చేరుకోవటానికి ఒక ఉమ్మడి నిశ్చయాన్ని పెంచుకోవాలి" అని సందేశమిచ్చారు. –(బొజ్జాతారకం గారి నలుపు వ్యాసాలు నుండి).

2023 ఎన్నికల్లో మిగిలిన రాష్ట్రాల కంటే తెలంగాణ ప్రజలు అత్యంత చైతన్య వంతులని నిరూపించారు.

అవివేకులు, బలహీనులు మాత్రమే బానిసలుగా కొనసాగుతారు అంటాను నేను. మరిప్పుడు ఐక్యంగా ధైర్యంగా పోరాడవలసిందెవరో మీకర్థమై ఉంటుంది.

– జ్వలిత, ప్రధాన సంపాదకురాలు 9989198943.


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకురాలు**
జ్వలిత

**సంపాదక వర్గం**
డా. తిరునగరి దేవికీదేవి
అనిశెట్టి రజిత
డా. కొమర్రాజు రామలక్ష్మి
ఆచార్య సూర్య ధనుంజయ
ఆచార్య కె. ఆశాజ్యోతి
డా. వంగరి త్రివేణి
జి. విజయలక్ష్మి
డా. షాజహానా
కొల్లాపురం విమల
డా. గోగు శ్యామల
డా. నందిగామ నిర్మల కుమారి
డా. మారోజు దేవేంద్ర
నస్రీన్ ఖాన్
నాంపల్లి సుజాత
నిరుపమ
లావణ్య
రమాదేవి బాలబోయిన

**సాంకేతిక వర్గం**
చందన్ కలిత
టి. నరేష్ చైతన్య
కె. ప్రకాష్

**కార్యనిర్వాహక వర్గం**
జయింతి వాసరచెట్ల
సరోజన బోయిని
యడవల్లి శైలజ
సిస్టర్ అనసూయ
పోతన జ్యోతి


**బహుళ బహుజనస్త్రీలసమస్యలన్నింటినీ చర్చించే అవకాశం కల్పిస్తుంది. పత్రికలో ప్రచురించే రచనలతో సంపాదక వర్గం ఏకీభవించినట్టు కాదు.**

**రచనలు పంప వలసిన చిరునామా :** జ్వలిత, సాహితీవనం, 15-21-130/2, బాలాజీనగర్, కూకట్పల్లి, హైదరాబాద్ - 500072, తెలంగాణ
editorbahula@ gmail.com Cell : 9989198943


## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ముఖచిత్రం | గత సంచికల ముఖ చిత్రాలు | .............................................. 1 |
| 2. | పరిశోధన వ్యాసం | శివశరణి – అక్క మహాదేవి | – మడపటి వీణ (పరిశోధక విద్యార్థిని) 5 |
| 3 | కథ | ఘటన (తెలంగాణ మహిళా కథలపోటీలో ద్వితీయ స్థానం) | – మంజులభావన .......................... 8 |
| 4. | అనువాద కవిత్వం | ''ఏమీ లేదని ఎందుకు అనుకోవాలి'' | – అనుసృజన–గీతాంజలి ............... 16 |
| 5. | అనువాద కవిత్వం | ఇది చాలు నాకు ! | – అనుసృజన–గీతాంజలి ............... 16 |
| 6. | కవిత | స్నేహగీతం | – అనువాదం: హిమజ .................. 16 |
| 7. | సాంఘిక వ్యాసం | భూఆక్రమణ మారణహోమంలో సమిధలు | – భండారు విజయ, .................... 17 |
| 8. | కథ | పారసైట్స్ | – డా॥ తిరునగరి దేవకిదేవి ............ 23 |
| 9. | కవిత | ముత్యమంత ఆశ | – శీలా సుభద్రాదేవి ....................... 33 |
| 10. | పరిశోధన వ్యాసం | ముదిగంటి సుజాతారెడ్డి – యాత్రా కథన రచనలు | – ఆచార్య వి. త్రివేణి..................... 34 |
| 11. | బాలలకథ | రానియ్యరూ..! | – కన్నెగంటి అనసూయ ................ 42 |
| 12. | సమాచారం | అంతర్జాతీయ బాలికా దినోత్సవం | – అనూరాధ రావు ....................... 45 |
| 13. | బాల గేయం | బాల గేయం | – ఎ. రాజ్యలక్ష్మి .......................... 46 |
| 14. | బాల చరిత్ర | "రంగూ రేఖల మధ్య ఒదిగుండే స్మృతిదీపం – క్లింట్" | – మానస చామర్తి........................ 47 |
| 15. | కవిత | ఆమరణీయం! | – శైలజ మిత్ర ............................ 50 |
| 16. | సాహిత్య వ్యాసం | అమెరికాకు ఎగిరి వెళ్లిన 'తెలుగు భాష' | – డాక్టర్ కొండపల్లి నీహారిణి .......... 51 |
| 17. | బహుజన సాహిత్యం | దళిత షీరోల పోరాటాల చరిత్ర మిణుగురులు | – కొండవీటి సత్యవతి ................... 54 |
| 18. | కథ | "వర్జిన్..!" | – బి. కళాగోపాల్ ........................ 56 |
| 19. | కవిత | రంగులులేని నేల | – కడెం లక్ష్మీ ప్రశాంతి .................. 58 |
| 20. | సాహిత్య విమర్శ | 'ఈరోజుల్లో సాహిత్య విమర్శ'.. అంతంత మాత్రమేనా..! | – ప్రొ. సిహెచ్. సుశీలమ్మ.............. 59 |
| 21. | మ్యూజింగ్స్ | హైద్రాబాదుతో అనుబంధం | – స్వర్ణ కిలారి ........................... 60 |
| 22. | కవిత | సినాప్సెస్ | – రోహిణి వంజారి....................... 61 |
| 23. | అస్తిత్వ పరిచయం | చరిత్రలో స్త్రీ అస్తిత్వం స్త్రీ వాది డా॥ రుక్మాబాయి | – సేకరణ – జ్వలిత ..................... 62 |
| 24 | విశ్లేషణ | రేలపూలు కథాసంపుటి – విశ్లేషణ | – డా.ఎం.దేవేంద్ర......................... 64 |
| 25. | యాత్రారచన | నా నేపాల్ యాత్ర | – సుమతి చురుకంటి.................... 67 |
| 26. | పరిశోధన వ్యాసం | 'బతుకమ్మ' ఒడ్డెరాజుల కులదైవం | – డా॥ ఓసు రామలింగం ............... 70 |
| 27. | సాహిత్య రిపోర్ట్ | వైభవంగా డాక్టర్ సంధ్యా విప్లవ్ ''దాల్చ'' అను అసాధారణ మహిళల కథల సంపుటి ఆవిష్కరణ..!! | – ఎ.రజాహుస్సేన్..!! ................... 77 |
| 28. | కవిత | మేలి ముసుగులు | – వనితారాణి నోముల .................. 78 |
| 29. | సాహిత్య వ్యాసం | నవీకరించుకోవడం అవసరమే..!! | – నాంపల్లి సుజాత....................... 79 |
| 30. | కథ | కాల మహిమ | – డా. బండారి సుజాత.................. 81 |
| 31. | కవిత | నల్ల కలువ | – ఆవుల వెంకటరమణ ................ 85 |
| 32. | కవిత | స్త్రీలోటు | – సోని కట్కూరి .......................... 86 |
| 33. | కథ | భార్య మనసు | – తమ్మెర రాధిక.......................... 87 |
| 34. | కథ | ఒక విజేత కథ | – సేకరణ– తనూజ ...................... 93 |
| 35. | కవిత | మహిళా బిల్లు...! | – డాక్టర్మ. హమ్మద్ హసన్............. 94 |
| 36. | కవిత | ఇన్ని రోజులు | – సుజాత రామానుజం ................ 94 |
| 37. | | బాలబహుళ | ............................................... 95 |



# శివశరణి - అక్క మహాదేవి

- మడపటి వీణ, (పరిశోధక విద్యార్థిని)
ఫోన్ : 9885585565



శివకవి యుగం పురుషునితో సవమానమైన స్థానాన్ని స్త్రీకి కల్పించింది. స్త్రీకి మతపరంగా, విద్యాపరంగ, సామాజిక పరంగా గౌరవం, సమాన స్థానం లభించుటంతో స్త్రీలు తమను తాము నిరూపించుకునే అవకాశం కల్గింది.

శివకవి యుగం అనగా దక్షిణ భారత దేశంలో శైవం ప్రబలిన కాలం అని కూడా చెప్పవచ్చు. శైవం, వీరశైవ మతాలు విజృంభించినాయి. భౌద్ధం,జైన మతాలతో పాటు అనేక వైదిక మతాలు ప్రాబల్యాన్ని కోల్పోయినాయి. ఈ వీరశైవ మతంలో పురుషునితో సమానంగా స్త్రీలు దీక్షను తీసుకోవటం,శివ లింగాన్ని ధరించటం, రుద్రాక్షలను ధరించటం, ఓం నమ:శివాయ మంత్ర జపాన్ని జపించటం లాంటి నియమాలు స్త్రీలలో ఆత్మాభిమానాన్ని, గౌరవాన్ని పెంపొందించాయి.

వీరశైవ సాంప్రదాయానికి చెందిన మహనీయురాలు, గొప్ప శివ భక్తురాలు,వీర విరాగిణి, పండిత పవని, సాహితీ వేత్త అక్క మహదేవి.

అక్క మహదేవి 12, 13 శతాబ్దాల మధ్య కాలంలో కర్నాటకలోని బల్లిగామలోని ఉడుతడి గ్రామంలో వీరశైవ సంప్రదాయపరులైన సుమతి నిర్మల శెట్టి దంపతులకు జన్మించింది. చాలా కాలం వరకు సంతానం కాక పోవటంతో ఆ పుణ్య దంపతులు చేసిన శివారాధన, వ్రతాల పుణ్యఫలం వలన అక్క మహాదేవి జన్మించింది.

పార్వతీ దేవిని, రూపవతి, గుణవతి, శివభక్తి గల పుత్రికను ప్రసాదించమని కోరగా వారికి అక్క మహదేవి జన్మించటంతో సాక్షాత్తు ఆ పార్వతీ దేవి జన్మించిందనీ ఆ దంపతులు ఎంతో సంతోషించారు.

మహాదేవికితల్లి దండ్రులు లింగాధారణ, విభూతి రుద్రాక్షధారణ చేసి గురువు చేత పంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశించారు. చాలా చిన్న వయస్సులోనే ఆమె మతపరమైన నిష్ఠ నియమాలను ఆచరించటంలో ఎంతో శ్రద్ధ చూపుతుంది. వీరశైవ సాంప్రదాయంతో గురువుకు విశేషమైన ప్రాధాన్యతతో పాటు బాధ్యత కూడా ఉన్నది. గురువు దగ్గరకు వెళ్ళి శిష్యుడు అర్థించాల్సిన నియమం ఏమీ లేదు. గురువు రప్పిస్తే శిష్యుడు గురువు దగ్గరకు భక్తి శ్రద్ధలతో వచ్చి విద్యనభ్యసిస్తాడు. అనగా శిష్యుడే ప్రత్యేకించి గురువును ఆశ్రయించి అర్థించాల్సిన

అవసరం లేదు. గురువు శిష్యుని దగ్గరకు వెళ్ళవచ్చని అర్థం

గురువు అక్క మహాదేవి ఇంటికి రాగా, అక్కమహాదేవి

**"నిత్యము నా ఇంటికి నడిచి వచ్చెను నేడు**
**ముక్తి నా ఇంటికి నడచి వచ్చెను నేడు**
**జయ జయా, శివ శివా, హర హరా!**
**గురువే నమో పరమగురువే నమో**
**చెన్న మల్లికర్జుని చూపిన గురవే నమో"** – అని

గురువును చూసి ఎంతో సంతోషంతో, తన్మయత్వంతో నమస్కరిస్తుంది. అక్కమహాదేవి గురువును ఎంతగానో గౌరవిస్తుంది. గురువును గౌరవించే గొప్ప సంస్కారి మహాదేవి. యవ్వనదశలోకి చేరుకున్న మహాదేవి ఇతర ఆడపిల్లలాగనే అందమైన వరుడొచ్చి తన పాణిగ్రహం చేసినట్లు కలగనేది. తనకు వచ్చిన కలను చెలికత్తెలకు ఈ విధంగా చెప్పుకునేది.

**"చెలీ వినవే వినవే నేనొకకలగంటి**
**పోకలు బియ్యం పత్రము టెంకాయల కలగంటి**
**చిన్న చిన్న జడలు చక్కని పల్వరుసగలజోగి**
**ఇంటికి భిక్షకని వచ్చినది గంటినమ్మ**
**మితిమీరిన మోహముతో వెన్నాడి కై బట్టితి**
**చెన్నమల్లికార్జునుని జూచి కన్ను తెరిచితినమ్మ!"**

మహాదేవి కలలో కూడా ఆ పరమశివున్నే తన భర్తగా భావించింది. అంటే ఇతరులు ఎవరినీ తాను కలలో కూడా వరించలేనని తమ చెల్లికత్తెలకు (స్నేహితులకు) చెప్పుకొచ్చింది.

యుక్త వయస్సు వచ్చిందని తల్లి దండ్రులు ఆమెకు వివాహం చేయలని ప్రయత్నాలు చేస్తుంటే, మహాదేవి తన తల్లితో ఈ విధంగా అంటుంది.

**"ఓ తల్లీ నీవు వెర్రితల్లివే నా దేవుడు**
**చిన్న మల్లికార్జునుని వలచి**
**నేనతనిపై మరులుజెందితిని**
**నీ తల్లి తనము నేనొల్లను పోవె** – అంటూ

తన తల్లి ప్రేమగా పెళ్ళి చేద్దామనుకున్నా నేను ఎవరినీ నేను పెళ్ళి చేసుకోనని, ఆ మల్లికార్జునిని వలిచాననీ నిర్భయంగా చెప్పింది.

అక్క మహాదేవి తనతల్లి ప్రేమకు ఎంతో ఉప్పొంగి పోయి నేనంటే ఎంతో ప్రేమ నీకు వెర్రితల్లీ నీవు నా కోసం నా భవిష్యత్తు కోసం అందరి ఆడపిల్లల తల్లుల వలె తమ తమ పిల్లలకు వివాహం చేసి సంతోషించినట్లుగా నాకు వివాహం చేయాలనుకుంటున్నావు. కానీ నేను నీ తల్లితనాన్ని స్వీకరించలేక పోతున్నాను. నీకు ప్రేమగా నెరవేరుస్తానన్న బాధ్యతని నేను నిర్వర్తించేటట్లు చేయలేక పోతున్నాను. ఎందుకంటే ఆ చెన్నమల్లికార్జునిపై మనసు పారేసుకున్నాననీ చెప్పింది.

మహాదేవి తనకు చెన్న మల్లికార్జునునితో వివాహం అయిపోయినట్లే ఊహించుకునేది. హిందూ సమాజంలో స్త్రీలు పతిని పరమేశ్వరునిగా భావించి పూజిస్తారు. అందుకే "పతియే ప్రత్యక్ష దైవం" అని అంటారు. మహాదేవి పరమేశ్వరుడిని పతిగా భావిస్తూ, పతి, పరమేశ్వరుడు వేరు గాదు. ఇద్దరూ ఒక్కటే అనీ, నిత్యం చెన్న మల్లికార్జునుని తలుచుకుంటూ ఉండేది. ఇక్కడ మహాదేవి పరమేశ్వరున్ని భర్తగా భావించి ఆరాధించింది. కానీ శారీరక, మానసిక శృంగారాలకు తాను వ్యక్తపర్చులేదు. అటువంటి వాటిని తాను నిరసించింది.

(మహాదేవి రూపవతి, గుణవతి మాత్రమే కాకుండా సాహితీ వేత్తగా ఎన్నో వచనాలను కూడా రాయటం జరిగింది).

మహాదేవి అందానికి ముగ్ధుడైన ఆ దేశపు రాజైన కౌశికుడు వివాహం చేసుకోవాలను కుంటాడు. కానీ మహాదేవి దానికి తిరస్కరిస్తుంది. రాజు కోపంతో మహాదేవి తల్లిదండ్రులకు హాని కల్గిస్తాననీ రాజు మంత్రి చేత సందేశాన్ని మహాదేవికి పంపిస్తాడు. తల్లిదండ్రులకు ఎటువంటి హాని కల్గకూడదని భయంతో మహాదేవి కౌశికునితో వివాహానికి ఒప్పుకుంటుంది. కానీ 3 షరతులు పెడుతుంది. వాటిని పాటిస్తే అతడిని వివాహం

చేసుకుంటాననీ మంత్రికి మహాదేవి తెల్పుతుంది.

ఆ మాటలను విన్న రాజు మహాదేవి ఒప్పుకుందనే సంతోషంతో రాజభవనానికి తీసుకురమ్మంటాడు. మహాదేవి రాజ భవనానికి వచ్చిన దగ్గర నుండి ఈ మల్లికార్జునుని సేవలోనే, ఆ స్వామి వారి స్మరణలోనే కాలం గడుపుతూ ఉంది. సుందరాంగిని చూస్తూ రాజు కోరికలను నిగ్రహించుకోలేక పోతాడు. లింగనిష్టలో ఉన్న తనను రాజు తాకబోగా మహాదేవి కోపంతో ...

''పశువు కొక చింత, కసాయికొక చింత అంటూ రాజును ఈ విధంగా అడగసాగింది. అవివాహిత అయిన నన్ను బలాత్కరించుట న్యాయమేవిధంగా అవుతుంది. నీవు నేను చెప్పిన షరతులనుఉల్లంఘించావు. అనగా రాజు ఒక్క సారి ఉలిక్కిపడి ఆ షరతులు చెప్పమని అడుగగా, నీవు లింగదీక్షను తీసుకుంటే మన వివాహం జరుగుతుందని తెల్పుతుంది. కానీ దానికి కౌశికుడు ఒప్పుకోక పోగా నా షరతులును నీవు అంగీకరించలేదు. కాబట్టి నీ భవనం నుండి నేను స్వేచ్ఛగా వెళ్ళే స్వాతంత్ర్యం నాకు కలదని చెప్పి, నీ రాజ భోగాలు నాకు అవసరం లేదని, వాటన్నింటినీ విడిచిపెట్టి వివస్త్రగా, కేశాంబర్భై వెళ్ళిపోతుంది. ఆనాటి కాలంలోనే ఒక స్త్రీ దిగంబరిగా వెళ్ళటం అనేది ధైర్య, సాహసాలతో కూడిన పని, కానీ భక్తి తత్వంలో శరీరానికి, స్త్రీ, పురుష అని లింగ వ్యత్యాసం ఏమీ లేకుండా తన్మయత్వంలో, భక్తి పారవశ్యం మహాదేవి ఈ చర్యను చేయగల్గింది.

మహాదేవి దృష్టిలో శరీరం అనగా

**''అమేధ్యపు కడవ, మూత్రపు బుడిగె**
**ఎముకల తడక చీము బుడ్డ**
**కాలిపోనీ, ఈ దేహము**
**ఈ బడలిని నమ్మి, చెడక నుండుము**
**చెన్న మల్లికార్జునుని తెలియని వెర్రివాడా!** – అని చెప్పింది.

మహాదేవి శరీరాన్ని అపరిశుభ్రమైన కుండ, మూత్రం బుడగ, ఎముక తడక, చీము బడ్డి అని శరీరాన్ని వర్ణించింది. ఇటువంటి శరీరనికి మోహంతో ప్రేమించడం కన్నా, మల్లికార్జునుని సేవలో నిమగ్నమవ్వాలనే ఉద్దేశ్యంతో కళ్యాణ పట్టణానికి వెళ్ళింది. కళ్యాణ పట్టణంలో బసవన, శివశరణులు కల్గిన అనుభవమండపానికి చేరింది. మహాదేవి భక్తిని చూసి, సత్ప్రవర్తనను చూసి అందరూ ఆమెను అక్క అని సంబోధిస్తూ ఉండేవారు. నాటి నుండి మహాదేవి ''అక్క మహాదేవి''గా పేరు పొందింది. కళ్యాణ మండపంలో ఉంటూ తన పాండిత్యంతో, తన వచనాతో శివానుజ్ఞాన చర్చల్లో పాల్గొంటూ ఉండసాగింది. అక్క మహాదేవికి లింగంలో ఏకం కావాలనే కోరిక కలుగుగగా, ఆ కోరికను ప్రభు దేవునకు చెప్పగా, ప్రభుదేవుడు శ్రీశైల క్షేత్రంలో గల కదళీవనములో ఐక్యము పొందమని తెలిపాడు.

అక్కమహాదేవి శ్రీశైల మార్గ మధ్యలో వెళ్తూవెళ్తూ చెట్టు, పుట్ట ప్రతి దానిలో చెన్నమల్లికార్జునుడు ఉన్నాడని భావిస్తూ, పిలుస్తూ, వేడుకుంటూ, కనపడమని ప్రార్థిస్తూ శ్రీశైలం కొండను చేరుకొని ఇష్టదైవమైన మల్లికార్జునున్ని దర్శించుకుంది. మల్లికార్జునుని దీక్షలో కూర్చోవటానికి, ఇష్టలింగార్చన చేసుకోవటానికి కదళీవనాన్ని ఆశ్రయించింది.

**''కదిలీయనునది తనవు**
**కదిళియనునది మనసు''**

అంటూ అపారమైన భక్తి భావంతో మల్లికార్జునుని స్మరించుకుంటూ, ధ్యానించుకుంటూ శివయోగానందమై లింగైక్యం చెందింది.

**''తన పుట్టక శివునికై**
**తన చావు శివునికై''**

అన్నట్లు గొప్ప భక్తి భావంతో అక్క మహాదేవి భక్తికి తప్ప తన జీవితంలో దేనికి చోటివ్వలేదు. ఎందరో శివశరణులకు ఆదర్శమూర్తి.

**తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బహుళ అంతర్జాల అంతర్జాతీయ త్రైమాసిక స్త్రీవాద పత్రిక, తెలుగు తల్లి కెనడా మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ మహిళా కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ**



# ఘటన

- మంజులభావన
ఫోన్ : 9396983346

''వోయమ్మా... వొద్దే! నన్ను గొట్టకే! నీకెట్ల జెప్పాల్నే... ఎట్ల జెప్తె నీకు సమజైతదే..?''

''యింకా యేం జెప్తవే? ఏంజెప్పి సమ్జాయిస్తవ్? మా ఇజ్జత్ దీసినవ్ గదే! నీకేం గత్తరొచ్చిందే... మా కడుపుల మంట బెట్టినవ్? మన కాందాన్ ఇజ్జత్ పూరాగా మూసీల గలిపినవ్! మన కులపోల్లు ఆడ్విల్ల లందర్కంటే నీకే జాన్దార్ సంబంద మొచ్చిందని అందర్కి ఖుషీల జెప్పుకున్నం. ఆకిర్కి నీ బత్కుకి నువ్వే అగ్గిబెట్కొని– గిప్పుడు మమ్మను సమ్జాయించనీకి సూస్తావె? నీ పీనిగెల్ల! వో యాదగిరి నరసన్నా... ఎములాడ రాజన్నా... నేనేం జేతురా దేవుడా!!''

నా రూమ్ల... కూసొని సద్వుకుంటున్న నేను– 'మల్లా షురువైనట్లుంది!' అన్కుంట అటుదిక్కు జూశ్న.

''మా కడుపుల జెడబుట్టినవ్ గదే! నిన్ను లగ్గంమునుపే సంపేసున్నా పీడబొయ్యేది– గింతదాంక వొచ్చేది గాదు. ఐనా గిట్ల జేస్తవని మేమెవ్లం అనుకోలేదు. ఇంగ నిన్నేం జేయాల్నో మాకైతె ఎర్కయిత లేదు!'' ఆ పిల్ల నాయిన– అరుస్తున్నడు.

నేనింక లేచి దర్వాజ కాడ్కొచ్చిన. మా గోడకి అసుంట కిరాయికుంటున్న 'వాళ్ళు' అగుపిస్తున్నరు... తల్లీ, తండ్రీ, వాళ్ళ బిడ్డె, ముగ్గురు నల్గురు సుట్టాలు! వారం సంది ఏందో లొల్లి అయితాంది ఆ యింట్ల!

ఏమైందో తెల్వదుగానీ, ఆల్ల గరీబ్తనానికి తోడు ఇంకేందో 'కిరికిరి' ఆ ఇంటోల్ల నడ్మ అయ్యిందని మట్కు తెలుస్తాంది. వాల్ల అర్పులూ, లొల్లితోని సుట్టుముట్టు ఉండెటోల్ల నజర్ను గూడ ఆల్ల దిక్కు తిప్పుకున్నరు. దినాం నా మూడ్ చెడగొడ్తున్న రన్న యాష్ట కంటే– 'అసలేమయ్యుంటదీ?' అన్న ఆలోశనే నన్ను ఆల్ల ఇంటిదిక్కు జూసెటట్టు చేశ్నదంటే– కారణం... ఆ పిల్ల!

గప్పుడె... ''హాయ్ మామా!'' అన్కుంట వొచ్చింది నా చెల్లె బిడ్డె రేణుక. పక్కింటోల్ల లొల్లి గురించి దినాం నేను అరుసుకొనేది రేణుక తోనె! మొన్ననె పదారేల్లు నిండినయ్ తనకి... ఇంటర్ చదువుతాంది.

'' ఏంది బేటా... ఏమైతాంది ఆడ?!'' కండ్లతోనె పక్కింటి దిక్కు చూపించుకుంట అడిగిన.

''ప్చ్... పాపం!'' రెండు గూడలెగరేస్కుంట జాలిగ నవ్వింది రేణుక. నా మేనగోడలి ఈడే ఉంటది 'ఆ పిల్లది' గూడ. కాల్లు వలలో చిక్కువడి ఎగరలేక, మెస్లలేని తీర్గున్న కబూతర్ లెక్క ఏద్వాలో, వద్దో గూడ తెల్వక దీనంగ చూస్తాంది.

''ఈ ఆదివారం పంచాయతీ కూడ పెట్టరంట!'' రేణుక మాటలకి ఇంక జర్రంత జాలిగ జూశ్న అటు దిక్కు.

''ఆఖిర్కి ఏమౌతదో మామా! పాపం... ఆ పిల్లను తల్సుకుంటె భయమైతాంది నాకు!'' అన్నది మల్లా.

''భయమా? యెందుకు..?'' అర్థంగాక అడిగిన.

''ఏదైన జేస్కుంటదేమోనని! పాపం... పెండ్లయిన కాడ్నుంచి అందరు కల్సి ఆ పిల్లని ఒకటే తిట్టుడు, కొట్టుడు! వాల్ల సుట్టాలల్ల ఎవల్లకాడ్కి పోయినా 'మా తాన ఉండొ'ద్దని తోల్తున్నరంట!'' అన్నీ ఎర్కైనట్టు రేణుక చెప్తాంటె ఇనబట్టిన.

''పెండ్లి కాంగన్లె ఆ రేత్రికి రేత్రే పారిపోయి అదే ఊర్లె ఉన్న వాళ్ళ పిన్ని ఇంటికి పోయిందంట. 'ఎందుకిట్ల వొచ్చినవ్? ఏమైంది బిడ్డా?' అని ఎంతడిగినా నోరిప్పలేదంట! ఐతె– మొగనికాడ్కి, అత్తోరింటికి మట్కు పోనంటె పోనని జిద్దు వట్టిందంట. ఆ పిన్నోల్లు 'గట్లయితె మా తాన ఉండొద్దు. నువ్విడుంటె కులపెద్దలంత మమ్మల్నంటరు. మీ అమ్మోల్ల తానికె పో!' అని తరిమే శిన్రంట. పిచ్చిపిల్ల... ఏం జేస్తది? దిక్కులేక కన్నోల్లింటికొస్తే– ఇగో– చూస్తున్నవ్ కద... కన్నతల్లి గూడ ఆ పిల్లని ఎట్ల తిడ్తాందో..?!''

''ఏమైంది రేణుకా? సక్కగ పెండ్లయిన పిల్ల– ఎందుకట్ల పారిపోయి వచ్చినట్టు?'' నిజంగ తెల్వకనె అడిగిన.

''ఏమో మరి! కొత్తగ పెండ్లయిన పిల్ల కదా... మొదటిరేత్రి

ఏమైందో, ఏమో – ఆ రేత్రికి రేత్రే అత్తోరింటి నుంచి పారిపోయొ చ్చేసింది. మళ్లీ మొగని దగ్గరికి పోనంటె పోనని మొండిపట్టు బట్టింది. వాళ్ళ అమ్మనాయినా, సుట్టాలూ, కులపెద్దలూ నయానబయాన ఎన్నిసార్లడిగినా అసలేమయ్యిందో మటుకు చెప్తలేదంట!''

''అవునూఁ... ఆ పిల్ల నీతోని బాగనే మాట్లాడ్తది గదా... నువ్వయినా సంగతేందొ తెల్సుకోలేదా?''

''ఏదీ... పెండ్లయినాక ఆ పిల్లని కలిసే చాన్స్ యాడ దొర్కిందీ? వారం దినాల్నుంచి పొద్దున లేచినకాడ్నుంచి రాత్రి నిద్రపోయేదాక వాల్ల సుట్టాలూ, కులపెద్దలంతా ఆ పిల్ల సుట్టుముట్టు జేరి తిట్టిపోసుడే గాని– ఒక్కల్లైనా ఆ పిల్ల తరపు నుంచి ఆలోచన చేసుడు కానీ, ఆ పిల్లని ఒంటరిగా, ప్రశాంతంగా ఉండనిచ్చుడు కానీ చేస్తున్నరా?''

నిజమే... వారం దినాల్సంది నేను గూడ సూస్తనే ఉన్న ఈ సంగతి.

''అయినా... కారణమేందో తెలిస్తే మట్కు నువ్వు గాని, నేను గాని ఏంజేస్తం చెప్పు మామా? ఆ పిల్ల కష్టం కొంచెమైన పోగొట్టగలమా, ఏమన్నానా?'' తనే మల్లా అన్నది బాధగా.

''అదికాదే– సాటిమనుసులం... మానవత్వంతొ చేతనైనంత సాయం జేసుడు మనుషులుగా మన బాధ్యత గదా! కొంచెం సానుభూతి జూపిచ్చుడో, జరన్ని ఓదార్పు మాటలు చెప్పుడో చేస్తే ఆ పిల్లకి జర్రంతైన ఊరట కలిగించినోల్లమైతం గదా!''

''నిజమే మామా! కానీ, గిప్పటి పరిస్థితిలో ఎవ్వలైన ఆ పిల్ల తరపున మాట్లాడుడు, తనమీద సానుభూతి సూపుడు కానీ చేస్తే... వాల్ల సుట్టాలూ, కులపెద్దలతో పాటు, ఆ పిల్ల అమ్మనాయిన గూడ వాల్ల మీద్కి యుద్ధానికి దిగుతరు. నీకు గాని అస్వంటి ఆలోచన ఉంటే మట్కు గిప్పుడె దాన్ని మనసులకెల్లి తుడిశెయ్. లేకుంటె లేనిపోని చిక్కుల్ల పడతవ్ మామా... జాగర్త!'' ఉన్న నిజాన్ని, తన ఉద్దేశాన్ని కలిపి కుండబద్దలు గొట్టిన తీర్గ చెప్పేసింది రేణుక.

నిజమే– నిదానంగ ఆలోచన చేసిజూస్తె రేణుక చెప్పినదాంట్ల సత్యముంది. వాల్ల ఆచారాలూ, రివాజులూ, కులపెద్దల కట్టుబాట్ల నుంచి జూస్తె... ఆ పిల్ల ఇప్పటి పరిస్థితి శాన సున్నితమైనది. దాంట్ల బయటోల్లెవలైన కల్పించుకుంటె గన్క లేనిపోని పరేశాన్లు కోరి తెచ్చుకున్నట్టే! కాని, 'సాటిమనిషి'గా ఆలోచన చేస్తే... కొంచెమైన 'సానుభూతి' చూపించడం అవసరం ఇక్కడ!

అంతేనా– ఇంకేం లేదా? తునకల తీర్న విరిగిపడ్తున్న ఆలోశన్ల తుప్పల్లోంచి బైటకొస్తున్న ఆఖరి అంకం సిద్ధమైతాంది.

ఆ పిల్ల మునుపటి జీవితం ఒక్కసారి కండ్లముందు కదలాడింది నాకు.

★ ★ ★

సారమ్మ– అమ్మనాయినకు ఒక్కతే బిడ్డె...

గలగలపారే సెలయేరు తీర్న కళకళలాడ్త ఉండేడ్ది. బతుకుతెరువు కోసం అమ్మ,నాయినతో సిటీకొచ్చింది. ఈడ ఆస్తీ, పాస్తీ, సొంతిల్లు లేవుగాని– ఊర్ల రెండెకరాల పొలముందంట. దాన్ని కట్నంగ ఇచ్చి సారమ్మ పెండ్లి జేయాలని అమ్మనాయినల ఆలోచన. తల్లి పోచమ్మతో కలిసి నాలుగైదు ఇండ్లల్ల పాచిపనులు చేస్కుంటూ... మా పక్కింట్ల అగ్గిపెట్టెంత పోర్షన్ల వెయ్యి రూపాయల కిరాయికి తీస్కుని ఉంటున్నరు. ఆ పిల్ల తండ్రి ఒక మేస్త్రి కాడ పనిచేస్తడంట.

సారమ్మ పొద్దుగాల నాలుగ్గంటలకే లేచి, పని కుదుర్చుకున్న ఇండ్లల్లకు పొయి పనులన్నీ చేస్కొని, పది గంటలకి ఇంటికొచ్చి, స్నానం జేసి, సక్కంగ ముస్తాబై, వంట చేస్కుని తిని, హాయిగా పడుకుంటది. ఈలోగా వాళ్ళమ్మ వొచ్చి ఇంటిపనీ, బట్టల పనీ చేసి, తిని తనూ కూతురితో పాటు పడుకుంటది. తండ్రి మాత్రం రాత్రి ఏడు దాటినంకనె ఇంటికొస్తుంటడు.

అప్పుడప్పుడు ఊళ్లోని వాల్ల సుట్టాలు, తెలిసినోల్లు వొస్తుంటరు. గప్పుడు సారమ్మ ఉషారుగ తిర్గేది. చలాకీగా వాల్లతో ముచ్చట్లు జెప్కుంట గడిపేది. ఆదివారం రాంగనె– మా రేణుకతో శానసేపు ముచ్చటపెట్టేది. నా పనులల్ల నేనుండి అటుదిక్కు చూసేటోడ్నే తప్ప– నాలోపట ఎస్వంటి భావం ఉండేడ్ది కాదు. కొన్నిసార్లు సారమ్మ నాకు విన్పించేటట్లే రేణుకతో మాట్లాడేడ్ది–

''నిన్న మేం సేన్మకి బోయినం. శానా బాగుంది. గా సేన్మల యీరో ఏక్దమ్ మీ అంకుల్ లెక్కనే ఉన్నడనుకో!''

''ఈ నడ్మ వచ్చిన సేన్మలల్ల నాకు శానా నచ్చిన పాటేందో దెల్సా? గా సేన్మల ఉన్నది జూడూ– 'ఉదయం యాడ ఉన్నదీ... నీ సుట్టుముట్టే దిర్గుతున్నదీ' పాట నాకు శాన బాగ నచ్చిందనుకో! గా పాటంటే మీ అంకుల్కి గూడ యిష్టమేనా?''

''నిన్నరేత్రి మీ అంకుల్ శానా ఆల్చంగ ఇంటికొచ్చిండు.

'గింత రేతిరి గేటు సప్పుడైతాం దేందిరా' అనుకుంట సూతును గదా–. మీ అంకులే! యాడ్కి బోయిండేంది?'' –ఇట్ల మాటలల్ల శానమట్కు నా గురించి ఆరా తీసేదని మా రేణుక చెప్పేది. ఐదో క్లాసు తప్పిన ఆ పిల్ల మెంటాలిటీ మాకు అర్థమై– సారమ్మ మాటల్కి నవ్వుకునెటోల్లమే తప్ప ఇంకో ఆలోశన చేసెటోల్లం కాదు.

ఒకరోజు... మా రేణుక ఆ పిల్ల గురించి ఓ శుభవార్త చెప్పింది– ''సారమ్మకి పెండ్లి కుదిరిందంట మామా! వారం మునుపే 'నీ పెండ్లెప్పుడు సారమ్మా?' అనడిగితే 'రెండుమూడేండ్ల దాంక పెండ్లీ, గిండ్లీ ఏం లేదు' అని ప్రతిజ్ఞ చేసిన లెవెల్లో చెప్పింది. ఇప్పుడు ఏకంగా పెండ్లి కుదరంగల్నె– ఎగిరి గంతులేయలేదు కానీ, అదో తీర్గ ముఖం పెట్టింది.''

''అదో తీర్గనా... అంటే?''

''ఏమో మరి! ఈ పెండ్లి ఇష్టం లేదో, ఆ పెండ్లికొడుకు నచ్చలేదో, లేక ఇప్పుడిప్పుడే పెళ్ళి వద్దనో... తెల్వదు గానీ– 'నా పెండ్లికి నువ్వూ, మీ అంకులూ తప్పకుండ రావాలె' అని మాత్రం చెప్పింది...''

''అట్లనా! ఇంకా ఏం చెప్పింది?''

''తన ముఖం చూస్తే మాత్రం ఏదేదో చెప్పాలనుకున్నట్లుగా ఉంది కానీ, ఇంకేమీ చెప్పలేదు.''

ఆ తర్వాత– కొన్నిరోజులు సారమ్మ కన్పడలేదు... వాళ్ళ అమ్మానాయిన ఆ పిల్లని వాళ్ళ ఊరికి తీస్కపోయిండ్రంట.

★ ★ ★

''అరెరేఁ... ఏం జెప్పమంటవ్ దొరా... మా పేనాలకి పెద్ద పరేషాన్ తెచ్చిబెట్టింది ఈ పోరి! నీ బాంచన్– నీ కాల్మొక్త... మీరే నాయం జెప్పి ఏదైన దారి జూపెట్టుండ్రి...'' కులపెద్దల ముందు దీర్ఘాలు తీస్తూ వాపోతున్నది సారమ్మ తల్లి పోచమ్మ.

''అవున్దొరా! రోజులు గడవని బతుకులు మాయి. ఒక్కగానొక్క ఆడ్విడ్డెకి మంచి సంబంధం జూసి మొన్ననే లగ్గం జేశ్నం. గాని, పెనిమిటి తోని ఒక్క రేతిరి గూడ గడపకుండనె పారిపోయొచ్చేసింది. 'ఏం బిడ్డా... ఎందుకొచ్చినవ్?' అంటె ఏం జెప్పదు. అత్తింటికి మటుకు మల్ల పోనుగాక బోనంటది. 'కాపురాన్కి రాకుంట పిల్ల గిట్ల పారిబోతె మా ఇజ్జత్ ఏంగావాలె? గిస్వంటి పోరిని మేమెక్కడ జూడలేదు' అని పోరగాడు, పోరగాని అమ్మనాయిన మమ్లను తిడ్తాన్నరు. మా ఇజ్జతే గాకుండ పోరగాని కాందాన్ ఇజ్జత్ గూడ పూరాగ తీసేసింది గీ పోరి! ఏం జెయ్యాల్నొ మాకైతె సమజైత లేదు. కులపోల్ల నడ్మ మొగం జెల్లకుండ జేసింది! జర మీరన్న జెప్పుండయ్యా!'' సారమ్మ తండ్రి రాజయ్య తన గుండెలోపటి బాధనంత చెప్పుకుంటున్నడు.

పంచాయితీ జరుగుతున్నదక్కడ !

మా కాలనీలో ఉంటున్న వాల్ల కులపోల్లంతా మా ఇంటిముందున్న చౌరస్తాలో ఆదివారాలల్ల ఇట్ల 'పంచాయితీ' పెట్టుకొని, ఏవేవో తీర్మానాలు జేస్కుని, వాల్ల సమస్యలకి వాల్లే పరిష్కారాలు చూసుకుంటుంటారు.

''పోచమ్మా, రాజయ్యా... మీరు జర ఊకోండి– నేను అడుగుత కద!'' అని, ఇటుదిక్కు తిరిగి ''ఏం సారమ్మా... ఏంది కత? ఎందుకిట్ల జేసినవ్? పోరగాని దగ్గర్కెల్లి ఎందుకు పారిపోయి వచ్చినవ్?'' పంచాయితీ పెద్ద అడిగిండు.

సారమ్మ మాట్లాడలే. తలవొంచుకొని మాటముచ్చట లేకుంట నేల దిక్కు చూస్తాంది.

''ఏంది సారమ్మా... మాట్లాడవ్? కన్నోల్లకు ఇజ్జతియ్యకపోతివి– కులపోల్లందరున్న గీ పంచాయత్ కైన జర ఇజ్జతియ్యి! ఎందుకిట్ల జేసినవ్?'' ఈసారి గద్మాయించుకుంట అన్నడాయన.

గత్తర పడుకుంట నెత్తి పైకెత్తింది సారమ్మ. ఒకసారి కన్నోళ్ళ దిక్కు, చుట్టుముట్టు మూగినోళ్ళ దిక్కు చూసి, భయపడుకుంటనె అన్నది ఆ పెద్దాయనతో– ''నాకు... నాకు ఈ లగ్గం ఇష్టంలేదయ్యా! గందుకే వచ్చేశ్న...''

సారమ్మ చెప్పింది విని ఆ పిల్ల అమ్మనాయిన, వాళ్ళ సుట్టాలూ, అక్కడ గుమిగూడినోళ్ళూ, పంచాయితీ పెద్దలతో గూడి అక్కడ జరుగుతున్నదంతా నా గది కిటికీల కెల్లి సూస్కుంట యింటున్న నేను గూడ పరేషాన్ అయిన..

''ఎందుకు... ఏమిట్కి? నీకిష్టం లేకుంటే... గా మాట ముందుగాల్నె మీ అమ్మకి గాని, మీ నాయిన గ్గాని జెప్పొచ్చు కద?'' ఆశ్చర్యంలోంచి తేరుకుంటూనే మళ్లీ గద్మాయించిండాయన.

''ఎట్ల జెప్పాల్నయ్యా... గీ లగ్గం నాకిట్టమో, గాదో మాయమ్మ గానీ, మా నాయిన గానీ నన్నడ్గనే లేదు.''

ఆ పెద్దాయన కోపం నడినెత్తికెక్కినట్లుంది. అసలే సింహం అసుంటి తన ముంగట సిట్టెల్క తీర్న నిలబడ్డ సారమ్మ అంతమందిలో 'ఈ పెళ్ళి నాకిష్టం లేదు' అని ధైర్యంగ అన్నప్పుడే తన పెద్దరికాన్ని ఆ పిల్ల ఎదిరించినట్లుగా అన్పించిందా యనకి.

అస్వంటిది– మాటకి మాట బదులిస్తుంటే ఆయనకి తన అహం దెబ్బతింటాంది.

''ఆల్లు అడ్గకపోతె నువ్ జెప్పవా? గిట్ల లగ్గమైనాంక పారిబోయొస్తే మీవోల్లదీ, నీ పెనిమిటోల్లదీ ఇజ్జత్ ఏం గావాలె? జర సోంచాయించినవా?'' ఈసారి కోపంగానే అన్నడాయన.

''గయ్యన్నీ నాకు తెల్వలేదయ్యా!'' తన తీర్గనే చెప్పింది సారమ్మ.

''గియ్యే కాదు... నీకింకా శానా దెల్వవ్. నిన్ను కన్నోల్లు నీ మంచికోరి గీ లగ్గం జేసింద్రు. ఆల్లను గోస బెట్టకు. ఆల్లు జెప్పినట్టు యిను!'' నచ్చజెపుతున్నట్లు అన్నాడాయన.

''యిన్నేండ్లదాంక మా అమ్మానాయిన ఏం జెప్తె గది యిన్నానయ్యా! ఆకిర్కి గీ లగ్గం నాకిట్టం లేకపోయిన గాని ఆల్ల మాట కాదనకుండ తలొంచి పుస్తె గట్టించుకున్న! గాని నా అత్తోల్లింటికి, నా పెనిమిటి తాన్కి మట్కు నన్ను మల్ల పొమ్మంటె నేను బోనయ్యా!'' మాట గొంతుల గుట్క బడుతున్న గాని... తన తీర్మానం మాత్రం, సూటిగనె చెప్పింది సారమ్మ.

''ఏందీ? ...ఎందుకుబోవే? అత్తింటికి, పెనిమిటి తాన్కి బోకుండ బత్కినంత కాలం పుట్టింట్లనే కూకొని కన్నోల్ల రక్తం పీల్చక తింటావె? నీకు తిండి పెట్టనీకి మా తాన పైసలచెట్లు లేవే! పొద్దుగాల్నుంచి నడిరేతిరి దాంక రెక్కలుముక్కలు జేసుకుని కూలిపని జేసినా సగం కడుపు గూడ నిండని ఎండిన బతుకులు మనయి. గస్వంటిది– లగ్గమైనాంక గూడ పుట్టింట్ల బడి కన్నోల్లను యాష్ట బెడ్తనంటవేందే? ఆడ్విల్లగ బుట్టి అత్తింటికి, పెనిమిటి తాన్కి బోనని అననీకి సిగ్గులేదే నీకు?'' పంచాయితీలో గూడ బిడ్డె తీరు జూసి అప్పటిదాంక వోపిక బట్టిన రాజయ్య వొక్కతీర్న యిరుసుక బడ్డడు..

గప్పుడె పోచమ్మ కలుగజేసుకుని పెనిమిటికి అడ్డుపడ్డది

''ఊకో... ఊకోవయ్యా! పెద్దోల్ల నడ్మ బిడ్డెని బట్కోని గస్వంటి మాటలంటవేంది? నీకేమన్నా దమాక్ ఉందా? జర్రాగు!'' అని, పెద్దాయన దిక్కు తిరిగి, ''సూస్తున్నవ్ గద్దొరా– దీని నకరాలు! ఏం జెయ్యమంటవ్ మమ్లను? నాల్గు దన్ని సమ్జాయిద్ద మంటె శిన్నపోరి గాకపాయె– పెండ్లైన పిల్లయిపోయె... ఏం జెయ్యాలె? ఎవ్వరెన్ని తీర్ల జెప్పినగాని మాట చెవిన బెడ్తలేదు. కులపోల్ల నడ్మ ఇజ్జత్ బోతాంది. నువ్వేం జెప్తవో గాని, దాన్ని పెనిమిటి తాన్కి బొయ్యేటట్లు జెయ్ దొరా!''

''అసలేమైంది పోచమ్మా? పోరగాని తాన్కి ఎందుకు బోనంటదీ పోరి? పోరగాడు మంచోడు గాదా ఏంది? పోరని తరీక మంచిదేనా? గస్వంటి గిస్వంటి గత్తర్ అల్వాట్లేమన్న ఉన్నయా యేంది?'' అడిగాడు పెద్దాయన.

''యేదో... చవక బీడీ తాగే అలవాటొకటుందయ్యా... గంతే! తిరుగుడలవాటు గూడ లేదు. ఆల్లకి పదెక్రాలు దాచ్చతోట ఉన్నది. ముగ్గురన్నదమ్ములల్ల గీ పోరగాడే పెద్దోడు. పది దాంక జదివిండు– ఐనగాని పనిజేస్తడు. ఎట్ల జూసినగాని మా కాందాన్ మొత్తంల గిస్వంటి సంబందం ఎవ్వల్కి దొర్కలేదు. మూడ్నెల్ల ముందర మా కులపోల్ల లగ్గంల మా పిల్లని జూసి మనుసు వడిండంట. 'చేస్కుంటె గీ పోరినే జేస్కుంట'నని పెద్దోల్లకి జెప్పి లగ్గాన్కి మూర్తం బెట్టమన్నడంట. లగ్గమైనాంక పిల్లని కాలు కదపకుండ జూస్కుంటనని మాతోని గూడ జెప్పిండు. 'గిదంత మా పిల్ల ఏ జెన్మలో జేస్కున్న పున్నెమో!' అన్కుంట గా పోరగాని కిచ్చి లగ్గం జేశ్నం. గాని, మా పిల్లేమొ గిట్ల జేశె! పోరగాడు మట్కు శానా మంచోడు!''

సుట్టుముట్టు నిల్సునోల్లందరు పోచమ్మ మాటలు యిన్నాంక వాల్లల్ల వాల్లు మాట్లాడుకోబట్టిను.

''ఓ పన్జేసేదుండె పోశమ్మా... అత్తింట్లనే సారమ్మని కాల్జేతులు కట్టి ఓ మూల పడేశుంటే మంచిగుండేది. రెండ్రోజులై నాంక ఆ పిల్లకే అలవాటయ్యేది!'' ఎవరో ఉచిత సలహా ఇచ్చారు. పంచాయితీ పెద్దమన్సులు గూడ వాల్లల్ల వాల్లు గుసగుస లాడ్కుంట వొక తీర్మానానికి వొచ్చేందుకు ప్రయత్నిస్తున్నరు.

వాల్లేం జెప్తరో, ఇంక అక్కడ యేం జరుగుతదో అనుకుంట నేను గూడ ఆలకించి ఎదురుజూడబట్టిన.

పది నిమిషాలైనాంక పెద్దలందరు ఒక తీర్మానంకి వొచ్చినట్లున్నరు... మనసులోని తీర్మానాన్ని చెప్పేముందర ఆఖరిసారి సారమ్మను జూస్కుంట అడిగిండు ఆ పెద్దాయన ––

''ఏం సారమ్మా... ఇన్నవ్ గద అందరి మాటలు? గిప్పుడు జెప్పు... ఆకిర్కి ఏమంటవ్ నువ్వు?''

సారమ్మ స్థిరంగానే చెప్పింది– ''మా అత్తోల్లింటికి, నా పెనిమిటి తాన్కి మట్కు నేను పోనయ్యా!''

'సరె... నీ ఖర్మ!' అన్కుంట తలవూపి, గట్టిగ వూపిరి ఎగబీల్చి పంచాయితీ పెద్దోల్ల తీర్మానం వెల్లడి జేశిండు...

''సూడుండ్రి పోచమ్మా, రాజయ్యా! మీ పిల్లకింక పసితనం పోనట్లుంది... అది బోవాలె! గప్పుడు గాని లగ్గమంటె ఏందో, పెనిమిటి అంటె ఏందో సమజ్ కాదు. రాబోయేది అమాస...

యింకా పన్నెండు దినాలుంది. అప్పటిదాంక మీ పిల్లకి దినాం రెండే రెండు పిడికిల్ల అన్నం తప్ప ఇంకేం పెట్టకుండ్రి. దీన్తోని మీ పిల్లకున్న కావ్రం పూరాగ తగ్గుతది. పోరగాన్నీ, ఆల్ల ఇంటోల్లనీ అమాస తెల్లారొచ్చి పిల్లని దోల్కపొమ్మని జెప్పుండ్రి. పోరగాన్తోని మూడునిద్దర్లు జేసినాంక మీ పిల్ల పూరాగ సుదరాయిస్తది... పరేషాన్ గాకుండ్రి! అత్తింట్ల గూడ గిట్లనే నకరాలు జేస్తె కాల్జేతులు కట్టేసి మూడు దినాలు అన్నం పెట్టొద్దని చెప్పుండ్రి. ఏంది... చెప్పింది మతికెక్కిందా రాజయ్యా?'' అని, మిగతా కులపెద్దల దిక్కు జూసి ''గింతే కద మన తీర్మానం?'' అన్నాడా పెద్దాయన.

''అవ్ః... గంతే.. గంతే!'' అనుకుంట తలకాయలూపిన్రు పెద్ద మనుసులు. వాల్లల్ల కెల్లి ఇంకో పెద్దాయన లేచి –

''అందరూ ఇనుండ్రి... మన కాలనీల కాపురముంటున్న మన కులపోల్లలోని ముత్తయిద్వలూ, ముసలోల్లందరూ దినాం రాజయ్య ఇంటికాడికి బోయి లగ్గమంటె ఏందో, మెట్టినింటికీ, పెనిమిటికీ ఎట్ల ఇజ్జత్ ఇయ్యాల్నో సారమ్మకి జెప్పి సమ్జాయించుండ్రి. ఇగ ఇయ్యాల్టి పంచాయత్ గింతటితో ఖతం చేద్దాం!'' అని, రాజయ్య వైపు తిరిగి ''ఏంది రాజయ్యా! పంచాయత్ పెద్దల్కీ, కులపెద్దల్కీ కల్లూ, బోజనాల ఇంతెజామ్ జేసినవ్ గద?'' అన్నాడు.

''ఆః... చేసిన దొరా!'' తల వూపిండు రాజయ్య. పంచాయితీ పెట్టించినోల్లు ఆ దినం పెద్దలందర్కి మాపట్కి కల్లు బోయించి, బోజనాలు పెట్టించుడు... జమాన కాలం నుంచి వాల్ల రివాజు.

★ ★ ★

వారం దినాలు గడిచినై...

దినాం రెండే రెండు పిడికిల్ల అన్నం మెతుకుల్తో సారమ్మ ఏడు దినాలకే ముఖంల కళ పోయి, బక్కగైపోయింది. అంతేగాక– కాలనీలోని వాళ్ళ కులపోళ్ళలో ముసలీ, ముతకా వచ్చి పొద్దట్నుంచి రాత్రిదాంక ఆ పిల్ల ముందర కూసోని 'ఆడదానికి మొగుడే దేవుడు, మెట్టినిల్లే గుడి' అన్కుంట పతివ్రతనీతులు చెప్పుకుంట ఆ పిల్లకి బ్రెయిన్వాష్ చేయవట్టిండ్రు.

జరిగేదంత కండ్లార చూస్తున్న నాకు ఈ వారం దినాల్సంది మనసంతా కలతతో నిండిపోయింది. అయితే ఇట్లాంటి స్థితిలో నేనేం జేయాల్నో, నా కర్తవ్యమేందో నాకు అర్థమైత లేదు. సారమ్మనీ, ఆమె పరిస్థితినీ చూస్తుంటే మట్కు గుండె తరుక్కుపోతాంది. కనీసం ఆమెపట్ల సానుభూతి తెల్పడం కూడ ఎట్లనో నాకు తెలుస్త లేదు.

దినాలు దొర్లిపోతున్నయి! నేను ఎంత బిజీగ ఉన్నగూడ నడ్మ నడ్మ సారమ్మ యాదికొచ్చినప్పుడల్లా కొద్దిసేపటిదాంక నా మెదడు మొద్దుబారినట్టు ఐతాంది. ఎందుకో నేను దినాం చేసె పనులల్ల నాకు ధ్యాస కుదుర్తలేదు. నాలోపట ఏదో అలజడి! కండ్లముంగటే ఓ ఆడ్పిల్లకి అన్యాయమైతాంటె చూస్కుంట గూడ ఏంజెయ్యలేని, ఏం జెయ్యాల్నొ గూడ తెల్వని పరిస్థితి నాది!

నేను ఇంట్లకెల్లి బయటకు పోతున్నప్పుడూ, లోపల్కి వస్తున్నప్పుడూ అనుకోకుండనే మా కాంపౌండ్గోడ మీద్కెల్లి పక్కింటి దిక్కు చూసినప్పుడల్ల– ఏదో పోగొట్టుకున్నదానిలెక్క వాళ్ళ గడప దగ్గర దీనంగ కూసొని కొడిగట్కపోతున్న సూపుల్తో నా దిక్కే చూస్తున్న సారమ్మ ముఖమే నన్ను కలతబెడ్తున్నది.

అయినా... కనిబెంచిన అమ్మనాయినతో పాటు వాళ్ళ సుట్టాలూ, కులపెద్దలలో ఒక్కరుగూడ ఆ పిల్ల దిక్కు నుంచి ఆలోచన చేసుడు గానీ, అసలామె మనసుల ఏముందో తెలుసుకోవాలని గానీ అనుకోకబోవుడు నాకు ఆచ్చెర్యం కలిగిస్తాంది.

ఓ కన్నెపిల్ల పెండ్లయిన మొదటిరాత్రే కట్టుకున్న పెనిమిటి నుంచి, అత్తారింటి నుంచి పారిపోయి వచ్చేసిందంటే... అందుకు బలమైన కారణమేదో ఉండేవుంటది. అదేందో నిదానంగ అడిగి తెలుసుకుని, ఓపిగ్గ ఆమెకి నచ్చజెప్పాలె గానీ– కన్నతల్లితో పాటు ఇట్ల ప్రతివొక్కల్లు ఆమెని తిట్టీ, కొట్టీ, పంచాయితీ పేరుతో నలుగుర్లోకి గుంజి దోషిలాగ నిలబెట్టి ఆ కన్నెమనసు చితికిపోయేటట్లు చేసుడే గాక, పది దినాల్నుంచి ఆ పిల్లని పస్తుల్తో మాడ్చి శారీరకంగా హింసవెట్టి... రేపో, ఎల్లుండో తాను ఎక్కడ్నుంచి పారిపోయి అచ్చిందో మల్ల గాడికే బల్వంతాన పంపాలనుకొనుడు సరికాదనీ, సున్నితమైన ఈ సమస్యను అంత మెత్తంగనె ముడివిప్పాలన్న ఆలోశన గింతమందిల ఒక్కల్లకైన రాకపోవుడు నాకు బాధగా అన్పిస్తాంది.

ఒక్కొక్కపారి నాకే అన్పిస్తది... 'సారమ్మ గురించి నేనే ఎక్వ ఆలోశన జేస్తున్ననేమొ?!' అని! నా ఆలోశన్లు గిట్లుంటే... అందరూ ఎదురుచూస్తున్న ఆ అమాస రానేవొచ్చింది! ఆ మరుసటి దినమే సారమ్మను అత్తారింటికి పంపబోతున్నరు.

★ ★ ★

ఎండా కాలం...

రూమ్ల స్పీడుగ తిరిగే ఫ్యాన్ కింద పండుకుంటె గూడ

శెమట పోస్తనే ఉంటది గన్క– రేత్రిపూట విశాలంగ ఉన్న మా కాంపౌండ్లోనే మడతమంచం యేస్కోని పండుకునుడు నాకు అలవాటు. ఎప్పట్లెక్కనే గా రాత్రి గూడ పన్నెండు గంటల్దాక నా రూమ్లనే చదువుకుంట, రాస్కుంట ఉన్న. ఆ తర్వాత లైట్ ఆఫ్ జేసి, తలుపులు మూసొచ్చి, మంచంమీద పడుకున్న.

అమాస... చిమ్మచీకటి! ఆకాశంలో ఎక్కడ చూసినా ఒక్క వెలుగుచుక్క కూడ లేదు. కండ్లు మూతలు పడంగనె ఎప్పట్లెక్కనే దీనంగున్న సారమ్మ మొగమె అగుపించింది. 'రేపే ఆమెని అత్తారింటికి పంపిస్తున్నరు!' అన్న సంగతి గుర్తుకురాంగనె మనసంత దిగులు నిండిపోయింది. ఆలోచనల్తోనే ఎప్పుట్కి నిద్రలోకి జారుకున్ననో నాకే తెల్వదు.

టైమెంతయిందో తెల్వదుగానీ, చిక్కటినిద్రలో మునిగిన నాకు– కాళ్లకి ఏదో తగిలినట్లు అన్పించి కష్టమ్మీద కండ్లు తెరిశిన. చిమ్మచీకట్ల, గింతగూడ సప్పుడు లేని గా నిశిరేత్రి నా కాల్లతాన యేదో నల్ల ఆకారం నిలబడినట్లు అగుపించింది. గంతే... గట్టిగ అర్వబోయిన– గానీ, భయంతో నా కుత్కెలోని మాట బైటకి రాలేదు.

అంతలోనె... ఆ ఆకారం దబ్బున నా నెత్తి కాడికొచ్చి ''నీకు దండం బెడ్త... అర్వకు సారూ!'' అన్నది.

''హేఁ... ఎ... ఎవర్నువ్వు?'' అన్న మాటలు శాన కష్టమ్మీద బయటికొచ్చినయ్ నా గొంతుల నుండి.

''నేను... నేను సారూ... సారమ్మను!'' అన్నది ఆ ఆకారం. నేను దబ్బున మంచం మీద్కెల్లి లేశిగూసున్న.

''నువ్వా..? గిదేందీ... ఇంత రేత్రి... గిప్పుడు ఎందుకొచ్చినవ్?'' అన్న గాబరవడ్కుంట. నాలోపట భయం పోలేదింకా.

''మీతోని మాట్లాడనీకి వచ్చిన!'' అన్నది.

''నా..తో.. నా? మాట్లాడ్తవా? గిప్పుడా? గిం..త రేత్రా?'' భయం కంటె ఎక్వ ఆచ్చెర్యబోయిన నేను.

''గంత గట్టిగ మాట్లాడకు సారూ... జర మెల్లగ మాట్లాడుండ్రి!''

''గింతరేత్రి మాట్లాడుడేంది సారమ్మా? అసలు మా కాంపౌండ్లకి యెట్లొచ్చినవ్?'' నాకింకా నమ్మకం కల్గుతలేదు.

''గోడ దూంకొచ్చిన!''

''ఏందీ... గోడ దూంకా?'' ఈసారి కరెంట్ షాక్ గొట్టినట్టయ్యింది నాకు.

''అంత గట్టిగ అర్వకు సారూ! ఎవులైన ఇంటెగాని, సూస్తెగాని నన్ను బత్కనియ్యరు!'' అన్నది. అప్పటికి పూర్తి సోయి వొచ్చింది నాకు. అంత రేత్రి... ఎవరైనా మా ఇద్దర్నీ అట్ల గిన చూశిండ్రంటే ఆమెకే కాదు, నాకు గూడ మంచిది కాదు.

''సరె... ఇట్ల రా!'' అని మా ఇంటిముంగిట్లున్న నా రూమ్ దిక్కు నడిచిన. మాట్లాడకుండ నా ఎన్కనె వొచ్చింది.

సప్పుడు గాకుండ తలుపు తీసి, లైటు స్విచ్ వేసి, వెన్కకు దిర్గి ''చెప్పు... ఏంది సంగతి? గింతరేత్రి ఎందుకొచ్చినవ్?'' అని నేను అడుగుతూండగల్నె... ఏడ్సుకుంట నా కాళ్లమీద పడిపోయింది సారమ్మ. ఆమె అట్ల జేస్తదని తెల్వని నేను– ''అరెఁ... సారమ్మా! ఏందిది? మీదికి లే!'' అంటి గాబరబడి.

సారమ్మ లేవలేదు. కాళ్ల తాన కూసోనే తల మీద్కిలేపింది. చెంపల మీద్కెల్లి కన్నీల్లు బిరబిర జారిపోతుంటె నా మొగం లకే చూస్కుంట– ''సారూ... పొద్దుగాల్నే నన్ను బల్వంతాన మా అత్తోరింటికి తోల్కబోతాంద్రు. నేనాడ్కి బోను సారూ! మీ కాల్మొక్త... నన్ను మీరే కాపాడుండ్రి!'' అన్నది ఏడ్సుకుంట.

''నేనా?'' నాకేం అర్థంకాలేదు. ''నేను... నేనెట్ల కాపాడ్త?'' అనేస్తి నాకు దెల్వకుండనె.

''ఏదైనా జెయ్యుండ్రి... నేనాడ్కిబోతె బతకను సారూ!'' అన్నది ఏడ్సుకుంటనే.

మా ఇంటికి ఇటు దిక్కు, అటు దిక్కు ఉన్న ఇండ్లతో పాటు, గేటు బయట రోడ్డు మీద్కెల్లి గూడ శాన బాగ అగుపడ్తది నా రూము. అసుంటిది– గంత రేత్రి నా రూమ్ల లైటు వెలుగు ఉండుడు, ఆ వెలుగులో నేను, నా కాళ్ల తాన ఏడ్సుకుంట ఉన్న సారమ్మను గిట్ల ఎవరైన సూశింద్రంటే..? ఎందుకో– ఊహించనీకె నాకు ధైర్యం చాలలే.

అయితే... ఆ ఆలోశన రాంగనె రెండడుగులు ఎన్కకేసి, ''సారమ్మా... ముందు నువ్ మీద్కి లే! ఇంత రాత్రి నువ్విట్ల నా తాన్కి వచ్చుడు మంచిది కాదు. ఏదైనా ఉంటే రేపు మాట్లాడు! ముందుగాల నువ్ మీ ఇంటికి పో!'' అంటి.

''లేదు సారూ! పొద్దుగాల్నె నన్ను తోల్కపోనీకె నా పెనిమిటి, మా అత్తోల్లు వస్తరు. గిప్పుడు కాకుంటే నా పానం బొయ్యేదాంక ఇంకెప్పుడు మీతోని మాట్లాడుడు కుదరదు సారూ!'' అంది దీనంగా.

రెండు సెకండ్ల పాటు సారమ్మను సూటిగ జూశ్న.

పది దినాల్సంది పస్తులతో, కన్నోళ్ళ తిట్లకీ, కొట్టిన దెబ్బలకీ చిక్కిశల్యమై, జీవం పోయినట్లున్న ఆ పిల్లని చూస్తాంటే... నా మనసంతా జాలీ, సానుభూతి సుట్టుముట్నాయి.

''సరె– ముందుగాల ఏడుపాపి, చెప్పు సారమ్మా... అసలేమైంది? ముద్దుగ పెండ్లిజేస్కుంటివి... అత్తగారింట్ల మగనితోని సక్కంగ కాపురం చేస్కోకుండ ఎందుకు పారిపోయి వచ్చినవ్? మీ అత్తమామలో, కట్టుకున్నోడో నిన్నేమైన కష్టపెట్టిన్రా? నీ భర్త మంచోడు కాదా? శాడిస్టా? నిన్నేమైనా హింసించిండా? భయపెట్టిండా? లేక వింతగా, పైశాచికంగా ఏమైన చేశిండా?'' సారమ్మ అత్తారింటికెల్లి పారిపోయి రానీకె కారణమేందని ఆలోశన జేస్తున్న నేను– నా అనుమానాలన్నిట్ని అడిగేస్తి.

కానీ, అన్నింటికీ వెక్కివెక్కి ఏడుస్తూ కాదన్నట్లుగా తల అడ్డంగా ఊపింది.

''లేక... నీ భర్త మగాడు కాదా?'' కొంచెం వెనకాడ్తూనే మనసులోని ఆఖరి ప్రశ్నని బయటపెట్టిన.

''కాదు సారూ! ఇయ్యేవీ కార్నం కాదు...'' ఏడుస్తనే బదులు జెప్పింది సారమ్మ.

''మరి? ఎందుకు పారిపోయొచ్చివ్... మళ్లీ అత్తారింటికి ఎందుకు పోనంటున్నవ్?'' అర్థంగాకనె అడిగిన.

''చెప్త సారూ– గది జెప్పనీకనె గింత రేతిరి గోడ దూంకొచ్చిన! యొందరు తిట్టినా, యెన్ని దెబ్బలు తిన్నా... నా మనసు లోని మాట ఇప్పటిదాంక నేను ఎవ్వల్కి జెప్పలే! గిప్పుడు మీకు గూడ జెప్పకపోతె ఇగ యీ జెన్మల ఎవ్వల్కి, ఎప్పట్కి జెప్ప లేను సారూ...'' అంటూ కొంగుతో కండ్లు తుడుచుకుని, చెప్పవట్టింది. ఆమె చెప్తున్నది వింటూంటే... నోట మాట రాలేదు నాకు.

చెప్పడం పూర్తిజేసి, ''మీ కాల్మొక్త... నన్ను మీరే కాపాడుండ్రి సారూ!'' అని చేతుల్తో నా కాళ్లను తాకి కండ్లకద్దుకుంది.

ఆ తర్వాత వెన్కకుదిరిగి వచ్చిన దారినే గోడ దూంకి వాళ్ళ ఇంటిదిక్కు పోతున్న సారమ్మ దిక్కే మాటలు రాని రాతివిగ్రహం తీర్న చూస్తూ నిలవడిపోయిన నేను.

★ ★ ★

''జల్ది బైలెల్లుండ్రి... ఇంటికి జేరేసరికి బాగ పొద్దుబోతది!'' ఎవరో అంటున్నరు.

సారమ్మని తమతోని తీస్కపోయేటందుకు ఆమె భర్త, అత్తమామలు వచ్చిన్రు. పయనాన్కి ఏర్పాట్లు జరుగు తున్నయి. బలికి సిద్ధంచేసే మేకపోతుని ముస్తాబు జేసినట్లు సారమ్మను అలంకరించిన్రు.

''బిడ్డా... ఇగ గిది నీ యిల్లు గాదు. మెట్టినిల్లే నీ యిల్లు– అత్తమామలే నీ అమ్మానాయినలు– నీ పెనిమిటే నీ పాలిటి దేవుడు. ఆల్లకి ఇజ్జతియ్యి!'' సుట్టాలూ, కులపెద్దలు సారమ్మకు జాగ్రత్తలు చెప్తూ, అత్తగారింట్లో మసలుకోవల్సిన పద్ధతుల్ని బోధిస్తున్నరు. అవన్నీ ఆమె వింటుందో, లేదో తెల్వదుగానీ– సారమ్మ చూపులూ, చేష్టలైతె జీవంలేనట్లే ఉన్నయి.

ఆర్భాటంగ జరిగే సారమ్మ అత్తారింటి పయనాన్ని సుట్టుముట్టు ఇండ్లలోనివాల్లు కూడ వింతగ చూస్తున్నరు. నా రూమ్ తాన నిలబడి చూస్తున్న నేను మట్కు ఎప్పట్లెక్క ఉండలేకపోతున్నా. నా మనసంత కెలికినట్లుంది.

రాత్రి జరిగిన ఘటన తర్వాత– పొద్దుగాల్ల నేను మా రేణుకతో మాట్లాడ్తూ 'ఎట్లైన సారమ్మ పయనాన్ని ఆపాలి. ఆమె తరపున నేనే వాల్ల అమ్మానాయినతో, కులపెద్దలతో మాట్లాడ్తా'నని అన్నప్పుడు– రేణుక చెప్పిన మాటలు నన్ను ఆపకుండ వుండివుంటె ఈపాటికి సారమ్మ ప్రయాణం పయనం ఆగిపోయి ఉండేద్ది.

''ఏంది మామా... నీకేమైన మతిబోయిందా? సారమ్మ తరపు ఏమని మాట్లాడ్తవ్? ఒకవేళ మాట్లాడినా అదంతా నీకెట్ల తెలుసని అడిగితే ఏమని చెప్తవ్? 'నడిరేత్రి నీ రూంకొచ్చి చెప్పిం'దని చెప్తవా? అట్ల చెప్తే ఇంకేమైనా ఉందా? అసలు ఆ పిల్ల అత్తగారింటి నుంచీ, మొగని తాన్నుంచీ రేత్రికి రేత్రే పారిపోయి రానీకి నువ్వే కార్నమని గోస బెట్కుంట నీకూ, ఆ పిల్లకీ సంబంధం అంటగట్టి లొల్లి లొల్లి జేస్తరు. గప్పుడు నువ్వు ఆ పిల్లని కాపాడుడు గాదు– నిన్ను నువ్వు కాపాడ్కునె ఛాన్సు కూడ ఉండదు. ఊకెనె ఎమోషనలై లేనిపోని కష్టం తీస్క రాకు. ఆ పిల్లని ఉద్ధరించనీకె నువ్వెవరివి? సారమ్మకు అన్యాయం అయితుందని నీ ఒక్కనికే గాదు– మాకూ, గిదంత జూస్తున్న చుట్టుప్రక్కలోల్లందర్కి ఎరికె. ఐనా ఎవ్వల్ నోరిప్త లేరెందుకు? కోరికోరి ఎవ్వల్ కష్టంల యేలు వెట్టరు. నువ్వు కూడ ఏం మాట్లాడకు. ఏం జరగనట్లే, నీకేం తెల్వనట్లే ఉండిపో!'' అన్నది రేణుక.

రేణుక మాటల్లో ఎంత నిజమున్నదో గాని, ఆమె

జెప్పినట్లు నేనుగాని సారమ్మ విషయంలో జోక్యం చేస్కుంటే, నోరు మెదిపితే– ఆమెకి నాతోని అక్రమ సంబంధాన్ని కూడ అంటగట్టే మూర్ఖులు వాళ్లంతా. సారమ్మ ఈరోజు గాకున్నా కొన్ని దినాలకైనా అత్తగారింట్లో సర్దుకుపోయి, మగనితో సక్కగ సంసారం జేస్కునే అవకాశం ఉంది. ఇస్వంటి అభాండమేదైనా ఆ పిల్లమీద పడితే మట్కు ఆమె జీవితం కుప్పగూలిపోవుడే కాక, ఆ మచ్చ జీవితాంతం ఆమెని హింస పెడ్తనే ఉంటది. ఈ ఆలోచనే నేను సారమ్మ విషయంలో జోక్యం చేసుకోనీయకుండా చూస్తూ ఉండిపోయేట్లు జేసింది.

ఐతే, అంత ధైర్యంజేసి అర్ధరేత్రి గోడ దూంకొచ్చి తన గోడు చెప్పుకున్నందుకైనా తనకోసం నేనేదైన జేసి ఆమె ప్రయాణం ఆపుతానని ఎదురుచూస్తున్న సారమ్మ– నేనిట్ల ఏం జేయకుండ ఉండిపోతె నా గురించి ఏమనుకుంటది? నన్ను క్షమిస్తదా?

''వో అత్తా... పోయొస్తం!'' పోచమ్మతో అంటున్నడు సారమ్మ భర్త.

''పోయిరా బిడ్డా!'' అని, కూతురి దిక్కు దిర్గి ''సూడు సారమ్మా... మేమేం జేశినా నువ్ బాగుండాలని, నీ బత్కు సుకూన్గ ఉండాలనే జేశ్నం. మమ్లను తప్పుగనుకోకు బిడ్డా!'' చీరకొంగుతో కళ్ళొత్తుకుంటూ అన్నది పోచమ్మ.

సారమ్మ ఏం మాట్లాడకుండ తల వొంచుకునే కదిలింది.

''గదేంది సారమ్మా... గట్లొచ్చేస్తవ్? అమ్మనాయినకి కాల్మొక్కి రా!'' ప్రేమగా అన్నడు సారమ్మ భర్త.

సారమ్మ తల యెత్తకుండానే వెన్కకు దిరిగి అమ్మనాయినల కాల్లకు మొక్కింది. రాజయ్య కూతురి భుజాలు పట్టుకుని పైకిలేపి, ''పోయిరా బిడ్డ!'' అన్నాడు తడికండ్లతో.

కదిలింది సారమ్మ. తల వొంచుకొని పెనిమిటి వెనుక నడుస్తూ గేటు బయటకి వచ్చింది. నేను నా రూము దగ్గర నిలబడి దూరంనుంచే సారమ్మ ముఖంలోని భావాల్ని చదవాలని జూస్తున్న, గాని, వీలైత లేదు.

అప్పటికే బస్టాండుకి పోయేటందుకు ఇంటిముందర ఆటో సిద్ధం చేశిను. అయినోల్లందరు వీడ్కోలు జెబ్తుంటె... అందరి తాన సెలవు తీసుకుంటున్నట్లు తలవూపి, ఆటో యెక్కబోతూ– గప్పుడు జూసింది సారమ్మ... నా రూమ్ దిక్కు.

నీల్లు నిండిన ఆమె కండ్లనుంచి గురిపెట్టిన బాణాల తీర్న దూసుకొచ్చిన ఆమె సూపులు– అటుదిక్కే చూస్తున్న నా కండ్లకి సూటిగ వచ్చి తగిల్నయ్. రెండు క్షణాలు కూడ ఆ చూపులను తట్టుకోలేక తల వంచుకున్నాన్నేను.

నాకు తెలుసు... ఆ చూపుల్ని నేను ఎప్పట్కి మరచిపోలేననీ, వాటిలోని భావం నన్ను జీవితాంతం వెంటాడుతూ వేటాడుతూనే ఉంటదనీ!!

ఔను... ఇప్పట్కి గూడ నా అంతరాత్మ నన్ను ఒక నేరస్తుడిలాగ చూస్తూ... నన్ను ప్రశ్నిస్తూనే ఉన్నది.

## రచయిత్రి పరిచయం

వృత్తిరీత్యా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా రెండు దశాబ్దాలకు పైగా విధులను నిర్వహిస్తున్న "వై. మంజులత"గారు– ప్రవృత్తి రీత్యా కవయిత్రిగా, రచయిత్రిగా సాహిత్యలోకంలో ఒకటిన్నర దశాబ్దం నుంచి తన వంతు "సాహితీసేద్యం" చేస్తున్నారు. మంజులతగారు రచించిన పలు కవితలు, కథలు ప్రముఖ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. ఈవిడ కలం నుండి జాలువారిన కొన్ని కథలు, కవితలు వివిధ పత్రికలు, సంస్థల నుండి ఈవిడకు బహుమతులను, పురస్కారాలను, సత్కారాలను అందించాయి.

మంజులతగారి కలంపేరు "మంజులభావన"

మంజులతగారు రచించిన కవితలలో కొన్నింటిని "కవితాస్రవంతి" పేరుతో ఒక సంపుటిగా 2020వ సంవత్సరంలో వెలువరించారు. ఈవిడ రచించగా పత్రికలలో ప్రచురింపబడిన కథలతో "కథాసంపుటి" కూడా త్వరలో వెలువరించనున్నారు.

**చిరునామా**

"మంజులభావన"

వై. మంజులత, ఎం.ఏ., ఎం.ఎస్సీ., బి.ఎడ్.,
16– 11– 16/ ఎన్/ 166/ 2, ప్రశాంత్ నగర్,
మూసారం భాగ్, హైదరాబాద్– 500036.
ఫోన్ : 9396983346
ఈ–మెయిల్ : manasuputalu@gmail.com

## అనువాద కవిత్వం

# ఇది చాలు నాకు !




అనుసృజన
గీతాంజలి
8897791964


ఇది చాలు నాకు !
నా తల్లి లాంటి మాతృ భూమి మీద చనిపోవడం...
ఆమె లోపల దాచబడి ఇమిడి పోవడం..
చాలదా నాకు ?
నా భూమాత వెచ్చని మట్టిలో కరిగిపోయి..
మాయమైపోయి...
ఇకప్పుడు నేనొక విత్తన మై ..
మొక్కై మొలిచి, పువ్వునై పూయాలి !
నా దేశపు బాలిక అపురూపంగా ఆ పూలతో ఆడుకోవాలి !
నా దేశపు కౌగిలిలో..
గుప్పెడు ధూళి లా...
ఆకుపచ్చని గడ్డి పరకలా..
విరబూసిన పూవులా ఇమిడిపోవడం కన్నా
నాకేం కావాలి చెప్పండి ?
ఇది చాలు నాకు !



మూలం - ఫద్వా తుకాన్
(పాలస్తీనా కవయిత్రి )

## అనువాద కవిత్వం

# “ఏమీ లేదని ఎందుకు అనుకోవాలి”

వెలుతురు లేనప్పుడు...
నీరు లేదు..నీడా లేదు.
చంద్రుడు లేడని.. నీరూ., సూర్యుడూ లేరు.
నీరు లేదని సముద్రాలూ లేవు మరి..
పక్షులు లేవని చెట్లు లేవు ..కాంతీ లేవు.
భూమి లేదని ఆకాశమూ లేదు !
అగ్ని లేదని ఇక వెలుతురు.. వేడీ రెండూ లేవు.
నీరూ.. నిప్పు భూమీ.. లేకపోతేనేం..?
అవన్నీ సాధిస్తామనే ఒక కల అయితే
నిదురలోనే సజీవంగా ఉంది.
నీలి ఆకాశపు అన్వేషణలో
అది చాలదా ?



మూలం: అనాబెన్ లోపేజ్
(మెక్సికో కవయిత్రి)

## కవిత

# స్నేహగీతం




అనువాదం: హిమజ
9441492737


నేనే గనుక ఇంద్రచాపాన్ని అందుకోగలిగితే
తప్పకుండా పట్టుకుంటాను
కేవలం నీ కోసం
నువ్వు నిరాశగా ఉన్న రోజుల్లో
దాని అందాన్ని నీతో పంచుకుంటాను కూడా
నేనే గనుక పర్వతాలని నిర్మించగలిగితే
అవి ఇక నీ స్వంతం అనుకోవచ్చు నువు
ఏకాంతంగా ఉండేందుకో స్థలం
ప్రశాంతమైన ఓ ప్రదేశం దొరికి
నీ బాధలన్నింటినీ నేను తీసుకోగలిగితే
సముద్రపు అగాధాల్లోకి వాటిని విసిరేస్తాన్నేను

నాకు తెలుసు ఇవన్నీ నాకు అసాధ్యాలని
నేనో పర్వతాన్నీ నిర్మించలేను
ఇంద్రధనువు జాతరనీ పట్టుకోలేను
కానీ .....
ఎప్పుడూ నీకు మంచి చేసే నేస్తంగా నన్నుండనివ్వు !
నీ మేలు కోరే మైత్రి గా నేనుంటాను !!

శరతుల్లేని ప్రేమ అభిమానం ఒక్క స్నేహితుల మధ్యనే సాధ్యం. నిజమైన మిత్రులు ఒకరినొకరు తగ్గించుకోకుండా, బదులేమీ కోరకుండా మనసులు పంచుకుంటూ ఉంటారు. అలాంటి ఓ స్వచ్ఛహృదయపు స్నేహగీతం ఈ కవిత .

సాంఘిక వ్యాసం

# భూఆక్రమణ మారణహోమంలో సమిధలు



భండారు విజయ
ఫోన్ : 8801910908






ఈశాన్య రాష్ట్రంలో ఒక్కసారిగా మంటలు భగ్గుమని మండలేదు. కొన్ని దశాబ్దాలుగా ఇరు జాతుల మధ్య వున్న అనేక వైరుధ్యాలు, వైషమ్యాలతో పాటు వలసవాద రాజకీయాలు కూడా ఆయా ప్రాంత వాసుల మధ్యన జొచ్చి, జాతుల పోరుకు దారులు తీయించింది. భారత రాజ్యాంగం, 371సి ఆర్టికల్ ప్రకారం 1981లో అడవి,కొండ ప్రాంతాల మూలవాసులైన ఆదివాసులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించబడ్డాయి. అందులో 90% ఆదివాసుల భూములు ఆదివాసేతరులకు అమ్మడానికి, దానం చేయడానికి వీలు లేదన్నది ముఖ్య అంశం. అయితే, 2014 తర్వాత దేశ పాలనాధికారం చేపట్టిన మతతత్వపార్టీ అనేక రాష్ట్ర శాసనసభల్లో మార్పులు చేస్తూవస్తున్నది. ఆ ప్రభావం ప్రస్తుతం రెండు జాతుల నడుమ అసూయ,ద్వేషాలు పెంచి ఒక జాతి మరో జాతిని నిర్మూలించే కుట్ర, కుతంత్రాలలో యుద్ధం జరుగుతున్న విషయం మనం చూస్తున్నాం. . ఆ క్రమంలో మెయితీలు కూకీలపై మూక దాడులు చేస్తూ కూకీ మహిళలను వివస్త్రలుగా చేసి నడి బజారుల్లో ఊరేగిస్తూ అత్యాచార హత్యలు చేయడం మానవజాతి క్షమించరాణి నేరం. అక్కడ మారణహోమాలు జరగడం పరిపాటైన విషయమే అయినప్పటికి దారుణ హత్యాకాండలను, సజీవ దహనాలను నిర్మూలించే దిశగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టకపోవడం, కనీసం బాధితులకు రక్షణను కల్పించకపోవడం దురదృష్టకరం.

మణిపూర్ రాష్ట్రంలోని ఇంఫాల్ ఈస్ట్, వెస్ట్ మైదాన ప్రాంతాలలో నివసించే ప్రజలు అందరు మెయితీ జాతీయులు. వీరికి ఒక చరిత్ర వుంది. స్వతంత్ర భారత దేశానికి పూర్వం మణిపూర్ మహరాజుల పాలనలో వున్న ప్రాంతం. అక్కడ నివసించే ప్రజలు అందరూ వలస వాదులు కాదు. మైదాన ప్రాంత ఆదివాసులే. కూకీలతో నాగ, లాంటి మరో ముప్పైరెండు చిన్న,చిన్న తెగల వారందరూ కొండప్రాంత వాసులు. భారత రాజ్యాంగ ప్రకరణల దృష్ట్యా అడవి,కొండ ప్రాంత వాసులు మాత్రమే ఎస్ టి హోదాను కలిగివున్నారు. తమకులేని ఎస్ టి హోదా కూకీలకు ఉండడం , రోజురోజుకూ పెరిగిపోతున్న జనాభాకు సరిపోయే భూమి తమకు లేకపోవడం సహజంగానే మెతీల అసహనానికి పునాదులు. ప్రస్తుతం మైదాన

ప్రాంతంలో వున్న మేతీలకన్నా (ఇంఫాల్) వైశాల్యంలో కుకీల సంఖ్యాబలం చాలా తక్కువ. అధికంగా పెరుగుతున్న జనాభా కలిగిన తమను కూడా కొండ ప్రాంత వాసులుగా గుర్తించాలని, తమకూ కుకీల వలె ఎస్ టి హోదాను కల్పించాల్సిందిగా 'మణిపూర్ హైకోర్టు' కు మేతీలు న్యాయమూర్తికి అర్జీ పెట్టుకున్నారు. ఆ అర్జీపై 'మణిపూర్' హైకోర్టు న్యాయమూర్తి స్పందిస్తూ మెయితీ వర్గీయుల డిమాండును పరిశీలించవల్సినదిగా ఆ రాష్ట్ర బీజేపి ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. దానిని కూకీలు విభేదిస్తున్నారు. అగ్నికి ఆజ్యం పోసినట్లుగా, ఆ ఉత్తర్వులు సహజంగానే కుకీ జాతీయులను భయాందోళనలకు గురిచేసింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరుతూ, 'ఆదివాసీ పరిరక్షణ చట్టం' కింద కూకీ, నాగా, మిజో, చిన్, జోమీ లాంటి అనేక కొండజాతి వాసులకు రక్షణ కల్పించాలని కొందరు యువకులు భారీ ర్యాలీని తీయడంతో మేతీ వర్గీయులు ఆ నిరసన ర్యాలీని జీర్ణించుకోలేక పోయారు. దాంతో నిరసన తెలుపుతున్న వారిపై రాళ్ళు రువ్వుతూ, కొందరు మేతీ ఆందోళనకారులు ఆ ర్యాలీని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఆ సందర్భంగా జరిగిన దాడిలో కుకీ మరియు మేతీ వర్గీయుల నడుమ అసహనం పెరిగిపోయి, అది చిలికి,చిలికి గాలివాన అయినట్లుగా పగ,ద్వేషాలు, కక్షల రూపం దాల్చి పరస్పర దాడులు చేసుకునేలా ప్రేరణకు దోహదం పడ్డాయి.

సహజంగా ఏ మనిషి ఎలా మారిపోయినా, ఆ సమయంలో మారణాయుధాన్ని పట్టుకోవాలని ఎవ్వరూ కోరుకోరు. యుద్ధం చేయాలని కూడా ఎవ్వరూ అనుకోరు. అందరికీ అన్ని అందుబాటులో ఉన్నంతకాలం ఏ ఒక్కరికీ పోరాటం అనే పదం కూడా గుర్తుకురాదు. ఎవరైనా తమ జోలికి లేదా తమ ప్రాంతం లేదా తమ వారి జోలికి వచ్చినప్పుడు, ముందుగా అక్కడనుంచి మౌనంగా తప్పుకుని వెళ్ళిపోతారు. పదేపదే వారిపై దాడులు జరుగుతుంటే ముందుగా శాంతియుత చర్చలు మొదలు పెడతారు. ఆ తర్వాత హెచ్చరిస్తారు. అప్పటికి వినకపోతే కొట్లాటలకు దిగుతారు. ఇంకా సద్దుమనకపోతే ఇరు వర్గాల పెద్దలు కూర్చొని చర్చించుకుంటారు.

అవీ ఫలించకపోతే తప్పనిస్థితిలో ఒకరిపై ఒకరు దాడులకు తెగబడడానికి కూడా వెనకాడరు. అప్పటి వరకు వ్యక్తిగతంగా వున్న సమస్య ఎప్పుడైతే వర్గాలకు పాకుతుందో అది సామూహికమై ఇరువర్గాల మధ్య యుద్ధానికి దారి తీస్తుంది. ఈర్ష్య,అసూయ,పగ, ద్వేషాలతో పాటు దౌర్జన్యకరమైన దాడులు కూడా వారు చేయడానికి వెనుకాడరు. బలమైన వర్గం ఎప్పుడూ బలహీన వర్గంపై దాడులు చేసినప్పుడు ఎక్కువ నష్టం బలహీనవర్గం వారిపైనే జరుగుతుంది. ముఖ్యంగా ఏ యుద్ధంలోనైనా ముందుగా బలై పోయేవారెప్పుడు మహిళలు, పిల్లలు మాత్రమే. ఇది తరతరాలుగా జరుగుతున్న సామాజిక చరిత్ర. ప్రతి యుద్ధంలో ఇరు వర్గాలవారికీ కొన్ని మెలుకువలు, పన్నాగాలు వుంటాయి. పాలక వర్గాలు, పోలీసు వ్యవస్థ ఒక వర్గానికి మాత్రమే సాయపడితే, మూకుమ్మడి దాడులకు తెగబడితే ఫలితం బలహీన వర్గ ప్రజలు తమ ప్రాంతాలు, దేశాలు వదిలి ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని పారిపోవడం సహజం. అందులో భూ ఆక్రమణ, సంపదనే ధ్యేయంగా జరిగే యుద్ధాలలో కేవలం వాటిని దోచుకోవడమే ప్రధాన హేతువు అవుతుంది. అలాంటి సందర్భంలో గత నాలుగు నెలలుగా తడి ఆరని దుఃఖాలుగా మణిపూర్ రాష్ట్ర కుకీ తెగకు చెందిన ఆదివాసులు మన ముందు ప్రశ్నార్ధకమై కనబడడం మనం చూస్తువున్నాం. పాలకులు వారి మీడియాలు ఒక వైపు అణగారిన వారికి సానుభూతిని చూపుతూనే , మరోవైపు బలమైన వర్గానికి కొమ్ము కాస్తూ రెండు తెగల మధ్య జరుగుతున్న మారణకాండను ఎగదోస్తూ వుండడం ఇప్పుడు అక్కడ నడుస్తన్నచరిత్ర.

అసలు ఈ కుకీలు ఎవరు? మేటీలు ఎవరు? ఎందుకు ఒకరిపై మరొక ఆదివాసీ తెగ తెగబడి మూకదాడులు, హింసలు చేసుకుంటున్నారు? కుకీలతో పాటు సహజీవనం చేస్తున్న ఇతర 36 ఆదివాసీ తెగలు వున్నప్పటికినీ, మేటీ వర్గీయులు కేవలం కుకీ వర్గీయులపై మాత్రమే ఎందుకు దాడులు చేస్తూ వారి ధన, మాన, ప్రాణాలను హరిస్తున్నారు అన్నది తెల్సుకోవాలనుకున్నప్పుడు ముందుగా ఆ జాతుల చరిత్రలోకి మనం వెళ్లాల్సి వుంటుంది.

మేతీయ వర్గానికి చెందిన ఆదివాసులు అందరూ 'సనామహి' అనే ప్రాచీన వైష్ణవ సాంప్రదాయాన్ని ఆచరించే సనాతనులు. మణిపూర్ రాష్ట్రంలోని ఇంఫాల్ మైదానం లేదా లోయ ప్రాంతం. బ్రిటీషు కొలోనియల్ కు పూర్వం 'మణిపూర్' మహారాజుల అధీనంలో వుండేది. వారిది సర్వస్వతంత్ర

రాజ్యం. బ్రిటీష్ పాలకులు మణిపూర్ ను ఆక్రమించుకుని, తమ అధీనంలోకి తెచ్చుకున్న తర్వాత మణిపూర్ మహారాజు వారికి సామంత రాజుగా మారిపోయాడు. స్వాతంత్రానంతరం కూడా మేటీలు తమ సనామహి సంప్రదాయ మైన వైష్ణవ మతాన్నిమాత్రమే ఆచరించేవారు. బ్రిటీషర్స్ కన్నా కూడా, ముందుగా ఇంఫాల్ ప్రాంతంలో ఎక్కువగా 'కెనడా' దేశ మిషినరీలను ప్రవేశించాయి. వారి ప్రాబల్యంతో ముందుగా 10% ప్రజలు మాత్రమే క్రిష్టియానిటీని అక్కడ స్వీకరించడం జరిగింది. ఆతర్వాత ఇంఫాల్ నగరం, మరియు ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో క్రైస్తవ చర్చ్ లను ఎక్కువగా బ్రిటిష్ వారు స్థాపించడం వల్ల అక్కడి ప్రజలకు విద్య, వైద్య సదుపాయాలతో పాటు బాప్టిస్ట్ క్రైస్తవ మతవ్యాప్తి జరిగింది. అందువల్ల అక్కడి పౌరులలో 55% మంది ప్రజలు 'సనామహి' వైష్ణవ సంప్రదాయాన్ని, 40% మంది క్రైస్తవులు, మిగిలిన 5-7% పౌరులు ముస్లింలుగా వున్నారు. ఆ సమయంలోనే ఆర్ ఎస్ ఎస్ మరియు వారి అనుబంధ సంస్థలు బ్రిటీష్ పాలకులకు తమ మద్దతును తెలిపి, వారికి ఊడిగం చేయడమే కాదు, అణగారిన వారిని అణచివేయడంలో సహకరించింది. 1945లో జరిగిన రెండవ ప్రపంచ యుద్దంలో కుకీలు భారత దేశ పక్షం వహిస్తే, మేటీలు మాత్రం ఇండియాకు వ్యతిరేకంగా బ్రిటీషర్స్ కి తమ మద్దతును ప్రకటించి వారి రాజ్యాధికారానికి సహకారం అందించారు.

ఆ తర్వాత జరిగిన భారతదేశ స్వాతంత్రానంతరం కూడా మేటీలు ఇండియాలో కలవడానికి అసమ్మతిని ప్రకటించి స్వతంత్ర మణిపూర్ దేశంగానే వుండిపోయారు. కొన్ని దశాబ్దాల పాటు మేటీలు భారతదేశం పట్ల, రాజ్యాంగం పట్ల విధేయతగా ఉండడానికి వ్యతిరేకించారు. బిజేపి పాలకులు మణిపూర్ భాగాన్ని ఆక్రమించుకునేంత వరకు కూడా భారతదేశ మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేయడానికి, జాతీయగీతాన్ని ఆలపించడానికి కూడా మేటీలు తమ విముఖత్వాన్ని చూపారు. 2014 తర్వాతనే మెల్లమెల్లగా మణిపూర్ లోని మేటీలు ముఖ్యంగా ఇంఫాల్ ప్రాంతంలో నివసించే మేటీలందరూ 'సనామహి' సంప్రదాయానికి దగ్గరగా వున్న హిందూమతంలో చేరడం మొదలుపెట్టారని, కాంకోపి జిల్లాలో నివసించే ఊరి పెద్దలు, చర్చ్ ఫాదర్స్ కూడా ఇదే విషయాన్ని ధృవీకరించారు.

2023 భారతదేశ జనాభా లెక్కల ప్రకారం మణిపూర్ జనాభా మొత్తం ముప్పైరెండు లక్షలకు పైగా వున్నారు. 2011 సెన్సెస్ ప్రకారం జనాభాలో 53% మేటీలు, నాగాలు 24%, కుకీలు 16% మిగిలిన వారిలో ఇతర తెగలు, 7% ముస్లీములు కూడా వున్నారు. కుకీలలో 36 తెగలు వుండగా, నాగాల్లో 6 తెగలు వున్నారు. కుకీల నుండి ప్రస్తుతం 10మంది ఎంఎల్ ఏలు వుండగా, నాగా జాతి నుండి 10మంది ఎంఎల్ ఏలు వరకు వున్నారు. 17 జిల్లాలుగా మణిపూర్ విభజించబడింది. ఈస్ట్,వెస్ట్ ఇంఫాల్ మైదాన ప్రాంతం తప్ప మిగిలిన ఈశాన్య పర్వత ప్రాంతాలు అన్నీ కుకీ, నాగాల స్థావరాలుగా వున్నాయి. ఇక మారణకాండ విషయానికి వస్తే అనేక వాదనలు వినిపిస్తున్నాయి. ఆర్ ఎస్ ఎస్ మరియు బీజేపీ పార్టీ మణిపూర్ రాష్ట్రంలోకి ప్రవేశించిన తర్వాత "సనాహమా" ఆచారం గల వారందరు హిందూమత వ్యాప్తిలో భాగస్వాములు కావడం చెప్పుకోదగ్గ పరిణామమం.

మణిపూర్ భారతదేశ మణిహారంగా చెప్పుకుంటాం. ఈ ప్రాంతం జానపదులతో కూడిన గొప్ప సంస్కృతిని కలిగి వుంది. వీరి ఆర్థిక వ్యవస్థకు పుష్టిని ఇచ్చేది వీరి వ్యవసాయమే. మణిపూర్ చుట్టూ తొమ్మిది కొండలు, 'ఒవల్' (అండాకారపు) ఆకారపు లోయలతో కూడిన సహజసిద్ధమైన ఒక ఆభరణంగా వుంటుంది. భారతదేశానికి ప్రకృతి ప్రసాదించిన కానుకగా దీనిని చెబుతారు. 1891 ఆంగ్లో-మణిపూర్ యుద్దంలో ఓటమి తర్వాత ఈ ప్రాంతం రాచరిక రాష్ట్రంగా మారింది. 1949 'ప్రిన్సీ' స్టేట్ ఇండియన్ యూనియన్ లో విలీనం అయింది. 1972 లో భారతదేశం యొక్క పూర్తిస్థాయి రాష్ట్రంగా ఏర్పడింది. దీని భూగోళ వైశాల్యం 22,327 చదరపు కిలో మీటర్లు. 90% కొండప్రాంతంతో కప్పబడి వుంటుంది. ఇక్కడి జాతులన్నీ గత కొన్ని శతాబ్దాలుగా సామరస్యతతో నివాసం వుంటున్నారు. వీరి పురాణ గాథలు, ఇతిహాసాలు, నృత్యాలు, జానపద కథలు, చేనేత కళాఖండాలు పేరెన్నికగన్నాయి. ఇక్కడి ప్రజల సంప్రదాయ ఆట 'పోలో' గా ప్రసిద్దిచెందింది. మణిపూరు రాష్ట్రంలో చాలా భాగం చురాచాంద్ పూర్, కాంకోపి, సేనాపతి మొదలగు జిల్లాలన్నీ కుకీల స్థావరాలు. ఇంఫాల్ లో వున్న జనాభాలో ఎక్కువ శాతం మేటీలు వుండగా, చాలా తక్కువ శాతం కుకీలు, ముస్లింలు వుంటారు. అందువల్ల మేటీలకు అది

బలమైన స్థావరంగా వుంది. కుకీలు మాత్రం ఎక్కువ శాతం కొండ ప్రాంత వాసులైతే, మేటీలు మైదాన ప్రాంత వాసులుగా స్థిరపడినారు. నిత్యం పెరుగుతున్న జనాభాలో ఎక్కువ శాతం మెటీ వర్గీయులు వున్నారు. కొండ ప్రాంతాలలో నివసించే కుకీ జాతీయుల కన్నా, మేటీ జాతీయులు విద్యా, వైద్య, ఇతర అనేక రంగాలలో బాగా వెనకబడి వుంటారు. మేటీలు వ్యాపారస్తులుగా, పెట్టుబడిదారులు గా, మొదటి నుంచి గుజరాత్ ప్రాబల్యంతో రాజకీయ చాతుర్యం కలిగిన వారుగా వున్నారు. కుకీలు మిషినరీ సంస్థల ప్రోత్సాహంతో ఉన్నత విద్యారంగంలో గొప్ప ప్రావీణ్యత కలిగి వున్నందున కీలక ప్రభుత్వ వ్యవస్థల్లో పైచేయిగా వున్నారు. కుకీలకు సామాజిక,ఆర్థిక, న్యాయ రంగాలలో ఉన్నత పదవులలో వుండటం, అన్ని పాలనా వ్యవస్థలలో కుకీల సహకారం మేటీలకు అవసరం పడుతూ వుంటుంది. పరిపాలనా విధానంలో సహజంగానే మేటీలు కుకీ అధికారుల సమ్మతిని తీసుకోవాల్సిన స్థితిలో ఈనాటికీ వుండడం మేటీలకు మింగుడుపడని విషయం. రాజకీయ, పెట్టుబడి, వ్యాపార రంగాలలో కుకీల కన్నా మేటీలు ఎప్పుడూ అగ్ర స్థానంలోనే వుంటారు. అందువల్ల కూడా మేటీలు మొదటి నుంచి కుకీలపై ఒకరకమైన ఆధిపత్యాన్ని, అసహనాన్ని పెంచుకుని వున్నారు. కుకీలు బర్మా మరియు మయన్మారు దేశాల నుండి వలస వచ్చిన వారన్న చిన్నచూపు కూడా వారిలో వుండడం వల్ల, పూర్తి ఈశాన్య కొండ ప్రాంతాలన్నీ కుకీలే ఆవరించి వున్నారన్న అక్కస్సు కూడా గత కొన్ని దశాబ్దాలుగా మేటీల మనసులను తొలిచివేస్తున్న విషయం. అందువల్లే మేటీలు కుకీలపై నిలువెత్తు ద్వేషాన్ని నింపుకోవడానికి ముఖ్య కారణం అయింది. అందులో ' స్పెషల్ ఫారెస్ట్ ఆక్ట్ ప్రకారం' కుకీల అడవి ప్రాంతం చాలా విశాలంగా వుండడం, షెడ్యూల్ ట్రైబ్స్ కు చేయిందిన అన్ని రిజర్వేషను సదుపాయాలు కుకీలకు వుండడం, వాటి ఫలితాలను వారు గత దశాబ్దాల నుండి అనుభవించడం చూస్తున్న మేటీ వర్గానికి, కుకీల ఎదుగుదల కంటగింపుగా వుండి, వారిలో ఈర్ష్య, అసూయ,ద్వేషాలకు దారితీసింది. సహజంగానే మేటీలు కుకీలపై చిన్నచూపుకు, కక్ష, పగలు పెంచుకోవడానికి కారణభూతమైందన్నది నిర్వివాదాంశం.

ఇరువర్గాల నడుమ ఉన్న వైవిధ్యాలు, విభిన్న కోణాలను దృష్టిలో తీసుకున్నప్పుడు, మనుషుల నడుమ వున్న సహజసిద్ధమైన జెలసీలు ఎక్కువగా పనిచేస్తుండడం వలన అప్పుడప్పుడు మేటీలు తమ ఆధిపత్యాన్ని కుకీల మీద చూపుతూ దాడులు చేయడం అక్కడ పరిపాటి. ఇంకొక ముఖ్యమైన విషయం మేటీలు అడవి ప్రాంతంను' లీజు' పద్ధతిలో తీసుకున్న కొండ ప్రాంతపు సాగుభూమిలో గంజాయి లాంటి మాదకద్రవ్యాల పంటలను పండించటం, కొండ ప్రాంత ప్రజలైన కుకీలు, తమ పేదరికం కారణంగా ఆ భూములలోనే కూలీలుగా పనిచేస్తు తమ జీవనాధారం చేసుకోవడం వలన కూడా మేటీల మనసులో కుకీలు తమకన్నా తక్కువస్థాయి వారన్న చులకన భావం కలిగివున్నారు. తాము లీజుకు తీసుకున్న భూములపై పూర్తి అధికారం కుకీలకు మాత్రమే వున్నదన్న విషయం వాళ్ళు జీర్ణించుకోలేకపోతున్నారు. అలాంటి పంట భూములపై పూర్తి హక్కును సాధించాలంటే తమను కూడా ఎస్ టి జాబితాలో చేర్చగలిగే ఆయుధం భారతదేశ రాజ్యాంగ పరిధిలోకి తాము వెళ్ళినప్పుడు మాత్రమే అది సాధ్యం అవుతుందన్నది వారికి తెలుసు. కుకీల హక్కుగా వున్న కొండ ప్రాంతంలో తాము కూడా స్వేచ్ఛను కలిగి వుండాలంటే తాము ఎస్ టి జాబితాల్లోకి వెళ్ళడం తప్ప మరో మార్గం లేదన్నవాస్తవ గ్రహింపుతోనే కుకీలపై సహజంగానే మేటీలు ద్వేషాన్ని పెంచుకున్నారు. అందువల్లనే వారిరువురి నడుమ నిరంతరం జరిగే చిన్నచిన్నఇగోల దాడులు. ఆ దాడులే ఇప్పుడు మేటీలు(రాజకీయ కారణాలు వేరే వున్నా) ఉధృతం చేయడం, అందుకు వారికి రాజకీయ పలుకుబడి, పోలీసు వ్యవస్థ వెన్నుదన్నులు అందించడంలో బలమైన వైరానికి నాంది పలికింది. ఆ అవకాశాన్ని అదునుగా తీసుకున్న మేటీలు తెగబడి, గత నాలుగు నెలలుగా జరుగుతున్న దాడులు. ఈశాన్య ప్రాంతంలో జరుగుతున్నఈ దారుణ మారణకాండకు అక్కడి ప్రభుత్వం కూడా బాధ్యత వహించడం వలన అక్కడి ప్రజల కోపానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా అందులో ఆజ్యం పోసినట్లైంది.

1972 కు పూర్వం వరకు భారతదేశ విధేయతను ఒప్పుకోలేని మేటీలు, ఇప్పుడు ఒక ప్రధాన జాతీయ రాజకీయ పార్టీ పంచన చేరడమే కాదూ, మణిపూర్ రాష్ట్ర పగ్గాలను కూడా వారి చేతిలో పెట్టింది. ఆ రాజకీయ పార్టీ ప్రోద్భలంతో

తమను కూడా షెడ్యూల్డ్ ట్రైబ్ జాబితాలో చేర్చాలని మేటీలు డిమాండ్ చేస్తూ, కుకీలు తమలా మూలవాసులే కాదని, వారు బర్మా,మయన్మారు ప్రాంతాల నుండి వలస వచ్చిన శరణార్థులు అంటూ, మణిపూర్ 'హైకోర్టు' నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు. 1949కి పూర్వమే బ్రిటీషు కొలోనియా కాలం నాటి నుండి కుకీలకు సంక్రమించిన అడవి భూములను, వారి ప్రాంతాలని చేజిక్కించుకోవాలన్న దురాశే ఈ మారణ హోమానికి ముఖ్యమైన కారణం. మణిపూర్ హైకోర్టు తీర్పును నిరసిస్తూ' ఆల్ ట్రైబల్ స్టూడెంట్స్ యూనియన్' తీసిన ఒక ప్రదర్శనను వ్యతిరేకించి మేటీలు మే 3వ తేదీన ఇంత దారుణానికి పాల్పడడం వెనుక కేవలం కుకీలను భయపెట్టి, హతమార్చి, వారినుండి అడవి భూములను ఆక్రమించుకోవాడానికే అన్నది నిర్వివాదాంశం.

మొదటి నుంచి భారతదేశంలో పూర్తి బాధ్యతాయుత పౌరులుగా వున్న కుకీలు, భారత రాజ్యాంగపరంగా సంక్రమించిన చట్టాల అధీనతలో ఉన్నామని, తమని మేటీలు కవ్విస్తూ కయ్యానికి కాలుదువ్వి, రెచ్చగొట్టడమే కాకుండా, తమ జాతి నిర్మూలనే ధ్యేయంగా కంకణ బద్దులై వున్నారని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం, వారి పోలీసు బలగాలు కూడా వారికి వెన్నుదన్నుగా వున్నాయి కనుకనే తమపై తెగబడి దాడులు చేస్తూ, మారణహోమాన్ని సృష్టిస్తున్నారని కుకీల వాదన. ముసలి,ముతక, పిల్లా,జెల్లలు అని కూడా చూడకుండా అనేక కుటుంబాలను వాళ్ళ ఇళ్ళల్లోనే బంధించి సజీవ దహనం చేశారు. కుకీలను వారి ప్రాంతాల నుండి తరిమి కొట్టటమే కాదు, కనిపించిన వారిని కనిపించినట్లు హతమార్చారు. ఎంతో మంది స్త్రీలను వివస్త్రలుగా చేసి ఊరేగించడమే కాదు.. అత్యాచారాలు,హత్యలు కూడా చేశారు. కొందరి శవాలు ఇప్పటి వరకూ దొరకడం లేదన్న వారికి సమాధానాలు లేవు. అంతేకాదు ఎన్నో చర్చ్ లలో తలదాచుకున్న కుకీ ప్రజలలో ఎంతమంది సజీవదహనం అయ్యారో తెలియదు. తమలో చనిపోయినవారు చనిపోగా మిగిలిన వాళ్ళల్లో ఎంతోమంది క్షతగాత్రులయ్యారు. పారిపోయిన వారు కొందరు అడవి ప్రాంతంలో తలదాచుకోగా, మరికొందరు ఇతర ప్రాంతాలలో వున్న శిబిరాలలో తమ ప్రాణాలను కాపాడుకున్నారు. చాలామటుకు పారిపోయి వచ్చిన కుకీలు అందరూ కాంకోపి పట్టణంలో మిషినరీ సంస్థలు స్థాపించిన శరణార్థుల శిబిరాలలో తలదాచుకున్నారు.

కొంత ఆర్థిక స్థోమత వున్నవారు డిల్లీ లాంటి ప్రాంతాలకు తరలివెళ్లిపోయారు. ఏదిఏమైనా, భూఆక్రమణ కోసమే మేటీలు తెగబడి , తమను తరిమికొట్టేశారన్నది వారి బలీయమైన వాదన. కుటుంబాలు కుటుంబాలు ఎక్కడి వస్తువులు అక్కడ పడేసి ప్రాణాలని అరచేతుల్లో పెట్టుకుని అడవుల గుండా పారిపోయి వచ్చినవారిలో మహిళలు,పిల్లలు,ముసలివారు మాత్రమే ఎక్కువగా వున్నారు. దాదాపు 50% యువత యుద్ధభూమిలో సైనికుల్లా తమ జాతి హక్కులకోసం ఇంకా యుద్ధం చేస్తూనే వున్నారు.

విద్వేషం నింపుకున్న మేటీలు దురుద్దేశ్యంతోనే తమను తమ ప్రాంతాల నుండి బలవంతంగా పారద్రోలే ప్రయత్నంలో భాగంగానే కుకీలు భావిస్తున్నారు. ఎస్టి హోదాను మేటీలు కోరడం వెనుక మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం యొక్క కుట్ర కూడా వుందని,అందుకు కేంద్ర ప్రభుత్వ విధానాలు కూడా కారణమన్నది వారి ముఖ్య వాదన. పెట్టుబడిదారులైన 'ఆదాని' 'అంబానీ'లకు అప్పనంగా అడవి ప్రాంతాన్ని అప్పజెప్పడమే ధ్యేయంగా అక్కడి ప్రభుత్వం కూడా తీవ్రంగా ప్రయత్నిస్తున్నందువల్లనే మేటీలకు ఆయుధాలను అందిస్తున్నదన్నది కూడా వారి మరో ముఖ్య వాదన. అప్పనంగా ఆదివాసీ భూములను పెట్టుబదీదారులకు అప్పజెప్పే పన్నాగంలో భాగమే ఈ దాడులు అని వారు భావిస్తున్నారు. అంతేకాకుండా కొందరు మతతత్వ వాదులు కూడా వారి అగ్నికి ఆజ్యం పోసి మెటీలతో అంటకాగుతూ వారికి లాభం చేకూర్చుతున్నారన్న వాదన నమ్మశక్యంగానే వుంది. మేటీలకు కూడా భూఆక్రమణే వారి ధ్యేయం కాబట్టి తమ స్వలాభేపేక్ష కోసం కలిసి ఎన్ని దారుణాలు చేయడానికి కూడా వెనుకాడడం లేదన్నది నిర్వివాదాంశం. ఒక జాతిని నిర్మూలించి, వారి హక్కుగా వున్న అడవి భూముల ఆక్రమణే తప్ప మరొకటి కాదన్నది వారి భావన.

1990-92 మధ్య కాలంలో నాగా మరియు కుకీ జాతీయుల నడుమ జరిగిన యుద్ధంలో కుకీలు నష్టపోయినప్పటికినీ నాగాలు తాము కోరుకున్నట్లుగా స్వరాష్ట్రం లేదా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోగలిగారు. ఆ వాతావరణం సద్దుమణిగిన తర్వాత ఇరువురి నడుమ శతృత్వం సన్నగిల్లి, దాని స్థానే వారిరువురి నడుమ సత్సంబంధాలు ఏర్పాడ్డాయి. కొందరు






నాగాలు ఇప్పటికీ కుకీ ప్రాంతాలలో కలిసి,మెలిసి ఉంటున్నారు, నాగాలతో కుకీలకు ఎటువంటి అభ్యంతరాలు, అసహనాలు ఇప్పుడు లేవు. కుకీల సంఖ్యా బలం కన్నా నాగాల సంఖ్యా బలం ఎక్కువగా వుండడం వలన మేటీలు కుకీలపై దాడులు చేసినట్లుగా నాగాలపై చేయడానికి సాహసించరు. నాగాలపై దాడి చేయడానికి మేటీలు భయపడతారు. నిజానికి నాగాలపై కూడా మేటీలకు కొన్ని రాజకీయ విభేధాలు ఉన్నప్పటికినీ, ఒకే సమయంలో ఇద్దరిపై దాడులు చేస్తే, సంఖ్యాబలం ఎక్కువ వున్న నాగాలు, అల్పసంఖ్యాకులు అయిన కుకీలు కలిస్తే తమ అస్థిత్వానికి ముప్పు అన్నది మేటీలకు తెలుసు కాబట్టే నాగాలపై దాడులు చేయకుండా కేవలం కుకీలను మాత్రమే సెలెక్టీవ్ గా ఎంచుకుని దాడులు చేయడం ఇక్కడ రాజకీయ కుట్రలో భాగం కావడం విశేషం. ఆ కోణంలోనే ముందుగా కొండ ప్రాంతాల నుండి తరిమివేస్తూ కుకీలపై దాడిచేయడం జరిగింది. ఆ దాడుల ఫలితంగానే కుకీలు, నాగాలు కలిసి ఉన్న ప్రాంతాలలో నాగాల జోలికి పోకుండా కేవలం కుకీలను ఆయా ప్రాంతాల నుండి, నాగాల నుండి వేరుచేస్తూ, వెంటాడి, వేధిస్తూ, భయాంధోళనలకు గురిచేయడంతో కుకీలు తమ ధన,మాన, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పారిపోయి వచ్చి శిబిరాలలో తల దాచుకున్నారు.

కొన్ని శిబిరాలలో నర్సింగ్ కాలేజీ స్టూడెంట్స్, మరికొన్నిశిబిరాలలో వివిధ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు వున్నారు . కొంత మంది కాస్త ఆర్థిక స్తోమత గల ఉద్యోగులు, ప్రొఫెసర్స్, లాయర్స్ వారివారి ఫామిలీలతో కిరాయి ఇళ్ళు తీసుకున్నవారు కూడా ఆర్థిక ఇబ్బందులు పడుతూ పునరావాస కేంద్రాలలో భోజనాలు చేస్తున్నారు. ఎవరిని పలుకరించినా, దుఃఖసంద్రాల ఆటుపోట్లే! ఎవరిని తట్టినా, భయానక గాయాల తలపులే! ఇరు వర్గాల మధ్య వున్న వైరుధ్య, వైషమ్యాలు పోవాలంటే మాకు 'ప్రత్యేక హోదాతో కూడిన రాష్ట్రం' కావాలని అందుకోసం మేం మా ప్రాణాలు సైతం ఇవ్వడానికి సిద్ధంగా వున్నామని కుకీ జాతీయులందరూ ఏక కంఠంతో నినదించడం కొసమెరుపు.

కథ

# పారసైట్స్



- డా॥ తిరునగరి దేవకిదేవి
ఫోన్ : 9949636515

"అబ్బ మొత్తానికి పరీక్షలు సమాప్తం. ప్రశాంతంగా ఉంది." అంది నీలిమ

"నిజమేనే. సబ్జెక్ట్ ఎంత తెలిసినా లాస్ట్ ఎగ్జామ్ వరకూ టెన్షనే..."శాంతి

"రాసేంతవరకు టెన్షన్ తప్పదు. ఇప్పుడు బానే ఉన్నాంకదా! డిస్టింక్షన్ రాకపోయినా ఫస్ట్ క్లాస్ గ్యారెంటీ."నీలిమ

"నేనైతే క్లాస్ ల జోలికి పోయేంత సీను లేదనుకో. కాని పాసవడం ష్యూర్. ఇంతకీ నీ భవిష్యత్ ప్రణాళిక ఏంటి? " శాంతి ప్రశ్న

"ఏముంది. పి.జి. విత్ పబ్లిక్ ఆడ్. మరి నీ సంగతో...." నీలిమ.

"వీలైతే పి.జి. లేదంటే మారేజ్ . రెండింటికీ సిద్ధమే."

"నేను మాత్రం కచ్చితంగా పి.జి" బుజాలు ఎగరేస్తూ అంది నీలిమ కాన్ఫిడెంట్ గా ఇద్దరూ పిచ్చాపాటి మాట్లాడుకుంటూ బస్టాండు చేరుకున్నారు.

"ఔను. అంతులేని కథ సినిమాకు చెక్కేద్దామా?" అంది నీలిమ సడెన్ గా

"మంచి ఐడియా. చాలాబాగుందని విన్నా." అంది శాంతి సినిమా చూడాలన్న కుతూహలంతో.

"సరేగాని స్వాతి వాణిలను కూడా పిలుద్దామా?"అడిగింది శాంతి

"భలే ఐడియా. పిలుద్దాం." నీలిమ సమాధానం

సినిమా చూడాలని ఫిక్స్ ఐపోయిన స్నేహితులిద్దరూ బస్ తొందరగానే కనికరించడంతో ఇంటి ముఖం పట్టిను .

★ ★ ★

ఇంట్లోకి కాలుపెడుతున్న నీలిమకు ఏదో హడావిడి కనిపించింది. పెదనాన పెద్దమ్మ బాబాయి పిన్ని అమ్మమ్మ ఆకస్మిక అథిథులై కన్పించిను. అతిథులంటేనే ఆకస్మికం కదా! అని నన్ను ప్రశ్నించకండి. వ్యవహారార్థం మాత్రమే సుమా,

"ఆఁఏ హడావిడైతే నాకెందుకు? నేనైతే సినిమాకు చెక్కేస్తా ." అని ఆలోచిస్తూ నీలిమ తల్లి అనుమతితో సినిమా బాటపట్టింది. టాకీస్ గేట్ చేరుకున్న నీలిమ కళ్ళు స్నేహితుల కోసం అన్వేషించినై. వారి జాడ కనపడకపోవడంతో టికెట్ కౌంటర్ వైపు దారి తీసింది. రష్ పెద్దగా లేకపోవడంతో ఐదునిమిషాల్లో టికెట్ చేతిలో పడగానే హాల్లో ఉన్న సోఫాను ఆశ్రయించింది. ఒంటరిగా ఉన్న నీలిమపై వస్తూపోతున్న పోకిరీల కళ్ళు దాడి చేస్తూనే ఉన్నై. దాంతో ఆమె మనసు మగ జాతిపై కోపంతో రగిలిపోయింది. ఛీత్కరించింది. ఈవ్ టీజింగ్ ను అరి కట్టకల్గిన వ్యవస్థ లేనందుకు మనసులోనె ఉడుక్కుంది. కాని ఉడుక్కోవడానికి ఎంతో టైం ఇవ్వకుండా స్నేహితుల రాక ఊరట నిచ్చింది. రయ్యిమంటూ థియేటర్ లోకి చొర బడ్డారు స్నేహితులంతా. సీట్లు వెతుక్కొని కూర్చొన్నారో లేదో...... సినిమా మొదలైంది. మొదలవడమే కాదు. ఐపోయింది కూడా. అంతవరకు ఊపిరి బిగవట్టి స్థాణువుల్లా కూర్చున్న స్నేహితులందరు పెద్ద నిట్టూర్పుతో బయటి ప్రపంచంలోకి వచ్చారు.పెద్దబలగంలో సమస్యల వలయంలో ఒంటరిదైన సరిత ఉరఫ్ జయప్రద జీవితాన్ని చూసి వాళ్ళమనసులు బరువెక్కినై. అడుగులో అడుగు వేసుకుంటూ హాల్ నుండి బయట పడ్డారు.

"అంత త్యాగమవసరమంటావా ?"అడిగింది శాంతి

"త్యాగాల పరిధులు మనుషుల మనస్తత్వాన్ని ,పరిస్థితులననుసరించి ఉంటుందే తప్ప ఇదమిద్ధంగా ఎవరమేం చెప్పలేం." సమాధానమిచ్చింది నీలిమ

"పాటలైతె అదిరిపోయినై కదా? " స్వాతి .

"కరెక్ట్. తల్లుల విశృంఖల స్వేచ్ఛ పిల్లల జీవితాలను పక్కదారి పట్టించడమే కాదు వాళ్ళ జీవితాలను నాశనం చేస్తాయనే సందేశం బాగుంది." అన్నది వాణి.

“మనసులు భారమైనా మంచి సినిమా” అంది నీలిమ

సినిమా మాత్రమే భారం కాదు. మళ్ళీ ఎప్పుడు కలుస్తామో అన్న బెంగతో మరో భారం వెంటాడుతున్నది. “ అంది శాంతి

“ ఎగ్జాక్ట్లీ” అంటూ బాధతో శృతి కలిపిన గొంతులు ఆటోలలో ఇంటికి తిరుగుముఖం పట్టినై చల్తే చల్తే మెరె గీత్ యాద్ రఖ్ నా. పాటభావంతో

★ ★ ★

ఆ రాత్రి నీలిమ నిద్రను సినిమా కథతోపాటు భవిష్యత్ ప్రణాళిక అడ్డుకుంది.. ఊహాలోకంలో విహరిస్తున్న ఆమెను ఏతెల్లారు ఝామున్నో నిద్రాదేవి కనికరించింది.

“ఏం మొద్దునిద్ర.తొందరగా లే.”అన్న తల్లి సుప్రభాతానికి భారంగా కళ్ళు తెరిచి

“ఏంటమ్మా? పరీక్షలైపోయినవని హాయిగా నిద్రపోతుంటే నీ లొల్లేంది?” అంటూ విసుక్కుంది.

“ఇవ్వాళ్ళ నీ పెళ్ళి చూపులే తల్లీ!.మా అమ్మవి కదూ! లే . కొంచెం ఇల్లు సర్ద డంలోసాయం చేద్దువుగాని..” అన్న తల్లి మాట వినడంతోనే నీలిమ ఉలికిపడింది. ఒక్కమాటైనా తనతో చెప్పకుండా పెళ్ళిచూపుల తతంగం ఏర్పాటు చేసినందుకు రుసరుస లాడుతూ దిగ్గున లేచింది. బెడ్ షీట్ ను కిందికి తోసింది. మెత్తను ఓ మూలకు గిరాటేసింది. ఆమెకు తన కాళ్ళ కింది భూమి పాతాళం లోకి కుంగుతున్నట్లు తోచింది.. ఏం మాట్లాడాలో ఏంచెయ్యాలో తోచలేదు. ఒక్క ఉదటున బాత్ రూంలోకి దూరింది. అరగంట గడిచినా బాత్రూం తలుపులు తెరుచు కోలేదు. తల్లి రేవతి అయోమయంలో పడ్డది. ఏంచేయాలో పాలుపోక. తల్లీ ఆత్తగార్లకు మొరపెట్టుకుంది. వాళ్ళు కాసేపాగమని సంఝాయించినట్లున్నారు. వంటింటివైపు కదిలింది. . నీలిమ ఎంత సేపని బాత్రూంలో కూర్చోగలదు. ఓగంట తర్వాత బాత్రూం తలుపులు తెరుచు కున్నై. వాచిన మొహంతో ఎర్రబడ్డ కళ్ళతో నీలిమ బయటకొచ్చింది. అప్పుడే అటువేపుగా వస్తున్న అమ్మమ్మ జానకమ్మ నీలిమను చూసి లోపలికి ఎంటరై

“ఏం తల్లీ మొహం కదుక్కున్నవా?” అంటూ నీలిమను అడిగింది.

“ఆcccc కదుక్కోక చస్తానా.????????”అంది కసిగా నీలిమ

“ అయ్యో అదేంమాటే తల్లీ .పొద్దుపొద్దున్నే. భవిష్యత్తంతా ముందుండగా “ అంటూనే

“నీలిమ బ్రష్ చేసుకున్నది. చాయ తీసుకురా” అంటూ రేవతిని ఆజ్ఞాపించింది. తల్లి మాట వింటూనే రేవతి చాయతో ప్రత్యక్షమైంది. చాయను నీలిమ చేతికిస్తూ మంచం పక్కనే ఉన్న చేర్లో చతికిలబడింది. ఈ లోగా “వదినగారూ ఎక్కడున్నారం”టూ నీలిమ నాయనమ్మ అనసూయ వచ్చి మంచం మీద సెటిలైంది. కోపం విషయం పక్కన బెట్టి ఈ డ్రమెటిక్ సీన్ ఏంటబ్బా అనే ఆలోచనలో పడ్డది నీలిమ చాయను చప్పరిస్తూ.

“పెళ్ళనగానే అంతకోపమెందుకే అమ్మడూ” అంటూ జానకమ్మ సంభాషణను మొదలు పెట్టింది.

“చదువు పూర్తి కానఖ్ఖర్లేదా? ఐనా నా కాళ్ళమీద నేను నిలబడాలి కదా! పెళ్ళి తర్వాత పి. జి ఉండదు . ఉద్యోగమూ ఉండదు.” విసురుగా సమాధానమిచ్చింది నీలిమ

“పెళ్ళైనవాళ్ళు ఎంతమంది చదువుకోవడంలేదు. ఉద్యోగాలు వెలగబెట్టడం లేదు. నీ అనుమానం తగిలెయ్య” ఏదో సందేహనివృత్తి ధోరణిలో ఓ ఛణుకు విసిరింది అనసూయమ్మ.

“పట్టుదల ఉండాలే కాని సాధ్యం కానిదేముంటది? ఐన నాన పరిస్థితి గురించి కూడా ఆలోచించాలె కదా!” అనునయంగా అంది జానకమ్మ.

“అది నిజమేనే తల్లీ. మీ అక్కల పెళ్ళిళ్ళు చేసే వరకు మీ నాన తలప్రాణం తోకకొచ్చింది. నీ పెళ్ళి చేస్తే ఏదో కృష్ణా రామా అంటూ కాలం గడుపుతాడు.” మళ్ళీ కల్పించుకొని అంది జానకమ్మే

“సాయంకాలం ఐదింటికి పిల్లవాడు వాళ్ళు, వస్తామన్నారు. మధ్యాహ్నంకల్లా మాధవి అక్క వస్తానంది. ఈ లోగా బ్యూటీపార్లర్ కు పోయిరా. పరీక్షలకు చదివి చదివి మొహం ఎట్లా. పీక్క పోయిందో.” అంది అనసూయమ్మ.

వాళ్ళమాటలను వింటున్న నీలిమకు ఏంచేయాలో అర్థం కాలేదు.ఏ మాత్రం వ్యతిరేకించడానికి వీలు లేకుండా అంతా కుమ్ముక్కై తన గోతి తవ్వుతున్నారు. దాంతో మౌనవ్రతమే ఆమెకు శరణ్యమైంది. విధిలేక సాయంకాలం జరిగిన పెళ్ళిచూపుల అంగట్లో కూచుంది నీలిమ. వచ్చిన వాళ్లకు నీలిమ నచ్చింది॥. దాంతో మాధవి భుజం తట్టడంతో నీలిమ లేచి లోపలికి నడిచింది అక్కతోపాటు. ఆ తర్వాత బేరసారాలు

మొదలయ్యాయి.

"చెప్పండి బావగారు. అమ్మాయి నచ్చిందంటున్నారు. మీరాశిస్తున్నది చెబితేగాని మేమాలోచించలేం.":అన్నాడు నీలిమ తండ్రి.

" ఇంతకీ విషయాలన్నీ వాళ్లకు చెప్పారా?" అని అబ్బాయి తండ్రి నాగేశ్వరరావు మధ్యవర్తి చెవిలో గుసగుసలాడాడు.

"ఏం మించిపోయింది. ముందే చెపితే ఏం భావ్యంగా ఉంటుంది? మొదటికే మోక్ష మొస్తుంది. ఇపుడు చెప్తానుగా" అంటూ

"పెళ్ళి చేసివ్వండి చాలు. కట్నకానుకలంటారా? మీకు చేతనైనంత. కానీ ఒక్క విషయం....." అంటూ నసిగాడు మధ్యవర్తి శివరావు

"ఏంటావిషయం......?"కొంచెం ఆందోళనతోనే అన్నాడు నాగేశ్వరా రావు

"అబ్బాయికి సంవత్సరం అమ్మాయి ఉంది. తల్లి ఈ మధ్యనే జరిగిన బస్ ఆక్సిడెంట్ లో కాలం చేసింది." ఒక్కొక్క అక్షరం ఒత్తి పలుకుతూ నెమ్మదిగా అన్నాడు శివరావు

"ఆ విషయం ముందే చెప్పాలి కదా?" నాగేశ్వరా రావు

"ఇప్పటికీ మించిపోయిందేమున్నది? మీ ఆర్థిక స్థితికి ఇది అనుకూలమనిపించింది.

ఏదో మీకూ సాయంగా ఉంటుందని..." అని మధ్యలోనే ఆపేసాడు శివరావు. దాంతో నాగేశ్వర్ రావు సందిగ్ధంలోపడి

"మేంచర్చించుకొని కబురు పెడుతాం. కాఫీ తీసుకొండి ముందు" అంటూ మాధవి తెచ్చిన కాఫీ ట్రే వైపు చేయి చూపించాడు.కాఫీలపని కానిచ్చి వెళ్ళిపోయారు వాళ్ళు. ఇక బాల్ నాగేశ్వర్ రావు కోర్టులో ఉండిపోయింది.

అదే రాత్రి భోజనాల తర్వాత డైనింగ్ టేబుల్ దగ్గరే చర్చ మొదలైంది.

"ఎంతైనా చూస్తూ చూస్తూ రెండో సంబంధం చేయడమేంటి?" అంది రేవతి తల్లి మనసుతో

"నువ్వన్నది కరెక్టే. కాని మీ పరిస్థితులు చూసుకోవాలె కదా?" అంది కొడుకు పక్షంగా ఆలోచిస్తూ అనసూయమ్మ.

"ఇల్లు కట్టిన అప్పులు మాధవి పెళ్ళి ఖర్చులు తడిసి మోపె డయ్యాయి. ఇంకా తేరుకోనే లేదు. నీలిమ పెళ్ళి తలపెట్టడమంటే సాహసమే. " అంది అనసూయమ్మే తిరిగి

"ఆ విషయం నేనూ కాదనడంలేదు మరీ రెండో పెళ్ళి వాడికిచ్చి చేయడంకంటే కొన్నాళ్ళాగొచ్చు కదా! అది పి.జి చేయాలని ఆశ పడుతున్నది. దాని కోరికా తీరుతుంది. మీకూ వెసులుబాటుగా ఉంటుంది." అంది రేవతి.

"దాని పి.జి విషయం సరే. ఈ అప్పులు తీరేసరికి ఆ పుణ్యకాలం కాస్త గడిచి అన్నయ్య రిటైర్మెంట్ వస్తుంది. అప్పుడు దానికి పి.జి. మొగుడే కావాలంటుంది. అన్నయ్యకొచ్చే

పెన్షన్ అంతంత మాత్రమే. వచ్చే సంబంధం ఎంత డిమాండ్ చేస్తారో తెలియదు. దాంతో మళ్ళీ అప్పు చేయక తప్పదు. " అంటూ తన అన్నయ్యకు కలుగబోయే ఇబ్బందులను చెప్పుకొచ్చాడు నాగేశ్వర్ రావు తమ్ముడు మాధవరావు.

"వాడనేది నిజమే. పెళ్ళికి చేసిన అప్పులు తీర్చాలి. ఇంటి కర్చులు ఉంటాయి. అంతటితో సరిపోతుందా . పురుళ్ళు పుణ్యాలో" అంది అనసూయమ్మ కొడుకుకి వత్తాసు పలుకుతూ .నాగేశ్వరరావు మాత్రం మౌనముద్ర దాల్చాడు అదేదో మీరే తేల్చుకొండి అన్నట్టు.అటు చూస్తే నుయ్యి ఇటు చూస్తే గొయ్యైంది రేవతి పరిస్థితి.

"ఏదేమైనా చదువుకొని ఉద్యోగం చేసి తన కాళ్ళమీద తను నిలబడాలనుకున్న పిల్లను రెండో సంబంధానికి ఇవ్వడం సరికాదేమో?" అంది జానకమ్మ

"మనసంటూ ఉంటే మార్గమదే దొరుకుతుంది. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ లో పి.జి చెయ్యొచ్చు. కావాలంటే మాటా ముచ్చటలో ఆ విషయాన్ని ఒప్పిద్దాం. "అన్నాడు మాధవరావు.

"ముందు పిల్లతో ఓ మాట చెప్పి చూడండి." అన్నది నకమ్మ.

"రెండో సంబంధమన్న మాటేగాని పిల్లవాడి వయసేం పెద్దగా మీరిపోలేదు కదా! పైగా పేరు మోసిన ఇనిస్టిట్యూట్స్ కు అధిపతి. డబ్బుకు కొదువలేదు. చేతికింద కావలిసినంత మంది పనివాళ్ళు. " వదినకు సర్ది చెప్పుతూ అన్నాడు మాధవరావు. దాంతో జానకమ్మ రేవతులు మూతులకు ప్లాస్టర్స్ వేసుకోక తప్పలేదు. పక్క గదిలో ఉన్న నీలిమ చెవులు అందరి వర్షన్లను రిక్కించి మరీ విన్నాయి. అంతేకాదు ఆ మరునాడు అందరూ తమ హితబోధనలను ఆమెకు ఊదరగొట్టారు.. ఐనా ఆమె మనసు ససేమీరా అన్నది. దాంతో లంకణాన్ని ఆహ్వానించింది. మూడురోజులు గడిచినా తండ్రి బాబాయి నాయనమ్మల మాటలు ఆమె నిరసనను వీటో చేయడంతో పెళ్ళి తంతు

ముందుకు వచ్చింది.

ఇష్టంలేని సంబంధం చేసినా నీలిమను అత్తవారింటికి ఎంతో దుఃఖంతో వంపించారు తల్లి తండ్రులు. అత్తామామలు సంతోషంతో నీలిమను ఆహ్వానించారు. అక్కున చేర్చుకున్నారు కూడా. ఆ ఇంటి హంగు ఆర్భాటం చూసి నీలిమ నివ్వెరబోయింది. వంట మనిషి,పనిమనిషి పిల్లవాణ్ణి చూసే ఆయా , రెండు కార్లు ఇద్దరు డ్రైవర్లు. అంతా బేషుగ్గానే తోచింది నీలిమకు. నెలరోజులుండి వ్యవసాయం పనులంటూ అత్తామామలు తమ గ్రామం వెళ్ళిపోయారు. నాలుగు రోజులాగి నీలిమ పి.జి.కి అప్లై చేసింది .పద్ధతి పట్టు దల అలవాటైన మనిషి అవడంతో సవతి కొడుకును కూడా శ్రద్ధగా కనిపెట్టుకొని చూసుకోవడం అలవాటు చేసుకుంది. ఇంటిపనులను పర్యవేక్షించుకుంటూనే డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పి.జి.కి అప్లై చేసింది. ఏ ఒడిదుడుకులు లేకుండా జీవితం సాగుతూ పోతుంది. కానీ ఏదో చెప్పలేని వెలితి. అసంతృప్తి ఆమెను ఇబ్బంది పెట్టడం మొదలైంది. ఓ రోజు సాయంత్రం పనులన్నీ ముగించుకొని పుస్తకాలు ముందేసుకుంది. ఎందుకో వాటి మీద మనసు కేంద్రీకరించలేక పోయింది. దాంతో రిమోట్ అందుకొని టి.వి ఆన్ చేసి news channel పెట్టుకుంది .ఓట్లు సీట్ల రాజకీయాలు ప్రమాదాలు ప్రారంభోత్సవాలు, హత్యలు అత్యాచారాలు తప్ప అన్యధా శరణం నాస్తి అన్నట్లున్నాయి వార్తలు. దాంతో టి.వి. స్విచ్ ఆఫ్ చేసింది. ఏం చేయాలో తోచక ఫోన్ అందుకుంది. శాంతికి ఫోన్ చేస్తే. మెరుపులా ఆలోచన తట్టింది. లేడికి లేచిందే పరుగన్నట్లు ఫోన్ కలిపింది . శాంతి ఫోన్ ఎత్తడంతో మనసు ఎగిరి గంతేసింది.

"హలో శాంతి"

"హలో నీలిమ. ఎట్లున్నవ్? కొత్త సంసారమెట్లున్నది? మీ ఆయన ఏమంటున్నడు?

పెళ్ళౌతూనే తల్లి హోదాలో అడుగుపెట్టినౌ. ఎవ్రిథింగ్ ఓకేనా? " అంటూ ప్రశ్నల గుచ్ఛాన్ని ముందుంచింది.

" ఆగాగు. ఒకటేసారి అన్ని ప్రశ్నలేస్తే ఎట్లా? నా సంగతి సరే. ముందు నీ సంగతి చెప్పు? "అంటూ ఎదురు ప్రశ్న వేసింది నీలిమ

"ఎక్స్పెక్టేషన్స్ లేని జీవితం కదా ! పరిస్థితులను అనుకూలంగా మలచుకుంటూ సాగుతున్న జీవితం. మరి నీ సంగతో ? "

"సమస్యలంటూ లేవనుకో. కాని ఏదో అసంతృప్తి . అదేంటో స్పష్టంగా చెప్పలేను."

"దాంపత్య జీవితం మాటేవిటి? "

"నాతో బానే ఉంటారు. కాని బిజీ మనిషి. ఇంటి దగ్గర ఉండే సమయం తక్కువ. ఏ తొమ్మిదింటికో వస్తారా? వస్తూనే కాల్స్ మోసుకొస్తారు. ఒక పట్టాన వాటికి ఫుల్ స్టాప్ ఉండదు. వాటి పని ఐపోగానే ఫ్రెషప్ భోజనం. ఆ పై పెళ్ళి కాంట్రాక్టు లోని సంభోగం.నిద్ర. ప్రతిరోజు ఈ రొటీనే.

"అంటే మీ శృంగారం అంత డ్రైగా ఉంటుందా?"

"నాకు మాత్రం అదే ఫీలింగ్. ఆ టైంలో తప్ప అతను నాతో సన్నిహితంగా మెలిగిన సందర్భాలు లేవనే చెప్పాలి. పొద్దంతా వ్యాపారమే కదా!"

"మీ ఆయన వ్యాపారం కూడా చేస్తారా."

"ఔను. విద్యావ్యాపారం."

"ఓస్ అదా" అంటూ పెద్దగా నవ్వింది శాంతి .

"సరే కాని సినిమాలు షికార్లవంటివి లేవా?"

"పెళ్ళైన కొత్తలో ఒకటి రెండు చూసాం."

"మరి నీ కాలక్షేపం?"

"లంకంత కొంప. పనివాళ్ళను పురమాయించడం. చంటివాణ్ణి చూసుకోవడం. చదువుకోవడం. ఆయనకు సంబంధించిన ఫైల్స్ వెతికివ్వడం. చాలా వరకు ఇంట్లో ఏదో ఒకటి పని చేయనని మొరాయిస్తుంది. సొ వాటిని బాగు చేయించడం. బస్. ఇదే నా రొటీన్. ఇంతకు మినహా నథింగ్."

"అంటే మనసు పంచుకునేవాళ్ళు లేరన్నమాట."

"అన్నట్లే"

"అందుకోసం మాలాంటి స్నేహితులకు ఫోన్ చేయవచ్చు కదా!"

"అదే కదా చెప్పొచ్చే విషయం. పనివాళ్ళున్నప్పుడు ఫోన్ సంభాషణ జోలికి పోలేను. సాయంకాలాలు పిల్లవాడికి టైం కేటాయిస్తానా ?. ఆ తర్వాత మా ఆయనకోసం నిరీక్షణ.

ఈ మధ్యలో దొరికిన టైం చదువుకోసం కేటాయించి తీరాల్సిందే."

"ఒహ్. సుఖమొస్తే మొహం కడుగతీరదంటే ఇదనేమొ. ఇంతకీ ప్రొడక్షన్ ఎప్పుడు?"

"కనీసం వాడికి మూడేళ్ళన్నా నిండితే బాగుంటుందని ఆలోచిస్తున్న."

"ఔను. ఒకటే పనిగా వాగుతున్నాను. బోర్ కొట్టించడం లేదుకదా!"

"ఛ. అదేం కాదు. సరేకాని ఈ సారి వరంగల్ వచ్చినపుడు ఫోన్ చేయకూడదూ. కలుసుకుందాం." అంది శాంతి.

"తప్పకుండా.. జనం ఇంతసేపు కనికరించనందుకు ధన్యురాలను. పరిమితి దాటిందేమో. బెల్ మోగుతున్నది. ఉంటానే మరి." అంటూ ఫోన్ పెట్టే సింది నీలిమ.

కాలం చాలా చురుకైనది కూడా. కళ్ళుమూసి తెరిచినంతలో మూడు సంవత్సరాలు గబగబా నడుచుకుంటూ వెళ్ళిపోయాయి. ఆనంద్ మొదటి సంబంధం కొడుకు ఋత్విక్ ను యల్. కె .జి లో చేర్చ్చిను. నీలిమ తన ప్రణాళిక ప్రకారం పి.జి. పూర్తి చేయడమే కాదు. సీమంతం జరిపేందుకు అవకాశం కల్పించింది కూడా. అంటే బిడ్డను కనబోతుందన్నమాట. మరో నాలుగు నెలలు పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయి ప్రసవ కాలం రానే వచ్చింది. ఆనంద్ హైద్రాబాదులో మంచి వైద్యసౌకర్యం దొరుకుకుతుంనే కారణంతో కాన్పుకోసం వరంగల్ వెళ్లడానికి వీల్లేదని భీష్మించు కున్నాడు. అంచేత నీలిమ తల్లిదండ్రులే బిడ్డ ప్రసవానికి హైద్రాబాదు రాక తప్పలేదు. ఏమైతేనేం నీలిమ అందమైన ఆడపిల్లకు జన్మనిచ్చింది. లాలస అని పేరు పెట్టుకుంది ముద్దుగా. స్వంత ఇల్లు స్వంత ఊరు విడిచి ఉండటం ఇబ్బందిగా తోచింది నీలిమ పేరెంట్స్ కు. అట్లా అని పనికి జడిసి కాదు సుమా! సొ వాళ్ళు తిరుగుముఖం పట్టారు. దాంతో ఎంత పని వాళ్ళున్నా ఇద్దరు పిల్లలతో బిజీ ఐన నీలిమ కాకతీయ యునివర్సిటీలో .హెచ్.డి ఎంట్రెన్స్ రాయడానికి సంవత్సరం పట్టింది .

ఓ రోజు బ్రేక్ ఫాస్ట్ ముగించుకొని వాష్ బేసిన్ వైపు నడుస్తుండగా కాలింగ్ బెల్ మోగింది. ఎవరై ఉంటారని ఆలోచిస్తూ రెండడుగులు వేసే లోపు ఆమెకా శ్రమ కలిగించకుండ అప్పుడే ఇంట్లోకి వస్తున్న ఆనంద్ వచ్చిన మనిషి నుండి తీసుకున్న కవర్‌ను తెరుస్తూ కనిపించాడు. నీలిమకెందుకో అది తనకు సంబంధించిన లెటర్ గా తోచింది. అది నిజమైంది కూడ.

"అభినందనలు నీలిమ. పి.హెచ్.డి ఎంట్రెన్స్ రిజల్ట్స్ . మొత్తానికి సీటు కొట్టేసావు." అంటూ షేక్ హాండ్ ఇచ్చాడు ఆనంద్. నీలిమ మనసు ఎగిరి గంతేసింది. గబగబా లెటర్ తీసి చదువుకొని ఊపిరి పీల్చుకుంది.కాని తనకు సంబంధించిన కవర్ ను ఆనంంద్ ఓపెన్ చేయడం నచ్చకపోయినా సీటు దొరికిన సంతోషం ముందు అది అడుగున పడి పోయింది. జాయిన్ కావడానికి వారం రోజుల టైమ్ ఉంది. నీలిమ ఏవేవో ఆలోచిస్తుండగా

"ఔను నీలిమ. కాకతీయలో పి.హెచ్.డి కదా! మానేజ్ చేయడం కష్టమేమో ఇద్దరు పిల్లలతో. " అన్నాడు ఆనంద్.

"నేనూ అదే ఆలోచిస్తున్నానండి . కాని మనసుంటే మార్గముండకపోదు. చూద్దాం." అంటూ లెటర్ తీసుకొని తృప్తి తీరా చదువుకుంది. రాత్రి డిన్నర్ పనులు పూర్తి చేసేవరకూ ఆలోచిస్తూనే పోయింది. పిల్లలను నిద్రపుచ్చుతుండగా రోజుకన్నా ముందే ఫోన్లపని ముగించు కున్న ఆనంద్ వస్తూ వస్తూ

"ఇంతకీ పరిష్కారమేమైనా దొరికిందా" ఆనంద్ ప్రశ్న

"ఆ౯౯౯ ఒక ఆలోచనైతే వచ్చింది" నీలిమ సమాధానం.

"ఏంటది?"

"పిల్లలిద్దరితో నేను వరంగల్ కెళ్ళడం. ఋత్విక్ ను యస్. ఆర్. స్కూల్ లో చేరుద్దాం. "

"మరి లాలస ??..."

"అమ్మచూసుకుంటుంది."

"మరి నాగతో......."

"వీకెండ్ సంపూర్ణంగా మీకే కెటాయిస్తాను . మధ్యలో బుధవారం కూడా. బెంగ పడకండి."

"తప్పదంటవా? "

"తప్పదు. ఒకటి నెరవేరాలంటే రెండోదానికి సర్దుకొని తీరాలి." అంది నీలిమ నిశ్చయంగా"

" ఆ మాటలు నచ్చాయో నచ్చలేదో నచ్చనట్లు నటించాడో కాని నీలిమ నిర్ణయానికి తిరుగుండదని తెలిసిన ఆనంద్ మారు మాట్లాడకుండా పడక ప్రక్రియను స్వాగతించాడు.

అనుకున్న ప్రకారంగా తనింట్లో భర్తకు కావలసిన ఏర్పాట్లన్నీ సవ్యంగా చేసింది

నీలిమ. లాలసను చూసే విషయం తల్లిని ఒప్పించి వరంగల్ చేరుకుంది. ఋత్విక్ ను యస్. ఆర్ స్కూల్ లో

జాయిన్ చేసింది. రెండు రోజుల తర్వాత .యునివర్సిటీ చేరుకొని పి.హెచ్. డి లో జాయిన్ ఐంది. క్లాసులకు రెగ్యులర్ గా అటెండ్ ఔతూ లైబ్రరీని ఫుల్ ఫ్లెడ్జ్డ గా ఉపయోగించుకోవడం మొదలు పెట్టింది. సవ్యసాచికి రెండు చేతుల్లో సమాన నైపుణ్యమైతే ఈమెకు అదనంగా మరో చేయి ఉన్న లెవల్లో పిల్లలను చూసుకుంటూ హైద్రాబాద్ లో భర్తకు అన్ని సదుపాయాలను చక్కబెడుతూ పి.హెచ్.డి ని కొనసాగిస్తూ పోయింది. ప్రి పి.హెచ్.డి లో 80% మార్కులు కొట్టేసింది కూడా. దాంతో పరిశోధన పట్ల విశ్వాసం పెరిగి మరింత శ్రద్ధ పెంచుకుంది.

ఆ రోజే హైదరాబాద్ నుండి పొద్దున్నే 8గంటలకు వచ్చిన నీలిమ ఋత్విక్ ను స్కూల్‌కు పంపించి యూనివర్సిటీ బాట పట్టింది. సీరియస్ గా పుస్తకాల వేటలో ఉన్న నీలిమను

"హలో నీలిమ ! " అన్న గొంతు పలకరింటంతో వెనక్కి తిరిగింది.చూస్తే ప్రణవ్. డిగ్రీలో తన క్లాస్మేట్.

"హలో ప్రణవ్. హౌ ఆర్ యు. చాలా రోజులకు దర్శనం. ఏం చేస్తున్నారేంటి."

"నేను అదే అంటున్నాను. ఎన్నాళ్ళకు ...." అన్నాడు ప్ణణవ్

"ఇక్కడే యల్.బి కాలేజ్ లో పని చేస్తున్న. నీ సంగతి?"

"నా సంగతంటారా? కొన్ని సందర్భాల్లో ఎంత ప్రయత్నించినా మా ఆడవాళ్ళ జీవితాలు మా చేతుల్లో ఉండవు. డిగ్రీ ఐపోతూనే పెళ్ళి. ఓ కూతురు. ప్రస్తుతం పి.హెచ్.డి చేస్తున్న. "

"ఎవరి దగ్గర"

"ప్రొ. సీతారామయ్య."

"టాపిక్?"

"How can corruption in Public Administration be reduced?"

"చాలా మంచి టాపిక్. .మీరు ఒకసారి ప్రొ. హరగోపాల్ గారిని కలిస్తే బాగుంటుం దేమో."

"ఔను. నిజమే. నేనూ చాలా సార్లనుకున్నాను. పని ఒత్తిడి వల్ల కుదురలేదు. సార్ ఫోన్ నంబర్ మీకు తెలుసా?"

"తెలియకేం" అంటూ ప్రణవ్ నంబరిచ్చి కాసేపు మాట్లాడి. వెళ్ళిపోయాడు. నీలిమ లేడికి లేచిందే పరుగన్నట్లు std బూత్ కు పోయి ఫోను కలిపింది. అదృష్టవశాత్తు హరగోపాల్ గారు రెస్పాండయ్యారు.. వచ్చిన చిక్కేమిటంటే ఆయన యూరపు లోని పలు ప్రాంతాల్లో సెమినార్స్ లో పాల్గొనడానికి వెళ్తుండటం వలన మరుసటి రోజు ఉదయం ఎనిమిది గంటలకు మాత్రమే టైమివ్వగలనని చెప్పటడం. దాంతో ఆ సాయంత్రమే హైద్రాబాద్ దారిపట్టింది. ట్రేని దిగుతూనే బూత్ చేరుకుని భర్తకు ఫోన్ కలిపింది నీలిమ మూడు నాలుగు సార్లు ప్రయత్నించినా లాభం లేక పోవడంతో ఆ ప్రయత్నం విరమించుకొంది. ఇల్లు చేరేసరికి తొమ్మిది కావచ్చింది. ఇన్ఫర్మేషన్ లేకపోవటంతో తనే డిన్నర్ చేసుకోక తప్పదని ...ముందుగా ఫ్రెషప్ అవుదామని బెడ్ రూంవైపు దారి తీసింది. ఆశ్చర్యంగా బెడ్ రూం తలుపులు మూసుకొని ఉన్నై. ఏమైఉంటుందని ఆలోచిస్తూనే డోర్ నాక్ చేసింది . అది తెరచుకోవడానికి కొంత టైం తీసుకుంది. ఐనా వెయిట్ చేయక తప్పలేదు. అంతకన్నా ఏం చేయగలదు మరి. వెయిటింగ్ లో ఉండటం వలన సర్రున లోపలికి దూరిన నీలిమ ఓ ఆడ ఆకారం కనబడటంతో షాక్ తింది. ఇది నిజమా ? కలా? అని ఒళ్ళు గిల్లుకోలేదు కాని కళ్ళు నలుపుకొని చూసింది. అది ఆనంద్ కాలేజిలో పని చేసే ఆకారమే. సందేహం లేదు. తనను చూస్తూనే ఆమె లేచి నిలబడి " సరే. వస్తాను సర్ . రేపు కాలేజీలో కలుస్తానం"టూ నిష్క్రమించింది. నీలిమ కనుబొమ్మలు ముడివడ్డాయే తప్ప పెదవులు కదలలేదు.

"రేపు ఆడిట్ ఉంది. అకౌంట్స్ చూసుకుంటున్నాం. "

"నేను మిమ్మల్నేం అడగలేదే? "

"సాయంకాలం ఫోన్ చేసినా ఎత్తలేదెందుకు?"ఆనంద్

"ఓ అదా! నేను ట్రేన్ లో కదా ఉంది. అమ్మా వాళ్ళు ఏదో ఫంక్షన్ కు పోయిను."

నేనూ రైల్వేవే స్టేషన్ను బూత్ నుండి . నాలుగైదు సార్లు చేసినా లాభం లేకపోయింది. ఎందుకో ఫోన్ ఎత్తను కాక ఎత్తనని మొరాయించింది. " అంటూ బట్టలు తీసుకొని బాత్రూంలోకి దూరింది. మొగుడి విషయం అర్థమవడంతో ఆమెలో తుఫాను చెలరేగింది. సంయమనంతో మనసును అదుపులోకి తెచ్చుకుంది. ప్రొద్దున లేస్తూనే హరగోపాల్ గారిని కలవడానికి బయలుదేరింది. ఆయనను కలవడం ఆమెకు సార్థకంగా తోచింది. ఒకవైపు తృప్తి. రెండోవైపు ఆందోళన. మిశ్రమ ఫలితాలతో ఆ సాయంత్రం వరంగల్ చేరుకుంది.

ఇంతవరకు ఆనంద్ తనతో యాంత్రిక దాంపత్యాన్నే గడుపుతున్న విషయాన్ని నెమరేసుకుంది. మనసును అధీనంలోకి తెచ్చుకొని పరిశోధన వైపు దృష్టి సారించింది. మరో సంవత్సరం గడిచే సరికి పరిశోధన ఒక కొలిక్కి రావడంతో ఆకస్మిక హైదరాబాద్ ప్రయాణాలు చాలా సార్లే తటస్థ పడ్డాయి.ప్రతి ప్రయాణంలోనూ ఆ ఆడ ఆకారం ఇంట్లో దర్శనమిచ్చింది. నీలిమ చర్చలు వాదులాటల జోలికి పోలేదు. ఎప్రిల్ 30 న థీసిస్ సబ్మిట్ చేసింది. ఋత్విక్ కు సెలవులు రావడంతో పిల్లలిద్దరిని తీసుకొని హైద్రాబాద్ ప్రయాణం కట్టింది. ఆనంద్ క్రితంకన్నా యాంత్రి కంగా ముభావంగా ఉంటున్నాడు. నీలిమ మాత్రం ఏ విధమైన హావభావాలు వ్యక్తం చేయకుండా నిర్లిప్తతగా గడపడం మొదలు పెట్టింది. అదృష్ట వశాత్తు హాస్పిటల్ చెకప్ కై వచ్చిన అత్తా మామలు ఇంట్లోనే ఉన్నారు. అది నీలిమకు కొంత ఊరటనిచ్చింది. ఏది ఏమైనా ఆనంద్ ను తన పరిసరాలకు రానీయలేదు నీలిమ. తమ ఇద్దరు మధ్య జరుగుతున్న అంతర్యుద్ధాన్ని ఏమాత్రం బయటకు పొక్కనీయలేదు. లాలసది కూడా స్కూల్‌లో చేర్చాల్సిన వయసు. పిల్లలను హైద్రాబాద్లో చేర్చకపోతే జనాలకు సవాలక్ష సందేహాలు. పోనీ విషయం చెప్పినా అంతా సర్దుకు పొమ్మనే శాల్తీలే. అందుకే తనలో తాను మధనపడుతూ పరిష్కారం కోసం మెదడును చీల్చడం మొదలు పెట్టింది. పనిలో పనిగా డిగ్రీ లెక్చరర్ ఎడ్ హాక్ అపాయింట్మెంట్ పోస్టులు పడటంతో అప్లై చేసింది కూడా. అది కూడా ఆమెకు పరిష్కారమార్గంగా తోచింది.

ఓ రోజు మధ్యాహ్నం పిల్లలకు తినిపించి సోఫాలో కూర్చోబెట్టి టి.వి. ఆన్ చేసింది. ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్ళిన ఆనంద్ జాడ కనపడలేదు. అత్తా మామలు భోజనం చేసి ఓ కునుకు తీస్తున్నారు. గోడ గడియారం రెండైందని హెచ్చరించడంతో తన భోజనం కానిచ్చేసి ఎగ్జామ్ కు సంబంధించిన పుస్తకాలు ముందేసుకొని కూర్చుంది బయటి ప్రపంచం తెలియనంతగా. అన్నా చెల్లెళ్ళకు టి. వి బోర్ కొట్టిందేమో సోఫాలోనుండి లేచి ఆట వస్తువుల వెంటపడ్డారు. ఏంతేడా వచ్చిందో ఇద్దరి మధ్య కీచులాట మొదలవడంతో లాలస "అమ్మా !" అంటూ ఏడుస్తూ అన్నయ్య మీద కంప్లైట్ తో రావడంతో ఈ లోకం లోకి వచ్చింది నీలిమ. వెంటనే లేచి రెండు చాక్లెట్ లు తెచ్చి ఇద్దరి చేతుల్లో పెడుతుండగా ఆనంద్ కార్ చప్పుడు విని వాకిలి వైపు దృష్టి సారించింది. ఆ కళ్ళకు ఆశ్చర్యకరంగా ఆనంద్ తో పాటు కాలేజీ ఆడ ఆకారం దర్శన మిచ్చింది.అదీ మెడలో పూల దండలతో. "ముసుగులో గుద్దులాట కాస్త బహిరంగమైంది " అనుకుంది నీలిమ. టీ టైంకావడంతో .కునుకు తీసి. హాల్లోకి వచ్చిన అత్తామామలకు ఎవరూ రిపోర్ట్ ఇవ్వకుండా ప్రత్యక్షంగా ఆనంద్ వ్యవహారం కనబడింది. అది చూసి స్థాణువుల్లా గుడ్లప్పగించి చూస్తూ సోఫాలో కూలబడ్డారిద్దరూ. పూలదండల శరీరాలు ఆ పెద్దమనుషులకు దండం పెట్టడానికి కిందికి వంగినై. కాని. పెద్దమనుషుల కాళ్ళు నిరసనతో ఆగ్రహంతో పక్కకు జరిగినై.

"క్షమించాలి. ఒక బలహీన క్షణం కారణంగా శ్రావణి తల్లికాబోతున్నది. ఈ విషయం తెలిసి ఇంటి పరువుమర్యాదలు, ఆమె భవిష్యత్తు అంటూ ఆమెను చితుకబాదడమే కాదు అత్మహత్య చేసుకుంటామంటూ బెదిరిస్తున్నారు. అందువల్ల పెళ్ళి చేసుకోక తప్పలేదు." అంటూ ఒక్కొక్క అక్షరాన్ని ఒత్తి పలికాడు ఆనంద్. ఆ విషయాన్ని విని వాళ్ళు ఖంగు తిన్నారు.

"మామయ్యగారు ఆయన జీవితం ఆయనకే వదిలేయండి. ఈ వయసులో మీకు అండగా ఉంటానని మాటిస్తున్నాను" అంది నీలిమ పెద్దాయనకు ధైర్యమిస్తూ. డ్రైవరు తీసుకొచ్చిన శ్రావణి సూట్ కేసును ఆనంద్ కనుసైగలతో పనిమనిషి లక్ష్మి పైన గదిలోకి చేర్చింది ఏ మాత్రం వ్యవధానమివ్వకుండా. నీలిమ ఓ అరగంటలో తన సామానంతా పిల్లల రూంలోకి మార్చుకుంది.

అత్తామామలు నీలిమను ఓదార్చడం కాదు. నీలిమనే అత్తమామలను ఓదార్చింది. ఋత్విక్ బాధ్యతనే కాదు వాళ్ళ యోగక్షేమాలూ ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ చూసుకుంటానని చెప్పి వాళ్ళకు ధైర్యం నూరిపోసింది. తన మకాంను వరంగల్ లోనే కొనసాగించింది. తల్లి దండ్రులు నీలిమ జీవితం గురించి చాలా బాధ పడుతూ అందుకు తామే కారణభూతుల మ య్యామని మథన పడ్డారు. ఇరుగు పొరుగు మాత్రం ఆనంద్ ను పట్టించుకోకుండా వరంగల్లులో పరిశోధన చేయడం వల్ల ఆయన మరో ఆడ తోడు వెతుక్కున్నాడంటూ నీలమనే బాధ్యురాలని చేసి బాగానే చెవులు కొరుక్కున్నా రు. జనాలను పట్టించుకుంటే తనకు పరిష్కారముండదని నీలిమకు అనుభవం వలన తెలిసిన గుణపాఠం. సొ తను వేసుకున్న మార్గంలోనే మరో నాలుగడుగులు వేసింది. తనకు పాఠాలు చెప్పిన అధ్యాపకులు ఇంకా కొనసాగుతుంటడం వలన తను చదువుకున్న కాలేజీలో పార్ట్ టైం జాబ్ సులభంగా

సంపాదించుకో గల్గింది. పిల్లల చదువులు ఇంటికర్చులకు ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా సాయంకాలం పూట ట్యూషన్స్ చెప్పడం కూడా మొదలు పెట్టింది. తల్లితండ్రుల వద్దే ఉండటం వలన ఇంటి కిరాయి బెడద తప్పింది. గతంలో పంపించినట్లే ఆనంద్ తన అకౌంట్ లో వేసిన డబ్బులను వెనక్కి పంపింది. ఆ రోజు ఆనంద్ నుండి కాల్ రానే వచ్చింది. నీలిమ విసుగుతోనే ఫోన్ లిఫ్ట్ చేసింది.

"అమౌంట్ రిటర్న్ చేసినవెందుకు?"

"అవసరమనిపించలేదు."

"గతంలో అవసరమనిపించిందా?"

"అప్పుడు బాధ్యత గల తండ్రివనుకున్న"

"ఇప్పుడు కూడా బాధ్యత వల్లనే పంపిస్తున్న."

"డబ్బు మాత్రమే బాధ్యతను నెరవేర్చదు." అంటూ సంభాషణ కొనసాగించలేక ఫోన్ కట్ చేసింది. అక్టోబర్ లో వైవా డిసెంబరు లో కాన్వకేషన్ జరిగినై. ప్రత్యేకత ఏమంటే నీలిమ పరిశోధనకు గోల్డ్ మెడల్ వచ్చింది. దాంతో నీలిమకు పరిశోధన పట్ల మరింత ఆసక్తి పెరిగి రిసెర్చి పేపర్స్ రాయడం మొదలుపెట్టింది. మరోవైపు ఉద్యోగ సంబంధమైన పరీక్షలు రాస్తూపో యింది. కాలం కలిసొచ్చింది. సంవత్సరం లోపే కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ ఆడ్ పోస్టులు పడటం...నీలిమ అప్లై చేయడం...ఇంటర్వ్యూ అన్నీ చకచకా జరిగిపోయాయి. నీలిమ కాలేజ్ లో పనిచేస్తుండటం రిసెర్చి పేపర్స్, ఇంటర్వ్యూ లో ఆమె సమాధానాలు అన్నీ ఉద్యోగం సంపాదించి పెట్టినై. దాంతో నీలిమ సాయంకాలం ట్యూషన్లను పక్కన పెట్టింది.

ఒకరోజు అత్తామామలను చూడటానికి ఆరుట్ల బస్ కోసం వెయిట్ చేస్తుండగా కనబడిన శాంతి బిగ్గరగా కౌగిలించుకొని అభినందనలు తెలిపింది .

"నిన్ను చూస్తే నాకు చాలా గర్వంగా ఉంది"

"థ్రీ అఫ్ కాస్టే లే. ఎంతైనా గర్వపడు. నాకభ్యంతరం లేదు." అంది నీలిమ.నవ్వుతూ

"చాలా రోజులకు కలిసాం. ఇంటికి పోయామా? సంసారంలో సర్వం మరిచిపోతాం.

కాంటిన్ లో టీ చప్పరిస్తూ కాసేపు మాట్లాడుకుందామా?" అడిగింది శాంతి

"దానికేం భాగ్యం పద" అంటూ నీలిమ క్యాంటిన్ వైపు అడుగులు వేయగా శాంతి ఆమెను అనుసరించింది.ఇద్దరూ మంచి తరుణం మించిన దొరుకదన్నట్లు తమ సంసారాల గురించి తవ్వి ముందట పోసుకున్నరు.

"ఆరుట్ల బస్ దిగినట్లున్నవ్? అక్కడెవరున్నట్లు? " అడిగింది శాంతి.

"మా అత్తామామలు. పెద్దవాళ్ళుకదా! అప్పుడప్పుడూ పోయి యోగక్షేమాలు కనుక్కుంటూ ఉంటాను. "

"అదేంటి మీ ఆయనతో తెగతెంపులు చేసుకున్నట్లు విన్న. మళ్ళీ అత్తమామలు......"

సందేహాన్ని వెలిబుచ్చింది శాంతి.

"అత్తామామల బాధ్యతే కాదు. ఆనంద్ మొదటి భార్య కొడుకు ఋత్విక్ ను కూడా నేనే చూసుకుంటున్నాను." నీలిమ

"ఇదెక్కడి గొడవే తల్లి.? సంసారాన్ని వదిలి వచ్చినదానివి విడాకులే తీసుకోవచ్చు కదా! " అడిగింది శాంతి.

"ఆనంద్ నన్ను పెళ్ళి చేసుకున్నది కేవలం ఋత్విక్ కోసమే అని పెళ్ళైన కొద్ది రోజులలోనే అర్థం చేసుకున్న. కాలేజ్ ఎంప్లాయ్ తో ఎప్పటినుండో సంబంధమున్నట్లున్నది. ముందే కొంత అనుమానమొచ్చినా పక్కా సాక్ష్యం దొరికే వరకు నేనూ స్పందించలేదు. " నీలిమ

"మరి విడాకులో...?"

"విడాకుల సంగతంటావా? నేను మరో పెళ్ళి చేసుకోవాలనుకోవడం లేదు. ఈ జీవితానికిది చాలు. అతణ్ణి వదిలించుకోవాలనుకున్నాను. అఫ్ కోర్స్ ఆయనకు నా అవసరం లేదు. ఋత్విక్ బాధ్యత తప్ప. ఇప్పుడైతే వాడు కొంచెం ఎదిగిండో ఏ కాస్ట్లీ హాస్టల్ లోనే వేసి చదవించగలడు. కుటుంబంతో అనుబంధం లేక పెరిగిన పిల్లల మనోవికాసం గురించి ఆలోచించాలి కదా! విడాకులు తీసుకుంటే ఆ హక్కును కోల్పోతాను. అత్తామామల అనుబంధం కూడా. ఇప్పుడైతే వాళ్లకు నా సపోర్ట్ . నా సపోర్ట్ వాళ్లకు. "

"పిచ్చా నీకు వాళ్ళ సపోర్ట్ ఏంటి"

"నైతికపరమైన అండ. భర్తను వదిలి ఉండే మహిళలకు కావలసిన అండ. అంతేకాదు. మరో విషయం. నన్ను ఆనంద్ వదలలేదు. నేనే ఆనంద్‌ను వదిలిన. అది నా ఆత్మ గౌరవంలో భాగం కూడ." నీలిమ నిట్టూరుస్తూ చెప్పింది.

"ఔను . ఎంత సేపు నా గోలేనా? ఇప్పుడైనా చెప్పవే.

నీపిల్లలు ఆరాధ్య అద్వైత్ లు ఎట్లున్నరు? మీ ఆయన కోర్టు వ్యవహారాలు ఎట్లా సాగుతున్నై. " అడిగింది నీలిమ.

"ప్రస్తుతానికి ఒడిదుకులు లేని సంసారమనుకో. మా ఆయన ఐదురోజులు కోర్టు. ఒకరోజు ఆఫీసులో . ఆదివారం స్ట్రిక్ట్ గా పిల్లలకోసం కేటాయిస్తారు. పిల్లల చదువు సంధ్యలు నా బాధ్యతనుకో. ఆదివారం పిల్లలను ఎంటర్టైయిన్ చేయడం కోసం సినిమానో షికారో ...ఏది వీలైతే అది" అంది శాంతి.

ఇద్దరు మాట్లాడుకుంటూనే ఉన్నారు. బస్సులు వస్తున్నాయి. పోతున్నాయి. ఓ అర గంట తర్వాత గాని హైద్రాబాద్ బస్ అనౌన్స్ మెంట్ తో ఈ లోకం లోకి వచ్చిన వాళ్ళ కాళ్ళు కాంటీన్ నుండి బయటి వైపు అడుగులు వేసినై..

"సరేనే మళ్ళీ కలుద్దాం. ఇవ్వాళ్ల సాయంత్రం 7గం. మా పిన్ని బాబాయిల గోల్డెన్ జుబ్లీ ఆనివర్సరీ. వాళ్లకు ఆడపిల్లలు లేరు. నేను వెళ్లి తీరాలి." అంటూ బై చెప్పి బస్ వైపు పరిగెత్తింది. శాంతి నీలిమ ఇంటివైపు దారి తీసింది.

★ ★ ★

జీవితం మనం అనుకున్నట్లే సాగొచ్చు. సాగక పోవచ్చు. నీలిమ విషయంలో అదే జరిగింది. పెళ్ళి వరకు ఆమె అనుకున్నది ఒకటి .ఐంది మరొకటి. కాని ఆనంద్ వ్యవహారం వలన జీవిత లక్ష్యశుద్ధి పట్ల ఆమెలో కసి పట్టుదల ఎక్కువై జీవితాన్ని పూలబాటా చేసుకొంది అన్న మాటేగాని ఎక్కడో మొగిలిపూలతో వచ్చిన ముండ్లు ఎంత జాగ్రత్త పడినా అప్పుడప్పుడు గుచ్చుకుంటూనే ఉన్నాయి. కాలం గిర్రున తిరిగి నీకు అరవై ఏళ్ళంది. యూనివర్సిటీ నియమం విశ్రాంతినిచ్చింది.. వృద్ధాప్యం తల్లితండ్రులను అత్తామామలను మీకు భూమ్మీద నూకలు చెల్లాయంటూ వాళ్ళను శాశ్వత నిద్రలోకి పంపించింది. పిల్లల చదువులకుగాను నీలిమ పదేండ్ల క్రితమే తన మకాంను హైద్రాబాద్ కు మార్చి కష్టమైనా ఇష్టంగా మలచుకుంది. అందుకే రిటైర్మెంట్ కావడంతో ఊపిరి పీల్చుకోగలిగింది. పెరుగుతున్న క్రమంలో తండ్రి వ్యవహారం తల్లిగా నీలిమ తీసుకున్న బాధ్యతలు ఆమె చూపించిన అనురాగాలు తెలిసొచ్చినై. ఋత్విక్ కు నీలిమ అంటే ఎనలేని ప్రేమే కాదు భక్తి భావం పెరిగింది. తల్లి సలహాతో సి. ఏ పూర్తి చేసి మొదట ఒక సంవత్సరం ఒక ఆఫీసులో పని చేసి అనుభవం సంపాదించుకున్నడు. నీలిమ స్వంత ఆఫీసు ఎస్టాబ్లిష్ చేసుకోమని సలహా ఇచ్చింది. ఇంటర్ పూర్తవడంతోనే లాలస పబ్లిక్ ఆడ్, పొలిటికల్ సైన్సు , ఎకనామిక్స్ లతో డిగ్రీ పూర్తి చేసి సీరియస్ గా సివిల్స్ కు ప్రిపేర్ ఐంది. ఒక సంవత్సరం ఆలస్యంగానైనా ప్రిలిమ్స్ లోనే కాదు ఫైనల్స్ లో ఫలితం సాధించింది. కలెక్టర్ పోస్ట్ కాదు కాని ఏ.జి ఆఫీస్ లో డైరెక్టరుగా చేరింది.

దసరా రోజు ఋత్విక్ ఆఫీసు ఓపెనింగ్. ఋత్విక్ స్నేహితులతోపాటు లాలస నీలిమ స్నేహితులు బిజినెస్ పీపుల్, కార్పొరేట్ కాలేజ్ యజమానులు చాలామంది వచ్చారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ ను ఆహ్వానించారు. పెద్ద అట్టహాసంగాను సింపుల్ గాను కాకుండా మధ్యేమార్గంగా ఓపెనింగ్ సెర్మని జరిగింది. రెఫ్రెష్మెంట్ తతంగం ముగియడంతో ఎంప్లాయిస్ మినహా ఆహ్వానితులు వెళ్ళిపోయారు. నామినల్ గా ఎంప్లాయిస్ తమ పనులను మొదలు పెట్టడంతో ఋత్విక్ చాంబర్ చేరుకున్న నీలిమకు అక్కడ ఋత్విక్ తన స్నేహితురాలు ప్రజ్ఞతో ఏదో డిస్కస్ చేస్తూ కనబడ్డాడు. నీలిమ వాళ్ళ డిస్కషన్ ఫాలో అవడానికి ప్రయత్నిస్తుండగా లాలస వచ్చింది.

"ఏంటమ్మా ? ఎక్కడున్నావు? నీవు కనిపించకపోవడంతో నేను వచ్చేసిన." అంది నీలిమ

"మా స్నేహితుడు శౌర్యను పంపించి వస్తున్నానమ్మా!" అంది లాలస

నీలిమ ఎప్పటినుండో ఋత్విక్ ప్రజ్ఞ లనే కాదు లాలస శౌర్య లను గమనిస్తూనే ఉంది. అందువల్ల ఆ రోజు రాత్రే భోజనాల అనంతరం వాళ్ళ పెళ్ళి ప్రసక్తిని తీసుకొచ్చింది. ఇద్దరూ తమ ప్రేమ వ్యవహారాన్ని బయట పెట్టారు. దాంతో ముందు వాళ్ళ పూర్వాపరాలు తెలుసుకొని ఆ కుటుంబాలతో చర్చించి ఒకే తేదీన ఇద్దరి పెళ్ళిల్లు చేసి మరింత ఊపిరి పీల్చుకుంది. ఒకరోజు సాయంకాలం టీ చప్పరిస్తూ కూచున్న నీలిమకు డోర్ దగ్గర తెలిసిన ఆకారం దర్శనమిచ్చింది.

ఆ ఆకారం లోపలికి అడుగుపెడితేగాని అది శాంతిదని అర్థం కావడంతో దిగ్గున లేచి అమాంతంగా కౌగలించుకుంది.

"ఏంటి. మా ఇంటి దారెట్లా దొరికిందే" అన్నది నీలిమ నిష్టూరంగా

"తిట్టకే. సారి . మీ పిల్లల పెళ్ళి రోజే మా మామగారు కాలం చేసిన్రు. శుభ కార్యం జరుగుతుండగా ఆ విషయం చెప్ప కూడదని కామ్ గా ఉండిపోయాను." అంది శాంతి

"సరేలేవె. మన స్నేహితులందరూ వచ్చారు. నీవు లేకపోవడం వెలితిగా అనిపించి వచ్చిన డైలాగ్ లే. సరే ఇంతకీ

నీ రాక భావమేమి?"

"కూతురు భావన పెళ్ళి ముప్పైన. తప్పకుండా మీ రంతా రావాలి. ఇంతకీ ఋత్విక్ లాలసలు ఎక్కడ? " అని శాంతి అడగటంతో

"లాలస వాళ్ళు రావడానికి మరోగంట పట్టొచ్చు. ఋత్విక్ సంగతైతే అసలు చెప్పలేను. స్వంత ఆఫీసు కదా!"నీలిమ

"ఓ సరే నామాటగా వాళ్ళను రమ్మని చెప్పు. సరేగాని లాలస సంగతి వేరనుకో. అదేంటే ఋత్విక్ వేరే కాపురం పెట్టాడు .? "

"ఈ తరం స్వేచ్ఛను కోరుకుంటున్నారు. మన ఆలోచనలు పద్ధతులు వేరుగా ఉంటాయి. వాళ్ళ మానాన వాళ్ళను ఒదిలితే పోలా. వాళ్ళెక్కడున్నారు. నా పక్కనే కదా! నేను మూలిగిన చప్పుడు విన్నా క్షణాల్లో నా ముందు వాలుతారు. ఏ అవసరం వచ్చినా వాళ్లకూ నేనున్నాను. అంతకంటే ఇంకేం కావాలి." అంది నీలిమ

"ఎంతైనా నీలిమ ప్రణాళికకు సరిలేరెవ్వరు? అన్నంతగా నీ ప్లానుంది సుమా!"

అభినందన భంగిమలో అంది.శాంతి

"ఋత్విక్ ఆఫీస్ ఎస్టాబ్లిష్మెంట్ ముగ్గురికి విడిడిగా ఇండ్లు లాలస పెళ్ళి ఒక్కచేతిమీదుగా ఎలా చేయగలిగావు.?"

"మా అత్తామామలు పొయ్యేముందు తమ పొలాన్ని ఋత్విక్ లాలస పేర్లమీద వీలునామా రాసారు. ఆ పొలం అమ్మి వాడికో ఫ్లాట్, వాడి ఆఫీస్ ఎస్టాబ్లిష్మెంట్ చేసుకోమన్నాను. లాలస ఋత్విక్ ల పెళ్ళి ఖర్చులు నావే. పొలం డబ్బులు నేను టచ్ చేయలేదు. ఎందుకంటే డబ్బుకోసమే వాళ్ళ బాగోగులు చూసాననే అపప్రధ అవసరమా? అపప్రధ అనే కాదు. నాకూ ఇష్టం లేదు కూడా. లాలస అపార్ట్ మెంట్ అంటావా? వాళ్ళే కొనుక్కున్నారు.ఇదీ సంగతి" అంది నీలిమ నిట్టూరుస్తూ.

"ఆనంద్ సంగతులేమన్న తెలుస్తున్నాయా? "

"తెలియకేం. బేషుగ్గా తెలుస్తున్నాయి. కాలేజీ శాల్తీతో మరో కొడుకును కన్నాడట. ఇంజనీరింగ్ చేసి అమెరికా ప్రయాణం కట్టాడట. మరిచేపోయా. సెకండ్ లాక్ డౌన్ లో కాలేజీ శాల్తీ టికెట్ తీసుకుందట. దాంతో ఆనంద్ ఒంటరివాడై మొన్నీమధ్య నాకే ఫోన్ కొట్టాడు."

"ఏం విశేషమో?"

"విశేషమా? పాడా. ఒంటరిగా ఉండలేకపోతున్నాను. నువ్వు రా అని"

"పిల్లల పెళ్ళిళ్ళు అయ్యాకా నీవు ఒంటరివేగా అని ఓ వెధవ డైలాగ్ ఒకటి"

"నీ సమాధానం..........?"

"ఏముంటుంది. కేవలం ఋత్విక్ కు పెళ్ళాం రూపంలో ఆయాగా పెళ్ళి చేసుకున్నావు. వాడిని నేను మాత్రం స్వంత కొడుకులా చూసుకున్నాను. అది నా వ్యక్తిత్వం . వదిలెయ్. నీ టక్కులాడి చనిపోతో మళ్ళీ నేను గుర్తుకొచ్చానా మహానుభావా" అన్నది నా సమాధానం.

"ఒంట్లో బాగోలేక కాలేజీ అమ్మేసుకున్నాను. ప్రస్తుతం ఇంటికి పరిమితమై ఉంటున్న" అని కూడా అన్నాడు

"అంటే ఇంటివద్దే ఉండి నిన్ను ముద్దూ మురిపాలలో ముంచెత్తుతాడన్న మాట" నవ్వు తూ అంది శాంతి.

"ముద్దూమురిపాలా పాడా? సేవచేయించుకునే మురిపాలు"

"నువ్వోకా పరాన్నబుక్కువి. నేను నీకు వడ్డించిన విస్తరిని కాలేను. అపకారికి ఉపకారంలా నీకే మంచి సలహా ఇస్తున్నాను. ఇ..సి.ఐ.యల్ లో సాకేత్ ప్రణామ్ అనే అపార్ట్ మెంట్స్ ఉన్నాయని విన్న. అవి నీలాంటి వాళ్ళ కోసమే. అందులో చేరు" అని సమాధాన మిచ్చిన

ఆ సమాధానానికి ఆశ్చర్యపోతూ "ఔనా ?..." అంది శాంతి

"మరి పారసైట్స్ కు ఇంతకన్నా మంచి సలహా ఏముంటుంది చెప్పు"అంది నీలిమ భారంగా

"పరాన్నబక్కు బిరుదేంటే తల్లీ" సందేహాన్ని వెలిబుచ్చింది శాంతి

"ఓ అదా? దోమలు, నల్లులు, జలగలు మనుషులు తయారు చేసుకున్న రక్తాన్ని పీల్చి బతుకుతై. అట్లని మనుషులు కూడా కొంమంది ఇతరులపై ఆధారపడి బతుకుతారు. ముఖ్యంగా మగవాళ్లు. ఆనంద్ ఆర్థికంగా కాదనుకో. కొందరు తాగుబోతులైతే కరెక్టుగా ఆ కోవకు చెందుతారు" అంది నీలిమ

"మొత్తానికి లెక్చరర్ అనిపించుతున్నావే నీలిమ. సరే నేను వస్తా. పెళ్లికి రావడం మరిచిపోకేం" అంటూ ఇంటి దారి పట్టింది శాంతి

# ముత్యమంత ఆశ

- శీలా సుభద్రాదేవి
8106883099



వెతుక్కుంటూనే ఉంటాం

వెతుకులాట ఎప్పుడు మొదలైందో
నలుగురుపిల్లలకీ
వాళ్ళనిచ్చిన ఇంటి పెద్దకీ
కడుపు నింపాలంటే
పొయ్యిలో పడుకున్న పిల్లిని తోలటానికి రూపాయిలకర్రని వెతికే పనిలో
దిగులుముఖంతో
పక్కనే ఒరిగినఅమ్మ కొంగుకిందదూరి
పసికందుగా పాలచుక్కకోసం
మొదలు పెట్టిన వెతుకులాట

బాల్యాన్ని ఎత్తుకుపోయి
అర్థంకాని బెంగని
గుండెలనిండా నింపిన నాటినుండి
అటల్నీ ఆనందాల్నీ దొంగిలించి
కన్నీళ్ళతో కళ్ళునింపి మసకలు చేసి
దాగుడుమూతలు ఆడినప్పటి నుంచీ
కలలన్నీ మూటకట్టి దాచేసి
కలతలకట్టెలమూట నెత్తిన పెట్టినప్పుడూ
వెతుకులాట సాగుతూనే ఉంది

అలా అలా జీవితం పొడవునా
సంసార సాగరంలో మునుగీతలుకొడుతూ
జార్చుకున్న యవ్వనాన్ని
పోగొట్టుకున్న నవ్వుల్ని
కరిగిపోయిన క్షణాల్ని
అట్టడుక్కి చేరిన అనుభవాల్నీ
ఎన్నెన్ని వెతుకులాటలో

అంతులేని వెతుకులాటలో
ఏనాడో ఒకనాడు సాగరగర్భం
అట్టడుగున పగడాలచెట్టు చాటున దాగిన
చిరుచేప కళ్ళ మిలమిలల్లాగా
ఎప్పుడో ఏమూలో ఏ ఆల్చిప్పలోనో
ఓ ఆశ మంచిముత్యంలా చేతికి చిక్కుతుంది
ఎప్పుడో ఒకనాడు ఒడ్డున చేరి
లక్ష్యాల్ని సాకారం చేసుకోగలమన్న
ముత్యమంత ఆశే కదా
మనిషిని సజీవంగా ఉంచేది.

# ముదిగంటి సుజాతారెడ్డి - యాత్రా కథన రచనలు



## (సామాజిక, సాంస్కృతిక, చారిత్రక విశేషాలు)

ఆచార్య వి. త్రివేణి
ఫోన్ : 9951444803

యాత్ర అనగా..

1. యాత్రకు 'యాన్తి అస్యామ్ ఇతి యాత్ర' (యా-ప్రాపణే) అని సంస్కృతంలో వ్యుత్పత్తి 'యా-ప్రాపణే' అంటే 'దీని యందు కదలిపోవుదురు' అనే అర్థం ఉంది.

2. శబ్దార్థ కల్పతరువులో 'గత్యాం, యాపనే, భోగాది వర్తనే' అనే అర్థాలు కనిపిస్తున్నాయి. అంటే క్రమంగా 'వెళ్ళుట, కాలము గడుపుట, భోగాలను అనుభవించుట' అనే అర్థాలలో యాత్రా శబ్దం వాడబడిరది.

3. 'భిక్షమెత్తి పరితోషమునం భుజియించి దేహయాత్ర కులంబు గైకొనుట ధర్మము భిక్షునకున్'

4. భగవద్గీతకు వ్యాఖ్య వ్రాసిన నీలకంఠుడు శరీరయాత్రను దేహ వ్యవహారమన్నాడు. ఈ పదం యాత్ర శబ్దానికి గల నానార్థాల్లో ఒకటి. అకర్మయందు ఆసక్తి కలవానికి దేహ వ్యవహారం (శరీర యాత్ర) కూడా సాగదు.

శరీర యాత్రా 2 పిత తేన ప్రసిద్ధ్యేద కర్మణః (భగవద్గీతా 3-8)

శరీర యాత్రా - దేహ వ్యవహార: (నీలకంఠ వ్యాఖ్య)

5. అమరకోశంలో యాత్రకు వ్రజ్య, అభి నిర్యాణం, ప్రస్థానం, గమనం, నమ: అని కూడా అర్థాలు ఉన్నాయి.

యాత్రా వ్రజ్యా 2 భి నిర్యాణం ప్రస్థానం గమనం గమ:

6. యాత్రకు కేవలం 'వెళ్ళుట' అనే అర్థం కాక 'సేన వెడలుట, దాడి వెడలుట తీర్థమునకు పోవుట' అని ప్రత్యేక గమనాన్ని సూచించే అర్థాలను కూడా నిఘంటువులు సూచిస్తున్నాయి.

7. యాత్రకు బదులుగా 'యానము, ప్రయాణం, పర్యటన' అనే మాటలు కూడా వాడటం కనిపిస్తున్నది. కాబట్టి యాత్రార్థ నిరూపణము అన్నప్పుడు వీటిని కూడా పరిశీలించవలసి ఉన్నది.

8. ప్రయాణమే మాటకు, 'తరలి పోవడమనే అర్థం కూడా బ్రౌణ్ చూపాడు. 'ప్రస్థాన భేరీ' అన్నప్పుడు 'గుంపు తరలి వెళ్ళే ప్రారంభంలో మ్రోగించే పెద్ద భేరీ' అన్న అర్థం పై దానికి ఉపబలంగా ఉంది. ప్రయాణమంటే 'పయనము, ప్రస్థానము' అనే అర్థాలు కూడా కనిపిస్తున్నాయి. అంతేగాక బయల్దేరడమనే సామాన్య గమనార్థంలో కూడా ఈ మాట క్రియారూపంలో వాడబడిరది.

9. యాత్రకు సన్నిహితార్థంలో ఇంగ్లీషులో ట్రావెల్ (ƒతీaజవశ్రీ) వాడబడుతున్నది. ఇంకా (ƒతీaజవశ్రీ) కు దాదాపు పర్యాయ పదాలుగా జీశీబతీఅవవ, జుఞజూవసట్‌ఱశీఅ, పశీవaస్త్రవ జుఞషబతీంఱశీఅ, ƒతీఱజూ, ƒశీబతీ అనే మాటలు కూడా కనిపిస్తున్నాయి.

10. ట్రావెల్ అనే మాటకు ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి ప్రయాణించడం అని అంథ్థముంది. దూర దేశాలకు లేదా అపరిచిత ప్రదేశాలకు చేసే ప్రయాణమన్న మాట.

(A jశీబతీఅవవ వంజూవషఱaశ్రీశ్రీవ శో a సఱర్‌aఅ్‌ శీతీ బఱటaఎఱశ్రీఱaతీ.... షవపర్‌వత్ణీం ష్ట్రఱతీస చీవష Iఅ్‌వతీఅa్‌ఱశీఅaశ్రీ ణఱష్‌ఱశీఅaతీవ శీట ష్ట్రవ జుఅస్త్రశ్రీఱంష్ట్ర ూaఅస్త్రబaస్త్రవ బఱaపతీఱసస్త్రవస - 1668, పశీశ్రీ.III)

యాత్రల వల్ల యాత్రా కాలం నాటి సామాజిక, రాజకీయ, ధార్మిక, సాంస్కృతిక పరిస్థితులు అవగతమై తరువాతి తరాలకు ఒక గొప్ప ప్రేరణ కలిగిస్తుంది.

**తెలుగులో యాత్రా చరిత్రలు :**

మన తెలుగు సాహిత్యంలో కాశీయాత్రలు, నీలగిరి యాత్రలు, కాశ్మీర్ యాత్ర, దక్షిణ భారతదేశ యాత్రలు, పశ్చిమ భారతదేశ యాత్రలు, ఉత్తర భారతదేశ యాత్రలు, హిమాలయ

యాత్రలు, రష్యా యాత్రలు, అమెరికా యాత్రలు, ఐరోపా యాత్రలు, ఇంగ్లాండు యాత్రలు, మలేషియా యాత్రలు, చైనా యాత్రలు, మిగతా విదేశీ యాత్రల విశేషాలతో కూడిన గ్రంథాలు రచించబడ్డాయని మచ్చ హరిదాసు తన పరిశోధనా గ్రంథంలో తెలియజేశారు. యాత్రలను సందర్శించి స్థల విశేషాలను తెలిపిన రచయితలు :

1. కాశీ యాత్రలు : ఏనుగుల వీరాస్వామి, వెన్నెలకంటి, చెళ్ళపిళ్ళ

2. నీలగిరి యాత్ర : శేషాచల కవి, బులుసు వెంకట రమణయ్య

3.కాశ్మీర యాత్రలు : నాయని క ృష్ణకుమారి 'కాశ్మీర దీపకళిక'

4. దక్షిణ దేశ యాత్రలు : ప్రాతూరి వేంకట శివరామ శర్మ, బులుసు వేంకట రమణయ్య, సూరాబత్తుల సుబ్రహ్మణ్యం, ముమ్మనేణి లక్ష్మీనారాయణ, మాలతీ చందూర్, మల్లంపల్లి సోమశేఖర శర్మ

5. పశ్చిమ భారతదేశ యాత్రలు : జొన్నలగడ్డ సత్యనారాయణ, ప్రాతూరి వేంకట శివరామ శర్మ, బాపిరాజు సురా బత్తుల

6. ఉత్తర భారతదేశ యాత్రలు : ప్రాతూరి వేంకట శివరామ శర్మ, సుబ్బయ్య, బులుసు వెంకట రమణయ్య, రామబ్రహ్మం

7. హిమాలయ యాత్రలు : మనోహర రావు, బులుసు వెంకట రమణయ్య

8. రష్యా యాత్రలు : నెక్కొండ వేంకట జనార్ధన రావు, దీపాల పిచ్చయ్య, సి.నారాయణరెడ్డి, భరద్వాజ, పోశెట్టి, ప్రభావతి, శ్రీశ్రీ.

9. అమెరికా యాత్రలు : ఎల్.ఎన్.రావు, అక్కినేని, ఎ.జి.కె. కొడాలి రుక్మిణమ్మ, దాశరథి, సినారె, ఆరుద్ర, కామేశ్వరి, ఆచార్య ఎన్ గోపి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి (శివమెత్తిన చికాగో)

10. ఐరోపా యాత్రలు : కురుమెళ్ళ వెంకట రావు, ఉప్పల లక్ష్మణరావు, ఎ.బి.కె. ప్రసాద్ కృష్ణమాచార్యులు

11. ఇంగ్లాండు యాత్రలు : డి.వి. సుబ్బారావు, వెంకటరావు, సోమసుందర్

12. మలేషియా యాత్రలు : త్రిపురనేని

13. చైనా యాత్రలు : శ్రీశ్రీ

14. మిగతా విదేశీ యాత్రలు : మూర్తిరాజు, రమణాబాయమ్మ

ఇలా ఎందరో రచయితలు తాము దర్శించిన స్థలాలను, వాటి విశేషాలను యాత్రా చరిత్ర గ్రంథాల్లో పొందుపరిచారు. అదే విధంగా ముదిగంటి సుజాతారెడ్డి ఈజిప్ట్ యాత్రా కథనాన్ని, లద్దాఖ్ యాత్రా కథనాన్ని తన పర్యటనలో భాగంగా రచించారు.

**ఈజిప్టు యాత్రా కథనం :**

సుజాతారెడ్డికి ఈజిప్టును సందర్శించాలని, ప్రపంచంలో అద్భుత కట్టడాలైన అక్కడి పిరమిడులను, భవ్యమైన దేవాలయాలను చూడాలనే కోరిక చిన్నప్పటి నుండి ఉండేది. చివరికి ఆ కోరిక సఫలమై 2006 జనవరి 11 నుండి 21వ తేదీ వరకు ఈజిప్టు పర్యటనాయాత్ర కొనసాగింది. ఆమె 'ఎన్.ఓ.టి.సి.' అనే టూరిస్టు సంస్థ తీసుకుపోయే ఈజిప్ట్ టూర్‌లో వెళ్ళారు. ఆమెతో పాటు పొరుగు వారైన సర్వదేవయ్య గారి శ్రీనివాసరెడ్డి కుటుంబం, వికారాబాదు నుండి ఒక లాయరు లవకుమార్, ఒక వ్యాపారవేత్త నరసింగరావు వీరందరు కలిసి వెళ్ళారు. ఈజిప్టు వెళ్ళే ముందు ఆమె కొన్ని గ్రంథాలను పఠించడమే గాక శ్రీనివాసరెడ్డి కూతురు అభిజ్ఞ వెబ్ సైట్ నుంచి ఈజిప్టు గురించిన సమాచారాన్ని సేకరించి తెలుసుకున్నారు. ముంబైలో ప్రారంభం అయిన వారి విమానం సౌదీ అరేబియాలోని 'షార్జా' పట్టణం మీదుగా ఈజిప్టు రాజధాని 'కైరో' లోని ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు సమయం రాత్రి ఎనిమిది గంటలకు (ఈజిప్టు కాలమానం ప్రకారం) చేరారు. భారతదేశ కాలమానానికి, ఈజిప్టు కాలమానికి నాలుగన్నర గంటల సమయం తేడా. మొత్తం ముంబై నుండి కైరో చేరడానికి వారికి ఏడు గంటల సమయం పట్టింది. అక్కడ తొమ్మిది రోజులు ఉన్నారు. ఈ తొమ్మిది రోజుల్లో వీరికి గైడ్ (ఈజిప్టాలజిస్టు) అన్ని స్థలాలను వర్ణించి చెప్పాడని ఆమె ఈ గ్రంథంలో తెలిపారు. ఒక విధంగా ఈజిప్టును దర్శించి నైలునది నాగరికతగా రచన చేసిన మొట్ట

మొదటి యాత్రికురాలు ముదిగంటి సుజాతారెడ్డి.

**చారిత్రక స్థలాలు :**

**పిరమిడులు :**

ప్రపంచంలోనే మొదటి వింతగా పేరుగాంచినవి. పిరమిడులు. మొదటి రోజు సుజాతారెడ్డి తోటి పర్యాటకులు కలిసి 'ఘీసా' అనే ప్రాంతంలో ఉన్న పిరమిడులను చూడటానికి వెళ్ళారు. అక్కడ మూడు ప్రసిద్ధమైన పిరమిడులను చూశారు. అవి తండ్రి 'కుఫూ', కొడుకు 'కఫ్రే', మనుమడు 'మెన్‌కౌరే' తమ కొరకు నిర్మించుకున్నారు. ఇవే ప్రపంచంలో అద్భుతమైన పిరమిడులుగా వర్ణింపబడుతున్నాయని రచయిత్రి తెలిపారు.

ఈ మూడిరటిలో 'కుఫూ' (ఎతైన ప్రదేశంలో ఉంది) పిరమిడ్ పెద్దది. అక్కడే రాళ్ళకుప్పగా చిన్నగా ఉన్న పిరమిడు ఉంది. అది రాగిది కావచ్చుననే విషయాన్ని ఆమె తెలిపారు. ఇంకా చిన్న చిన్న సమాధులు, దీర్ఘ చతురస్రాకారంలో చాలా ఉన్నాయని, వాటిని 'ముస్తాబా'లు అంటారని, అవి రాజ బంధువులకు, ప్రముఖమైన రాజోద్యోగులకు చెందినవి కావచ్చుననే విషయాన్ని తెలిపారు.

**పిరమిడుల నిర్మాణం :**

చెక్కతో చేసిన లేదా రాతితో చెక్కిన శవ పేటికల్లో రాజుల శవాలను పెట్టి పిరమిడుల్లో ఉంచుతారు. పిరమిడులంటే సమాధులనే అర్థం తెలుస్తుంది. రాజులు బతికి ఉండగానే తమ కోసం పిరమిడులను నిర్మించుకునేవారని సుజాతారెడ్డి తెలిపారు. మృత శరీరాలను భద్రపరిచే విషయాలను తెలియజేస్తూ, రాజు మరణించిన తర్వాత శరీరాన్ని 'ప్రిజర్వ్' చేయడానికి శరీరం లోపలి భాగాలను ఒక గుండెను తప్ప అన్నిటినీ తీసేసేవాళ్ళు. తర్వాత శరీరాన్ని కెమికల్స్‌లో 'డీ హైడ్రేట్' అంటే నీరు భాగం లేకుండా చేసేవాళ్ళు. అప్పుడు శరీరానికి మరిన్ని కెమికల్స్‌ను పూసి అతి సన్నని బట్టలను చుట్టేవారు. అట్లా గుడ్డలతో చుట్టిన శవాన్ని శవ పేటికలో పెట్టి పిరమిడుల్లో కర్మ కాండలతో ఉంచేవాళ్ళు. ఇట్లా శవాన్ని తయారు చేయటాన్ని 'మమ్మీఫికేషన్' అని, శవాలను 'మమ్మీ' లని అంటారు. ఈ విధంగా మమ్మీఫికేషన్ చేయటానికి నలభై రోజులు పట్టేదనే విషయాన్ని రచయిత్రి వివరించారు. అంతేగాక ఈ పిరమిడుల్లో రాజుల శరీరాలతో పాటు వాళ్ళు ఉపయోగించిన కుర్చీలు, పడకలు, విలువైన బంగారు నగలు, వజ్ర వైఢూర్యాలు, పానీయాలు, సువాసన ద్రవ్యాలు, ఆహార ధాన్యాలు వుంచడమే గాకుండా, ఒక్కోసారి సేవకులను, ప్రియురాళ్ళను కూడా సజీవంగానే ఉంచి పిరమిడ్‌పై భాగాన్ని మూసేసే వాళ్ళని ఆమె తెలిపారు.

దీనిని బట్టి మరణం తర్వాత కూడా జీవితం కొనసాగుతుందనే నమ్మకం ప్రాచీన ఈజిప్షియన్లలో ఉండేదని, ఆ నమ్మకమే ఈ మమ్మీలను చెయ్యడానికి, పిరమిడులను నిర్మించడానికి పురిగొల్పి ఉండవచ్చునని చారిత్రకులు అభిప్రాయపడుతున్నారు.

**ఘీసా పిరమిడుల చరిత్ర :**

ఘీసా అనే ప్రాంతంలోని ఫిరమిడులు క్రీ.పూ 2700`2500 మధ్య కాలంలో కట్టబడ్డాయని సుజాతారెడ్డి తెలిపారు. ఈ మూడు పిరమిడుల్లో 'కఫ్రా' నిర్మించిన పిరమిడ్ చాలా పెద్దది. దీనిని కట్టడానికి ఇరవై సంవత్సరాలు పట్టాయి. లక్ష మంది కూలీలు పని చేశారు. ఒకే ఆకారంలో రాళ్లను పగుల గొట్టడానికి పది సంవత్సరాలు, నిర్మాణానికి పది సంవత్సరాలు పట్టాయి. ఇది పదమూడు ఎకరాల స్థలంలో ఆరు మిలియన్ టన్నుల బరువు గల రాళ్లతో కట్టబడిరది. ఎత్తు 480 ఫీట్లు. ఈ పిరమిడు మెట్లు మెట్లుగా కట్టి పైన 'లైమ్ స్టోన్'లను పరిచారు. ఘీసాలో ఉన్న మూడు పిరమిడుల చుట్టూ విశాలమైన ప్రాంగణం, అందులోని 'మార్చ్యురీ' అనే కట్టడం, మమ్మీలను తయారు చేసే దేవాలయం ఉన్నాయి. ఈ పిరమిడులకు కాపలాగా నిర్మించిన అతి పెద్దదైన 'స్పింక్స్' రక్షణగా ఉండి చూపరులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతాయని రచయిత్రి తెలిపారు. క్రీ.పూ. ఐదవ శతాబ్దం వాడైన గ్రీకు చరిత్రకారుడు హెరడోటస్ ఈజిప్టును సందర్శించి అక్కడి పిరమిడులను, దేవాలయాలను చూసి అద్భుతాశ్చర్యాల్లో మునిగి పోయాడనే విషయాన్ని (పుట. 18) ప్రస్తావించారు. అంతటి ప్రాచీనకాలంలో, విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా లేనటువంటి సమయంలో, ఇంకా మానవ నాగరికత బాల్యావస్థలోనే ఉన్న దశలో విశాలమైన, ఎతైన కోణాకారంలో పైకి లేచి సూచి ఆకారంలో ఉన్న పిరమిడులను ఏ విధంగా నిర్మించారో అనే సందేహాశ్చర్యాలను రచయిత్రి వ్యక్తపరిచారు.

పిరమిడులకు పూర్వం ఈజిప్షియన్లు శవాలను మట్టిలో పూడ్చి పెట్టేవారు. వాటి మీద దీర్ఘ చతురస్రాకారంలో పైకి

మొనదేలే విధంగా మట్టి దిబ్బను చేసేవారు. దాని మీద రాళ్లను పరిచేవారు. ఆ బొందలో శవంతో పాటు వాళ్లు ఉపయోగించిన వస్తువులను ఉంచేవారు. మరణం తర్వాత జీవితం ఉంటుందన్న నమ్మకమే పిరమిడుల నిర్మాణానికి దారి తీసి వుంటుందని పురాతత్త్వ శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ పిరమిడుల్లో శవాన్ని, వారి వస్తు జాలాన్ని భద్రపరిచే గదినే గాక, విశ్రమించే గదులను, ఆ వ్యక్తి జీవితాన్ని చిత్రించే బొమ్మలను, శిల్పాలను, చరిత్రను, చిత్రలిపిలో రాసిన రాతలను చేర్చేవారు. అందువల్ల పిరమిడుల నిర్మాణం రహస్యమయంగా మారింది. ఇలా వేల సంవత్సరాలు గడిచిన నేటికి చిత్రలిపి, రంగులు వేసిన బొమ్మలు తాజాగా ఉన్నాయని రచయిత్రి తెలిపారు.

ఈజిప్టులో రాజులను 'ఫెరో'లు అంటారు. 'ఫీసా' సమీపంలోనే 'సక్కారా' పిరమిడులు ఉన్నాయి. ఈ ప్రదేశంలోనే మొట్టమొదటి పిరమిడ్ నిర్మించబడిరది. అది ఈజిప్ట్ ప్రథమ రాజధాని 'మెంఫిన్' నగరంలో 'జోసర్' అనే 'ఫెరో' తన కోసం క్రీ.పూ. 2780లో ఈ పిరమిడ్‌ను నిర్మింపజేసుకున్నాడని, దీనినే ఫాదర్ ఆఫ్ పిరమిడ్ అంటారని రచయిత్రి పేర్కొన్నారు. ఇది మెట్లు మెట్లుగా ఉండటం వల్ల దీనిని 'స్టెప్ పిరమిడ్' అంటారు. దీనిని 'ఇమెతెప్' అనే ఆర్కిటెక్ట్ ప్లాను చేసి నిర్మించాడని అన్నారు. ఆనాటి ఆర్కిటెక్ట్‌లకు చాలా గౌరవం ఉండేదని, అతనిని ఒక దివ్యపురుషునిగా ప్రజలు భావించేవారని ఆమె పేర్కొన్నారు.

**రాచరిక పాలన :**

సువిశాలమైన ఈజిప్టు సామ్రాజ్యం దిగువ ఎగువ రాజ్యాలుగా ఉన్నప్పుడు, ఆ రాజ్యాలను చిన్న చిన్న నగరరాజులు, తెగలు పరిపాలించేవారు. ఈ ప్రాంతాలన్నింటిని ఏకం చేసి ఏక కేంద్రపాలిత ప్రాంతంగా చేసుకొని మొట్టమొదటి సారిగా పాలించిన రాజు 'మెనెస్' చరిత్రలో నిలుస్తాడు. అతనికే 'వార్మర్', 'మెరినర్' అనే పేర్లున్నాయి. అతనిని ఒక చారిత్రక పురుషునిగా నిలబెట్టేంత విషయం లభించకపోయినా, ఈజిప్టును ఐక్యం చేసిన కీర్తి మాత్రం లభిస్తుంది. ఇతని కాలం నుండే ఈజిప్టును పాలించిన రాజులను 'ఫెరో'లుగా వ్యవహరించేవారు. 'ఫెరో' అనగా 'పెద్ద ఇల్లు' అనే అర్థం ఉంది. అంతేగాక నిఘంటువులోని అర్థాలను సూచిస్తూ ఈ పదాలకు ప్యాలెస్, రాజభవనం అర్థాలున్నాయి. క్రమంగా ఈ శబ్దం 'రాజ' అనే శబ్దానికి పర్యాయపదంగా స్వీకరించినట్లు రచయిత్రి పేర్కొన్నారు.

ఈజిప్టు పాలించిన రాజ వంశాలను మూడు భాగాలుగా విభజించారు.

1. ాశ్రీస సఱఅస్త్రసశీఎ (ప్రాచీన రాజవంశాలు) – క్రీ.పూ. 2755–2494

2. వీఱససశ్రీవ సఱఅస్త్రసశీఎ (మధ్య రాజవంశాలు) – క్రీ.పూ. 2050–1780

3. చీవష సఱఅస్త్రసశీఎ (నూతన రాజవంశాలు) – క్రీ.పూ. 1550–525

ఇలా అనేక రాజవంశాలు గద్దెనెక్కుతూ దిగుతూ సుమారు 500 రాజవంశాల వారు ఈజిప్టును పాలించినట్లుగా రచయిత్రి తెలిపారు. ఇక్కడ ాశ్రీస సఱఅస్త్రసశీఎ కాలం నాటికే జోసర్ మొదటి పిరమిడును నిర్మించిన కుఫూ, కఫ్రా, మెన్‌కౌరేలు ప్రసిద్ధమయిన వాళ్ళుగా ఆమె పేర్కొన్నారు. ఇంకా ఇతర రాజవంశీయుల గూర్చి సవివరమైన విషయాన్ని తెలిపారు.

న్యూ కింగ్‌డమ్‌లో 'అఖెనాతన్' చాలా గొప్ప రాజు. మొదట్లో అతనిని 'అమెనోఫిస్ Iప' అని వ్యవహరించేవారు. ఇతనికంటే పూర్వీకులు అనేక దేవతలను ఆరాధించిన ఈ రాజు ఏకైక భగవంతుడైన సూర్యదేవున్ని 'ఆతన్' పేరుతో పూజించేవాడు. అందుకే అతనికి 'అఖెనాతన్' పేరు ప్రసిద్ధమైంది. 'అఖెనాతన్' అంటే 'ఆతన్'కు ప్రియమైనవాడు అని అర్థం ఉన్నట్లు తెలిపారు. ఇది మన అశోకుడు ధరించిన 'దేవానాం ప్రియ:' అనే బిరుదును తలపిస్తున్నట్లుగా ఉందని రచయిత్రి అభిప్రాయపడ్డారు.

**సాంస్కృతికాంశాలు :**

అఖెనాతన్ 'ఆతన్'కు లక్సర్ సమీపంలో కర్నక్‌లో గొప్ప దేవాలయాన్ని కట్టించాడు. 'అఖెనాతన్' యొక్క ఎత్తయిన గొప్ప విగ్రహం, సౌందర్యానికి ప్రతీకగా నిలిచిన అతని భార్య 'నెఫర్తీతి' విగ్రహం కైరో మ్యూజియంలో రచయిత్రి బృందం చూడటమే గాకుండా వాటి ఛాయాచిత్రాలను గ్రంథంలో పొందుపరిచారు. అఖెనాతన్ 20 సంవత్సరాలు పాలించి ధార్మికంగా గొప్ప విప్లవాన్ని తేవడానికి ప్రయత్నించాడు. అతను ఏకైక సూర్యదేవతారాధనను చేపట్టాడు. అందువల్ల అతడు తన కాలంలో నాటి పురోహితుల ఆగ్రహానికి లోను కావలసి

వచ్చింది.'అఖెనాతన్' తర్వాత అతని భార్య 'నెఫర్తీతి', ఆమె అల్లుడు 'తూతెన్ ఖామెన్' పురోహితుల వైభవాన్ని అంగీకరించి 'రే' (సూర్య దేవునికి ఏకైక దేవతారూపం)తో పాటు పూర్వ దేవతలను ఆరాధించారు.

కైరో మ్యూజియంలో గల నెఫర్తీతి శిరసు లైమ్ స్టోన్‌తో చెక్కబడిరది. ఆ విగ్రహం రంగులు చెడకుండా నేడు అది బెర్లిన్ మ్యూజియంలో ఉంది. అయితే నెఫర్తీతి అందాన్ని రచయిత్రి వర్ణిస్తూ 'నాజూకైన మెడతో, చక్కని ముక్కు, అందమైన ముఖ కవళికలతో అందానికి మారు పేరుగా నిలుస్తుంది. ఆమె ధరించిన అందమైన తలపాగా, నగలు చూడ ముచ్చటగా ఉన్నాయి.' అని అన్నారు.

అంతేగాక నాటి రాజవంశీయులు ఎటువంటి వేషధారణలు చేసేవారో ఈ శిల్పాలను బట్టి, పిరమిడుల్లో పెట్టి ఉంచిన వస్తువులను బట్టి తెలుస్తుంది. కేవలం శిల్పాలు, వర్ణ చిత్రాల వల్లనే గాక పిరమిడుల్లో ఉంచిన వస్తువులను బట్టి ఆనాటి కుర్చీలు, మంచాలు, పెట్టెలు, గృహోపకరణాలు, సౌందర్య సాధనాలైన 'సెంట్' పరిమళ ద్రవ్యాలు తెలుస్తున్నాయి. ప్రాచీన కాలంలో ఈజిప్టులో 'సెంట్' లను తయారు చేయటం భారీ ఎత్తున జరిగేదని పేర్కొనడం జరిగింది..

**వాస్తు శిల్పం :**

'లక్సర్' సమీపంలోగల 134 స్తంభాల వాస్తు శిల్పం సుజాతారెడ్డిని అబ్బుర పరిచింది. ఈ స్తంభాలు కర్నక్ దేవాలయంలో కన్పిస్తాయి. ఈ స్తంభాలపైన పాపిరస్, ఖర్జూర చెట్ల ఆకుల ఆకారంలో గల డిజైన్లు చిత్రింపబడ్డాయి. అయితే ఈ స్తంభాలన్నీ ఒక్క రాతితో చెక్కినవి గాక అనేక రాళ్ళను చతురస్రాకారంలో పేర్చి, మట్టితో 'అస్తర్' చేసి, నున్నగా సున్నంతో నిర్మించి, దానిపై చిత్రలిపిలో నాటి చారిత్రక విషయాలను లిఖించారు. ఈ స్తంభాలు ఇప్పటికి ఆకాశానంటుతున్నట్లుగా ఉన్నాయనడంలో అతిశయోక్తి లేదంటారు రచయిత్రి.

ఈజిప్టు శిల్పాలపైన క్యూబిక్ ఆర్ట్ ఉంటుంది. పాశ్చాత్య దేశాల్లో చిత్రకళలోని 'క్యూబినిజం' ఈ శిల్పాల ప్రభావంతో పుట్టిందని రచయిత్రి పేర్కొన్నారు. శిల్పాల యొక్క ఆకారం సౌష్ఠవ రూపంలో ఉండి చూపరులను ఆకట్టుకుంటాయని ఆమె వివరించారు.

ఈజిప్టులో దేవాలయాలు చాలా ఎతైనవి. చుట్టూ ప్రాకారం ఉంటుంది. తర్వాత స్తంభంతో కూడిన హాలు ఉంటుంది. అది దాటితే గర్భగుడి, దేవుని విగ్రహం, విగ్రహం ఎదురుగా విశాలమైన ఎతైన గ్రానైట్ లో పరిచిన అరుగు (కానుకలు సమర్పించడానికి, కర్మకాండలు నిర్వహించడానికి) ఉంటుంది. కానీ నేడు ఉన్న దేవాలయంలో గల ఏ గర్భగుడిలోనూ విగ్రహం లేదని, అవన్నీ మ్యూజియంలోనే ఉన్నట్లుగా రచయిత్రి తెలిపారు.

ఈ దేవాలయంలో గర్భగుడిలోకి ప్రధాన పూజారి, ఫెరో మాత్రమే ప్రవేశించడానికి అర్హులు. గర్భగుడి చుట్టూ ఎన్నో విశాలమైన గదులు, కక్ష్యలున్నాయి. ఇవి పూజారుల గదులుగా గాని, పూజా కర్మకాండలకు కావలసిన వస్తువులను ఉంచడానికి నిర్మించి ఉండవచ్చుననే విషయాన్ని ఆమె తెలిపారు.

**లద్దాఖ్ యాత్రా కథనం :**

జమ్మూ కాశ్మీర్‌లో లద్దాఖ్ ప్రాంతం విభిన్నమైన భౌగోళిక స్థితిని కలిగి ఉంటుంది. కాశ్మీర్, జమ్ము, లద్దాఖ్ మూడు ప్రాంతాలు మిశ్ర సంస్కృతికి నెలవుగా ఉంటాయి. కార్గిల్ లద్దాఖ్‌లో ఉత్తరదిశగా ఉంటుంది. మన భరతదేశ సరిహద్దు కార్గిల్ నుండి కన్యాకుమారి వరకు ఉండాలనే విషయాన్ని రచయిత్రి గుర్తుచేశారు.

**సాంస్కృతిక విశేషాలు :**

**మతం - భాష :** లద్దాఖ్‌లో ప్రజలు లద్దాఖ్ భాష మాట్లాడుతారు. లద్దాఖ్ భాష టిబెట్ భాషకు మాండలిక రూపం. అక్కడి ప్రజలు బౌద్ధమతం అవలంబిస్తారు. జమ్మూ కాశ్మీర్ ప్రజల వేష భూషణాల కంటే విభిన్నంగా ఉంటాయి. కాశ్మీరంలో కాశ్మీర్ భాష, జమ్ములో డోంగ్రీ భాష మాట్లాడుతారని రచయిత్రి పేర్కొన్నారు. కాశ్మీర్‌లో ఉర్దూ కూడా చలామణిలో ఉంది. హిందువులు, ముస్లింలు కలిసి ఉంటారు. సాహిత్యం వెల్లి విరిసింది. లల్లాదేవి అని ప్రముఖ కవయిత్రి కాశ్మీర్ వనితనే అనే విషయాన్ని స్పష్టపరిచారు. రచయిత్రి అన్న ఒక్క విషయం ఈరోజు వాస్తవం అయ్యింది: 'జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని లద్దాఖ్, కాశ్మీర్, జమ్మూ అని మూడు చిన్న రాష్ట్రాలుగా విభజిస్తే భిన్న భాషా సంస్కృతులు గల ఆ ప్రాంతం ఉగ్రవాదం కోరల్లో చిక్కుకోకుండా అభివృద్ధి చెందుతాయని అంటారు. అది నిజమేనేమో కూడా' (పుట. 64) మూడు రాష్ట్రాలు కాకపోయినా

రెండు రాష్ట్రాలుగా కేంద్ర పాలిత ప్రాంతం నుండి రాష్ట్రాలుగా భారత ప్రభుత్వం విభజించి లద్దాఖ్ సాంస్కృతిక సామాజిక భద్రతకు కృషి చేస్తుంది.

**వ్యాపారం :**

లద్దాఖ్ ప్రాంతం ద్వారానే ప్రాచీన కాలంలో వ్యాపారం కొనసాగేదని రచయిత్రి తెలియజేశారు. మధ్య తూర్పు పశ్చిమ మధ్య ఏసియా ప్రాంతాలకు ఎగుమతి, దిగుమతులను చేసుకొనేవారు. ఒంటెలు, యాక్‌లు, గుర్రం, కంచర గాడిదల మీద సామాన్లు వేసుకొని వర్తక వాణిజ్యాలు నిర్వర్తించేవారు. అక్కడి వర్తకులకు 'క్యారవాన్' అని పేరు. వీరు సామూహికంగా ప్రయాణం చేసి వస్తు వినిమయం చేసేవారు. చైనా వస్తువులన్నీ ఈ ప్రాంతం నుండే భారతదేశానికి, పశ్చిమ దేశాలకు చేరవేస్తూ వ్యాపారం చేసేదట. 'సిల్క్ రూట్' అనే ప్రసిద్ధమైన వ్యాపార మార్గం లద్దాఖ్ ప్రాంతం గుండానే సాగేది.

**వ్యవసాయం :**

లద్దాఖ్‌లో విభిన్నమైన వాతావరణం నెలకొని ఉన్నప్పటికీ వ్యవసాయం చేసే ప్రజలు ఉన్నారు. ఏడాదిలో ఎనిమిది నెలలు అతి చల్లగా ఉండడం వల్ల ఆ సమయంలో వ్యవసాయం చేయలేరు. మిగతా నాలుగు నెలలు వెచ్చదనంలో ఉండి ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుంది. వ్యవసాయం చేయడానికి ఈ కాలమే అనుకూలం. పోడు వ్యవసాయం వీరి వృత్తి. క్యారెట్, గోబీ, ఆలు, క్యాలీఫ్లవర్, బార్లీ, గోధుమ వంటి పంటలు పండిస్తారు. బార్లీ గింజలను కాచి సారాయి తయారు చేస్తారు. దీనినే అక్కడి ప్రజలు 'చ్యాంగో' అంటారని రచయిత్రి తెలిపారు. ఇది అక్కడి వారికి అత్యంత ప్రియమైన పానీయం.

**వస్తు సంస్కృతి :**

లద్దాఖీలు మట్టితో నిర్మించిన ఇంటిలో నివసిస్తారు. అవి మిద్దెలరూపంలోఉంటాయి.చాలాపేదరికంఅనుభవిస్తుంటారు. కరెంట్ ఉత్పత్తి సరఫరా చాలా తక్కువ. అక్కడ టీవీలు చాలా కొద్ది మందికే ఉన్నాయని రచయిత్రి అన్నారు. ఈ పాటికి అక్కడ కూడా అంతా మారిపోయి ఉండవచ్చు. జియో దాని సేవలు విస్తృత పరిచింది కదా! స్త్రీలు, పురుషులు ఒకే విధమైన లాగు, పైన షల్వార్ లాంటి అంగీని ధరిస్తారట. ఆ అంగీ దొడ్డు ఉలెన్ బట్టతో కుట్టించుకొని వేసుకుంటారు. పురుషుల కన్నా స్త్రీలే ఎక్కువ కష్టించి పనిచేస్తారట. స్త్రీలు పూసల దండలను మెడలో ధరిస్తారు. ఉన్నవాళ్ళు తలల మీద రంగు రంగుల కుచ్చులతో, పూసలతో, రాళ్ళతో కూడిన కిరీటం ధరిస్తారట.

**లామాల ప్రభావం :**

లద్దాఖ్‌లో హిందువులు, క్రిస్టియన్లు ఉండరు. రచయిత్రి లద్దాఖ్ సందర్శన సమయంలో 'దలైలామా' వచ్చారు. బహిరంగ సభల్లో ప్రసంగించారు. రచయిత్రి మిత్రబృందం 'దలైలామా' ప్రసంగాన్ని విన్నారు. మూడురోజులు దలైలామా అక్కడ ఉన్నారు. లద్దాఖ్‌లో 90 శాతం బౌద్ధమతాన్ని స్వీకరించిన వారైతే 10 శాతం మాత్రమే ముస్లింలు ఉన్నారు. 'దలైలామా' టిబెటన్ భాషలో ప్రసంగించారు. టిబెట్‌ను చైనా ఆక్రమించిన తర్వాత దలైలామా మరికొందరు టిబెటన్లు ఉత్తర ఈశాన్య భారతదేశంలోకి వలసవచ్చారు. హిమాచల్ ప్రదేశ్‌లోని 'ధర్మశాల' పట్టణంలో స్థావరం ఏర్పరచుకొన్నారు. ఇంకొంతమంది లద్దాఖ్‌లోని లేహ్ పట్టణంలో ఉంటున్నారు. లద్దాఖ్‌లో 'దరద్' ప్రజలు, మంగోల్‌లు, టిబెటన్లు, చైనీయులు ఉన్నారు. 'దరద్'లు లద్దాఖీ భాషను మాట్లాడేవారు. వీరు ఇండో ఆర్యజాతికి చెందినవారు. లద్దాఖ్‌లో అనుసరించే బౌద్ధాన్ని 'లామా బుద్ధిజం' అంటారు. హిమాచల్ ప్రదేశ్‌లో బుద్ధుని అవతారంగా 'పద్మ సంభవుడి'ని ఆరాధిస్తే లద్దాఖ్‌లో బుద్ధుని అవలోకితేశ్వరునిగా ఆరాధిస్తారని రచయిత్రి వివరించారు. 'లామా బుద్ధిజం'లో 'తార' అనే స్త్రీ దేవతకు ప్రముఖ స్థానం ఉందన్నారు.

**బౌద్ధారామాలు :**

'గొంపా'లు అని పిలువబడే బౌద్ధారామాలు లద్దాఖ్ నిర్జన ప్రదేశాల్లో ఎతైన కొండల మీద ఉంటాయి. ప్రతి కుటుంబం నుండి ఒక బాలుడినైనా 'లామా'గా అర్పించే ఆచారం అక్కడ ఉందని రచయిత్రి తెలిపారు. ఇవి జనావాసాలకు దూరంగా ఉంటాయని అన్నారు. అతి ప్రాచీనమైన గొంపాకు రచయిత్రి బృందం వెళ్ళారు. దీనినే 'లామాయోరో' అని పిలుస్తారు. అక్కడ హెమిస్, లికిత్ గొంపాలు ఉన్నాయట. తమ తమ కక్ష్యల్లో ఉన్న లామాలు గంట కొట్టగానే బయటకు వచ్చి భోజనానికి సిద్ధమవుతారు. అజంతాలో లాగా కొన్ని గొంపాలో వర్ణచిత్రాలు ఉన్నాయి. అందులో ప్రార్థనాలయం ఉంది. ఇది చర్చిలాగానే ఉందట. బుద్ధుని విగ్రహం పూలతో అలంకరింపబడి ఉంది. కొవ్వొత్తులు, దీపాలతో పూజిస్తారు.

చిన్న చిన్న పాత్రల్లో నీళ్ళుపోసి బుద్ధుడికి అర్పిస్తారు. నీళ్ళు అందరికి అందుబాటులో ఉంటాయి కాబట్టి బుద్ధుడికి నీళ్ళు అర్పిస్తారట. ఈ ప్రార్థనాలయాలు రెండు అంతస్తులవి కూడా ఉన్నాయి. భక్తులు నిశ్శబ్దంగా ప్రార్థనలు చేసుకుంటారు. వాళ్ళు కూర్చొనే వెనుక గోడలకు అల్మారాలు ఉంటాయి. అందులో 'త్రిపిటకం' బౌద్ధుల పవిత్ర గ్రంథం ప్రతులు ఉంటాయి. వాటిని తీసి చదువుకుంటారు. పాజీ భాషలోనే ప్రార్థనలు చేస్తారు. అక్కడి ప్రజలు బుద్ధుని ధ్యానిస్తారు. ఆ సమయంలో గరికలాంటి తిరిగే దానిని చేతిలో పట్టుకొని గుండ్రంగా తిప్పుతుంటారు.

**భౌగోళిక పరిస్థితులు :**

**సరిహద్దులు :**

లద్దాఖ్ ప్రపంచంలోనే అతి ఎత్తైన ప్రదేశం. ఇందులో లేహ్, కార్గిల్ అని రెండు జిల్లాలు ఉన్నాయి. లేహ్ పట్టణం లద్దాఖ్ రాజధాని. లేహ్‌కు ఉత్తరాన ఉన్నది కార్గిల్. ఇది ఇంకా ఎత్తులో ఉంటుంది. 1999లో కార్గిల్ యుద్ధం జరిగింది. లద్దాఖ్‌లో కార్గిల్ యుద్ధానంతరం ఎక్కువ సైనిక స్థావరాలను ఏర్పరిచారు. లద్దాఖ్ హిమాలయాల్లోని కారాకోరం పర్వత శ్రేణులతో నిండి ఉంది. ఎత్తైన పర్వతాలతో కూడుకొని ఉంది. అత్యున్నత పర్వత శిఖరాలతో అలరారుతుంది. ఎక్కడ పచ్చదనం కన్పించదు. కాని పర్వత శిలలు వివిధ వర్ణాలతో చిత్ర విచిత్రంగా కనిపిస్తాయి. ఎడారి భూమి ఉండి మంచుతో పర్వతాలను కప్పి ఉన్న ప్రదేశం లద్దాఖ్ అని రచయిత్రి తెలిపారు. అత్యంత ఎత్తైన విమానాశ్రయం లేహ్ పట్టణంలోనే ఉందన్నారు. ఎత్తైన రోడ్డు కూడా లేహ్ పట్టణం చేరుకోవడానికి ఉందని పేర్కొన్నారు. 18,380 ఫీట్లు కలిగిన రోడ్డు 'ఖర్దుంగ్‌లా'లో ఉన్నట్లు తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలి నుండి రోహతంగ్ కనుమ ద్వారం నుబ్రాలోయ, లేహ్ పట్టణం చేరుకోవచ్చునని పేర్కొన్నారు. తూర్పుదిశగా చైనా సరిహద్దు, పడమటి దిశగా పాకిస్తాన్ సరిహద్దులుంటాయి. లద్దాఖ్ మంచు ఇసుకలతో నిండి విచిత్రంగా ఉండే ప్రాంతం. ప్రపంచంలోనే ఒక వింతైన ప్రదేశం. చలికాలంలో ఇక్కడ 30 శాతం తక్కువ డిగ్రీలకు పడిపోతుంది. ఎండాకాలంలో 30 శాతం పైబడి డిగ్రీలకు ఎక్కువవుతుందని రచయిత్రి తెలిపారు.

**నేల - పర్వతం :**

'లామా యోరో'కు వెళ్ళే దారిలోనే ముదిగంటి సుజాతారెడ్డి బృందం 'ల్యాండ్ ఆఫ్ మూన్'ను చూశారు. అక్కడి భూమి లేత పసుపు, తెలుపు వర్ణంలో ఉంటుంది. ఇది చంద్రునిలో ఉండే భూమితో సమాన లక్షణాలు కలిగి ఉంటుంది. అదొక గొప్ప విశేషంగా రచయిత్రి వర్ణించారు. అదే తోవలో ఒక 'అయస్కాంత పర్వతం' ఉన్నట్లుగా ఆమె తెలిపారు. ఇది ఇనుమును ఆకర్షిస్తుందట. పర్వతం ఎదుట నిలిపిన కారును ఆకర్షించి ముందుకు కదిలింపజేసిందట. పర్వతం మీది నుండి విమానాలు రాకపోకలు జరగకుండా జాగ్రత్త వహిస్తారట విమాన సిబ్బంది.

**నదులు :**

సింధు నది లేహ్ పట్టణం నుండి 'లామా యోరో'కు ప్రయాణం చేస్తున్న దారి పొడుగూత ఉంటుందట. ఇందులోని నీళ్ళు లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయని రచయిత్రి తెలిపారు. మధ్యలో రఇన్‌స్కార్ నది సింధునదిలో కలుస్తుంది. సింధు, రఇన్‌స్కార్ నదుల సంగమం అద్భుతంగా ఉంటుందన్నారు. అందులోకి దిగి కాళ్ళు చేతులు కడుక్కున్న అనుభూతిని రచయిత్రి పంచుకున్నారు. గుర్తుగా అక్కడి రాళ్ళు ఏరుకొని తెచ్చుకున్నట్లుగా తెలిపారు. సింధు నదిలో రఇన్ స్కార్ నది కలిసిన తర్వాత నీళ్ళు తెల్లగా మారాయని అన్నారు. నది విశాలంగా మారుతుంది. సింధు నది మానస సరోవరంలో పుట్టి లేహ్ గుండా పయనించి కార్గిల్ ప్రాంతం పర్వత లోయల్లోకి ప్రవేశిస్తుంది. కార్గిల్‌లో శోక్ అనే నది ఉంది. సింధు నది శోక్ నది పాకిస్తాన్ వరకు ప్రవహించి ఆ భూభాగంలో సంగమిస్తాయని రచయిత్రి తెలిపారు.

**సరోవరం :**

'ప్యాంగోంగ్' సరోవరం ఎత్తైన హిమాలయాల్లో ఉంది. నీలం, ఆకుపచ్చ రంగుల్లో ఉంటుందని రచయిత్రి పేర్కొన్నారు. మానస సరోవరం లాగానే అందంగా ఉంటుందట. నిశ్చలంగా ఉంటుందట. దీనిని అపూర్వమైన దృశ్యంగా అభివర్ణించారు. ఆ సరోవరం భారతదేశంలో ఒక వంతు, చైనాలో మూడు వంతులు ఉంటుంది. దానికి దగ్గరలోనే మణి పర్వతం ఉంది. మణులకు నెలవైనదిగా ప్రసిద్ధి. లవణ పర్వతం ఉంది. ఆ కొండల్లో నుండే నల్ల ఉప్పును తవ్వి తీస్తారు.

**చైనా యాత్రా కథనం :**

'అద్భుత చైనా యాత్ర' పేరుతో ముదిగంటి సుజాతారెడ్డి యాత్రా కథనాన్ని రచించారు. అందులోనే జపాన్ యాత్రా విశేషాలను చేర్చారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్ యాత్ర, టర్కీ – గ్రీసు యాత్ర, అమెరికా సందర్శించిన వివరాలను పొందుపరిచారు. ఈ యాత్రా కథనంలో భాగంగా 'ఢల్లీ నేషనల్ మ్యూజియం' అద్భుతాన్ని వివరించారు. ఆధునిక సాంస్కృతిక నాగరికతా కేంద్రంగా రూపుదిద్దుకున్న ఢల్లీ నేషనల్ మ్యూజియం విశేషాలను వర్ణించారు.

**సాంస్కృతికాంశాలు :**

చైనా దేశ సంస్కృతి అత్యంత ప్రాచీనమైంది. విభిన్నమైంది. ఆధ్యాత్మిక తాత్త్విక చింతన పరంగా విశిష్టమైంది. సంప్రదాయతను ప్రదర్శించే దేశాలలో చైనా పురాతనమైంది. చైనాతో పాటుగా జపాన్ దేశంలో సంస్కృతి పురోభివృద్ధి ముందంజలో ఉంది. పాశ్చాత్య సాంకేతిక పరిజ్ఞానానికి జపాన్ ఒరవడిని దిద్దింది. చైనా దేశంలో విస్తారంగా వ్యాపించిన బౌద్ధ తాత్త్వికతకు మూలం భారతదేశం. గొప్ప ఆధ్యాత్మిక సంపదను వారసత్వంగా భారతదేశం చైనాకు అందించిందని రచయిత్రి పేర్కొన్నారు. అదే సందర్భంలో చైనా నుండి మన దేశీయులు చీనాంబరాలను తెచ్చుకొని భారతదేశ వస్త్ర సంస్కృతిలో అంతర్భాగమైందని తెలిపారు. సాంస్కృతిక సమ్మేళనం భారత్ `చైనాల మధ్య అత్యంత ప్రాచీన కాలం నుండి కొనసాగిందని గుర్తుచేశారు. అలీన ఉద్యమం నేపథ్యంగా భారత ప్రభుత్వం రూపొందించిన పంచశీల సూత్రాలు భారత్ `చైనా మధ్య అంతరాలను ఏర్పరచాయి. ప్రస్తుతం ప్రపంచీకరణ ప్రభావం వల్ల ఇరుదేశాల వ్యాపార వాణిజ్య విషయాలలో, వస్తు వినిమయంలో విభేదాలు చోటుచేసుకున్నాయి. చైనా దేశ వస్తువుల మీద భారత ప్రభుత్వం ఆంక్షలు విధిస్తుంది. నాణ్యతా లోపం, పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ ప్రమాద సూచికలుగా తయారు అవుతున్న చైనా వస్తువులను నిషేదిస్తుంది. ఇదంతా నేడు భారత్ `చైనాల మధ్య ఉన్న అగాధాన్ని చిత్రిస్తుంది. కాని ముదిగంటి సుజాతారెడ్డి చైనా `జపాన్ దేశాల సంస్కృతి సమైక్యతను వెల్లడిరచారు. వీరు మొదటగా హాంకాంగ్ నుండి జపాన్ రాజధాని టోక్యోకు వెళ్ళారు. టోక్యో జనాభా దాదాపు 40 మిలియన్లు మాత్రమే. జపాన్ మోటారు కారుల ఉత్పత్తికి ప్రసిద్ధిగాంచింది. ఆరు వేల ద్వీపాలు కలిగిన సముదాయమే జపాన్ దేశంగా వ్యవహరింపబడుతుంది. అక్కడ వ్యవసాయం చాలా తక్కువ. 14 శాతం మాత్రమే భూమిని దున్ని పంటలు పండిస్తారు. మిగతా ప్రజలంతా సాంకేతిక పరిజ్ఞానంతో ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తిలో నిమగ్నమవుతారు. టోక్యో అత్యాధునిక నగరం. అభివృద్ధి చెందిన పట్టణాలలో టోక్యోకు అగ్రస్థానం ఉంది. టోకోయ కంటే పూర్వం జపాన్‌కు 'కియోట' నగరం రాజధానిగా ఉండేది. ప్రాచీన మతం 'షింటో' తో కియోట నాడు తులతూగేది. ప్రకృతి జీవనంతో మమేకమై షింటో మతస్తులు వెలుగొందేవారు. ప్రకృతినే ఆరాధ్యదైవంగా భావించేవారు. ప్రకృతిలో మూలజీవనం ఉందనే విశ్వాసం వారి ఆచారాల వల్ల తెలుస్తుంది. పితృదేవతల ఆరాధన కూడా ఆ నగరంలో ఉండేది. పితృస్వామ్య భావజాలం ఏర్పరచడంలో అత్యంత పురాతనమైన నగరంగా కియోట నిలుస్తుంది. నాడు భారతదేశ వ్యాప్తంగా మాతృస్వామ్య కుటుంబ వ్యవస్థ ఉన్న సమయంలో కియోటలో మాత్రం పితృదేవతారాధన అవలంబించేవారు. భక్తి ఆచార వ్యవహారాల్లో జపాన్‌కు ఇతర దేశాల మధ్య వ్యత్యాసం ఉండేదనే విషయం స్పష్టమవుతుంది. ప్రకృతి పరంగా జపాన్ స్వచ్ఛమైంది. వాతావరణ కాలుష్యం ఉండదు. రోడ్ల జనరద్దీ లేకుండా శబ్ద కాలుష్య రహితంగా ఉంటాయి. అక్కడి వారందరు అత్యంత పనిమంతులని, ప్రజలందరూ తమ తమ పనుల్లో మునిగిపోతారని సుజాతారెడ్డి పేర్కొన్నారు. జపాన్ దేశం టూరిజానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తుందని ఆమె తెలిపారు. జపాన్ దేశీయులు విదేశీ విద్యను ప్రోత్సహించరట. జపనీస్ భాషలో వారి చదువంతా సాగుతుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శబ్దజాలం జపనీస్ భాషలో రూపొందింపబడిరది. శాస్త్ర విజ్ఞానం జపనీస్ భాషా పుస్తకాలలో ముద్రింపబడిరది. వీరి భాష చిత్ర లిపిని పొంది ఉంటుంది. జపాన్‌లో అత్యంత విశిష్టమైన షింటో మతంతో పాటుగా బౌద్ధం, క్రిస్టియన్ మతాలు కూడా ఉన్నాయని రచయిత్రి వెల్లడిరచారు. విశేషమైన ప్రాచుర్యాన్ని పొందిన చైనా – జపాన్ దేశాలు సంస్కృతి పరంగా, సామాజిక భద్రత పరంగా ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా మారాయనడంలో అతిశయోక్తి లేదు.

బాలలకథ

# రానియ్యరూ..!

## కాలం నేర్పే గుణపాఠాల్లో తేడా ఉండదు.



కన్నెగంటి అనసూయ
ఫోన్ 9246541249

అలా నేర్చిన పాఠాలనుండి..కోలుకుని ...మీ ఇద్దరికీ ఈ నాలుగు మాటలు..

మిమ్మల్ని అమ్మా, నాన్నా అని సంభోదిస్తూ పిలిచే అర్హత కోల్పోయామేమో...అనిపిస్తుంది మాకు.

అందుకే మాకు జన్మనిచ్చి మమ్మల్ని ఇంతటి వాళ్లని చేసిన మీకు ఏ సంభోదనా లేని ఈ ఉత్తరం.

ఎందుకంటే... ఏ తల్లిదండ్రులూ చెయ్యనంత త్యాగం మీరు మాకు చేసారు. కానీ అది గుర్తించలేని గుడ్డోళ్లమై ఏ పిల్లలూ చెయ్యనంత అన్యాయం మేము మీకు చేసాము. అందుకే మిమ్మల్ని అలా పిలుచుకునే భాగ్యాన్ని మేము కోల్పోయాము అనిపించి ఎప్పట్నించో రాద్దామనుకున్న ఉత్తరాన్ని చాల బాధతో ఆలస్యంగా రాస్తున్నాం.

అవును నాన్నా సౌకర్యాలు ఇచ్చిన ధనం, అహంకారాన్ని పెంచిన సమాజం మా కళ్ళు మూసేసాయి నాన్న.

మేము ఆ ఇంట్లో నుండి వచ్చేసేముందు..మీరు మాతో.."ఎన్నో కష్టాలు పడీ పడీ మీ కోసం, మీ ఆనందం కోసం ఇంత సంపాదించాం. అయినా కన్నోళ్లని ఒంటరిగా వదిలి పెళ్ళికాకుండానే అలా ఎలా వెళతారల్లా.. " అన్న ఆనాటి మీ రోదనని కనీసం లెక్కచేయకపోగా..".. అందరి పేరెంట్స్ చేసే పనే మీరూ.. చేసారు. మేమేమైనా అడిగామా మా కోసం ఇంత కష్టపడండి అని?" అని దురుసుగా మేము మాట్లాడిన మాటలు ఆ పొరలు కప్పేసిన కళ్ళు కూయించిన కూతలే.

మా పట్ల నిజాయితీగా మీరు మాకు పంచిన ప్రేమ పట్ల మా దురుసుతనం తలచుకుని పశ్చాత్తాపంతో మనసు అట్టడుగు పొరల్లోంచి తన్నుకు వస్తున్న దుక్కం మా గుండెల్ని మెలేసి పిండేస్తుంటే..ఎదురు తిరుగుతున్న మా వేళ్లను బలవంతాన ఒప్పించి ఈ అక్షరాలు రాస్తున్నాం...అమ్మా.. నాన్నా!

“పిల్లలకు తెలుగు రాకపోతే ఎలా? ప్రపంచంలో ఏ మూలనున్నా, ఎన్నేళ్ల తర్వాతైనా..తెలుగు మాటలు వినపడితే చాలు మది పులకించటానికైనా తెలుగు రావాలి. పిదప ఆ మమకారం..ఉన్న ఊరికి..కన్నవాళ్ల దగ్గరకి లాక్కురావాలి..” అంటూ నీ ఒడిలో కూర్చోబెట్టుకుని నువ్వు దిద్దించిన ఆ తెలుగు అక్షరాలే మా మనసులోని కుళ్ళుని, బాధని, భారాన్ని దింపుకోవటానికి ఇప్పుడు సహకరిస్తున్నాయమ్మా.!

ఈ అక్షరాలు మము కన్నవాళ్ల దగ్గరకి చేరుస్తాయో లేదో...అది మీ నిర్ణయం . కానీ మీ పట్ల అంత నిర్ధయగా ప్రవర్తించి మా స్వేచ్ఛని వెదుక్కుంటూ,మా ఆనందాన్ని, సుఖాల్ని వెదుక్కుంటూ మిమ్మలని వదిలి మేము వచ్చేసేటప్పుడు మాకు తెలియలేదమ్మా.. మీ స్వేచ్ఛనీ, సంతోషాన్నీ, ఉత్సాహాన్నీ, చలాకీతనాన్నీ కూడా వెంటబెట్టుకుని తీసుకెళ్ళిపోతున్నామని, మరీ ముఖ్యంగా మీ ఆరోగ్యాన్నీ వెంటబెట్టుకుని వచ్చేశామని మాకు చాల ఆలస్యంగా తెలిసిందమ్మా.

అంతే కదా..మరి. ఊరని, ఊరువాళ్లనీ , బంధువులనీ, స్నేహితులనీ, వంశమనీ అన్నన్ని మైళ్ళు ఓపిక లేకపోయినా ప్రయాణం చేస్తూ మన తాతముత్తాతల జ్ఞాపకాలను, అడుగులను వారు వదిలి వెళ్ళిన సంస్కృతీ, సంప్రదాయాలను ఇంత పెద్దైనా ప్రోది చేసుకోవటానికి పెళ్ళిళ్లనీ, ఫంక్షన్లనీ మీరు అటెండ్ అయిన కార్యక్రమాల్లో,

మీరు చేస్తున్న సేవల్లో అంతర్లీనంగా...మాకూ అవి నేర్పాలని మీరు పడ్డ తాపత్రయాన్ని కాలరాసి, మా కోసం , మా ఉన్నతి కోసం ఎంతో శ్రమించి మా చుట్టూ మీరు నిర్మించుకున్న ఆశల సౌధాన్ని స్వేచ్ఛపేరుతో కూలదోసి మిమ్మల్ని వదిలి మేము దూరంగా వెళ్ళిపోతే మొత్తం మీ ఉనికినే మేము దోచేసుకున్నట్టే కదా...నాన్నా!

అవును దోచుకున్నాం. మీరు చేరుకున్న హైట్స్ ని, అఫ్

కోర్స్ నేనూ, తమ్ముడూ, చెల్లీ మా ముగ్గురిలో ఎవ్వరిలో వెదికినా ఇదీ అని గర్వంగా చెప్పుకోగలిగే ఏ ప్రత్యేకతా కనీసం లేక శారీరకంగా ఇంత ఎత్తు ఎదిగిన మమ్మల్ని కేవలం మీకు పుట్టిన పిల్లలమనే మాతృత్వపు ప్రేమతో..చూసుకుంటూ అందరి ముందూ తలెత్తుకు తిరిగే మీరు...మా స్వార్థం కోసం మిమ్మల్ని వదిలి వేరే ఇంటిలో ఉండటం మొదలు పెట్టాకా మీరు ఏ కార్యక్రమానికి, విందులకీ వినోదాలకీ హాజరవగా చూడలేదు. "పిల్లలేం చేస్తున్నారు.? విదేశాల నుండి వచ్చేశారట కదా? ఏదైనా బిజినెస్ పెట్టించావా వాళ్లతో.? ఓయబ్బ..ఎదగటానికి ఇక్కడ కూడా బోలెడన్ని అవకాశాలున్నాయట కదా. ఇళ్లల్లో ఉండి పిల్లలు రకరకాల వ్యాపారాలు చేస్తున్నారట. ఎక్కడైతే ఏం లే..కళ్లముందు ఉంటే చాలు " అని అడిగేవాళ్ల కళ్లల్లోకి సూటిగా చూడలేకే కదా నాన్నా..

ఊరు వెళ్ళి వచ్చాకా ఎంత ఎనర్జీగా కనిపించే వాడివో, ఎంత ఎత్తున కనిపించేవాడివో, ఏది నాన్నా..నీలో ఆ నిలువెత్తు గర్వం? అంతులేని అహంకారంతో..మేమే కూల్చేశాం కదా? ఎంత అన్యాయం?

నిజమే అమ్మా! నువ్వన్నది అక్షరాలా నిజం.

ఒక్కో దేశానికీ ఒక్కో ఆచారం, సంస్కృతి, సంప్రదాయం ఉంటుంది. దాని ప్రకారమే వాళ్లు జీవిస్తారు. అది ఆయా ప్రాంతాల్లో చెల్లుబాటు అవుతుంది. ఒక్కో దేశపు జీవన విధానాన్ని వేర్వేరు దేశాల్లో పాటిద్దామంటే కుదరదని...దాన్ని అక్కడి సమాజం అంగీకరించదని...మాకు ఇప్పుడు బాగా అర్థం అయ్యిందమ్మా.

కడుపున పుట్టిన పిల్లలు ముఖ్యంగా ఆడపిల్లలు పెళ్లయ్యేదాకా తల్లిదండ్రులచాటు బిడ్డలుగానే ఉంటే బాగుంటుందని.. పెళ్ళయ్యాకా ఆత్మీయులు, అయినవాళ్ళు, అమ్మానాన్నా, అమ్మమ్మా, నాయనమ్మా తాతయ్యలూ, మేనమామలూ, అత్తలూ, బాబాయ్ లూ,పిన్నులూ అక్క చెల్లెళ్ళూ, అన్నదమ్ములూ.. అందరూ అప్పగింతల పేరుతో కన్నీటి పర్యంతమవుతూ వీడలేక వీడలేక వీడ్కోలు పలుకుతుంటే కట్టుకున్న భర్తతో.."చూసావా.. నా వాళ్లందర్నీ వీడి నీతో వచ్చేస్తున్నా.ఇక నువ్వే నా సర్వస్వం " అన్నట్టుగా కన్నవారింటి గుమ్మం దాటి అత్తారింటికి పయనమైతే అందులో ఒక ఆనందం, ఒక ఆశీస్సు ఉంటాయని..అదీ మన దేశపు కట్టుబాటూ, ఆచారం, సంస్కృతీ,సంప్రదాయం అని నెత్తీ,నోరూ బాదుకుంటూ మొత్తుకున్నా వినకుండా మూర్ఖంగా మిమ్మల్ని వదిలి వచ్చేశాం అమ్మా.

ఇంకా పెళ్ళి కాకుండానే తల్లిదండ్రులను వదలి వాళ్ళు ఉన్న ఊళ్ళోనే పిల్లలు విడిగా వెళ్ళి ఉంటుంటే అది కన్నవాళ్లకి నామర్ధా అని, అపఖ్యాతి అని నువ్వూ, నాన్నా రోదిస్తూ మాతో అన్న మాటల్లో అర్థం ఇప్పుడిప్పుడే అవగతం అవుతూ వస్తుందమ్మా. అర్థం అయిన దగ్గర్నించీ మేము కడుపులో పడ్డప్పట్నించీ తాతయ్యా, నానమ్మా, అమ్మమ్మా, తాతయ్యలు జాగ్రత్తగా మమ్మల్ని తాకిన తీరు, మేము పుట్టాకా మీరంతా సంతోషంగా నిర్వహించిన వేడుకలు...మా పాదాలకు ఎక్కడ గాయమవుతుందోనని ఏడు మల్లెల ఎత్తున మమ్మల్ని మీరు పెంచిన తీరు...మీరు చెప్పగా విన్నవీ..మేము చూసినవీ మాకిప్పుడు కళ్లముందు కనిపిస్తున్నాయమ్మా.

బోర్లపడితే బొబ్బట్లు, కూర్చుంటే కుడుములు, అడుగులేస్తే అరిసెలు, పరిగెడితే పాయసం, పళ్ళొస్తే పాలతాలికలూ వండించి ఊరంతా పంచటం అత్తామామలు చెప్పటం మాకిప్పుడు గుర్తొస్తున్నాయమ్మా.

మా తొలి అడుగులు ఫోటో ఫ్రేం కట్టించుకున్నావ్. మాకు తొడిగిన తొలి జుబ్బా, సాక్సులు, నేపీ, చొక్కా, గౌను, పేంటు ఇలా అన్నీ నువ్వెంత అపురూపంగా దాచుకున్నావో. మేమంతటి మీ అపురూపానికీ,ప్రేమకీ అర్హులము కామని ....నువ్వు, నాన్నా ఎంత అరచి గీపెట్టినా, నెత్తీనోరూ బాదుకుంటూ ,ఏడుస్తూ " మీకేం కావాలన్నా తీసుకోండర్రా... ఆస్తులు మొత్తం కావాలన్నా ఇప్పుడే రాసిచ్చేస్తాం మమ్మల్ని వదిలి వెళ్లకండర్రా...మీకు పెళ్ళిళ్ళు చేద్దామని కాళ్లకు చక్రాలు కట్టుకుని మరీ తిరుగుతున్నాం...కళ్లల్లో వత్తులు వేసుకుని మరీ వెదుకుతున్నాం.. పదిమందిలో మమ్మల్ని దోషులుగా నిలబెట్టకండర్రా.." అని మా కాళ్లావేళ్ళా పడ్డా ఖాతరు చేయకుండా అలా నిర్ధాక్షిణ్యంగా ఎలా వచ్చెయ్యగలిగామో ఇప్పుడు ఎంత ఆలోచించినా మాకు అర్థం కావటం లేదమ్మా..?

సరదాగా పార్టీలకని సినిమాలకనీ వెళ్ళి అర్ధరాత్రుళ్ళు, అపరాత్రుళ్ళ వరకూ మేము బయట ఉంటే పెందరాడే నిద్రించే మీరు ఎన్నిసార్లు కునికిపాట్లు పడుతూ హాల్లో కాలక్షేపం చేసేవారో..ఇంకా నిద్రపోలేదా అని మేమడిగితే.. ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాం లే అని నీవిచ్చే సమాధానంలోని ఆత్రుత మాకిప్పుడు కళ్లకి కట్టినట్టు

కనిపిస్తుందమ్మా..

"అంతంత రాత్రుళ్ల వరకూ బయట ఉండద్దను. రోజులసలే బాగా లేవు..తల్లిగా నువ్వే చెప్పాలి.." అని నాన్న నీతో ఎన్నిసార్లన్నారో.." చిన్నపిల్లలాండి చెప్పటానికి? ఆ వయసులో మనం వాళ్ళిద్దర్నీ కనలేదా? ఏదైనా అంటే పడుండే రోజులా? మా గురించి మాకు తెలియదా? అని వాళ్ళు ఏదైనా చేసుకుంటేనో.." అన్న నీ సమాధానం మా పట్ల మీరెంతగా కుంగిపోయేవారో..ఇప్పుడు అర్థం అవుతుందమ్మా..

అందరం కలసి ఉండటం..ఒకరి ఆకల్ని ఒకరు వాకబు చేయటం, ఒకరి ఇష్టాఇష్టాలని ఒకరం గౌరవించుకోవటం, ఎవరి తిండి వాళ్లకే ఉన్నా, ఎవరి తిండి వాళ్లే తిన్నా..ఒకరికోసం ఒకరం ఎదురు చూడటం, వేచి ఉండటం ఎంత ఆనందం అమ్మా.! నిజంగా చెప్పనామ్మా..ఎవరికైనా తల్లిదండ్రులు ఉండటమే గొప్పనుకుంటే...వాళ్ళనీ, వాళ్ల అవసరాలనీ దగ్గరుండి చూసుకోగలగటం మరింత అదృష్టం అమ్మా. అదిప్పుడు మాకు బాగా అర్థమైందమ్మా.!


ఉద్యోగం వచ్చి వేరే ఊర్లో ఒంటరిగా తల్లిదండ్రులకు దూరంగా ఉండటం వేరు. ఏ ఉద్యోగం చేస్తూండకపోయినా స్వేచ్ఛలోనే ఆనందం , వ్యక్తిత్వం ఉన్నాయని ఉన్న ఊళ్ళోనే వేరే ఇల్లు తీసుకుని బయటికి రావటం వేరు. ఎప్పుడైతే ఇంట్లో నుండి బయటికి వచ్చామో..అప్పుడే ఈ స్వేఛలో ఉన్న ప్రమాదం, ఈ స్వేచ్ఛపట్ల సమాజానికి ఉన్న చులకనతనం మాకు స్వయంగా అర్థం అవుతున్నా.. మా పక్క ఫ్లాట్ లోకి తల్లిదండ్రులేని ,మొన్న మొన్నటి వరకూ మేమెంతో ఆరాధించిన స్వేచ్ఛ పుష్కలంగా ఉన్న రేవతి రాకపోతే మేమెప్పటికీ ఇదే స్వర్గం అనుకునేవాళ్లమేమో..

లేని తల్లిదండ్రుల పట్ల రేవతి ఆరాధనాభావం, చెప్పే ముచ్చట్లూ, కళ్లకి కట్టినట్టు చూపించిన తనతోపాటు ఎంతోమంది అనాథల వాస్తవ జీవన ప్రపంచం, కొరవడిన రక్షణ,నిరంతరం వెంటాడే తోడేళ్ల చూపులు, వెకిలి చేష్టలు రేవతి నోటి వెంట విని వణికిపోయాం. అవన్నీ కొంచెంకొంచెంగా మాకు అవగతమవుతున్నా..ప్రాక్టికల్ గా తెలుసుకుని వణికిపోయాం నాన్నా. అప్పుడే మాకు అర్థమైంది తల్లిదండ్రుల ఒడి ఒక రక్షణ కవచమని, అది ఛేదించలేని ఎత్తయిన కోట అని బంధనాల వెనుక వెలకట్టలేని బంధమే ఉంటుందని, ఆంక్షల వెనుక అంతులేని ఆపేక్ష ఉంటుందని అది మాటల్లో చెప్పలేని తీయని అనుబంధమని. ఇల్లంటే నాలుగు గోడల గూడు కానే కాదని, ఆప్యాయతానుబంధాల మేళవింపని అర్థమయ్యే కొద్దీ, ఆలోచిస్తున్న కొద్దీ...పెద్దవాళ్లపట్ల పిల్లలకు ఎంత బాధ్యత ఉంటుందో..పిల్లలూ, తల్లిదండ్రులూ ఎంతగా పరస్పర రక్షకులో ,మీకు అందుబాటులో ఉంటూ, మిమ్మల్ని, మీ అవసరాలను చూసుకుంటూ...అనుక్షణం అండదండగా ఉంటూ , మీ నుండి ప్రేమను పొందుతూ...ఆ ప్రేమ నుండే అవసరమైన శక్తియుక్తుల్నీ, పోరాటపటిమనూ పొందుతూ... మీ అనుభవాలే మా అనుభవాలుగా మార్చుకుని , మీ సుఖమే మా సుఖంగా మిమ్మల్ని కాపాడుకోవటం ఎంత అవసరమో.. తెల్సివచ్చింది. అందుకే.. ఈ మానసిక వేదన మేము ఇంక భరించలేం.. మేము లేని మీ జీవితాల్లో వెలుగే లేదని భావించి, సమాజానికి ముఖం చూపించలేక, తప్పు చేశామేమో అన్న అపరాధభావంతో మీరు ఆ నాలుగ్గోడలకే పరిమితమై చిక్కి శల్యమైపోయిన మీకు దూరమైన మా జీవితాల్లో..చొచ్చుకొచ్చిన నిలువనీయని వెలితిని తరిమెయ్యాలని, విదేశీ కవచాన్ని వీడి దేశీయ ప్రేమని మనసంతా నింపుకుని మేము మళ్ళీ మీ దగ్గరకే వచ్చేద్దామని, కరువుతీరా ఇవన్నీ మీతో చెప్పుకుని...మనసారా విలపిస్తే వచ్చే మా కన్నీళ్లతో మీ మనసుల్ని కడిగి క్షమించమని అడుగుదామని వచ్చాం అమ్మా! వచ్చాకనే తెలిసింది...... నిత్యం నిలువెల్లా కాల్చేస్తున్న ఒంటరితనపు మంటలను భరించలేక, మేము ఉండి కూడా మీతో లేమనే నిజాన్ని జీర్ణించుకోలేక ..మీ సమక్షం వద్దని వెళ్ళిపోయిన మమ్మల్ని చేరి మేము స్వర్గం అనుకుంటున్న మా స్వేచ్ఛను భగ్నం చేయటం ఇష్టం లేక దూరంగా వెళ్ళిపోయి పెళ్ళికి ఉన్న ఎంతోమంది అమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేయటానికిగాను వాళ్లని మీరు దత్తతకి తీసుకున్న నిజం.

మీరెలా చెయ్యాలో అలానే చేసారమ్మా. ఇప్పుడు మీకు ఎంతమంది పిల్లలో. అయితే మీరు చేస్తున్నఈ యజ్ఞంలో మేమూ భాగం కావచ్చా? ముక్కలు ముక్కలై ఎక్కడెక్కడో విసిరివేయబడ్డ మా హృదయ శకలాలు..ఎంత వెతికినా దొరకటం లేదమ్మా! ఆ యజ్ఞవాకిటిలో దొరుకుతాయేమో! వచ్చేసి వెతుక్కోమంటారా అమ్మా, నాన్నా?

సమాచారం

# అంతర్జాతీయ బాలికా దినోత్సవం



శ్రీమతి అనురాధా రావు,
బాలల హక్కుల సంఘం అధ్యక్షులు.
9866342424

అంతర్జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 11న నిర్వహించబడుతోంది. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించింది.

2012 అక్టోబరు 11న తొలిసారిగా ఈ దినోత్సవం జరుపబడింది. ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహం పై, వివక్షతపై అవగాహన పెంచడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం.

బాలికలు, యువతులు వారివారి రంగాలలో ప్రచారం, పరిశోధనలకు సంబంధించి సాధించిన అభివృద్ధిని ప్రతిబింబించేలా ఈ దినోత్సవ వేడుకలు జరుగుతాయి. బాలికలకు తమ హక్కుల పట్ల అవగాహన కల్పించడానికి, లింగ వివక్షతను రూపుమాపడానికి, మహిళా సాధికారత కోసం పోరాటం అనేవి బాలికల దినోత్సవం లక్ష్యాలు.

ఆడ పిల్లల పట్ల వివక్షతకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే, ఆడా మగ మధ్య వ్యత్యాసాలు తొలగిపోతాయి.

మనం ఎంత ముందుకు అభివృద్ధి చెందిన, ఏ శతాబ్దాల్లో ఉన్నా, ఆడపిల్ల అనగానే మొగ్గలోనే తుంచే కుంచితబుద్ధి/ కుసంస్కారం నుండి బయటకు రావడం లేదు. ఇంకా అనాగరిక సమాజంలోనే కుళ్ళుతున్న సంగతి అందరికీ తెలిసిందే.

ఈ వివక్షను వీడినపుడు మనం నిజమైన మానవులం / మనుషులం అవుతాము. దిన దిన గండం లా బ్రతుకుతున్న / బలి అవుతున్న బాలికలకు పూర్తి స్వేచ్ఛగా బ్రతికే లా మన వంతు కృషి చేద్దాం.

తొలి ఏడాది బాల్యవివాహాలకు ముగింపు పలకాలనే బాలికల దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం.కానీ దరిదాపులో మనకు బాల్య వివాహాల అదుపు కానరావడం లేదు. రోజు రోజుకూ అమ్మాయిలపై అత్యాచారాలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రతి రెండు గంటలకు ఒక అత్యాచారం జరుగుతుంది. కేసు నమోదుకే పోలీసు స్టేషన్ల చుట్టు తిరిగవలసిన దుస్థితిలో ఉన్నాం.

ఇక శిక్షల అమలుకు సంవత్సరాలు పడుతుంది. ఏ ప్రభుత్వాలు కూడా అమ్మాయిల రక్షణకు భరోసా ఇవ్వడం లేదు.భ్రూణహత్యలు ఆగడం లేదు, అక్రమ రవాణా ఆగడం లేదు, బాల్య వివాహాలు ఆగడం లేదు... అమ్మాయి అంటేనే చిన్నచూపు చూపించకుండా ఉండడం మన ఇంటి నుండే ప్రారంభం కావాలి.

**2012 నుండి థీమ్ లు:**

2012 – బాల్య వివాహాలు రూపుమాపడం
2013– బాలికల విద్య కోసం నూతనత్వం
2014 – కౌమార బాలికలను సాధికార పరచడం, హింసను రూపుమాపడం
2015 – పఢో భేటీ లడో భేటీ,విజన్ ఫర్ 2030
2016 – బాలికల పురోగతి – లక్ష్యాల పురోగతి.
2017 – సాధికారిక బాలికలు – సంక్షోభాలకు ముందు, తర్వాత
2018 – ఆమెతో ఒక నైపుణ్యం బాలికల బృందం
2019 – గర్ల్ ఫోర్స్: అన్ స్క్రిప్టడ్ మరియు అన్ స్టాపబుల్
2020 – నా గొంతు – మా సమాన భవిష్యత్తు
2021 – డిజిటల్ తరం – మా తరం
2022 – ఇప్పుడు మన సమయం, మన హక్కులు, మన

భవిష్యత్తు
2023 – బాలికల హక్కులలో పెట్టుబడి పెట్టండి, మా నాయకత్వం,మన శ్రేయస్సు.

బాలికల చదువు చూస్తే, ప్రతి 5 గురి లో ఒకరు ఇంటర్ మిడియేట్ పూర్తి చేయడం లేదు. 10 బాలికల్లో 4 గురు పదవ తరగతి పూర్తి చేయడం లేదు. టీనేజ్ పిల్లలు గర్భం దాల్చినట్లయితే ఇంట్లో పేరెంట్స్ కు తెలియకుండా ఇల్లీగల్ గా అబార్షన్ చేయించుకోవడం వల్ల మరణాలు ఎక్కువగా ఉన్నాయి.

ఎంత మంది బాలికలు వ్యభిచార కూపంలోకి నిర్భందం గా వెళుతున్నారు? కిడ్నాప్ లకు ఎంత మంది గురైతున్నారు?బాలకార్మికులు గా ఎంతమంది బాలికలు ఉన్నారు? కనీసం తాగేందుకు నీళ్లు లేక ఎన్నో రుగ్మతలకు గురైతున్న అమ్మాయిలు, సరియైన ఆహారం అందక, వైద్యం అందక ఉన్న అమ్మాయిల పరిస్థితి.

అమ్మాయిలకు అడుగడుగునా సమస్యలే. ఈ దినోత్సవాలు వస్తుంటాయి పోతుంటాయి కానీ అమ్మాయిల అభివృద్ధి కోసం ఆలోచించే వారు కావాలి, పేపర్ పై మాత్రం పెట్టటం వల్ల ఉపయోగం లేదు అని బాలల హక్కుల సంఘం విన్నపం. సమాజంలో ప్రతి ఒక్కరు అమ్మాయిల అభివృద్ధి కోసం పాటు పడాలి.

బాల గేయం

# బాల గేయం


ఎ. రాజ్యలక్ష్మి, చెన్నై
ఫోన్:9487486985




బాల్యం బాగా గడపా లంటే
బంగరు బొమ్మలు నవ్వాలి..
మా బంగరు బొమ్మలు నవ్వాలి.
బోసి నవ్వుల దారుల లోనే
బోలెడు ఆశలు పండాలి

బుడి బుడి నడకల దారంబటనే
బుజ్జి బుడతలు నడవాలి అహ
బుజ్జి బుడతలు నడవాలి
బడి వడి చేరగ భవ్యంగాను
బుదుగు లందరూ రావాలి

కల్లాకపటం ఎరుగనిని బాలలందరూ
కలసి మెలసి ఆడాలి
కబుర్ల జడి లో వడివడిగా తమ
కలలన్నిటిని కలబోయాలి

బువ్వనెయ్యి బుద్ధిగ తింటూ
పెరుగు మీగడ కొసరాలి
అమ్మ ముద్దుల జలపాతాల
హాయిగ జలకా లాడాలి

అందరి మనసుల గెలుచు
కుని ఆనందంగా ఎదగాలి
ఆదర్శంగా బతుకుల గెలిచి
ఆహ్లాదం గా బతకాలి..


వారానందం లో
అందరి మనసుల
ఆశలు ఊయలలూగాలి.

బాల చరిత్ర

# "రంగూ రేఖల మధ్య ఒదిగుండే స్మృతిదీపం - క్లింట్"




మానస చామర్తి
79754 68091


"ఊపి ఊపి మనసు నొక్కొక్క వేదన కావ్యమౌను మరియు గానమౌను" అంటాడు కృష్ణశాస్త్రి. నిండా ఏడేళ్ళైనా లేని తన జీవితంలో ఇరవయ్యేదు వేల బొమ్మలు గీసి, వాటిని తన జ్ఞాపకాలుగా వదిలి వెళ్ళిన క్లింట్ అనే కేరళ చిత్రకారుడి కథ, "లిప్తకాలపు స్వప్నం"గా తెలుగు లోగిళ్ళలోకి రావడానికి వెనుక కూడా అట్లా మనసుని పట్టి ఊపిన వేదనే ఉంది.

ఈ పుస్తకం అతని ఆరేళ్ళ పదకొండు నెలల జీవితాన్ని కళ్ళకు కడుతుంది. అతని ఆసక్తులు, అతని వేళ్ళలోని ప్రతిభ, అతని ఆలోచనల్లోని పదును, అతని అమ్మానాన్నల మురిపెం, అతని చుట్టూ ఉన్న వాళ్ళ అపేక్ష, అతని వీడ్కోలు...అన్నిటినీ మెల్లని గొంతుతో పరిచే కథనమీ పుస్తకానిది. రేఖా చిత్రాలు, వర్ణ చిత్రాలు, నీటి రంగుల చిత్రాలు – ఒకటేమిటీ, క్లింట్ గీసిన బొమ్మలను ఈ పుస్తకంలో మణిపూసల్లాగా పొదిగి, అతని కథనీ, కళనీ కూడా ఒకేసారి పరిచయం చేశారు అనువాదకురాలు స్వర్ణ. స్వర్ణ కిలారి

చీకట్లతో యుద్ధం చేస్తున్నట్టు కనపడే నారింజ రంగు శోభలు ఏటి నీళ్ళ మీద పారాడే సంధ్యాకాలాన్ని క్లింట్ పట్టుకున్న తీరు చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఇదే ఈ పుస్తకపు ముఖచిత్రం. ఎట్లాంటి కళ్ళతో జూమ్ చేసి ఈ సూరీడిని పట్టుకున్నాడో అనిపించేంత దగ్గరగా, నిండుగా చిత్రించడం ఒక్కటే నా ఆశ్చర్యానికి కారణం కాదు. ఆ ఏటి ఒడ్డున వెదురు పొదల్లోకి కూడా పాకిన కాంతి పుంజాలు ఆ చిన్నపిల్లవాడి కళ్ళను తప్పించుకోలేదన్న ఊహ ఇచ్చిన పులకింత కూడా దానికి తోడైంది. వాటర్ కలర్స్ తో క్లింట్ గీసిన మొదటి చిత్రం విప్పారిన ఓ పూవు మీద తుమ్మెద వాలిన చిత్రం. ఏమి అందం ఆ

బొమ్మది. చూస్తూ చూస్తూనే ఆ సౌందర్యానికి లోబడిపోయాను. ఆ బొమ్మ దాకా వచ్చాక, ఆ బొమ్మను విప్పారిన కళ్ళతో చూశాక, ఇక కథ వదిలేసి ఒక్కొక్క బొమ్మనూ వెదుక్కుంటూ పుస్తకం చివరికి వెళ్ళిపోయాను. చిన్నప్పుడే తల్లిదండ్రులకు తన బొమ్మలేవీ పారెయ్యద్దని చెప్పాట్ట ఈ పిడుగు. అందుకని, వాళ్ళు అన్నీ దాచారు. పుస్తకంలో దశల వారీగా ఆ బొమ్మలన్నీ చూపెడతారు కనుక, బొమ్మల గురించి కనీస పరిజ్ఞానం లేని నాబోటి వాళ్ళకి కొన్ని మరీ చిన్నపిల్లల బొమ్మల్లానే అనిపిస్తాయ్. ప్రత్యేకత ఏమీ లేనట్టుగానే కనిపిస్తాయ్. అయితే అవి కొన్నే. ఆనక ఈ పూవునో, ఆ సాయంసంధ్యల్నో, జలపాతాలనో, కేరళ ఉత్సవాలనో చూస్తే – వాటిలో ఎట్లాంటి వారినైనా విభ్రముల్ని చేసే సౌందర్యం కనపడుతుంది. తీవ్రమైన భావాతిరేకం, ఆతని కోమలమైన భావస్ఫూర్తి, ఆ వయసుకి చెక్కుచెదరని అతని ఏకాగ్రత ఆ బొమ్మల్లో నుండి, రంగుల్లో నుండి అర్థమై అతనెంత ప్రత్యేకమో తెలిసొస్తుంది.

నమ్మశక్యంగాని ఎన్నెన్ని సంగతులు గుది గుచ్చి రాశారో ఈ పుస్తకంలో. ఉదాహరణకి, ఒక్కటంటే ఒక్కసారే చూసి కాలికులేటర్ బొమ్మ గీశాట్ట క్లింట్. స్క్రీన్, బటన్‌లు అన్నీ ఏ పరిమాణంలో ఏ నిష్పత్తిలో ఉండాలో అచ్చు అట్లానే. అందం గురించి మాట్లాడుతూ, ఒక టీచర్ గురించి చెప్తూ, ఆమె ఉదయం మామూలుగానే ఉంటుందనీ, రోజు పూర్తయ్యాక వదులైన జుట్టుతో, చక్కటి చీరకట్టులో అందమైన మార్మిక యువతిగా మారిపోతుందనీ అన్నాట్ట. ఏడేళ్ళ పిల్లాడి గమనింపులోకి రాగలిగిన అందమా అది అని ఆశ్చర్యచకితురాలినయ్యాను. జంతువుల బొమ్మలు గీసినప్పుడు ఆ కళ్ళల్లో క్రౌర్యం, ప్రకృతిని పరిచినప్పుడు, మామూలు మనుషుల కళ్ళను దాటిపోయే అందాలు అలవోకగా చూపించాడతను. చావు గురించి ఎంత మాట్లాడాడు! బ్రతుకు గురించి ఎంత తపనపడ్డాడు. ఎన్ని బొమ్మల్లో తన జీవితాన్ని ఒంపుకున్నాడు. ఆఖరకు అతడు గీసిన చివరి బొమ్మ కూడా ఓ అద్భుతమే. దానికీ అతని మరణానికీ కూడ ఒక మెలిక లాంటి కథ. ఇలాంటి ఎన్నో ఎన్నో ఆశ్చర్యాల మూట క్లింట్ జీవితమంతా.

క్లింట్ కి బొమ్మలు వెయ్యడానికి ఏదైనా స్ఫూర్తి కావాలి. జూ లో, తోటల్లో, జంతువుల్లో, వస్తువుల్లో, తాను విన్న కథల్లో ఏది ఆసక్తిగా అనిపిస్తే దానిని తన రంగుల, గీతల లోకంలోకి తెచ్చేసుకున్నాడు. కానీ ఎట్లాంటి ఊహలు ఆ పిల్లాడివి!! ఏనుగులంటే ఇష్టమని వందల ఏనుగులనీ, వినాయకుడిని విధవిధాలుగా చిత్రించుకున్నాడు. అది సరిపోలేదతనికి. షీట్‌లో ఒదగనన్ని ఏనుగులను తీసుకొచ్చి గుంపులుగా గీశాడు. అదీ చాల్లేదు, ఏనుగుల దండు వెళ్తుంటే ఆ తొక్కిడికి నలిగిపోయిన దారినీ గీశాడు. అసాధ్యుడు నిజంగా. కార్ బొమ్మలు, విమానాల చప్పుళ్ళు, ఇంకా స్వగతాలు..ఒకటేమిటీ, ఒక పసి మనసు ఎంత హడావుడి ఆలోచనలతో ఉంటుందో, అవన్నీ వరుసాగ్గా, అదే పనిగా బొమ్మలు గీసుకుంటూ వచ్చాడు. అదే అతనిలో తమాషా. లేదంటే బతికిన 2300 రోజుల్లో 25000 వేల బొమ్మలు వేయడం ఎవరికైనా సాధ్యం కాకపోవచ్చు. కానీ, ఎంత చెప్పినా, ఈ కథను ఒక చిత్రకారుడి కథగా మాత్రమే అయితే నేను చూళ్ళేకపోయాను. ఒక అపురూపమైన కళాకారుణ్ణి అంతే అపురూపంగా పెంచుకున్న తల్లిదండ్రుల కథ ఇది. లోకంలో ఎవ్వరూ పంచుకోలేని దుఃఖాన్ని తనతో పాటే మోసుకు తిరుగుతోన్న తల్లి వ్యథ, ఈ పుస్తకంలో అంతర్లీనంగా ఉంటూ హృదయాలను తాకుతూనే ఉంటుంది.

★ ★ ★

మీరు కళాకారులైతే, ఎట్లాంటి తపనతో మసలుకోవాలో నేర్చుకునేందుకు ఈ పుస్తకం చదవాలి. ఎట్లా వేశాడు ఈ

పిల్లాడు బొమ్మల్ని! బడిలో, హాస్పిటల్ బెడ్‌లో, ఇంట్లో, గోడల మీద, పనికిరాని అట్టల మీద, ఇసుక మీద, తన నిశితమైన గమనింపుతో, అది మరపు దారుల్లోకి మళ్ళిపోయే లోపే సృష్టించుకున్నాడు.

మీరు ఒక కళాకారుడైనా, కళాకారుడి తల్లిదండ్రులైనా, వాళ్ళ గురువులైనా, వాళ్ళు మసలుకునే దగ్గరి సమూహాల్లోని సమాజంలోని వాళ్ళైనా ఈ పుస్తకం చదవాలి. కళాకారులు ఎట్లాంటి సున్నితత్వంతో ఉంటారు, వాళ్ళతో ఏం చెప్పాలి, మరీ ముఖ్యంగా ఏం చెప్పకూడదు, ఏం చేస్తే ఈ లోకంలో ఇంకొందరు కళాకారులు స్వేచ్ఛగా ఎదుగుతారో అర్థం కావాలంటే, మీరీ పుస్తకం చదవాలి.

క్లింట్ తల్లిదండ్రులు ఎవ్వరికైనా అర్థం అయ్యే అవకాశం తక్కువ. అందుకని, ఆ ఆదర్శమూర్తుల నుండి మీరేదైనా నేర్చుకోవడానికి ఈ పుస్తకం ఒకసారి చూడండి అని నేను చెప్పను. వాళ్ళ నాన్న అతనికున్న చిన్న జీతంలో నుండీ లెక్కకు వెనుకాడకుండా వాళ్ళ పిల్లాడికి కాగితాలు, రంగులు తెచ్చిపోసాడు. అల్లిబిల్లి గీతల మీద అంత ఖర్చా అనుకోలేదతడు. వాళ్ళ అమ్మ పిల్లాడిని కేవలం అతనికి తోచుబాటు కోసమే బడికి పంపాలనుకుంది తప్ప మార్కుల కోసమో, "బొమ్మలతో పాటుగా" క్లింట్ మిగతావన్నీ నేర్చేసుకోవాలన్న తాపత్రయంతోనో కాదు. ఎన్ని సార్లో ఆలోచనల్లో మునిగిపోయాను, ఈ పుస్తకం చదువుతూ. పిల్లలకు ఒక పూట బాలేదంటే సర్వశక్తులూ ధారపోసి పక్కన కూర్చుందాం అనుకుంటాం. వాళ్ళకి బాలేని రోజున బొమ్మలిస్తాం, ఆడిస్తాం, ఆడతాం, అటెన్షన్ ఇస్తాం. ఆరోగ్యంగా ఉంటే మాత్రం గ్రాంటెడ్ గా తీసుకుంటామేమో కదా. ఏవి వాళ్ళను సంతోషంగా ఉంచుతాయో తెలిసీ, మూసలో ఒదక్కపోతే ఏమవుతాడో నన్న భయానికి ఏడిపించైనా సరే, ఎ ప్లస్‌ల రొంపిలోకి దించేస్తాం. వాళ్ళకి ఇష్టమైన ఆట మళ్ళీ మళ్ళీ ఆడితే, ఇష్టమైన పాట పదే పదే పాడితే, నచ్చిన పనే ఇంకోసారి ఇంకోసారి చేస్తే, ఏ పిచ్చి పడితే అదేనా నీకు అని కట్టడి చేసే ప్రయత్నం చేస్తాం. రాత్రిళ్ళు క్లింట్‌ని చదువుతూ, అప్రయత్నంగానే పక్కనున్న పిల్లాణ్ణి తడుముకున్నాను.

క్లింట్ కళలో ఎంత మగ్నమై ఉన్నా, అతను పట్టుమని ఏడేళ్ళైనా నిండని చంటిగుడ్డు. అందరు పిల్లల్లాగే అతనిలోనూ ఇష్టమైన వాటిని చేతికిస్తే సంతోషంతో ఎగసిపడే పసితనం ఉంది. నచ్చని వాటిని నిర్ద్వంద్వంగా తిరస్కరించే పెంకితనం ఉంది. నచ్చని మనుషుల పొడ కూడా గిట్టదని చెప్పే దురుసుతనం ఉంది. కానీ, అతని తల్లిదండ్రులు అతనికిచ్చిన భరోసా ముందు, ఇవన్నీ నలకలైపోయాయి. పూవులు విచ్చుకుంటుంటే దూరం నుండి చూసినట్టు, పిట్టలు గొంతులు సవరించుకుంటే నిశ్శబ్దంగా నిలబడి విన్నట్టు, ప్రార్థనలో నిమగ్నమైన మనిషి ఏకాంతాన్ని భగ్నం చేయకుండా పక్కన కూర్చునట్టు – వాళ్ళు క్లింట్ రంగుల ప్రపంచంలో మునిగిపోవడం చూశారు. తన ఊహల్లో నుండి కొత్త ప్రపంచాలను కాగితాల మీదకు అద్భుతాలుగా అనువదించుకుంటుంటే చూశారు. నిమిషాలు, గంటలు, రోజులు...అతని తపస్సులో కాగితాలు, అట్టలు, ఇంటి గోడలు, సమస్తం– అతని ఆవేశంలో ఐక్యమవడం చూశారు. నిశ్శబ్దంగా, ఇష్టంగా...

ఏ తపః ఫలాలతో మనందరం ఈ భూమి మీదకు వచ్చామో తెలీదు. ఆ రహస్యాలు పట్టుబడవు. కానీ, ఈ సృష్టిలో మనగలగడానికి ఎవ్వరికైనా కావలసినది మాత్రం "అనువైన వాతావరణం". అది ఉంటేనే పూవులు వికసిస్తాయి. అది ఉంటేనే పిట్టలు పాడతాయి. అది ఉంటేనే... కొన్ని రంగులకలలు ప్రాణం పోసుకుని కాలానికిలా నిలబడతాయి.

కవిత

# ఆమరణీయం!




శైలజ మిత్ర
9290900879


మనిషి పుట్టుకకు వేల ఏళ్ళు
ఆదివాసి నుండి అత్యాధునికం వరకు
మనిషికి తన ఉనికి తనకు పరిచితమే

ఎదిగాడు..మరింత గెలిచాడు
ఇంకా ఇంకా ఎదగడానికి
కుతంత్రాలు పన్నుతూనే ఉన్నాడు
ఎదుటి మనిషిని అంతమొందించేంత వరకూ
పోరాటం చేస్తూనే ఉన్నాడు
వేరొకరి పతనాలపై పట్టాభిషిక్తుడవుతున్నాడు
సిగ్గులేదు.. మానం లేదు
పరువు లేదు.. పరుగు లేదు
విశ్రాంతి లేదు.. ప్రశాంతత లేదు
దేశానికి సరిపడేంత ధనం మాత్రం ఉంది..

నేను ఏ ఒక్కరినీ వేలెత్తి చూపటం లేదు
నాలుగు వేళ్ళు చూపే నన్ను నేనే తరచి
చూసుకుంటున్నాను
మనలాగే, మనమధ్యే మనకోసమే బతుకున్నట్లుగా
చిరునవ్వులు చిందిస్తూ మనిషి గురించే
మాట్లాడుతున్నాను

పాపం! సైనికుడు
ఇవేవీ తెలియకుండా అమాయకంగా
దేశ సరిహద్దుల్లో నిలుచుని
మనకోసం తన జీవితాన్ని పణంగా పెట్టి
కావలి కాస్తున్నాడు
బుద్ధి లేదు వాడికి..
తనకోసం తాను బతకాలనే ఇంగిత జ్ఞానం లేదు వాడికి
తన స్వార్థం తాను చూసుకోవాలనే ధ్యాస లేదు వాడికి
గజ దొంగలకి కావలి కాస్తున్నాననే విషయం
తెలియదు వాడికి
వాడికి తెలిసిందల్లా ఒక్కటే
మన దేశం సుభిక్షంగా ఉండాలని..
దేశమంటే మట్టి అనుకుంటున్నాడు చిన్నపిల్లాడిలా..
భూ బకాసురుల బట్టీ అని అర్థం కావడం లేదు వాడికి
పిచ్చివాడు ఎలా బతుకుతాడో ఏమో!
ఆడుకునేందుకు తల్లి అనుమతి తీసుకున్న పిల్లాడిలా
కుటుంబం అనుమతితోనే వెళతాడు..
ఆవిరై ఇంటికి చేరుకుంటాడు.. అంతే!

ఆ కళ్ళు దేశాన్ని నిత్యం ప్రశ్నిస్తూనే ఉంటాయి..
బహుశా మనమున్నంతవరకూ నిలదీస్తూనే ఉంటాయి

అయినా ఎవరు ఏమయితే మనకేంటి?
పోరాటం ఒక సామూహిక క్రీడ
అది దేశ పోరాటం కావచ్చు.. మరేదయినా కావచ్చు..
మనలోని రెండో ముఖాన్ని చూపేదే కదా
పోరాటమైనా.. ఆరాటమైనా..

మనలో ఎందరు సైనికులున్నారని?
ఈ పోరాటాలకు చిత్రాల్ని ఎవరు గీస్తున్నారు?
ఈ వికృత క్రీడల వినోదం వెనుక ఎందరున్నారు?

ఈ అంతులేని పోరాటంలో ఎవరు గెలిస్తే ఏమిటి?
నిత్యం నువ్వే గెలవాలనే నిబంధన ఏమిటి?
పోరాటం చేయాలనే ఆరాటం మొదలైనప్పుడే
మనిషులుగా మనల్ని మనం పూర్తిగా కోల్పోవడానికి
సిద్ధమయ్యాం!

నిజానికి మనకున్న బలం ముందు
ఆవేశం ముందు అనాలోచితం ముందు
మనకున్న కాస్త వివేకం ఓడిపోతోంది
మనలో దాగున్న మరికాస్త విచక్షణ నిర్వీర్యమైపోతోంది
చిగురంత ప్రేమభావం ఇంకిపోతోంది

అలాగని జీవచ్ఛవాల్లా బతుకుతున్న మనిషికి
ఇవేవీ లేని సమాజాన్ని అందిస్తామని హామీ ఇవ్వగలమా?
సైనికుడు పోరాటం దేశం కోసం
ప్రేమికుడి పోరాటం దేహం కోసం..
ప్రతి సైనికుడు వీరుడు కాలేదు
ప్రతి ప్రేమికుడు తన జీవితం ప్రేమమయం చేసుకోలేడు.

ఇది నా సమాజం
ఒక పోరాటాన్ని వివరించిన జీవితంగా
పంచభూతాలకు నమస్కరిస్తాను
పోరాటమంటే ఆరాటపడటం కాదు..
పోరాటమంటే ఆక్రమించుకోవడం కానేకాదు
ఎందరో మహనీయుల అడుగుజాడల్ని అందుకోవడం కోసం
నిత్యం తలుచుకునే ఆమరణీయం!

# అమెరికాకు ఎగిరి వెళ్లిన 'తెలుగు భాష'



డాక్టర్ కొండపల్లి నీహారిణి
9866360082

'తెలుగు భాష' మధురమైన భాష.మనదైన భాష.అలా అమెరికా కు ఎగిరి వెళ్లిపోయింది. రెక్కలకు గజ్జెలు కట్టుకొని మరి ఆడుతుంది,గొంతు సవరించి మరీ పాడుతుంది. మురి పెంగా!ముప్పిరిగొనేలా!అమెరికా వాసులకు దక్కిన అరుదైన విషయమిది.

సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం,వంగూరి ఫౌండేషన్స్ ఆఫ్ అమెరికా సంయుక్త ఆధ్వర్యంలో '13వ అమెరికా తెలుగు సాహితీ సదస్సు' 2023అక్టోబర్ 21, 22 తేదీలలో అమెరికా బే ఏరియా లో నిర్వహించారు.

అది అమెరికా దేశం, కాలిఫోర్నియా రాష్ట్రం,మిల్పీటస్ నగరం, సిలికానాంధ్ర విశ్వవిద్యాలయ ప్రాంగణం!డా. హనిమిరెడ్డి లకిరెడ్డి భవనం, తెలుగు భాషామతల్లి వేదిక! 'జగమంత కుటుంబం'అనే ధ్యేయం!ఎంత కమ్మని పరిమళం ఈ తెలుగు తోటలో! అవి రెండు రోజులు కావు రెండు గంటలు అనాలా? కాదు కాదు రెండు యుగాలు అనాలా? ఏమో? ఎవ్వరిదో గానీ ...ఈవని.. !ఆ సందోహం,సంతోషం మావే అయ్యాయి...!!

ఉదయం ఫలహారాలు,పలకరింపులతో మొదలైన ఈ సభా కార్యక్రమాలు ప్రధాన అతిధులైన యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, కొలకలూరి ఇనాక్,వంగూరి చిట్టెన్ రాజు, కూచిభట్ల ఆనంద్, డా. సి.మృణాళిని గార్ల ఉపన్యాసాలతో నూతన చైతన్య ప్రదీప్తులు వెల్లివిరిసాయి.ఈ సాహిత్య నందనోద్యానవనం రంగుల హరివిల్లు కూడా అయ్యింది. సంగీత సాహిత్య కళావైభవాలు తెలుగు ధనంగా తెలుగు తనంగా వెలుగులీనిన సందర్భం.

"స్వాతంత్ర్య సమరంలో సామాజిక పరిస్థితులు"," తెలుగు సంస్కృతి ఒక పరిచయం","సంగీతలక్షణ గ్రంథాలు","అమెరికాలో తెలుగు భాషా సాహిత్యాల సుస్థిర ప్రగతి–వ్యాప్తి:తీరుతెన్నులు", "తెలుగు భాష నాడు నేడు రేపు"," వసు చరిత్రలో నర్మసచివుని వాక్చాతుర్యం"," హరికథ సాహిత్య సింధువు","రామాయణంలో రహదారుల నిర్మాణం"," సంగీత సాహిత్య సమన్వయం"," ఏది కొత్త కథ?","దయాస్ఫోరా కథల విశ్లేషణ","తెలుగు సినీ సాహిత్యం –తెలంగాణ ప్రాంతీయ స్పృహ ", "తెలుగు అంతర్జాల పత్రికలలో వస్తున్న కథాంశాలు", "సినారె సాహితీ ప్రభావం", "మేఘదూతము ఉపమానాలు, పద చిత్రాలు", " అన్నమాచార్య పద సాహిత్యంలో తాత్వికత", కవిత్వంలో కొత్త గొంతులు", "ఇనాక గారి సాహిత్యం పాఠ్యాంశాలు", "ప్రపంచ కథా సాంప్రదాయాలు విశ్లేషణ", "అద్దంలో జిన్నా", "తెలుగు పద్యం", "తెలుగు నవల", "జానపద సాహిత్యంలో సంస్కృతి సంప్రదాయాలు– బతుకమ్మ పాటలు', సంపాదకత్వంలో ఇష్టాలు ఇబ్బందులు", వంటి చక్కని అంశాలతో 70 అద్భుతమైన వ్యాసాలతో ఉన్న 332

పుటల పెద్ద గ్రంథాన్ని ఆవిష్కరించారు.ఈ వ్యాసాలు రాసిన వారే ఈ సదస్సులో పాల్గొన్నారు.అందరినీ వ్యాస సారాంశాన్ని క్లుప్తంగా మాట్లాడమన్నారు.

ఇలా మొదలైన సదస్సు ప్రథమ సమావేశం లోనే తెలిసిపోయింది, తెలుగు భాషా సాహిత్యాల సుస్థిర స్థానం సంపాదించుకోవడం ఇక్కడ అమెరికా లో సాధ్యం అని! ఎంత శ్రద్ధ?ఎంతటి కృషి? వాళ్ళ ధ్యేయం ఒక్కటే తెలుగు భాష నూ సాహిత్యాన్నీ భావితరాలకు అందించాలి అని!

వంగూరి చిట్టెన్ రాజు గారికి ఎంత ఓపిక! ఈ 80 ఏళ్ల యువకుడు.. అవును మీరు చదివింది నిజమే. తమ వయసు ను మరచి ఉల్లాసోత్సాహాలతో కార్యక్రమం మొత్తం సెషన్స్ మొత్తానికి అనుగుణంగా వారు ప్రతి అంశం తర్వాత వేదికనెక్కి క్లుప్తంగా నాలుగు మాటలు మాట్లాడి దిగడం , అలా రెండు రోజులు చేశారు .ఒక్క సారి కూడా విసుగు, చిరాకు ప్రదర్శించలేదు .వాళ్ళు సమయం ఎక్కువ తీసుకొని కాలాన్ని హరిస్తున్నారని తెలిసినా ఏ ఉపన్యాసకుల మీద దూషణ అనేది చేయలేదు చాలా గౌరవపూర్వకంగా మర్యాదపూర్వకంగా సున్నితంగా చెప్పారు. అందరిని ...చిన్నవాళ్లు పెద్దవాళ్లు ,వయసు అయిన వాళ్ళు ,కొత్తగా వ్రాస్తున్న వాళ్ళు, సీనియర్ కవులు అని కాకుండా ప్రతి ఒక్కళ్ళని కూడా సమానమైన భావంతో మాట్లాడడం అనేది చాలా బాగా అనిపించింది.

కూచిభట్ల ఆనంద్ గారు కార్యక్రమం మొత్తం సభ చివరలో నిలబడి మొత్తం ,తిరుగుతూ అందరిని చూస్తూ ఆ కార్యక్రమాన్ని పరిశీలిస్తూ, వేదిక మీద ప్రసంగిస్తున్న వాళ్ళ మాటలను వింటూ కార్యక్రమం అంతా అయిపోయాక సంక్షిప్తంగా విశ్లేషణ చేసి చెప్పడం ఎంతో బాగుంది. హాల్లో ఉన్న ప్రసంగీకులు కాకుండా, నిర్వాహకులు అందరూ కూడా గొప్ప గొప్ప ఉద్యోగాలు చేస్తున్న వాళ్లే! అయినా కానీ ఎంతో వినమ్రంగా సమయానికి అన్నీ తీసుకొచ్చి అందివ్వడం,టి బిస్కెట్లు కానివ్వండి ,స్వీట్స్ కానివ్వండి జ్యూసులు కానివ్వండి కొబ్బరినీళ్లు కానివ్వండి మంచి నీళ్లు కానివ్వండి సమయానికి ఆయా టేబుల్ ల దగ్గరికి తీసుకొచ్చి రెడీగా పెట్టడం,అందరినీ కనుక్కోవడం అసలు ఏంటి ? ఎక్కడున్నామనిపించింది !చదువు సంస్కారాన్ని ఇస్తుంది అనడానికి ఇంతకన్నా పెద్ద నిదర్శనం ఇంకేముంది అని కూడా అనిపించింది.

రెండు రోజులు పండగ వాతావరణం చక్కని విందు భోజనం ఇవ్వడం కూడా భలేగా ఉండె.దసరా పండుగను మిస్ అవుతున్నాము అనే ధ్యాస లేకుండా పండుగ వాతావరణం సృష్టించారు.

ఒక్కొక్క సెషన్ కి ఒక్కొక్క విశ్లేషకులు వాళ్ళు కూడా ఎంతో నిబద్ధతతో ఎంతో గౌరవంగా స్పష్టంగా మాట్లాడుతూ,కార్యక్రమాన్ని నడిపించారు.వాళ్ళ వాళ్ళ బాధ్యతలను సక్రమంగా నిర్వహించారు.

ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు, యార్లగడ్డ ప్రసాద్ గారు అద్భుతమైన ఉపన్యాసాలను ఇచ్చారు.

ప్రపంచంలో దాదాపు 6700 భాషలు ఉన్నాయి, తెలుగు భాష మాట్లాడేవారు అని చూసినప్పుడు సంఖ్య పరంగా 15వ స్థానంలో ఉంది.అలాగే భారతీయ భాషల్లో తెలుగు భాష 3 స్థానంలో ఉన్నది. ఇటువంటి గొప్ప తెలుగు భాషను భవిష్యత్ తరంలో తెలుగు ఎక్కడ మాట్లాడుతున్నారా అని చూడాలి అంటే అమెరికా వైపే అందరూ చూసే రోజులు వచ్చేలా ఉన్నాయి అనే మాటను పెద్దలు ఉటంకించడం చాలా ఆశ్చర్యంగాను,బాధగాను అనిపించింది. ఒకవైపు ఆనందంగా

నూ అనిపించింది. పరాయి దేశంలో మన భాష ప్రాభవం చూస్తాం అనడం!!అయితే తెలుగు భాష మాతృభాషగా ఉన్న వాళ్ళు ఎవరు తెలుగు భాషను మృత భాష గా కానివ్వరు. ఆత్మాభిమానాన్ని చంపుకోరు చంపనివ్వరు. నేల తల్లి ఒడిలో కన్న తల్లులు ఉన్నంతవరకు తెలుగు భాష ఉంటుంది. తండ్రి మాట్లాడినంత వరకు తెలుగు భాష ఉంటుంది. కాకపోతే వ్యాకరణ శుద్ధ సహితమైనటువంటి భాష లేదనో, అన్ని సాహిత్య ప్రక్రియలు నేర్చుకోవడం లేదనో ,గొప్ప కావ్యాలు రాయడం లేదనో బాధపడాల్సి వస్తుండొచ్చు. అంతేగాని తెలుగు భాష మీద అభిమానం పోదు,పోనివ్వరు,పోనివ్వవద్దు

అనే నిశ్చితమైన అభిప్రాయం ఇదిగో ఇటువంటి సభలను చూసినప్పుడు తప్పకుండా అనిపిస్తుంది.

13 వి అమెరికా తెలుగు సాహితీ సదస్సు లో కౌముది పత్రిక సంపాదకులు,'కిరణ్ టాక్ షో ' నిర్వాహకులు కిరణ్ ప్రభ,కాంతి గార్లకు "జీవన సాఫల్య పురస్కారం" అందజేశారు.సిలికానాంధ్ర కుటుంబ సభ్యులు అందరూ కలిసి వంగూరి చిట్టెన్ రాజు గారిని ఘనంగా సన్మానించారు. సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం మాస్టర్ 'బంగారు ఏనుగు ' "మహా" ను బహుకరించారు. " అమెరికా ఖండంలో తెలుగు సాహిత్యానికీ, తెలుగు సంస్కృతి కీ ఎవరూ ఊహించనటువంటి అపురూపమైనటువంటి సేవచేసిన వారి కి ప్రత్యేకంగా ఒక పురస్కారాన్నను కున్నాం .ఈ సిలికానాంధ్ర విశ్వవిద్యాలయ పురస్కారాన్ని తొలిసారిగా అందుకోబోతున్నటువంటి ఆప్తులు, ఆత్మీయులు, సోదరులు వంగూరి చిట్టెన్ రాజు గారికి ఇస్తున్నాం " అంటూ కూచిభట్ల ఆనంద్ గారు ప్రకటిస్తూ , చిట్టెన్ రాజు గారిని వేదికపైకి ఘనంగా ఆహ్వానించి "మహా పురస్కారం " జ్ఞాపికను బహుకరించారు."యాభై సంవత్సరాలుగా అమెరికాలో తెలుగు భాష కు ఒక దశ దిశ కల్పించి, దానిని తన హాస్య చతురతతో ముందుకు నడిపించి ఎందరెందరో హృదయాలను కొల్లగొట్టి, చూరగొన్న చిట్టెన్ రాజు గారికి 50 ఏళ్ల వయస్సు ఉన్న చెట్టు చెక్క మీద ఉన్న ఈ బంగారు ఏనుగు ను మహా పురస్కారం క్రింద ఈ జ్ఞాపికను ఇస్తున్నాం. ఇది ప్రతిష్టాత్మకమైన పురస్కారం. అమెరికాలో తెలుగు విశ్వవిద్యాలయం మొట్టమొదటిగా స్థాపించడానికి చేసిన కృషికి వంగూరి చిట్టెన్ రాజు గారికి ఈ పురస్కారం ఇవ్వడం ఎంతో ఉచితంగా భావిస్తున్నాము" అంటూ ఘనంగా సత్కరించారు కూచిభట్ల ఆనంద్ గారు, మనబడి, సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం బృందం.


ఈ యూనివర్సిటీ భవిష్యత్తులో ఇంకా వృద్ధి లోకి వచ్చేలా ప్రణాళిక లు చేస్తూ అతి పెద్ద సిలికానాంధ్ర యూనివర్సిటీ క్యాంపస్ ను నిర్మిస్తున్నారు. అమెరికాలో పుట్టి పెరిగిన పిల్లలు తెలుగు భాష మీద అభిమానం ఆరాధన పెంచుకుంటూ చదువుతున్నారు.వాళ్ళ విద్యా విధానంలో తెలుగు భాష వలన గ్రేడ్స్ సాధిస్తున్నారు.దీనికి ఋజువు అమెరికాలో తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించడాన్నే చెప్పవచ్చు. చక్కని సాహిత్య విందు,

భోజనాల విందు కవులకు రచయితలకు అనుభవం లోకి వచ్చాయి ఇలా ఎన్నో అనుభవాలను పొదవు కొని సాహిత్య సృజనకారులందరూ తమ మీద కూడా తెలుగు భాషా సాహిత్యాల సుస్థిరత కోసం బాధ్యత ఉన్నదని భావిస్తూ , తెలుగు భాష రెక్కలారుస్తూ అమెరికాలో తిరుగుతున్న వైనాన్ని తెలుసుకుని సెలవు తీసుకున్నారు.

# దళిత షీరోల పోరాటాల చరిత్ర మిణుగురులు



కొండవీటి సత్యవతి
96187 71565




చాలా సంవత్సరాల క్రితం 'ఉమెన్ రైటింగ్ ఇన్ ఇండియా' పుస్తకం చదివినప్పుడు చరిత్ర చీకటి కోణాల్లో తెరవెనకే ఉండిపోయిన ఎంతోమంది స్త్రీల జీవితాల గురించి వారి పోరాటాలు, వారి వ్యక్తిత్వాలు గురించి మొదటిసారి చదివినప్పుడు చెప్పలేనంత ఉద్వేగం కలిగింది.

చరిత్ర పొడవునా విస్మరణకు అదికూడా ఒక కుట్రలో భాగంగా మహిళల చరిత్రను బయటకు రానీయకుండా తొక్కి పెట్టిన పితృస్వామిక కుట్రలు బహిర్గతమయ్యాయి. ఆ పుస్తకంలో దేశవ్యాప్తంగా చీకటిలోనే ఉండిపోయిన అనేకమంది మహిళల జీవితాలు, పోరాటాలు పుస్తక రూపంలో బయటకు వచ్చాయి. ఆ పుస్తకం ద్వారానే తెలుగులో తొలి కథ రాసిన భండారు అచ్చమాంబ గురించి తెలిసింది. ఆమె తెలుగు సాహిత్యంలో, తెలుగు సమాజంలో చేసిన కృషి గురించి కూడా బహిర్గతమైంది. అలా ఎంతో మంది మహిళలు చరిత్ర పొడవునా విస్మరణకు గురైన మహిళల చరిత్రలు ఆ పుస్తకం నిండా ఉన్నాయి. తర్వాత వచ్చిన 'మనకు తెలియని మన చరిత్ర' పుస్తకం తెలంగాణ సాయుధ పోరాటంలో అనన్య సామాన్యమైన పాత్రను నిర్వహించిన మహిళల పోరాట చరిత్రను రికార్డు చేశారు స్త్రీ సంఘటన వారు. తెలంగాణ సాయుధ పోరాటం గురించి అంతకు ముందు వచ్చిన ఏ పుస్తకంలో కూడా ఇంత వివరంగా మహిళలు నిర్వహించిన గొప్ప గొప్ప పోరాటాల గురించి ఎక్కడా రానేలేదు. మొదటిసారి 'మనకు తెలియని మన చరిత్ర' పుస్తకం స్త్రీల దృష్టి కోణంతో స్త్రీల చరిత్రను రికార్డ్ చేసింది.

అలాంటి ఒక గొప్ప కర్తవ్యాన్ని మిణుగురులు పుస్తకం ద్వారా డా:చల్లపల్లి స్వరూపరాణి దళిత స్త్రీల పోరాట చరిత్రను వెలికి తీసి పుస్తక రూపంలో మన ముందుంచింది.

**పుస్తకంలో తను**

రికార్డు చేసిన 26 మంది అద్భుతమైన దళిత మహిళల పోరాట చరిత్ర చదువుతున్నప్పుడు స్త్రీల పరంగా ముఖ్యంగా దళిత ఆదివాసీ, మైనారిటీ స్త్రీల పరంగా చరిత్ర ఎంత దుర్మార్గంగా వ్యవహరించిందో, ఎలా వారిని చరిత్రలో ఎక్కడా కనబడకుండా అణిచి ఉంచిందో స్పష్టంగా అర్థం అవుతుంది.




ఈ 26 మంది స్త్రీలు ఒకరిని మించి ఒకరు తమ పోరాటాల ద్వారా గొప్ప దళిత పోరాటాల చరిత్ర నిర్మించారు. కొన్ని అబద్ధాలను చరిత్ర పొడుగునా చల్లుకుంటూ వెళ్లిన వైనాల గురించి స్వరూపరాణి ఈ పుస్తకంలో స్పష్టంగా రాశారు. ముఖ్యంగా ఝాన్సీ లక్ష్మీబాయి పేరుతో భారత దేశంలో గొప్ప పోరాట మహిళగా ప్రాచుర్యం పొందిన లక్ష్మీబాయి నిజానికి ఝాన్సీ యుద్ధంలో లేదని జల్కారిబాయి అనే దళిత స్త్రీ ఆ యుద్ధంలో పోరాడి ప్రాణాలు కోల్పోయిందని చదివినప్పుడు ఔరా! ఎంత మోసం అనిపించక మానదు. చరిత్ర పొడవునా ఇలాంటి అబద్ధాలు కుప్పలు తెప్పలుగా ఉన్న కథనాలు బయటకు వస్తున్నాయి.రావాల్సిన అవసరం చాలా ఉంది.

అలాగే అప్పటి ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన సారా వ్యతిరేక ఉద్యమంలో భాగ్యమ్మ పాత్ర గురించి స్వరూప రాణి గారు రాసిన వాస్తవాలు, దూబగుంట రోసమ్మను సారా ఉద్యమం పోరాట నాయకురాలుగా ప్రచారం చేసిన తీరు గురించి చదువుతున్నప్పుడు చాలా బాధనిపించింది. ఇంతకాలం సారా ఉద్యమ నాయకురాలుగా దూబగుంట రోశమ్మే అని నమ్మిన ఒక నమ్మకం పటాపంచలైంది.

స్వరూప రాణి భాగ్యమ్మ గురించి రాసిన తర్వాత కూడా

సారా వ్యతిరేక పోరాట నాయకురాలు

దూబగుంట రోశమ్మ అని నమ్మలేం.

నిజానికి చరిత్ర పొడవునా స్త్రీల నాయకత్వాన్ని, స్త్రీల చరిత్రని చీకట్లోనే ఉంచి పురుషుల పరంగానే చరిత్రను నిర్మించుకుంటూ పోయిన దుర్మార్గం స్పష్టంగా కనిపిస్తూనే ఉంది.



**ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి**

అలాగే గొప్ప గొప్ప జీవితాలతో వెలిగిన దళిత స్త్రీల చరిత్రలను మరింత అట్టడుగుకు నొక్కేసిన దుర్మార్గాలను తప్పకుండా బయటకు తీయాల్సిన అవసరం ఉంది.

చరిత్ర చీకటిలో మినుకు మినుకుమంటున్న మహిళలు ముఖ్యంగా దళిత, ఆదివాసీ మహిళల అట్టడుగు అణగారిన వర్గాల చరిత్రను తప్పకుండా బయటకు తీయాలి. చల్లపల్లి స్వరూప రాణి తన మిణుగురులు పుస్తకం ద్వారా విజయవంతంగా ఈ పనిని ప్రారంభించారు. అంతకుముందు గోగు శ్యామల నల్ల పొద్దు పుస్తకం ద్వారా ఎంతో మంది దళిత స్త్రీల జీవితాలను, వారి పోరాటాలను బయటకు తీసుకురావడం జరిగింది. ఇలాంటి పుస్తకాలు వందల్లో కాదు వేలల్లో రావలసిన అవసరం ఉంది. చరిత్ర స్త్రీల పట్ల వ్యవహరించిన వివక్షను, అణిచివేత ను ఇలాంటి పుస్తకాలు మాత్రమే బహిర్గతం చేయగలుగుతాయి. నిజమైన చరిత్ర ప్రధాన స్రవంతిలోకి రావడానికి ఇలాంటి పుస్తకాలు మాత్రమే దోహదం చేస్తాయి. ఇంత మంచి పుస్తకాన్ని తీసుకొచ్చిన

చల్లపల్లి స్వరూప రాణి కి మనః పూర్వక అభినందనలు.ఈ పుస్తకం లోని కొన్ని వ్యాసాలు భూమిక లో ప్రచురితమయ్యాయి.

అలాగే ఈ అద్భుతమైన పుస్తకాన్ని ప్రింట్ చేసిన పర్స్పెక్టివ్ రామకృష్ణా రావు గారికి ధన్యవాదాలు, అభినందనలు. ఈ పుస్తకం చదవడం, నిజమైన చరిత్రను అర్థం చేసుకోవడం మనందరికీ తప్పనిసరి. లేకపోతే చరిత్రలో ఉన్న అబద్ధాలని నమ్ముతూ ఎంతోమంది నిజమైన షీరోల గురించి మనం ఎప్పటికీ తెలుసుకోలేము. వారు నిర్మించిన పోరాట చరిత్రలను అర్థం చేసుకోలేం. సో... అందరూ మిణుగురులు పుస్తకం చదవాలని, ఒక మంచి చర్చకు నాంది పలకాలని నేను భావిస్తున్నాను.

# "వర్జిన్..!"



వి. కళాగోపాల్
నిజామాబాద్, సెల్..9441631029

"మీరు ఇంకా వర్జినే అనే మీ అమ్మగారు అనుకుంటున్నారా?" అని వెకిలి నవ్వు నవ్వుతూ తన మొహాన్ని సగానికిపైగా కప్పిన అత్యాధునిక ఆకారంలో ఉన్న కళ్ళజోడును సవరిస్తూ ఓ ఫిల్మ్ ప్రొడ్యూసర్.. ఓ వర్ధమాన యువనటిని అడుగుతున్న ప్రశ్నలో వివాదాస్పదంగా ఆమె ఆడతనాన్ని అపహాస్యం చేస్తున్న వికృతత్వం.. ఛానల్ చూస్తున్న నేను ఆమె జవాబు కొరకు ఎదురు చూడకుండా విసుగ్గా టి.వి. కట్టేశాను. నా అంతరంగంలో పదిహేనేళ్ళ క్రితం జరిగిన సంఘటన తాలూకు జ్ఞాపకాలు కలుక్కుమన్నాయి.

★ ★ ★

"రాస్కెల్! నీకెన్నిసార్లు చెప్పాలి? ఆన్యువల్ ఎగ్జామ్ ఫీ డేట్ అయిపోవస్తుంది. త్వరగా డబ్బులుకట్టాలి అని.. గణిత ఉపాధ్యాయిని సుచరిత మేడం చేయి గాలిలో విసురుగా లేచి ఎదురుగా నిలబడ్డ పదవ తరగతి విద్యార్థిని స్రవంతి చెంపను ఫెటీల్మనిపించింది. ఆ అమ్మాయి కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి.. "మా అమ్మ బుగ్గలు, బూరలు, పిన్నీసులు అమ్ముకుంట సికింద్రాబాద్ బస్ స్టేషన్ ల తిరుగుతది.. మూన్నెళ్ళకోసారి అస్తుంది. మా అమ్మ రాంగనే పైసలు కడ్త మేడం" అంది బెదురుతున్న నేల చూపులతో.. "ఫీజు కట్టేందుకైతే పైసలు లేవుగాని.. ఇలా షోకులు పోవుడుకైతే పైసలెట్లస్తయి నీకు?" గుచ్చుతున్న సుచరిత మేడం చూపుల్ని తప్పించుకుంటూ ఎర్రని గోరింట చేతులతో చెంపలను తుడుచుకుందామ్మాయి నిస్సహాయంగా.. "వీళ్లిలాగే సతాయిస్తూ టైంపాస్ చేస్తారు గానీ.. ఆ ఫీజేదో నేనిస్తాను.. రేపు మీరు వెళ్ళి బ్యాంకులో చలాన్ కట్టేయండి" అంది మా హెచ్.ఎం. సముదాయింపు ధోరణిలో.. ఓవర్ సైజ్ వైట్ షర్ట్, బ్లూ స్కర్ట్ లో వెనుదిరుగుతున్న స్రవంతిని చూసి జాలేసింది నాకు..

★ ★ ★

మరో నాలుగు నెలలు పోయాక ఓ చలి సాయంత్రం పూట అందిన వార్త నన్ను ఆశ్చర్యంలో కొయ్యబారేలా చేసింది.. తెల్లారే నేను పని చేస్తున్న బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన స్త్రీ, శిశు సంక్షేమ అధికారులు సైతం విస్మయపడేలా జరిగిన ఆ సంఘటన ఆ మండల కేంద్రాన్నే కాదు మొత్తం జిల్లా యంత్రాంగాన్నే ఉలిక్కిపడేలా చేసింది."స్రవంతి నిన్న రాత్రి పండంటి మగబిడ్డను ప్రసవించింది..!" బాలికల బాగోగులు చూడలేని ఉపాధ్యాయినిలంటూ అధికారులు మాపై తీవ్రంగా ధ్వజమెత్తారు.వయసు తెచ్చిన ఆకర్షణ మనసును ముంచెత్తగా ఒక నయవంచకుడి వలలో పడిందామ్మాయి.

మైనర్ బాలికగా పెళ్లి కాకుండానే తల్లి అయి తన జీవితానికి భారీ మూల్యాన్ని చెల్లించుకుందా చిట్టితల్లి. మార్చి నెలలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు తన హాల్ టికెట్ కావాలంటూ అదే లూజ్ వైట్ షర్ట్, స్కర్ట్ తలకు మఫ్లర్ చుట్టుకొని వచ్చిన ఆ పిల్లని చూసి అంతా ఆశ్చర్య చకితులమయ్యాం. వెనక్కి తిరిగిన ఆ అమ్మాయి చుట్టూ కందిరీగల్లా రొదపెడుతున్న సమస్యలు, ఆలోచనల గొలుసులు నాలో.. నాలుగు క్షణాల సుఖాన్ని పొంది ఆ అమ్మాయిని వదిలేసినా ఆ మోసగాడికి ఈ వర్జినిటీ అనేది వర్తించదా?? ఆ అమ్మాయి శక్తినంతటినీ పరీక్షించేందుకై ప్రకృతి ప్రసాదించిన తల్లితనాన్ని శిక్షలా పొందిందా? లేదా ఆడ, మగ పెంపకంలోని తేడాలవల్ల ఆడపిల్లలు ఎదగాల్సిన ఎత్తుకు ఎదగలేక పోతున్నారా? లాంటి

ప్రశ్నలకు అర్థాల్ని వెదుక్కోవడంలో గట్టిగా.. ఇంకా గట్టిగా బిగుసుకుంటున్న ముళ్ళు నా ఎదలోపల.. లోలోతుల్లో..

★ ★ ★

ఎండాకాలం సెలవులు ముగిశాయి. ఎన్నో ఏళ్ల తర్వాత జరిగిన ట్రాన్స్ ఫర్స్ లో నాకు మళ్ళీ అదే మండల కేంద్రానికి దగ్గర్లోని పల్లెకు ట్రాన్స్ ఫర్ ఆర్డర్ అందింది.జాయిన్ అయ్యే మొదటిరోజు బస్ లో ప్రయాణం."టికెట్!టికెట్! మొరటుగా, కాస్త గరుకు గరుకుగా కరుకైన స్వరంతో ఆ అమ్మాయి టికెట్ ఇస్తూ నన్ను పలకరించింది."నేను శ్యామలను మేడం!"అంది.కళ్ళలో మిలియన్ డాలర్ల ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ నేను.."గుర్తుపట్టారా?స్రవంతి బ్యాచ్ "అంది నేను దిగేటపుడు నాకు మాత్రమే వినిపించే లో గొంతుకతో అభిమానం ఉట్టిపడేలా.. ఆత్మీయంగా చేయినొక్కి బై చెబుతున్న నన్ను దింపి బస్ వేగంగా మండల కేంద్రానికేసి పరుగులు తీసింది.

మరో వారం రోజుల తర్వాత పాఠశాల బాధ్యతలను నాకప్పజెప్తూ అర్జెంట్ లీవుపై వెళ్ళారు ప్రధానోపాధ్యాయులు. ఆరోజు స్కూల్ అసెంబ్లీ ముగిశాక నీలం రంగు ట్రాక్ ప్యాంట్, వైట్ టీషర్ట్ ,పెట్టుకున్న టోపీలో నుండి నిర్లక్ష్యంగా కదులుతున్న బిగించబడిన ఒత్తైన పోనీటెయిల్ ..చేతిలో ఓ లెటర్ తో ఆఫీస్ రూంలోకి అడుగుపెట్టిందా యువతి.కౌమారదశ విద్యార్థినులకు కరాటే ట్రైనర్ గా ఆ అమ్మాయి తీసుకొచ్చిన అపాయింట్ మెంట్ లెటర్ అది.అటు తిరిగి ఎవరితోనో పల్చని వేళ్ళను ఆడిస్తూ మాట్లాడుతున్న ఆ యువతి నా పలకరింపుతో కళ్ళను రెపరెపలాడించి "నేను మేడం కృష్ణవేణిని" అంది ఆహ్లాదంగా నవ్వుతూ..కాల ప్రవాహంలో ఎన్నెన్ని మార్పులు ?ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పేదరికాన్ని అధిగమించి వచ్చిన అవకాశాలను సద్వినియోగ పర్చుకుంటూ స్థిరపడిన నా విద్యార్థులైన నేటి యువతులను మనసులోనే అభినందించాను.

ఆ సాయంత్రం పూట అందిన సమాచారం ప్రకారం.. మరసటిరోజు లీవ్ పెట్టక తప్పలేదు నాకు. మండల కేంద్రంలో నిర్వహించుకుంటున్న మహిళా దినోత్సవం వేడుకల్లో భాగంగా నన్నూ వక్తగా మాట్లాడమన్న ఆ మీటింగ్ కు వెళ్లాను.

★ ★ ★

చుట్టూ మైక్ లు, రకరకాల వయసులోనున్న మహిళలు, స్ఫూర్తిదాయకమైన వారి స్వావలంబన అనుభవాలు, జీవితం పెట్టిన కఠిన విషమ పరీక్షలు, పారుతున్న తరాల కన్నీరు.. సుళ్ళు తిరిగిన ప్రవాహం.. అక్కడ.. మీటింగ్ చివర్లో తూర్పుగాలి విసిరికొట్టినట్లుగా ప్రవేశించిందామ్మాయి హాల్లోకి.. ఆలస్యానికి క్షమాపణ కోరుతున్న కళ్ళు.. పల్చని వేళ్ళతో మైక్ పట్టుకున్న ఆమె మాటలు వింటుంటే.. నాలో గుంపులు గుంపులుగా కదులుతున్న జ్ఞాపకాల మబ్బులు..! చిత్తు చిత్తుగా వాన నాలో ..!

★ ★ ★

ఆ అమ్మాయి స్రవంతి..! దారిద్ర్యం, ఆకలి, ఏమీ చేయలేని నిస్సహాయ తల్లి. ఆ పాక.. ఆ స్టేల్ లెస్ పరిసరాలు..ఆ భయంకరమైన బాధ.. పొరలు పొరలుగా రాలుతున్న జీవితపు ఒత్తిడి ఆమె మాటల్లో.. తనలా కాకుండా ఆడపిల్లలు ఆనందంగా తల్లులు కావాలనీ..

వయస్సు తెచ్చిన ఆకర్షణ లో తప్పటడుగులు వేస్తే నష్టపోయేది కేవలం ఆడపిల్లలే అని..ఆధునికత అంటూ నేటితరం లివ్ ఇన్ రిలేషన్స్ ఊబిలో కూరుకుపోవద్దని, సంప్రదాయం ముసుగులో తెలిసీ తెలియని వయసులో చేస్తున్న మైనర్ బాలికల వివాహాలు, తద్వారా ముక్కుపచ్చలారని వయసులో గర్భం దాల్చడం, ఎదిగీ ఎదగని పిండమంటూ ప్రాణాల మీదికి తెస్తున్న అబార్షన్లు, ప్రసూతి మరణాలు.. పరువు హత్యలంటూ వారిపై కిరాతకమైన దాడులు ..కారణం ఏదయినా మొదటగా సమిధలయ్యేది ఆడవారేనంటూ.. ఆడపిల్లలు ఎదుర్కొంటున్న రకరకాల శారీరక, మానసిక సమస్యలు.. వీటన్నిటిని ఛేదించాలంటే కేవలం చదువొక్కటే మార్గమని బలమైన దృఢ స్వరంతో చెబుతున్న నేటి కుంతి

ఇప్పుడు శక్తిమంతమైన ఈ స్రవంతినే అన్పించింది. ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రుల్ని ఏదో కోల్పోయినవారిగా చూసే నేటి సమాజం దృష్టి మారాలంటూ.. చదువొక్కటే జీవితంలోని చీకటిని తొలగించే 'వెలుగు దివ్వె' అని అంధకార బంధురమైన బతుకులలో 'చీకటి చివరన చిరుదీపం ఉంటుందని' గొప్ప నమ్మకాన్ని.. వ్యక్తిత్వ వికాసాన్ని కల్గింపజేసే జ్ఞాన దీపం విద్య మాత్రమే అని మెరిసే కళ్ళతో చెబుతూ..

తానూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీ పొందిన గ్రేస్, కష్టపడి సాధించుకున్న ఉద్యోగం.. అటు సామాజిక కార్యకర్తగా.. హక్కుల ఉద్యమకారిణిగా తన శక్తిమేర పనిచేస్తున్న నేపథ్యాన్ని వివరిస్తున్న ఆమె వ్యక్తిత్వ ఆత్మవికాసం.. హాలంతా పరుచుకొని.. దేశంలో పేరుకున్న చెత్తను, దుమ్మును ఊడ్చిపడేస్తున్న ఇనుప చీపుర్ల చప్పుడేదో కరకరమంటూ నా చెవులను హోరెత్తించసాగింది. ప్రకృతి ప్రసాదించిన ఆడతనాన్ని ఆహ్వానిస్తూ.. ఎవరినీ తోసిపుచ్చకుండా.. నేలమీదే నిలబడి.. ఎటో తేలిపోకుండా.. గొప్ప చైతన్యంతో "శిరసెత్తిన మానవి"ని ఎంతో ఉద్విగ్నంగా.. అభిమానంతో అపురూపంగా చూస్తూండిపోయాను..! నాకు తెలియకుండానే గొప్పగా రీచార్జ్ అవసాగాను.. స్ఫూర్తిని నింపుతున్న ఆమె మాటల స్రవంతికి.. హాల్లో మార్మోగుతున్న కరతాళధ్వనులు.. ఆకులపై రాలిన చినుకుల అలికిడికి నాలో.. గెలిచి నిలిచిన మనిషికి అభినందనలంటూ..!!

కవిత

# రంగులులేని నేల



**కడెం లక్ష్మీ ప్రశాంతి**
**ఫోన్ :7893399773**

ఏ అర్ధరాత్రో ఆకస్మాత్తుగా
మెలుకువ వస్తుంది
రంగుల మాయలో అంతర్ధానమైన
నావాళ్లంతా గుర్తొస్తారు
మరిక నిద్ర పట్టదు

పుడుతూనే గాయాల్ని మొయ్యడం
అభ్యసించినదాన్ని
అయినా ఎప్పటికప్పుడు
కొత్తగాయలు పచ్చిగా సలుపుతూనే ఉంటాయి
మా తాతాముత్తవ్వల బ్రతుకులూ
ఇలాంటి దిగుళ్ళతోనే వెళ్ళమారిపోయాయి
ఇప్పుడిక నావంతు

నిన్నటివరకూ కలిసిమెలిసి ఉన్న
స్నేహితులు ఉన్నట్టుండి పరాయివాళ్ళైపోయారు
కనిపిస్తే పక్కకుతప్పుకుపోతారు
వాళ్ళూ బాధితులే కదా!
నాలాగే లోలోపల కుమిలిపోతుంటారు

నా కళ్ళు నిరంతరం
ఒకే కలను స్వప్నిస్తుంటాయి
అందమైన భర్తో
విలాసవంతమైన జీవితమో కాదు
ఏ రంగులు చొరబడని లోకాన్ని
కలగంటుంటాయి

నిజమే!
మనమేవ్వరమూ ఊహించి
ఉండకపోవచ్చు కానీ
రంగులులేని నేలపై
శాంతిగా బ్రతకడం
ఎంత బాగుటుంది..

'సాహిత్య విమర్శ'

# ఈరోజుల్లో 'సాహిత్య విమర్శ'.. అంతంత మాత్రమేనా..!



ప్రొ. సి.హెచ్. సుశీలమ్మ
9849117879

ఈరోజుల్లో సాహిత్య విమర్శ చూస్తుంటే "భజన కార్యక్రమం" అనిపిస్తోంది. కవి/రచయిత వల్ల తమకు ఏదైనా ప్రయోజనం ఉన్నదని భావిస్తేనే ఆ రచనని చదువుతున్నారు. చదవడం అనేది ఒక మంచి అభిరుచిలా, సాహిత్యాభిమానంగా ఉండడం గతంలో విషయం అయిపోయింది. తను రాసిందే చదువుకుని, అదే గొప్ప అనుకుని మళ్ళీ మళ్ళీ రాయడం. సన్నిహితులకు ఫోన్లు చేసి తన తవిక నో, కథ లాంటి స్కెచ్ నో చదివి "అభినందనలు" ( మాత్రమే) రాయమని కోరతాడు. ఇక అతని రచన కంటే ఇతని అభినందన వ్యాసమే సుదీర్ఘం గా సాగుతుంది. ప్రాచీన సాహిత్యం చదవడం పక్కన పెడితే, ఆధునిక సాహిత్యం, కనీసం సమకాలీన రచనలు చదవడం, ఒక అవగాహన ఏర్పరచుకోవడం లేదు నేటి రచయితలు. కొందరు పదవీ విరమణ చేసిన తర్వాత ఏమీ తోచక సాహిత్య సృష్టి చేద్దామను కోవడం తప్పు లేదు. కానీ కాస్తంత అయినా "రీడింగ్" లేకుండా "రైటింగ్" లోకి దిగిపోతారు. ఒక భజన బృందాన్ని ఏర్పరచుకొని "పొగడ్త" కార్యక్రమం మొదలు పెడతారు. రచన పరిస్థితి ఇలా ఉంటే ఇక 'విమర్శ' గురించి ఆలోచిస్తే అయోమయంగా తోస్తోంది.

సాహిత్య ప్రక్రియల్లో "విమర్శ"కు ప్రత్యేక స్థానం ఉంది. సద్విమర్శ అంటే రాగద్వేషాలకు అతీతంగా కావ్యం లోని మంచి చెడ్డలను, గుణ దోషాలను విశ్లేషించి వివరించి చెప్పటం. రచయితపై ఇష్టాయిష్టాలను అనుసరించి విమర్శిస్తే అది సరైన విమర్శ కాబోదు. సాహిత్య విమర్శ రాసేటప్పుడు రచనపై మాత్రమే దృష్టిని కేంద్రీకరించాలి. నిష్పక్షపాతంగా ఉత్తమ సాహిత్యాన్ని, అదే విధంగా దిగజారిన సాహిత్య పోకడలను కూడా చెప్పాల్సి ఉంటుంది. దీనికి తగిన ఆత్మస్థైర్యం లేకపోవడం వల్లనే ఈ రోజుల్లో మంచి సాహిత్య విమర్శ అనేది రావడం లేదని చెప్పక తప్పదు. వ్యక్తిగత దూషణకు దిగుతారేమో, శత్రుత్వం కలుగుతుందేమో అన్న భీతిచే కొందరు విమర్శకులు మిన్న కుండి పోతున్నారు. మనకెందుకులే అని ప్రముఖ విమర్శకులు ఉదాసీనంగా ఉండటం వల్ల ఏదైనా రాసేయవచ్చు అన్న ధోరణి కవుల్లో, రచయితల్లో పెరిగిపోతున్నది. దానివల్ల రచన పల్చబడి పోయే ప్రమాదం ఉంది. ముఖ పుస్తకంలో ఎవరికి తోచింది వారు రాసేయడమే కాక, కొందరు సొంత యూట్యూబ్ ఛానల్స్ సృష్టించుకుని 'కాకమ్మ కబుర్లు' చెప్తున్నారు. పేరుకు ముందు "ప్రముఖ" అని తగిలించుకోవడానికి ఉబలాటపడుతున్నారు. అవార్డులు, పురస్కారాలు, సన్మానాలు మీద ఉన్న దృష్టి బాధ్యతాయుతమైన రచన చేయాలన్న నిబద్ధత మీద ఉండటం లేదు. ఇదే సమయంలో కొన్ని పత్రికలు తమ మనుగడ కోసం 'నెలకింత' అని వసూలు చేసి 'ప్రతిరోజూ' కవితలు ప్రచురించడానికి ఒప్పందం చేసుకుంటున్న విషయం తెలిసి విజ్ఞులు ఆశ్చర్యపోతున్నారు.

ఇక్కడే "సాహిత్య విమర్శ" ప్రధాన పాత్ర పోషించాలి. "సాహిత్య విమర్శకుడు" బాధ్యతాయుతంగా, తామరాకు మీద నీటి బిందువులా, స్వప్రయోజనమాశించకుండా, నిక్కచ్చిగా ఆయా రచనల్లోని మంచి చెడులను చెప్పాలి.

రచయిత కు పాఠకుడికి మధ్య సరియైన అవగాహనా వారధిని నిర్మించాలి.

విమర్శ అనేది నిష్కర్ష గా, నిర్మొహమాటంగా రాకపోతే "ఈరోజుల్లో సాహిత్య విమర్శ అంతంత మాత్రమే" అనుకోక తప్పదేమో!

మ్యూజింగ్స్

# హైద్రాబాదుతో అనుబంధం

స్వర్ణ కిలారి
ఫోన్ : 76749 48464





హైదరాబాద్ వచ్చి పాతికేళ్ళు దాటింది. మొదటిసారి పదేళ్ళప్పుడు ఒక్కదాన్నే రైలు ప్రయాణం చేసి నాంపల్లి స్టేషన్ లో దిగింది మొదలు ఇప్పటిదాకా ఎన్నెన్నో తీపి చేదు గురుతులు.

సగం జీవితం ఓల్డ్ సిటీ చుట్టూ అల్లుకుపోయింది. అమ్మతో వెళ్ళి మదీనా దగ్గర షాప్ లో క్రీమ్ కలర్ ఫ్లోరల్ షిఫాన్ బట్ట కొనుక్కుని చుడీదార్ కుట్టించుకుని మిగతా కజిన్స్ ముందు కొట్టిన స్టైల్.

ఆ తర్వాత చుడీ బజార్ ఇంచు ఇంచు నాకు తెలుసు అన్న గర్వంతో దోస్తులందర్నీ వెంటేసుకుని మాచింగ్ గాజులనీ, మగ్గం వర్కులనీ, అల్లికలు, దారాలతో చేసే రకరకాల ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్ నీ వెతుక్కుని కాళ్ళు నొప్పులు, నీరసం అనే మాట లేకుండా తిరిగిన రోజులు.

చార్మినార్ ఎక్కి స్వర్ణా అని పిలిస్తే పలుకుతా అనే జోక్ కూడా వేసేవారు మా అన్నయ్య, అంత పిచ్చిగా తిరిగేదాన్ని.

ఎంసెట్ ఎంట్రన్స్ రాసిన ఓల్డ్ సిటీ లోని అన్వరులూమ్ కాలేజ్ అంటే ఒక ఆరాధన. బాబాయి వెంట ఎందుకు వెళ్ళానో గుర్తులేదు కానీ, అదే పాత బస్తీ ఇరుకు సందుల గొందుల గుండా ఒక మౌల్వీ ని కలిశాం. ఆయన కాసేపు ఏవేవో మంత్రాలు చదివి, నా చేతిలో విభూది పెట్టారు. ఈసారి బాబాయిని అడగాలి కలిసినప్పుడు.

పాత ఇత్తడి సామాన్ల షాపు, ముత్యాల కోసం జాఫర్ భాయ్ ని మామూలుగా విసిగించలేదు.

'కోఠి'తో అనుభవం ఎంత చెప్పినా సరిపోదు. సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ చుట్టూ జల్లెడ పట్టినట్టే తిరిగేదాన్ని. ఇప్పటికీ ప్రతీ షాపూ నోటెడ్. చివర్లో దహీపూరి ఎలాగయితే కొసరి ఒకటి అడిగి మరీ వేయించుకుని తింటామో అలాగే, ఆ సందులో ఒక పిల్లాడు చేతులకు గ్లవ్స్ వేసుకుని శుభ్రంగా సర్వ్ చేసే పానీపూరి తినకుండా షాపింగ్ incomplete అనిపించేది.

పెళ్లయిన కొత్తలో ఫ్రెండ్స్ తో కలిసి ఎక్కిన గోల్కొండ కోట, పైన ఉన్న జగదాంబికా గుడి చుట్టూ ప్రదక్షిణాలు, ఎక్కిన అలసట మర్చిపోయేలా చేసే ప్రశాంతంగా వీచే విరుల వీవెనలు. అప్పుడు ఇంత సెల్ ఫోన్లు, సెల్ఫీలు, ఫోటోల పిచ్చి లేక చుట్టూ ఉన్న పరిసరాలను మైమరచిపోయి చూస్తూ మనసారా ఆస్వాదించే వాళ్ళం.

సైదాబాద్ కాలనీకి దగ్గరగా ఉన్న మార్కెట్ కి వెళ్ళి వారానికి సరిపడా కూరగాయలు బాగ్ నిండా మోసుకురావడం. మారేడ్ పల్లిలో, గాంధీ నగర్ లో ఉన్నపుడు కూడా మోండా మార్కెట్ కి వెళ్ళి మామిడికాయ పచ్చడికి కావలసిన ముక్కలు కొట్టించడం, దినుసులు తెచ్చుకోవడం చేస్తుండే.

ఆ తర్వాత మొదటి ఉద్యోగం ఎర్రమంజిల్ లోని పెద్ద బిల్డింగ్ లో ఒక సినీ హీరో మావగారి దగ్గర. ఆయనో ప్రొడ్యూసర్. గమ్మత్తుగా అమెరికాలో ఉన్న ఆయన మనవరాలికి సెలవులకి

ఇండియా వచ్చినపుడు కొన్నాళ్ళు తెలుగు కూడా నేర్పించాను.

ఒకసారి బస్ లో ఎక్కడికో వెళ్తూ పెద్ద స్టీల్ టిఫిన్ బాక్స్ మరిచిపోయాను. అది అమ్మకి ఎంతో ఇష్టమయిన బాక్స్. నేను, చెల్లి జీడిమెట్ల బస్ డిపో కి వెళ్ళి టికెట్ చూపించి తిరిగి రాబట్టుకోవడానికి ఏవేవో ప్రయత్నాలు చేశాం. అప్పటికి రాత్రి ఎనిమిదో, తొమ్మిదో అయింది. ఇప్పుడు గుర్తొస్తే నవ్వొస్తుంది స్టీల్ బాక్స్ కోసం ఇద్దరం ఆ రాత్రిపూట పడ్డ ఆరాటం.

వెస్ట్ మారేడ్ పల్లిలో అన్నయ్య ఇంట్లో ఉన్నప్పుడు పరిచయం అయిన సింధీ అమ్మాయి ప్రేమ కథ వినడం (నాకంటే 4,5 యేళ్లు చిన్నది)ఆమె దగ్గర నేర్చుకున్న చేపల ఇగురు, ఇల్లంతా రంగురంగుల వాల్ పేపర్స్, అందమయిన పెయింటింగ్స్, అద్భుతమయిన శిల్పకళా నైపుణ్యం కలిగిన మినియేచర్ బొమ్మలు ఇప్పటికీ గుర్తు వస్తుంటాయి.

ఈస్ట్ మారేడ్ పల్లిలో ఉండే పక్కింటి అమ్మాయి, వాళ్ళ అమ్మ అమర్నాథ్ యాత్ర నుండి వస్తూ దోపిడీ దొంగల ఎటాక్ లో ఒక లోయలో పడిపోయి మూడు రోజుల తర్వాత బ్రతికి బయటపడి క్షేమంగా తిరిగి దెబ్బలతో ఇంటికి రావడం, అదొక పెద్ద ట్రామా కొన్నాళ్ళు.

ఆ తర్వాత నానమ్మ చివరి రోజు, ఆక్సిడెంట్ లో తీవ్రంగా గాయపడ్డ బాబాయి ఆఖరిరోజు కూడా ఉస్మానియా ఆసుపత్రిలోనే అవడం, ఎం. ఎన్. జే ఆసుపత్రి నుండి చివరికి అమ్మను కూడా అదే ఆసుపత్రికి పంపడం ఎన్నటికీ మర్చిపోలేని చేదు జ్ఞాపకాలు.

ఆ చివరి నుండి ఈ చివరి వరకూ సాగుతున్న ప్రయాణంలో అన్నీ మిళితమైన అనుభవాలు నావి, ఇవేమీ పట్టని హైదరాబాద్ మాత్రం నన్ను ప్రేమగా నిమురుతూ ఆలింగనం చేసుకుంది. నాకేం తక్కువ Being a Hyderabadiఅని నేనూ

కవిత

# సినాప్సెస్



**రోహిణి వంజారి**
**9000594630**

నీ జన్మస్థానం ఎక్కడో ఎరుకైననాడు
విశ్వపుత్రుడవవుతావు నువ్వు
ఆకులలమలతో ఒంటిని కప్పుకున్న
రాతిగుహల నుంచి బయటపడి
చాల కాలమైంది నువ్వు
కాళ్ళు చేతులు చెవులు కళ్ళు
లాంటి రెండు సాధారణ అవయవాలే
మా దేహాల్లో ఇమిడి ఉన్న రెండు రొమ్ములు
ఎదురుపడిన స్త్రీ రొమ్ములను చూసిన నీకు
కామ వికారపు అవకరం కలిగిందంటే
నీ బుద్ధి పాతాళపు బురదలో కూరుకుపోయినట్లే
ఇక నీ భావికి నువ్వు బావి తొవ్వుకున్నట్లే
హిజాబ్ లను నడిరోడ్డు మీద తగులబెట్టే కాలం ఇది
బానిస పంజరాలను బద్దలుకొట్టి
సమాభివృద్ధికి సమాయత్తమైన కాలం ఇది
నీలో ఇంకా ఈ దృష్టి అవకరం
విషప్పురుగు కాటుకన్నా అతి ప్రమాదం
సత్వర చికిత్స కావాలి ఇక నీ ఒంటినిండా
కామపు రసిని కార్చుతున్ననీ జ్ఞానేంద్రియాలకు
మదపు కుళ్లుతో దుర్గంధం వెదజల్లుతున్న
నీ నరాలను సెరిబ్రమ్ చేరకుండా కత్తిరించాలి
నీ మెదడులోని దుర్మార్గపు సినాప్సెస్ ని
ఏ రాతి బండకేసి బద్దలు కొట్టుకుంటావో
నీ విజ్ఞతకే వదులుతున్నాం
గుండెలపై చున్నీ కప్పుకోవాల్సింది మేము కాదు
నీ మనోనేత్రాన్ని కప్పియున్న కామపు శుక్లాలను
తొలగించుకోవాల్సింది నువ్వే ఇక.

# చరిత్రలో స్త్రీ అస్తిత్వం స్త్రీ వాది రుక్మాబాయి



సేకరణ : జ్వలిత
ఫోన్ : 99891 98943



రుక్మాబాయి ( Rukhmabai ) (నవంబర్ 22, 1864 – సెప్టెంబర్ 25, 1955) బ్రిటీష్ ఇండియాలో తొలి మహిళా వైద్యులలో ఒకరు. ఫెమినిస్టు. కాదంబినీ గంగూలీ, ఆనందీబాయి జోషిలు 1886లో వైద్యశాస్త్రంలో డిగ్రీ పొందిన తొలి భారతీయ మహిళలు కాగా కాదంబినీ గంగూలీ మాత్రం ప్రాక్టీసు చేపట్టింది. తద్వారా రుక్మాబాయి వైద్యవృత్తిని అవలంబించిన రెండవ మహిళగా పేరు పొందింది. స్త్రీ జనోద్ధరణకు, లింగ సమానత్వానికి కృషి చేసింది.

1884 మరియు 1888 మధ్య కాలంలో బాల్య వధువుగా తన వివాహానికి సంబంధించిన ఒక ల్యాండ్‌మార్క్ లీగల్ కేసులో ప్రమేయంతో ఆమె బాగా పేరు పొందింది. బ్రిటీష్ పాలనలో ఉన్న భారతదేశం మరియు ఇంగ్లండ్ రెండింటిలోనూ చట్టం, సంప్రదాయం మధ్య , సామాజిక సంస్కరణ, సంప్రదాయవాదం మధ్య మరియు స్త్రీవాదం అంశాలలో ఈ కేసు చర్చను లేవనెత్తింది. ఇది చివరికి చారిత్రాత్మకమైన "ఏజ్ ఆఫ్ కన్సెంట్ చట్టం 1891" (Age of Consent Act ) ఏర్పడటానికి రుక్మాబాయి కేసు దోహదపడింది.

**జీవిత విశేషాలు**

ఈమె మహారాష్ట్రకు చెందిన ఒక వడ్రంగి కుటుంబంలో జనార్ధన్ పాండురంగ్, జయంతిబాయి దంపతులకు జన్మించింది. రుక్మాబాయికి ఎనిమిదేళ్ల వయసులో తండ్రి మరణించాడు. జయంతి బాయి తన ఆస్తినంతటిని రుక్మాబాయి పేరుమీదకు బదలాయించింది. ఆమెకు 11 యేళ్ల వయసులో తల్లి ఆమెను 19 యేళ్ల దాదాజి భికాజీకి ఇచ్చి వివాహం జరిపించింది. జయంతిబాయి డా.సఖారాం అర్జున్ అనే అతడిని వివాహం చేసుకుంది. కానీ రుక్మాబాయి వారితోపాటు జీవిస్తూ ఫ్రీ మిషన్ చర్చ్ లైబ్రరీ పుస్తకాలను చదువుతూ విద్యను గడించింది. రుక్మాబాయి, ఆమె తల్లి ప్రార్థనా సమాజం, ఆర్య మహిళా సమాజం సభలకు వారం వారం హాజరయ్యేవారు. దాదాజి తల్లి మరణించిన తర్వాత అతడు తన మేనమామ వద్ద పెరిగాడు. అక్కడ వాతావరణం కారణంగా దాదాజీ సోమరిపోతుగా, దుష్టుడిగా తయారయ్యాడు. రుక్మాబాయి తన 12వ యేట తన భర్త దాదాజీ వద్దకు వెళ్లడానికి తిరస్కరించింది. ఆమె పెంపుడు తండ్రి డా.సఖారాం అర్జున్ ఆమె నిర్ణయానికి

మద్దతుగా నిలిచాడు. దానితో దాదాజీ కోర్టును ఆశ్రయించాడు. పేనీ, గిల్బర్ట్, సయానీ మొదలైన వకీళ్ల ద్వారా రుక్మాబాయి దాదాజీతో కలిసి జీవించక పోవడానికి కల కారణాలను కోర్టుకు తెలిపింది.

**కోర్టు కేసులు అనంతర పరిణామాలు**

"వివాహ హక్కుల పునర్వస్థితి" ని కోరుతూ కోర్టులో దాదాజీ భికాజీ వేసిన భికాజి వర్సస్ రుక్మాబాయి కేసుపై 1885లో రాబర్ట్ హిల్ పిన్హే అనే న్యాయమూర్తి తీర్పు వెలువరిస్తూ వివాహ హక్కులపై పూర్వపు ఇంగ్లీషు తీర్పులు ఇక్కడ వర్తించవని, ఎందుకంటే అవి పరిణతి చెందిన వయోజనులకు ఉద్దేశించినవని, ప్రస్తుత కేసులో రుక్మాబాయికి నిస్సహాయ స్థితిలో బాల్యంలో వివాహం అయ్యిందనీ, ఇటువంటి కేసులపై ఇంతకు ముందు హిందూ చట్టాలలో తీర్పు వెలువడలేదని పేర్కొంటూ కేసును కొట్టివేశాడు. 1886లో ఈ కేసు పునర్విచారణకు వచ్చినప్పుడు జె.డి.ఇన్వెరారిటి, తెలాంగ్ మొదలైన లాయర్లు రుక్మాబాయి పక్షాన వాదించారు. ఈ కేసుపై సమాజంలో రుక్మాబాయిని సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ అనేక చర్చలు జరిగాయి. కొందరు హిందువులు చట్టం హిందూ ఆచార వ్యవహారాలను గౌరవించడం లేదని ఆందోళనకు దిగారు. పిన్హే తీర్పుపై నేటివ్ ఒపీనియన్, మరాఠా అనే పత్రికలు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తపరుస్తూ దాదాజీ పక్షాన నిలిచాయి. ఈ సమయంలోనే టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఒక భారతీయ మహిళ అనే కలం పేరుతో వరుసగా రుక్మాబాయి వ్రాసిన వ్యాసాలు ప్రజలలో కదలికను తెచ్చింది. ఈ కేసులో 1887, మార్చి 4వ తేదీన జస్టీస్ ఫరాన్ తీర్పు చెబుతూ రుక్మాబాయిని భర్తతో కలిసి ఉండాలనిలేదా 6నెలలు కారాగారంలో ఉండాలని ఆదేశించాడు. రుక్మాబాయి ధైర్యంగా ఈ తీర్పును అంగీకరించేకంటే గరిష్టంగా శిక్షను అనుభవించడానికి సిద్ధంగా ఉన్నానని బదులు ఇచ్చింది. బాలగంగాధర్ తిలక్ తన "కేసరి" పత్రికలో రుక్మాబాయి తిరుగుబాటు ఇంగ్లీషు చదువుల ప్రభావమని పేర్కొన్నాడు. హిందూమతం ప్రమాదంలో పడిపోయిందని వ్యాఖ్యానించాడు. మాక్స్ ముల్లర్ ఈ విషయంలో తన అభిప్రాయం చెప్తూ ఈ సమస్యకు న్యాయపరమైన తీర్పులు సమాధానం కాజాలవని, రుక్మాబాయి విద్యాబుద్ధులే ఆమెను ఆమె కోరిన రీతిలో తీర్పు చెప్పే న్యాయాధికారిగా మారుస్తుందని అభిప్రాయపడ్డాడు.

1888లో దాదాజీతో 2000 రూపాయలు చెల్లించి తెగతెంపులు చేసుకునే విధంగా అంగీకారం కుదిరింది. ఆ తరువాత రుక్మాబాయి ఇంగ్లాండులో చదువుకోవడానికి బయలుదేరింది.

**వైద్యవృత్తి**

కామా హాస్పటల్‌కు చెందిన డా.ఎడిత్ పెచె రుక్మాబాయిని చదువుకోవడానికి ప్రోత్సహించాడు. కావలసిన ధనాన్ని సమకూర్చాడు.ఈమె 1889లో ఇంగ్లాండు వెళ్లి అక్కడి "లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఫర్ వుమెన్"లో విద్యనభ్యసించింది. 1894 లో డాక్టర్ ఆఫ్ మెడిసిన్ డిగ్రీ పొందారు. రాయల్ ఫ్రీ హాస్పిటల్లో కూడా విద్యను అభ్యసించింది. అక్కడ ఈమె చదువుకు పలువురు ఆర్థికంగా అండగా నిలిచారు.1895 లో ఇండియాకు తిరిగి వచ్చి సూరత్ లోని మహిళా ఆసుపత్రిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ గా చేరారు. 1918లో ఈమె వుమెన్స్ మెడికల్ సర్వీస్‌లో చేరే అవకాశాన్ని తిరస్కరించి రాజ్‌కోట్ లోని స్టేట్ హాస్పిటల్ ఫర్ వుమెన్‌లో చేరింది. ఈమె ముఖ్య వైద్య అధికారిణిగా 35 సంవత్సరాలు పని చేసి బొంబాయిలో 1929 లో పదవీవిరమణ చేసింది. రాజ్ కోట్ లో రెడ్ క్రాస్ సొసైటీని స్థాపించింది. తరువాత కూడా ఈమె సంఘసంస్కరణను కొనసాగించింది. "పరదా, దాని నిషేదానికి ఆవశ్యకత" అనే కరపత్రాన్ని ప్రచురించింది. యువ వితంతువులు భారతీయ సమాజానికి చురుకుగా సహకరించే అవకాశం కోల్పోయారని ఆమె వాదించింది.

**విశేషాలు**

2016లో ఈమె జీవితచరిత్ర ఆధారంగా "రుక్మాబాయి భీమరావ్ రావత్" అనే మరాఠీ సినిమా వెలువడింది. అనంత్ మహదేవన్ ఈ సినిమా దర్శకుడు కాగా తనిషా చటర్జీ ముఖ్యభూమికను నిర్వహించింది.

2017 నవంబర్ 22 న గూగుల్ రుక్మాబాయి 153వ జయంతి సందర్భంగా ఆమెను గూగుల్ డూడుల్ ద్వారా స్మరించుకుంది.


ఆమె ఊపిరితిత్తుల క్యాన్సర్ తో తన 90 వ ఏట 25 సెప్టెంబర్ 1955 న మరణించింది.

విశ్లేషణ

# రేలపూలు కథాసంపుటి - విశ్లేషణ



డా.ఎం.దేవేంద్ర
సెలెం: 9490682457




సమ్మెట ఉమాదేవి రాసిన 'రేలపూలు' తండావాసుల కథలు 2015 లో వెలువరించారు. అమ్మకథలు, జమ్మిపూలు, మా పిల్లల ముచ్చట్లు వీరి ఇతర రచనలు. ఉమాదేవి ఒక ఉపాధ్యాయురాలిగా గిరిజన తండాలలో పనిచేశారు. అందుకని అక్కడి మనుషులను, అక్కడి చెట్లను, పూలను ప్రేమించారు. అంతటితో అనుభూతి చెంది ఊరుకోకుండా వారి జీవితాలను నిశిత పరిశీలన చేసి, బంజార కథలను రాశారు. రేలపూలు కథా సంపుటిలో శిల్పపరంగా ప్రతికథ ఒక కళాఖండమే అని చెప్పవచ్చు. వస్తువులోను ఈ కథలు ప్రాధాన్యతను కలిగి వున్నాయి.

గిరిజన నేపథ్యం కలిగిన రచయితలు, వారి జీవితాలను కథా సాహిత్యంలోకి తీసుకొస్తున్నవారు తక్కువనే చెప్పాలి. అందుకు కారణాలు అనేకం ఉన్నాయి. ఒకటి అక్షరాస్యత లేకపోవడం, భాష వేరుగా ఉండటం, వారి భాషకు లిపిలేకపోవడం వల్ల గిరిజన రచయితలు చాలా ఆలస్యంగా సాహిత్యంలోకి అడుగుపెట్టారు.

కథాసాహిత్యంలో గిరిజనులుగా ఉండి కథలు రాసిన, రాస్తున్న వాళ్ళలో పద్దం అనసూయ రమేష్ కార్తిక్ నాయక్, ఆచార్య సూర్యధనంజయ్, సిల్మానాయక్ మొదలైన వాళ్ళున్నారు. గిరిజనేతరులైన రచయితలను తీసుకుంటే తొలివెలుగు గిరిజన 'సుగాలికుటుంబం' ను చింతా దీక్షితులు రాశారు. ఆ తర్వాత కాలంలో అల్లం రాజయ్య 'ఇప్పపూలు', బి.ఎస్.రాములు 'అడవిలో వెన్నెల', శిరంశెట్టి కాంతారావు 'బిగిసిన పిడికిల్లు', జాతశ్రీ 'పెరగాలి' కథలు గిరిజన ఇతివృత్తంలో వచ్చాయి.

గిరిజనేతరులు రాసిన వాటిలో పూర్తిగా బంజారాల ఇతివృత్తంతో సమగ్రంగా వచ్చిన కథాసంపుటి మాత్రం సమ్మెట ఉమాదేవి రాసిన 'రేలపూలు' కథలు అని చెప్పవచ్చు. ఇందులో ఉన్న 17 కథలలో కూడా తండా కేంద్రబిందువుగా కనిపిస్తుంది. ప్రతికథ కూడ అడవిపూల వంటి స్వచ్ఛగాలి పరిమళాన్ని పాఠకుడి హృదయానికి చేరవేస్తుంది.



**సమ్మెట ఉమాదేవి**

అనాదిగా సమాజానికి దూరంగా నివసించే ప్రజలు గిరిజనులు. స్వాతంత్ర్యం వచ్చాక నాగరిక సమాజంతో కలిసి జీవించడం అనివార్యమవుతూ వచ్చింది. ఒకప్పుడు వృత్తులు

కేంద్రంగా నడిచిన భారతీయ సమాజం కాలగమనంలో మార్పుచెందింది. వృత్తులకు ఆదరణ తగ్గుతున్న క్రమంలో బహుజనులు చదువును ఆధారం చేసుకొని అభివృద్ధి పథంలోకి వస్తున్నారు. ఈ పరిణామం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ క్రమంలో గిరిజనులు సైతం చదువును ఆలస్యంగానైనా కొనసాగిస్తూ వస్తున్నారు. రేలపూలు కథలు తండాకు, గ్రామానికి, తండాకు, నగరానికి మధ్య అంతరం తొలగాలనే ఉద్దేశ్యంతో రాశారు. తండాలో ఉన్న పేదరికం, సౌకర్యాలు లేకపోవడం, ప్రకృతి విపత్తులు ఇట్లా అనేక సమస్యలను కథల ద్వారా ప్రపంచానికి తెలియజేశారు.

బంజారాల్లో కూడా ఉపశాఖలుంటాయి. ఒకటి మధుర బంజారాలు. వీరు పాలుపెరుగు అమ్ముకుంటూ జీవిస్తారు. రెండవ వారు గోర్ బంజారాలు. వీరు ముఖ్యంగా వ్యవసాయపు పనులు, సీతాఫలాలు, కట్టెలు అమ్మడం మొదలైన పనులు చేస్తారు 'మూడవ వారు థాడీబార్ బంజారాలు. వీళ్ళు సాధువులు. తండాల్లో పండగలప్పుడు వచ్చి పూజలు చేసి, పురాణాలు వల్లెవేస్తారు.

ఆదివాసీలు అరణ్యాల లోపల ఆవాసాలను ఏర్పరుచుకుంటే బంజారాలు పర్వతపు అంచుల్లో నివాసాలను ఏర్పరుచుకుంటారు. గ్రామాలకు దగ్గరగా కూడా వీరి ఆవాసాలు ఉంటాయి.

బంజారాల అస్తిత్వాన్ని తెలియజేసే కథ 'గిరిజన దీపం' గిరి అంటే కొండ, కాన అంటే అడవి. దీపం అంట వెలుగు. శీర్షకు తగ్గట్టు ఈ కథ గొప్ప సందేశాన్నిచ్చిన కథ. లచ్చా తండాలో పుట్టిపెరిగిన జాలా చిననప్పటి నుండే తండాకు, గ్రామాలకు ఉన్న వ్యత్యాసాన్ని గమనిస్తుంటుంది. తండ్రి భూక్యా నాయక్ తో "తండాలో రోడ్లు లేవు, కత్రం బండ్లే గాని బస్సులు, ఆటోలు లేవు. రోగమొస్తే రామ్ కాకా ఇచ్చే పసర్లే గాని డాక్టర్లు లేరు, నాలుగు మైళ్ళు నడిసిపోతే పోచారంల చిన్నబడి, ఇక పెద్దబడికి పోయి సదవాల్నంటే ఊరు బట్టుకొని పోవాలే" అంటూ జాలా చిన్న బుర్రలో ఎన్నో ప్రశ్నలు, నగరంతో పోల్చుకుంటే గ్రామంలో సౌకర్యాలు తక్కువగా వుంటాయి. గ్రామంతో పోల్చుకుంటే తండాలో సౌకర్యాలు మరింత తక్కువగా ఉంటాయి కాబట్టి విద్యావంతులుగా వున్న బంజారాలు నగరాల్లోనే ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడుతారు.

కాని కథలోని జాలా అట్లా కాదు. తను చదువుకొని ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎదుగుతుంది. జాలా భర్త నగరానికి దగ్గరలో ఉన్న పాఠశాలను సెలక్ట్ చేసుకోమంటాడు. కాని భర్త చెప్పినట్లుగా జాలా అట్లా చేయలేదు. తన పోస్టింగ్ను తండాలోనే వేయించుకుంటుంది. కథలో జాలా చేతికి ఉన్న పచ్చబొట్టును చూస్తే లంబాడీలని తెలిసిపోతుందని ఆమె భర్త ప్లాస్టిక్ సర్జరీ చేయిస్తానంటాడు. జాలా అందుకు ఒప్పుకోదు. రచయిత్రి రెండు విరుద్ధమైన పాత్రలను సృష్టించి పాఠకులకు ఆలోచన రేకెత్తిస్తారు. జాలా భర్త తండా సంస్కృతికి దూరంగా పారిపోవాలనుకుంటాడు. కాని జాలా తను ఎదిగిన తరువాత తండా అభివృద్ధికి అంకితమవ్వాలనుకుంటుంది. ఆర్థికంగా ఎదిగినవాళ్ళు వారి వారి మూలాల్లోకి వెళ్ళి మిగిలినవాళ్ళకు అండగా ఉంటే ఈ సమాజం తొందరగా అభివృద్ధి పథంలోకి వెళ్తుదన్న సందేశాన్ని ఈ కథ ఇస్తుంది.

సమ్మెట ఉమాదేవి తండాల్లో పనిచేస్తున్నప్పుడు బస్సు సౌకర్యం లేని కారణంగా తండాలో నివాసముండాల్సి వచ్చింది. అందుకని దగ్గర్నుండి వారి సమస్యలను చూస్తూ వచ్చారు. అస్తిత్వం, బిజిలి, జైజై గణేశ, వాన, వారధి, ఆశలు కథల్లో విద్యార్థులు, పాఠశాల నేపథ్యం కనిపిస్తుంది.

'అస్తిత్వం' కథ నాగరిక సమాజంలో బంజారాలు కలిసే క్రమంలో వారి పేర్లు మార్చుకోవడం వల్ల ఎన్ని సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందో తెలియజేస్తుంది. బడిలో బంజారాల పిల్లలు చేరేటప్పుడు అక్కడి ఉపాధ్యాయులు అన్నలాల్ కు బదులు అనిల్ అని, పోలిపేరును ప్రవల్లిక అని, సాల్కి పేరును శైలజ అని, హర్యాలాల్కు బదులు హరీష్ అని ఇట్లా మార్చి రాయడం వల్ల తల్లిదండ్రులు ఇంట్లో పిలిచే పేరుతో ఆధార్ కార్డ్ ఉండటం వల్ల వారికి కొత్త సమస్యలు తలెత్తుతాయి. పైగా వారు ఇంట్లో మాట్లాడే భాష ఒకటి, స్కూల్లో చదువుకునే భాష మరొకటి. అందుకని వారు చదువు నేర్చుకోవడానికి చాలా శ్రమించాల్సి వస్తుంది. టీచర్లు కూడా భాష నేర్పించుటకు ఎక్కువ శ్రద్ధ చూపించాల్సి ఉంటుంది.

'బిజిలి' కథ చక్కటి ఎత్తుగడలో ప్రారంభమౌతుంది. పాఠశాలకు వెళ్ళి చదువుకునే సాల్కికి సాయంత్రమైతే కరెంటు ఉండదు. నాయకులు ఎన్నికలప్పుడు ఓట్లకోసం వస్తారు తప్ప, ఉత్తప్పుడు తండాలో ఉన్న సమస్యలేమున్నాయి అని ఆలోచించే వాళ్లు తక్కువ. కథలో తండావాసులు తమ ప్రాంతం నుండి పోతున్న కరెంటు తీగెలకు దొంగతనంగా తీగెలు తగిలించుకొని

రాత్రిపూట బల్బులు వెల్గించుకుంటారు. కథలో సాల్కికి స్కూల్ హోంవర్క్ చేసుకుందామంటే గుడ్డిదీపం కింద అక్షరాలు సరిగా కనపడవు. స్కూల్లో కంప్యూటర్ నేర్చుకోవాలన్నా కరెంట్ ఉండదు. ఇప్పటికి కరెంటు సౌకర్యం లేని మారుమూల తండాలున్నాయని కథ చదివితే అర్థమౌతుంది. 'వాన' కథలో బడిలో చదువుకుంటున్న పిల్లలు, పగలు వర్షం పడటం వలన తిరిగి ఇంటికి చేరుకోలేని పరిస్థితిని చిత్రించింది. అంటే అన్ని తండాల్లో ఇలాంటి పరిస్థితి ఉందని కాదుకాని కొండకోనల్లో ఆవాసాలు ఏర్పరుచుకున్న గిరిజనులకు మాత్రం ప్రకృతి విపత్తులు పొంచి ఉంటాయి.

'జైజై గణేశ' కథలో వినాయక చవివి సందర్భంగా తండాలోని పిల్లలు భారీ వినాయకున్ని పెట్టి పూజించాలని కష్టపడి చందాలు వసూలు చేస్తారు. తండాకు వైద్య సేవలు అందించడానికి వచ్చిన ఎ.ఎన్.ఎమ్ రజితక్క పిల్లలు అడిగినంత చందా రాసిస్తుంది. డబ్బు సమకూరినంక గణేషున్ని కొనడానికి నగరానికి వెళ్తారు. దారి మధ్యలో రజితక్కకు యాక్సిడెంట్ అవ్వడంతో తమ దగ్గరున్న డబ్బులను ఆసుపత్రిలో ఖర్చుపెడతారు. అందుకని చిట్టిమట్టి వినాయకున్ని పెట్టి పూజచేస్తారు. అంటే ఈ కథ మానవత్వం అన్నిటికన్నా గొప్పది అన్న సందేశాన్ని ఇస్తుంది.

'కేస్లా' కథ గిరిజనుల్లో ఉన్న మూఢవిశ్వాసాలను తెలియజేసే కథ. కేస్లా కోక్యా తండాలో పుట్టి, పెరిగి నగరానికి వెళ్ళి ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి. సెలవుల్లో తండాకు వెళ్ళినప్పుడు తనతోపాటు చిన్నప్పుడు చదువుకున్న స్నేహితుల గురించి ఆరా తీస్తాడు. నక్సలైట్లన్న అనుమానంతో జైల్లో ఉన్నారని తెలుసుకుంటాడు. మారిన తండా పరిస్థితులు చూసి చలించిపోతాడు. ఆ సమయంలో ఔషదమొక్కలపై పరిశోధన చేయడానికి కేస్లా మిత్రబృందం తండాకు రావాలనుకుంటారు. “మా వాళ్ళు కొత్తవారిని ఎవ్వరిని నమ్మరు. మీరు ఔషద మొక్కలపై పరిశోధన చేస్తున్న విషయం వారికి చెప్పినా అర్థం కాదు” అన్నా కూడా అతడి స్నేహితులు తండాకు చేరుకుంటారు. వచ్చిన కొద్ది రోజుల్లోనే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటారు. తండాలో ఒకరోజు లింగానాయక్కు పూనకం వచ్చి కేస్లా వల్ల తండా నాశనమౌతుందని చెప్పడంతో తండా ప్రజలందరు ఏకమై కేస్లాను చంపడానికి సిద్ధమై కిరోసిన్ పోసి, నిప్పట్టించాలని చూస్తారు. కేస్లా అడివిలోకి పారిపోయి స్నేహితుల సహాయంతో రక్షించబడతాడు. కాని అప్పటికి కేస్లా మొఖం కాలిపోవడంతో రూపం వికృతంగా మారుతుంది. అయినా కూడా కేస్లా ప్లాస్టిక్ సర్జరీ చేయించుకొని తండా ప్రజల బాగుకోసం నిరంతరం తపిస్తుంటాడు.

'కమ్లీ' కథ కూడా చేతబడులు ఉంటాయన్న బంజారాల నమ్మకాన్ని తెలియజేస్తుంది. తండాలో ఆడపిల్లలు పుడితే గొంతులో వడ్ల గింజలు వేసి చంపుతున్న వాస్తవసంఘటనలు మనం ఎన్నో వింటూనే ఉన్నాం. ప్రభుత్వం కూడా ఆడపిల్లలను చంపొద్దని ఉయ్యాల పథకాన్ని ప్రవేశపెట్టింది. కథలో కమికి ఇద్దరు ఆడపిల్లలు. అందుకని అత్త మాన్సిబాయి, కోడలుని రాచిరంపాన పెట్టేది. భార్యభర్తలు కూలీకి పోతే అత్త ఎక్కడ తన రెండో బిడ్డను మాయం జేస్తుందోనన్న భయంతో కూలిపనికి కూడా వెళ్ళడం మానేస్తుంది. భర్త మాత్రం కమ్లీని ఎంతో ప్రేమగా చూసుకుంటాడు. అయినప్పటికీ కమ్లీ బిడ్డ ఎక్కడ దూరమౌతుందోనన్న బెంగతో అనారోగ్యానికి గురవుతుంది. తను తలచినట్టుగానే అత్త బిడ్డను దూరం చేస్తుంది. మళ్ళీ వెతికి బిడ్డను తెచ్చుకుంటుంది.

'చాందీ' కథలో చాందిది వినోభా తండా, తన తల్లి కూలి పనిచేసి పిల్లలను పెంచుతుంది. తండ్రి తాగుబోతు. సంసారాన్ని పట్టించుకోడు. తల్లి ఒక్కతే కష్టం చేయలేక అనారోగ్యం పాలై చచ్చిపోతుంది. అందుకని చాందీ చిన్నవయస్సులోనే కూలీపనిలో చేరాల్సివస్తుంది. బంజారాల్లో ఎక్కువగా బాలకార్మికులుగా ఉన్న పరిస్థితి. 'పాలబుగ్గల చిన్నిరైతా' కథ కూడా బాలకార్మిక వ్యవస్థను చిత్రించింది. కథలో దేవాకు అందరిపిల్లల్లాగా తనకు బడికిపోవాలని ఉంటుంది. కాని తల్లి దండ్రులు పత్తి ఏరడానికి వేరే కూలీలు దొరకక కొడుకును బడి మాన్పించి పత్తి ఏరడానికి తీసుకెళ్తారు.

'దివిలి' కథలో ప్రకృతిలాగానే అందమైనది దివిలి. లోకపు పోకడ తెలియని అమాయకత్వపు బాలిక. తండాలో పుట్టి పెరిగిన దివిలికి చేమలను, చెట్లను, పంచభూతాలను ప్రేమించడం తెలుసుకుని మనుషుల లోతు తెలుసుకోలేకపోతుంది. ఆ వూరి సర్పంచ్ చేత హత్యాచారానికి గురై ఆత్మహత్య చేసుకుంటుంది.

ఈ విధంగా రేలపూలు కథల నిండా గిరిజన తండా జీవితం పరిమళిస్తూ ఉంటుంది. బంజారాల గురించి ఎన్నో విషయాలు తెలిసివస్తాయి.

యాత్రారచన

# నా నేపాల్ యాత్ర




సుమతి చురుకంటి

9866344106





నేపాల్ టూర్ 21-11. 2023

International federation of Asian & Western Pacific contractors' Associations(I-FAWPCA)

ఇఫాకా

రెండు నెలలుగా చిన్న సందడి . నేపాల్ లో బిల్డర్స్ & కాంట్రాక్టర్స్ మీట్ వుంది . ప్రతి రెండు సంవత్సరాలకు ఒక దేశంలో నిర్వహిస్తారు. మలేషియా, మాల్దీవ్స్ కి కూడా వెళ్ళాము గతంలో '

ఆ రోజు రానే వచ్చింది. వుదయం 10.30 కి మొదలైన ప్రయాణం ఢిల్లీ అటు నుండి సాయంత్రం ఖాట్మండ్ చేరడంతో ముగిసింది. దాదాపు 60 మంది పైన వున్నాం తెలంగాణ నుండి . రెండు బస్సులు మా కోసం పెట్టారు. హోటల్ " రాడిసన్" లో మాకు రూంస్ ఇచ్చారు. ఎదురుగా వున్న మరో రాడిసన్ లో డిన్నర్ చేసి వచ్చి రూంకి చేరాం.

2 వ రోజు

ఉదయం 7 లోపు టిఫిన్ చేసి అంతా రెండు బస్సుల్లో ఎక్కి బోధి టెంపుల్ కెళ్ళాం . గుడి చుట్టూ ప్రహరీ గోడలో చేతితో తిప్పే గంట లాంటి చక్రాలు వున్నాయి. ప్రతి వాళ్ళు చేతులతో తిప్పుతూ నడుస్తున్నారు. లోన పెద్దగా ఎత్తైన బుద్ధ విగ్రహం వుంది. ముందు కొందరు కూర్చుని మెడిటేషన్ చేస్తున్నారు. మాట్లాడుతున్న మాలో కొందరిని నిశ్శబ్దంగా వుండమని చెప్పారు. ఆ ప్రక్కనే మరో బుద్ధ టెంపుల్ చూసాం . చాలా పెద్ద తిప్పే గంట వుంది. స్వయం భూనాథ్ టెంపుల్ – కోతులు చాలా వున్నాయక్కడ మంకీ టెంపుల్ అని కూడా అంటారట .

3 వ రోజు

ఇఫాకా మీటింగ్ హోటల్ "హయత్" లో .

బ్రేక్ ఫాస్ట్ చేసి హయత్ కెళ్ళాం – మీటింగ్ లో పాల్గొన్నాము . నేపాల్ ప్రెసిడెంట్, ఆఫిషియల్స్ మాట్లాడారు. పాల్గొన్న దేశాల ప్రతినిధులు తమ తమ జెండాలతో ఎంటరైనారు . మేమూ తిరంగా జెండాలతో స్టేజి ఎక్కి గీతానికి అణుగుణంగా ఊపి భారత్ ని రిప్రజెంట్ చేసాము . రెండు సంవత్సరాల కాలంలో తాము చేసిన కార్యక్రమాలు వివరించారు. కొన్ని కల్చరల్ ప్రోగ్రాంస్ చూసాం . రిజిస్ట్రేషన్ కిట్స్ ఇచ్చారు అందరికీ . చాలా ఆహ్లాదకరంగా ఓపెన్ ప్లేస్ లో ఎరేంజ్ చేసిన లంచ్ చాలా బాగా ఎంజాయ్ చేసాము. తరువాత ప్రసిద్ధ దేవాలయం" పశుపతినాథ్" టెంపుల్ కెళ్ళాం . జీవమున్న ప్రతి ప్రాణిని కాపాడే దైవం. చాలా పెద్ద పురాతన ఆలయం . ముందు చాలా పెద్ద నంది విగ్రహం ఇత్తడి తో వుంది మహా

దర్శాగా 'దాని ముందు చిన్న నంది కూడా వుంది. కార్తీక మాసం దీపాలు వెలిగించారు ఇత్తడి ప్రమిదల్లో . ఫోటోలు వీడియో లు తీయకూడదు . సాధువులు చాలా మంది వున్నారక్కడ విభూతి ధారణ పెరిగిన గడ్డం తో గంభీరంగా ' విశాల ప్రాంగణాలు శివలింగాలు చాలా వున్నాయి చుట్టూరా . అభిషేకాలు, అర్చనలు వుదయం 5 గంటలకే మొదలు అవుతాయి . ఏదైతేనేం ' ఒక పురాతన మహిమాన్విత కట్టడాన్ని చూసిన అనుభూతి కలిగింది. అక్కడ ఇచ్చే హారతి చూడడానికి ఎంతో మంది వస్తారక్కడికి . ఈ ఆలయం పక్కనే భాగమతి నది వుంది. ఘాట్ లున్నాయి . స్ట్రెచర్స్ ఓ పక్కగా చాలా వున్నాయి. భజనలు జరుగుతున్నాయి. చనిపోయినవారిని అక్కడ కాల్చేసి బూడిదను . మిగిలిన కర్రలను ఆ నదిలో వేస్తారుట. కాశీలో వున్నామా అనిపించింది కాసేపు. రోలు – రుబ్బురోలుగా పెద్దగా వున్న రాయిని చేతులతో తిప్పి ఆ గంధాన్ని పెట్టుకుంటున్నారు భక్తులు . మా బస్సు దిగి టెంపుల్ దాకా నడిచే దారికిరుపక్కలా చిన్న చిన్న షాపులు వున్నాయి. వాటిలో కుంకుమ, ఇత్తడితో చేసిన వస్తువులు , సాలిగ్రామాలు రకరకాల సైజుల్లో వే వేల రుద్రాక్ష మాలలు వేలాడుతున్నాయి. ఎప్పుడు చూడలేదు ఇంత రుద్రాక్ష సంపద . ట్రక్కుల్లోంచి బస్తాలు బస్తాలు దిగుతున్నాయి కాయలు కొంచెం ముదురాకుపచ్చ రంగుల్లో చిన్న నిమ్మకాయల్లా . పై షెల్ తీస్తే లోపల రుదాక్షలు వాటిని సైజుల వారిగా – ముఖాల వారిగా ఏరి బుట్టల్లో పెట్టారు. చుట్టూ అడవుల్లో రుద్రాక్ష చెట్లు వుంటాయట .అద్భుతంగా ఆశ్చర్యంగా చూసాము . ఏ ఒకటి రెండో సాధువుల దగ్గరో పెద్ద వారి దగ్గరో అతి పవిత్రంగా చూసేవాళ్ళం . ఏది కొనాలో అర్థం కాక ఏమీ తేలేదు టైం కూడా లేదు పోలో మని అటు వెళ్ళాం , మళ్ళీ బస్ వద్దకు వచ్చాం . అంతా తొందరే . వీటి కోసమై నా ఆ టెంపుల్స్ చూడడానికైనా మళ్ళీ వెళ్ళాలని వుంది.

ఇక " హయత్" కెళ్ళి ఆరుబయట చలి చలిగా, స్నాక్స్, డ్రింక్స్, డిన్నర్, ఫైర్ క్యాంపులు, డిజె పాటలు డాన్సులు . ఉల్లాసభరిత వాతావరణంలో డిన్నర్ ముగించి రాడిసన్ కెళ్ళాం.

23–11–23

మార్నింగ్ 4 .30 కి బస్సుల్లో బయల్దేరి 6 AM కి సన్ రైజ్ పాయింట్ చేరాము . చేతులకు గ్లవుస్, తలపై వు లెన్ క్యాప్, వులెన్ సాక్స్ షూస్ స్వెట్టర్స్, మఫ్లర్స్ తో బందో బస్త్ గా వెళ్ళాం . బాగా పైకి మెట్లు ఎక్కి వెళితే దూరంగా వున్న కొండలపై తొలిసూర్య కిరణాలు పడి వెండి కొండల లాగా కనపడుతుంది ఎవరెస్టు శిఖరాల పై . కొన్నిమెట్లు ఎక్కేసరికి నాకు అర్థమైంది నావల్ల కాదని శ్వాస ఇచ్చిందిగా వుంది. కాళ్ళు మొరాయిస్తున్నాయి. ఇక వద్దు అనుకుని కిందికి వచ్చి బస్ లో కూర్చుని కొంత రాసుకున్నాను ఇలా . మిగతా అందరూ వెళ్ళి ఆ సూర్యోదయాన్ని చూసి ఆనందించి కెమెరాల్లో బంధించి – మనో యవనిక పై చిత్రించి – వెండికొండల్ని మనసులో ముద్రించి వచ్చారు. ఆ చలికి పక్కనే వున్న టీ స్టాల్ చిన్న పాక లో అందరం టీతాగాం మన డబ్బుల్లో 30 రూపాయలు టీ. ఈ మొత్తం ప్రయాణ సమయంలో ప్రముఖంగా ఒకరు – పాక్షికంగా ఇద్దరు మమ్మల్ని బాగా నవ్వించారు – ఎంటర్టైన్ చేసారు. వారికి మా ధన్యవాదాలు .



తిరిగి ప్రయాణమై చెంగు నారాయణ టెంపుల్ కెళ్ళాం. దాదాపు 2 కిలో మీటర్ల దూరం + చాలా మెట్లు ఎత్తుగా వుంటాయని తెలిసి నేను బస్ లోనే వున్నాను. వరాహ మూర్తి విగ్రహం కాపర్ తో చేసినట్లు వున్నదని చెప్పారు. ముఖ ద్వారం ఎదురుగా సింహం కాపలాగా . దక్షణ ద్వారంలో ఏనుగు

కాపలాగా .. దశావతారాలు – నరసింహావతారం. శివలింగం వున్నాయని చెప్పారు . మొత్తానికి చాలా శ్రమపడి వెళ్ళి వచ్చారు. చంద్రగిరి హిల్స్ రెండు మూడు గంటల బస్ ప్రయాణం తర్వాత రోప్ వే ద్వారా ' చాలా పైన పర్వతాలు, లోయలు –అడవులు చూస్తూ చంద్రగిరి హిల్స్ చేరాం. లవ్ షేప్ లో వున్న ఫ్రేమ్ దగ్గర అంతా ఫోటోలు దిగాం . పక్కన షాపుల్లో పాప్ కార్న్ – టీ – కాఫీలు తాగాం. అందరూ చేరాక ఇంకా పైన వున్న రెస్టారెంటుకి అక్కడి వ్యాన్లలో తీసుకెళ్ళారు. ఎంత బాగుందో ఆ ప్రదేశం , చుట్టూ కొండల నడుమ కిందికి చూస్తే ఖాట్మండ్ లలిత్ నగర్ అంతా కలిసి ఇళ్ళన్నీ చిన్నగా కనిపిస్తూ వున్నాయి. విశాలమైన ప్రాంగణాలతో ఆ రెస్టారెంటు చాలా ప్రత్యేకంగా వుంది. ఇంటర్నేషనల్ ఈవెంట్స్ ఏమైనా వుంటే అక్కడ నిర్వహిస్తే ఎంత బాగుంటుందో ... లంచ్ కూడా చాలా బాగుంది. ఎన్నో వెరైటీలతో చాలా తృప్తిగా తిన్నాం . ఆ వెనుక స్విమ్మింగ్ పూల్ దగ్గర ఫోటోలు దిగాం . తిరిగి అందరం వ్యాన్ లో రోప్ వే దగ్గరికొచ్చి దాని ద్వారా కిందికి చేరి బస్సుల్లో తిరుగు ప్రయాణమై మా హోటల్ రాడిసన్ కి ఎదురుగా వున్న మరో రాడిసన్ లో డిన్నర్ చేసి రూం కి చేరాము .

24–11 23

కొందరు వుదయాన్నే పశుపతినాథ్ ఆలయం వెళ్ళి అభిషేకం చేయించి అటునుండి గృహేశ్వరి టెంపుల్ చూసి వచ్చారు. హోటల్ హయత్ లో క్లోజింగ్ సెర్మనీ .. అందరం అటు వెళ్ళాం . వచ్చే సారి మీటింగ్ ఎక్కడో అనౌన్స్ చేశారు . సింగపూర్ ప్రతినిధి ఆహ్వానించారు వారి కంట్రీకి రమ్మని . ఓటాఫ్ థాంక్స్ చెప్పారు. లంచ్ చేసి జల్ నారాయణ టెంపుల్ కెళ్ళాం . ఓపెన్ ప్లేస్ లో నీటి మడుగులో శేష తల్పంపై పడుకున్న నారాయణుడు ను చూసాం . బుద్ధ నీల కంఠ అని కూడా అంటారు. 5 మీటర్ల భారీ విగ్రహం నీటి మీద తేలుతూ వుంటుంది. గుడిగోపురం లేని బహిరంగ ప్రదేశం . విష్ణు మూర్తి శంఖం – చక్రం – గధ – పద్మం తో దర్శనం . ఇది బుద్ధుని విగ్రహం అని కొందరి నమ్మకం. ఇక్కడ హరి బోధిని మేళా చేస్తారు. అంటే స్వామిని మేలుకొలపటం అన్నట్లట. ప్రపంచ నలుమూలల నుండి ఇది చూడాలని వస్తారట . 1400 సంవత్సరాల చరిత్ర అయినా ఎక్కడా సహజత్వం కోల్పోకుండా వన్నె తగ్గకుండా వుండడం విశేషం. నీటి అడుగు నుండి అదే విగ్రహానికి శివరూపం దర్శనమవుతుందని నేల పై పడుకుని నీటిలో చూస్తారు భక్తులు . అక్కడ స్టూడెంట్స్ కొందరు చక్కగా యూనిఫాం ధరించి వాలంటీర్స్ గా చేస్తున్నారు. ఒక మంచి ఫీల్ తో వచ్చాం అక్కడి నుండి . బస్సుల్లో ఎక్కి తిరిగి హోటల్ చేరుకుని ఫ్రెష్ అయి హయత్ కెళ్ళాం డిన్నర్ కి . చాలా గ్రాండ్ గా అరేంజ్ చేసారు. కొందరు త్వరగా ముగించి రూం చేరాం. కొందరు ఫుల్ జోష్ గా డాన్సులు చేస్తూ ఎంజాయ్ చేసి రూంకి చేరారు.

25–11–23

5 గురు మినహా మిగతా వారంతా 4 amకి బయల్దేరి పోక్రా – ముక్తినాథ్ కోసం వెళ్ళారు. మేము టిఫిన్ చేసి టాక్సీలో గృహేశ్వరీదేవి ఆలయానికెళ్ళాం ముందు రోజు వెళ్ళ లేదని . నెమ్మదిగా .. చూసినంతసేపు చూసి బైట ఫోటోలు దిగి వస్తూ దారిలో ప్యాలెస్ చుట్టూ ఓ రౌండ్ వేసి రూం కి వచ్చి లగేజి తో దిగాము .

అక్కడ వాళ్ళు సౌమ్యంగా అనిపించారు పేదగా కనిపించారు. ఎక్కడ చూసినా ఎరుపు రంగు ప్రముఖం గా కనిపించింది. ఏర్ పోర్ట్ లో మాకు చిన్న ఎరుపురంగులో వున్న షాల్ కప్పి బంతి పూల దండ మెడలో వేసి ఆహ్వానించారు. ఏషాపు ముందైనా రెడ్ కలర్ బోర్డు లు ఎక్కువగా కనిపించాయి. ప్రతి మహిళ రెడ్ కలర్ వస్త్రాలు ధరించి వున్నారు. కనీసం చున్నీ – బాటమ్ అన్నా రెడ్ కలరులో కనిపించారు. స్వెట్టర్స్ – మఫ్లర్ ' బైక్ – ఏ ఇంటి ముందు చూసినా ఆరేసిన బట్టలు రెడ్ కలర్. ఎందుకో .. ఏమైనా సెంటిమెంటా? పరంపరా ? నాకు అర్థం కాలేదు. ఇళ్ళ ముందు వీధుల్లో కరెంటు తీగలు స్తంభాలకు కుప్పలు కుప్పలుగా వేలాడుతున్నాయి. మన దగ్గర 20 సంవత్సరాల క్రితం వున్నట్లుగా . బజార్లన్నీ దుబ్బ దుబ్బగా వున్నాయి. హిల్ స్టేషన్ లలో చాలా క్లీన్ గా చూస్తాం ఎక్కడైనా . దీనికంతటికీ కారణం పేదరికమే .

ఈ ప్రయాణం లో కొస మెరుపు ఏమంటే .. నేను ఎక్కడికి వెళ్ళినా ఏదో ఒకటి గుర్తుగా కొంటుంటాను ఈ సారి ఏమీ కొనలేదని కాస్త నస పెడుతుండే మనసు . చివరకు ఏర్ పోర్టు లో ఒక ఫ్రెండు చూస్తున్న హాండ్ బ్యాగ్ నాకూ నచ్చింది. ఇద్దరం తీసుకున్నాం హమ్మయ్య ఇప్పుడు OK. కాస్త లేటుగా ఐదుగురం రాత్రి 11 కి హైదరాబాద్ లో లాండ్ అయ్యాం .

పరిశోధన వ్యాసం

# 'బతుకమ్మ' ఒడ్డెరాజుల కులదైవం

డా.ఓర్సు రాయలింగు
9849446027



తెలంగాణా రాష్ట్ర పూలపండుగా 'బతుకమ్మ' పండుగను తెలంగాణా రాష్ట్రంలో ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు.ఈ బతుకమ్మ (గౌరి) పండుగ లేదా సద్దుల పండుగ దసరాకి రెండు రోజుల ముందు వస్తుంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు. బతుకమ్మకు అధికారిక పేరు తెలంగాణ పండుగ.

ఇతర పేర్లు 'పూలపండుగా' తెలంగాణ రాష్ట్రంలో జరుపుకొనే పండగలో రకం.గౌరీ దేవి పండుగ ప్రారంభం, మహాలయ అమావాస్య ముగింపు, దుర్గాష్టమి జరుపుకొనే రోజు సెప్టెంబరు, అక్టోబరులో ఉత్సవాలు 9 రోజులు సంబంధిత పండుగ దసరాగా రూపుదిద్దుకుంటుంది.

## బతుకమ్మ పండుగ విశిష్టత

సెప్టెంబరు, అక్టోబరు నెలలు తెలంగాణ ప్రజలకు పండుగల నెలలు.నెలలలో రెండు పెద్ద పండుగలు జరపబడతాయి. ఈ పండుగలకు కనీసం పదిహేను రోజులు అటువైపు, ఇటువైపు అంతా పండుగ సంబరాలు,కుటుంబ కోలాహలాలు, కలయకలతో నిండిపోయుంటుంది. ఈ పండుగలలో ఒకటి 'బతుకమ్మ పండుగ',మరియొకటి దసరా (విజయ దశమి).అయితే బతుకమ్మ పండుగ మాత్రం, తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమయిన పండుగ. తెలంగాణ సాంస్కృతిక ప్రతీక.

రంగు రంగుల పూలను త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు అనే పాటలను పాడతారు.

బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వ బతుకమ్మ, సద్దుల బతుకమ్మ ఇలా దేని ప్రత్యేకత దానిదే.తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మలను బావిలో లేదా నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు.బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు,ప్రేమ,స్నేహం, బంధుత్వం,ఆప్యాయతలు, భక్తి,భయం,తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఈ పండుగ ఎంతో ప్రాచుర్యంలోకి వచ్చిన గత వెయ్యి ఏళ్లుగా బతుకమ్మను ఇక్కడి ప్రజలు తమ ఇంటి దేవతగా పూజిస్తున్నారు.ఎన్నో చరిత్రలు,పురాణాలు మేళవిస్తారు.ఎన్నో చారిత్రక పాటలు పాడుతారు.ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మలోనే ఉంది. తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా జరుపుకుంటున్నారు.ఈ సాంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. నవాబులు,భూస్వాముల పెత్తందారీ తనంలో నలిగిపోతున్న తెలంగాణ గ్రామీణ సమాజంలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి.వారి అకృత్యాలకు నలిగిపోయిన వారిని, తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నవారిని తలచుకొని తోటి మహిళలు విచారించేవారు.వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా లేదా బతుకు అమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" పాటల వెనుక ఉండే మర్మం ఇదే.ఈ పండుగ వర్షాకాలపు చివరిలో,శీతాకాలపు

తొలి రోజులలో వస్తుంది.అప్పటికే వర్షాలతో చెరువులన్నీ మంచి నీటితో నిండి ఉంటాయి. రకరకాల పువ్వులు రంగు రంగులలో ఆరుబయలలో పూసి ఉంటాయి.వీటిలో గునుగు పూలు,తంగేడు పూలు బాగా ఎక్కువగా పూస్తాయి.బంతి,చేమంతి, నంది వర్ధనం లాంటి పూలకు కూడా ఇదే సమయం. సీతాఫలాలు (షిత్పొలాక పండ్లు అంటారు) కూడా ఈ సమయంలో ఒక పెద్ద ఆకర్షణ. సీతాఫలాన్ని పేదవాని ఆపిల్ అంటారనేది తెలిసినదే. అలాగే జొన్న పంట కోతకు సిద్ధంగా తలలూపుతూ ఉంటుంది. వీటన్నింటి నేపథ్యంలో తెలంగాణ ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమయిన రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ బతుకమ్మ పండుగను జరుపుకుంటారు.

తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పాత్ర ఎంతో విశిష్టమైంది.ఉద్యమ సందర్భాల్లో బతుకమ్మతో ఊరేగింపులు చేసిన తెలంగాణ ప్రజలు తమ తమ అస్తిత్వాన్ని సగర్వంగా ప్రకటించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరుణంలో బతుకమ్మ ఖండాంతరాలు దాటి ప్రాధాన్యత మరింతగా పెరిగిపోయింది.

## బతుకమ్మ పండుగ చరిత్ర 'ఒడ్డెరాజుల ' ఆరాధ్య దైవం'

తెలంగాణ ప్రాంతాన్ని రాష్ట్రకూట రాజులు పరిపాలించేవారు.వారి వద్ద వేములవాడ చాళుక్యులు సామంతులుగా ఉండేవారు. చోళులకు,రాష్ట్రకూటులకు యుద్ధం జరిగినప్పుడు ఈ చాళుక్యులు రాష్ట్రకూటులకు మద్దతుగా నిలిచారు.క్రీస్తు శకం 973లో ఈ చాళుక్యరాజైన తైలపాడు రాష్ట్రకూటులకు చివరి రాజుగా వ్యవహరించిన కర్కుడిని హతంచేసి కళ్యాణి చాళుక్య రాజ్యాన్ని నెలకొల్పాడు. ప్రస్తుత తెలంగాణ ప్రాంతాన్ని తైలపాడు రాజే పరిపాలించేవాడు. క్రీస్తు శకం 997లో తైలపాడు మరణించడంతో అతని కుమారుడైన సత్యాసాయుడు రాజపీఠాన్ని అధిష్ఠించాడు. అప్పటి వేములవాడ (ప్రస్తుత కరీంనగర్ జిల్లా) లో ప్రసిద్ధి చెందిన రాజరాజేశ్వర ఆలయం ఉండేది.ఆపదల్లో ఉండేవారికి రాజరాజేశ్వరి అండగా ఉంటుందని అప్పటి ప్రజలు నమ్మేవారు. ప్రజలే కాదు చోళరాజు పరాంతక సుందరచోళా కూడా రాష్ట్రకూటుల నుంచి ఆపద తలెత్తినప్పుడు రాజరాజేశ్వరికి భక్తుడిగా మారిపోయాడు. రాజరాజేశ్వరే తనను కాపాడిందని నమ్మిన పరాంతక సుందర చోళ తన కుమారుడికి రాజరాజ అని నామకరణం చేశాడు.ఆ రాజరాజ చోళానే క్రీస్తు శకం 985 నుంచి 1014 వరకు రాజ్యాన్ని పరిపాలించాడని చరిత్ర చెబుతోంది.అతని కుమారుడైన రాజేంద్రచోళ సత్యాసాయపై జరిపిన యుద్ధానికి సేనాధిపతిగా వ్యవహరించి విజయం సాధించాడు.ఆ విజయానికి గుర్తుగా రాజేశ్వరి ఆలయాన్ని కూల్చేసి అందులోని భారీ శివలింగాన్ని తన తండ్రికి బహుమతిగా ఇచ్చాడు.తన కొడుకు ఇచ్చిన శివలింగం కోసం క్రీస్తు శకం 1006లో ఏకంగా ఓ ఆలయ నిర్మాణాన్ని చేపట్టాడు రాజరాజ చోళ. సా.శ 1010లో నిర్మాణం పూర్తయ్యాక భారీ శివలింగాన్ని బృహదేశ్వరాలయంలో ప్రతిష్ఠించాడు.తమ రాజ్యంపై దాడి చేసి దోచుకున్న సొమ్ముతోనే బృహదేశ్వరాలయ నిర్మాణాన్ని చేపట్టినట్టు కూడా తమిళ శిలాశాసనాల్లో చోళ రాజులు చెప్పారు.ఇప్పటికీ వేములవాడలోని భీమేశ్వరాలయ శివలింగానికి, బ్రిహదేశ్వరాలయంలోని శివలింగానికి మధ్య సారూప్యతను చూడచ్చు. వేములవాడ నుంచి శివలింగాన్ని పార్వతి నుంచి వేరుచేసి తంజావూరుకు తరలించినందుకు తెలంగాణ ప్రజల మనసు కలచివేసింది. బృహదమ్మ (పార్వతి) నుంచి శివలింగాన్ని వేరుచేసినందుకు గాను,తమ దు:ఖాన్ని చోళులకు తెలియజేస్తూ మేరూ పర్వతంలా పూలను పేర్చి బతుకమ్మను నిర్వహించడం మొదలుపెట్టారు తెలంగాణవాసులు.అలా ప్రతి ఏడాది బతుకమ్మను జరపడం ఆనవాయితీగా మార్చుకున్నారు.దాదాపు వెయ్యి సంవత్సరాల నుంచి బతుకమ్మను తెలంగాణవాసులు జరుపుకుంటున్నారు. బతుకమ్మ పేరు కూడా బృహదమ్మ నుంచి వచ్చినదే. బతుకమ్మ సందర్భంగా గౌరమ్మను పసుపు రంగు పూలతో పేర్చి తొమ్మిది రోజుల పాటు ఆటపాటలాడి పూలను నీటిలో వదులుతారు. శివుడు లేని పార్వతి గురించి పాటలగా పాడుతూ బతుకమ్మను జరుపుకుంటున్నారు తెలంగాణ వాసులు.బతుకమ్మ పండుగ ప్రకృతిని అరాధించే పెద్ద పండుగ. పూలు బాగా వికసించే కాలంలో,జలవనరులు సమృద్ధిగా పొంగి పొరలే సమయంలో బతుకమ్మ పండుగ వచ్చి,భూమితో, జలంతో,మానవ అనుబంధాన్ని సంబరంగా జరుపుకోబడుతుంది.ఈ సంబరాలు జరుపుకునే వారం అంతటా స్త్రీలు "బొడ్డెమ్మ" (మట్టితో చేసే దుర్గాదేవి బొమ్మ) ను బతుకమ్మతో పాటూ చేసి నిమజ్జనం చేస్తారు.

## బతుకమ్మ సంబరాలు వైభవాలు

చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం చూస్తూ ఉంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. మలీద చక్కెర,రొట్టెతో చేసిన పిండివంటకం తొమ్మిది రోజుల బతుకమ్మ నైవేద్యాలు

9 రోజులపాటు ప్రతిరోజూ ఓ రకమైన నైవేద్యం సమర్పిస్తారు.మొదటి ఎనిమిది రోజులు ఈ నైవేద్యం తయారీలో యువతీ యువకులు పాల్గొంటారు.చివరిరోజును సద్దుల

బతుకమ్మ అంటారు. ఈరోజు మాత్రం నైవేద్యాన్ని మహిళలు తయారు చేస్తారు.

ఎంగిలి పూల బతుకమ్మను మహా అమవాస్యరోజు బతుకమ్మ మొదటిరోజు వేడుక మొదలవుతుంది. తెలంగాణలో దీన్ని 'పెత్రామాస' అని కూడా అంటారు. నువ్వులు,బియ్యంపిండి,నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు.అటుకుల బతుకమ్మను ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు చేస్తారు.సప్పిడి పప్పు, బెల్లం,అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.ముద్దపప్పు బతుకమ్మను ముద్దపప్పు,పాలు,బెల్లంతో నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు. నానే బియ్యం బతుకమ్మను నానేసిన బియ్యం,పాలు,బెల్లం కలిపి నైవేద్యం చేస్తారు.

అట్ల బతుకమ్మను అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పిస్తారు.

అలిగిన బతుకమ్మను ఆశ్వయుజ పంచమి నైవేద్యమేమి సమర్పించరు.

వేపకాయల బతుకమ్మను బియ్యంపిండిని బాగా వేయించి వేపపండ్లుగా తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. వెన్నముద్దల బతుకమ్మను నువ్వులు,వెన్న లేదా నెయ్యి,బెల్లం కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

## సద్దుల బతుకమ్మ వైశిష్ట్యం

ఆశ్వయుజ అష్టమి నాడు ఆదేరోజు దుర్గాష్టమిని జరుపుకుంటారు.ఐదురకాల నైవేద్యాలు తయారు చేస్తారు.

పెరుగన్నం,చింతపండు పులిహోర,నిమ్మకాయ అన్నం, కొబ్బరన్నం,నువ్వులన్నం. తొమ్మిదిరోజులు సమర్పించే నైవేద్యాలలో మొక్కజొన్నలు, జొన్నలు,సజ్జలు,మినుములు,శన గలు,పెసర్లు,పల్లీలు,నువ్వులు,గోధుమలు,బియ్యం,కాజు,బెల్లం, పాలు ఉపయోగిస్తారు.తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగలో మొదటిరోజు బతుకమ్మను ఎంగిలిపువ్వు బతుకమ్మ అని,చివరి రోజు బతుకమ్మను సద్దుల బతుకమ్మ అని అంటారు.ఈ రోజుల్లో ఆడపడుచులు అందరూ అత్తవారింటి నుంచి కన్నవారింటికి చేరుకుని ఈ పూల పండుగ జరుపుకోవటానికి తయారవుతారు.ఈ తొమ్మిది రోజులలో వీరు రోజూ బతుకమ్మలు చేసి,ప్రతీ సాయంత్రం వాని చుట్టూ తిరుగుతూ ఆడుతారు.ఆ తరువాత దగ్గరలో ఉన్న జలాలలో నిమజ్జనం చేస్తారు.

అయితే చివరి రోజు బతుకమ్మ (సద్దుల బతుకమ్మ) పండుగ అత్యంత మనోహరంగా ఉంటుంది.ఆ రోజు మగవారంతా పచ్చిక బయళ్ళలోనికి పోయి తంగేడు,గునుగు మొదలగు పూలను భారీగా ఏరుకుని వస్తారు.ఆ తరువాత ఇంటిళ్ళపాదీ కూర్చుని ఆ పూలతో బతుకమ్మను తయారు చేస్తారు. ఇందులో గునుగు పూలు,తంగెడు పూలు ముఖ్య భూమికను పోషిస్తాయి.ఈ పూలను జాగ్రత్తగా ఒక రాగి పళ్ళెం (తాంబలం)లో వలయాకారంగా,రంగులు మార్చుకుంటూ పేరుస్తారు. ముందుగా తంగెడు ఆకులు, పూలు పళ్లెంలో లేదా తాంబోలంలో పేర్చుతారు.ఆపై తంగేడు పూల కట్టలు పేర్చుతారు.మధ్య మధ్యలో ఇతర రకాల పూలను ఉపయోగిస్తారు.ఈ అమరిక ఎంత పెద్దదిగా ఉంటే అంత అందంగా ఉంటుంది.తెల్లని గునుక పూలను రంగులతో అద్ది పెడతారు.పేర్చడం అయ్యాక పైన పసుపుతో చేసిన గౌరి మాతను పెడతారు. ఇలా పేర్చిన బతుకమ్మను గృహంలోని దైవస్థానంలో అమర్చి కొవ్వొత్తులతో, అగరొత్తులతో అలంకరించి పూజిస్తారు.సాయంకాలం అందరూ తమ తమ బతకమ్మలతో ఒక చోట చేరి వాటిని మధ్యలో పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ పాటలతో గౌరి దేవిని కీర్తిస్తూ ఆడవారు పాడుతారు.ఆడవారు వారికి ఉన్న అన్ని రకాల ఆభరణాలను దరించి కొత్త బట్టలు కట్టుకుంటారు.ఇలా చాలా సేపు ఆడాక మగవారు వాటిని చెరువులో నిమజ్జనం చేస్తారు.ఆపై ఆ పళ్లెంలో తెచ్చిన నీటితో ఆడవారు వాయినమమ్మా వాయినం అంటూ వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు.ఆపై ఇంటి నుండి తీసుకువచ్చిన పెరుగన్నం,సత్తుపిండి (మొక్కజొన్నలు, లేదా వేరుశనగ లేదా పెసర విత్తనాలను దోరగ వేయించి, వాటిని పిండి చేసి,వాటితో చక్కెర పిండి లేదా బెల్లం, నెయ్యి తగినంత కలిపి తయారు చేస్తారు) లను ఇచ్చి పుచ్చుకొని తింటారు.చివరి రోజు సాయంత్రం,

ఆడపడుచులు అందరూ చక్కగా దుస్తులు,అభరణాలు ధరించి బతుకమ్మను వాకిలిలో పెడతారు.చుట్టుపక్కల ఉన్న వారు కూడా వారి బతుకమ్మలను ఇదే విధంగా అమర్చి వాటి చుట్టూ పెద్ద వలయాకారంలో చేరుతారు. ఐక్యత, సోదరభావం,ప్రేమను కలపి రంగరిస్తూ మానవ హారం ఏర్పరిచి పాటలు పాడుతారు. ఒకరు ముందుగా పాట మొదలుపెడితే మిగిలినవారు వారితో గొంతు కలుపుతూ పాడుతారు.ఈ జానపద గీతాలు చుట్టు పక్కలా ప్రతిధ్వనిస్తూ ప్రత్యేకమైన తెలంగాణా సంస్కృతిని ఆవిష్కరిస్తాయి.చీకటి పడుతుంది అనగా స్త్రీలందరూ ఈ బతుకమ్మలను తలపై పెట్టుకుని ఊరిలో ఉన్న పెద్ద చెరువు గానీ,తటాకంవైపు గానీ ఊరేగింపుగా బయలుదేరుతారు.ఈ ఊరేగింపు అందంగా అలంకిరించుకున్న స్త్రీలు, బతుకమ్మలతో అత్యంత సుందరంగా,వైభవయానంగా

ఉంటుంది.ఈ ఊరేగింపు కొనసాగినంత సేపూ,జానపద గీతాలతో వీధులు మారుమోగుతాయి.జలాశయం చేరుకున్న తరువాత,మెల్లగా బతుకమ్మలను పాటలు పాడుతూ,ఆడుతూ నీటిలో జారవిడుస్తారు.ఆ తరువాత "మలీద" (చక్కెర,రొట్టెతో చేసినది) అనే పిండి వంటకాన్ని బంధు మిత్రులకు పంచిపెడతారు.ఆ తరువాత ఖాళీ తాంబలంతో పాడుతూ, బతుకమ్మను కీర్తిస్తూ ఇంటికి చేరుతారు.ఈ తొమ్మిది రోజులూ,ఈ పాటలన్నీ అర్ధరాత్రి వరకూ వీధులలో మారు మ్రోగుతూనే ఉంటాయి.

## హన్మకొండలో బతుకమ్మ, దసరా పండుగలు ప్రత్యేకత

హన్మకొండ పట్టణం అయినప్పటికీ బతుకమ్మ, దసరా పండుగలను మాత్రం పల్లెల్లో కంటే గొప్పగా జరుపుకుంటారు. పితృ అమావాస్య (పెత్రమవాస్య)తో బతుకమ్మ పండుగ మొదలుపెట్టి తొమ్మిది రోజుల పాటు రోజూ సాయంత్రం బతుకమ్మ ఆడుకుంటారు. అయితే ఆరవ రోజు మాత్రం బతుకమ్మ ఆడరు.

పెత్రమావాస్య ముందు రోజు సాయంత్రం నుండి చుట్టుప్రక్కల పల్లెల నుండి వచ్చిన అమ్మకదారులు తంగేడు,గునుగు,తామర, గుమ్మడి,బంతి,చేమంతి మొదలగు పువ్వులను అమ్ముతారు.వీటితో పాటు బతుకమ్మ పేర్చడానికి సిబ్బులు,గుమ్మడి ఆకులను కూడా అమ్ముతారు.తిరిగి వీటినన్నింటిని సద్దుల బతుకమ్మ ముందురోజు కూడా అమ్ముతారు.బతుకమ్మ మొదటిరోజు నుండి ఎనిమిదోరోజు వరకు అందరు వారి ఇంటి దగ్గరి గుళ్ళల్లో, ఖాళీ ప్రదేశాల్లో బతుకమ్మ ఆడుతారు.కాని తోమ్మిదో రోజైన దుర్గాష్టమి నాడు సాయంత్రం మాత్రం పిల్లల నుండి పెద్దలవరకు,ఎన్నడూ ఇంట్లో నుండి బయటికి వెళ్ళని వారు కూడా ప్రతి ఒక్కరు కొత్తబట్టలు వేసుకొని,వివిధ నగలను ధరించి తాము తయారుచేసిన బతుకమ్మలను చేత బట్టుకుని పద్మాక్షమ్మ గుట్టకు పోతారు. బతకమ్మలను మధ్య వుంచి,బాలికలు,స్త్రీలు వాటి చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ, "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో! బంగారు బతుకమ్మ ఉయ్యాలో!! " అని గొంతెత్తి ఒకరు పాడగా మిగతా వారు ఆ పాటను అనుసరిస్తూ పాడుతారు.సుమారు గంట నుండి రెండు గంటల వరకు అలా ఆడిన తర్వాత, బతుకమ్మను అక్కడే ఉన్న కోనేటిలోని నీళ్ళల్లో వదులుతారు. బతుకమ్మతోబాటు సద్దులు కూడా పట్టుకుపోతారు.సత్తిపిండి, నువ్వులపొడి,పల్లీలపొడి,కొబ్బరిపొడి మొదలగు వాటిని కలిపి సద్దులు అంటారు.

బతుకమ్మను నీళ్ళల్లో వదిలిన తర్వాత సద్దులను అందరు పంచుకుని తిని,

పసుపు కుంకుమలను ఒకరికొకరు ఇచ్చుకుంటారు. తిరిగి ఆటోలల్లోగాని, కార్లల్లోగాని ఇంటికి చేరుకుంటారు. బతుకమ్మ పండుగ మరుసటి రోజు వచ్చే దసరా పండుగను కూడా హన్మకొండలో వైభవంగా జరుపుకుంటారు.దసరా రోజు ప్రతి ఒక్కరు తమ తమ వాహనాలను కడుక్కొని, పూలదండవేసి కొబ్బరికాయ కొట్టి మొక్కుతారు.

చేతిపనులవారు తమ పనిముట్లకు,పరిశ్రమల వారు తమ యంత్రాలకు పూజలు చేస్తారు.పోలీస్,మిలిటరీ వాళ్ళు కూడా తమ ఆయుధాలకు పూజచేస్తారు. ఇండ్లకు ముగ్గుపోయడం, గృహప్రవేశాలు,దుకాణాల ప్రారంభం మొదలగు కొత్తపనులను చేస్తారు. బతుకమ్మరోజు కూరగాయల భోజనంచేస్తే,దసరా నాడు మాత్రం అందరు (శాకాహారులు మినహా) మాంసాహార భోజనం చేస్తారు.పూరీలు,గారెలు చేసుకుంటారు.చాలా మంది మద్యాన్ని కూడా సేవిస్తారు. సాయంత్రం నాలుగు గంటల నుండి పురుషులు,స్త్రీలు, పిల్లలందరూ కొత్తబట్టలు వేసుకొని జమ్మి కొరకు పద్మాక్షమ్మ గుట్టకు పోతారు. గుట్ట దగ్గరికి పోవడానికి బలమైన కారణముంది.గుట్ట దగ్గరికి వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రతి ఒక్కరు వస్తారు. తమ చిన్ననాటి మిత్రులను, దోస్తులను కలుస్తారు.జమ్మి ఆకు తీసుకొని,పాలపిట్టను చూసి,దసరా ఉత్సవ కమిటీవారు ఏర్పాటు చేసిన రావణాసుర వధను చూసి ఇంటికి వస్తారు.గుట్ట దగ్గరి నుండి ఇంటికి వచ్చేవరకు, వచ్చిన తర్వాత పెద్దలకు, మిత్రులకు జమ్మి ఆకు చేతిలో పెట్టి, కాళ్ళకు మొక్కి, ఆలింగనం చేసుకుంటారు. కొంత జమ్మియాకును బీరువాలల్లో వేసుకుంటారు. ఈ విధంగా బతుకమ్మ,దసరా పండుగలను హన్మకొండలో బాగా ఘనంగా జరుపుకుంటారు.

## జానపదుల వివిధ ఆచారాలు

జానపదులు తమసంతు దక్కాలని అమ్మదేవతలకు మొక్కుకునే ఆనవాయితీ పురాతనమైనది.పుట్టిన పిల్లలను చల్లగా చూడమని అమ్మదేవతల ముందు కట్టిన ముడుపులు,మొక్కులు చెల్లించుకుంటారు.కొంతమంది పుట్టినపిల్లలు పుట్టినట్లు చనిపోతుంటే,పిల్లలు పుట్టిన వెంటనే పెంట మీద వేసి తెచ్చుకుని 'పెంటమ్మ లేదా పెంటయ్య' అని పేరు పెట్టుకుంటారు.మరి కొందరు పుట్టినపిల్లల్ని ఎవరికైనా ఇచ్చి 'బిచ్చంగా' తిరిగియ్యమని కోరుకుంటారు.అట్లా తీసుకున్న పిల్లలకు 'భిక్షపతి,భిక్షమ్మ' లని పేరు పెట్టుకుంటారు.వాళ్ళే బుచ్చపతి,బుచ్చమ్మలుగా పిలువబడుతుంటారు. ఇట్లాంటి సందర్భాల్లోనే బతుకనిపిల్ల బారెడనే సామెతలు పుట్టాయి.

పిల్లల్ని బతికించమనే వేడుకునే దేవతల్లో మన బతుకమ్మ ఒక దేవత.ఆ దేవత వరాన బతికితే బతుకమ్మ, బతుకయ్యలని పేర్లు పెట్టుకుంటారు.సమ్మక్క మేడారంలో బతుకయ్య పేరున్న వాళ్ళు ఇపుడు కూడా ఉన్నారు.ఈ పూలపండుగ బతుకమ్మ ఎంగిలిపూలతో మొదలుపెట్టి సద్దులబతుకమ్మతో ముగిసిపోతుంది.బొడ్డెమ్మపండుగ నాడు 'బొడ్డెమ్మ బొడ్డెమ్మా వలలో,బిడ్డాలెందారే వలలో' అని పాడే పాట సంతానం గురించే కదా.నాటి రోజుల్లో నీళ్ళాడే (ప్రసవ) సమయాల్లో శిశుమరణాలు జాస్తిగా ఉండేవి.నీటిరేవులే ఆనాటి తల్లులకు ప్రసూతి స్థలాలు. నీళ్ళల్లో ప్రసవించే సమయంలో తల్లులు తమసంతు బతికినందుకు ప్రతీకగా నీటివారన పెరిగే తంగేడు, గునుగు పూలముద్దలను నిమజ్జనం చేసివుంటారు.ఆ తల్లుల ఆచారమే బతుకమ్మ పండుగగా మారి ఉంటుంది. ఇది తెలంగాణా ప్రాంతానికే చెందడం మన గొప్ప సంస్కృతికి సాక్ష్యం. ఎవ్వరికన్న ఐదారుగురు కన్నా ఎక్కువమంది పిల్లలుంటే ఆ తల్లిని గౌరవించేవాళ్ళు. మానవజాతి పిల్లల వల్లనే కదా ఇన్ని వేలయేండ్లుగా మనగలిగింది.అందుకే తల్లికంత గౌరవం. అమ్మతనం మీద భక్తి.ఆ భక్తే అమ్మదేవతలను కల్పించింది. పూజించింది.అమ్మదేవతల పూజల్లో ఒక ఆరాధనా రూపమే మన బతుకమ్మ.

### బౌద్ధంలో ఆరాధన తత్వం

బౌద్ధంలో ముందు చెడ్డదేవతగా,పిల్లల్ని ఎత్తుకపోయే రాక్షసిగా పిలువబడ్డ హారీతి బుద్ధునివల్ల మంచిదానిగా,పిల్లల్ని రక్షించే దేవతగా మారిపోయింది. ఆమెనే పిల్లలదేవతగా కొలుస్తారు.పుట్టిన తమ పిల్లలు బతుకాలని,రోగాలు, రొష్టులు లేకుండా వుండాలని హారీతిని ఆరాధించేవారు.ఈ దేవత గురించి బౌద్ధ జాతక కథల్లో చదువగలం.వివిధ చారిత్రకదశల్లో ఈ దేవత విగ్రహాలు వేర్వేరు రూపాల్లో అగుపిస్తున్నాయి. చాళుక్యులు తమను తాము హారీతిపుత్రులుగా శాసనాల్లో చెప్పుకున్నారు.2వ శతాబ్దంలో ఇక్ష్వాకుల కాలం నుండి హారీతి శిల్పాలు కనిపిస్తున్నాయి.12వ శతాబ్దం దాకా శాసనాల్లో హారీతిపేరు ప్రస్తావించబడ్డది. పిల్లల్ని బతికించే దేవత హారీతినే బతుకమ్మగా భావించినారేమో.కూష్మాండిని దేవతకు ప్రతీకగా గుమ్మడిపువ్వును పూజించే ఆచారమే బతుకమ్మ పండుగగా మారిందని కొందరి అభిప్రాయం.మన పూర్వీకులు ఇనుము–ఉక్కు తయారీకి తంగేడుచెక్కను వాడేవారని నేను విన్నాను.తోలు తయారీకి తంగేడు ఎంత అవసరమో అందరికి తెలుసు. గునుగుకు నీళ్ళను శుభ్రపరిచే గుణముంది. తమకు నిత్యజీవితాసరాలైన తంగేడు, గునుగుపూలతో మనపూర్వీకులు తమ అమ్మదేవత (కూష్మాండిని?)ని పూజించే రూపమే పరిణామంలో జాతరగా మారి వుంటుంది.గునుగు, తంగేడుపువ్వులతో కొప్పురం రూపంలో పూలబతుకమ్మను పేర్చి,శిఖరం లేదా సిగమీద గుమ్మడి పువ్వుంచి,పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. పూజపువ్వలను తొక్కుట్లవెయ్యని ఆచారమే బతుకమ్మలను నీళ్ళలో వదిలే సంప్రదాయమైంది. దసరా పండుగ సందర్భంగా కొలిచే హిందూదేవత నవదుర్గారూపాల్లో కూష్మాండిని ఒకటి.ఎనిమిదవ రోజున కూష్మాండినిని అర్చిస్తారు. అదేరోజు బతుకమ్మలాడుతారు. కొన్ని ప్రాచీన ఆచారాలను మతాలు స్వంతం చేసుకున్న క్రమం చరిత్రలో కనిపిస్తుంది మనకు. ఈ పండుగకు కూడా కులాల మసిపూయడం అనాచారం. ఇది ఎక్కువ (పెద్దకులాల) వాళ్ళ పండుగ కాదు తక్కువ (చిన్నకులాల,జాతుల) వాళ్ళదే. గిరిజనులదే.తొలి మొలకలను,తొలిపూతను కొలిచే ఆచారం గిరిజనులదే. పువ్వంటే రేపటి ఫలమని వాళ్ళకు తెలుసు.

ఆడపిల్లలను,పువ్వుల్ని కొలిచే పండుగే మన బతుకమ్మ. ఈ పండుగకు మతం లేదు. మతాచారాలు రుద్దబడ్డాయి. మన ప్రాంతంలో కూష్మాండిని ఆరాధన జైనులవల్ల వచ్చింది. జైనమతానుయాయులైన కాకతీయులవల్ల ప్రోత్సహించబడ్డది.జైనంలో 22వ తీర్థంకరుని శాసనదేవత, యక్షిణి అంబిక కూష్మాండిని (గుమ్మడితీగె,గుమ్మడిపువ్వు). ఈమె ప్రతిమాలక్షణంలో చేతుల్లో ఫలాలతో,ఇద్దరు పిల్లలతో,మామిడిచెట్టుకింద కూర్చొని ఉన్నట్టు ఉంది. అంబిక కూడా ఒక అమ్మదేవతే.ఈ దేవతలకు ప్రతిమారూపాలు శాలివాహన శకం 5వ శతాబ్దం నుంచే కల్పించబడ్డాయి. అంతకు ముందున్నట్టు చారిత్రకాధారాలు లేవు.

బతుకమ్మల తయారీలో కూడా చాలా భేదాలు కనిపిస్తాయి. బతుకమ్మలు స్తూపాల ఆకారంలో ఉంటాయి. లింగాల తయారీలో కూడా ఇటువంటి సంప్రదాయముందని చాలాచోట్ల చెప్పబడింది.

పూర్వం బౌద్ధులు తమ ఆరాధనలో భాగంగా చేసుకున్న స్తూపాలను పూలు, మట్టి,ఇసుక,పేడ,రాయి, ఇటుకలతో తయారు చేసుకునేవారు.బౌద్ధ భిక్షకులు నిరంతరం ప్రయాణిస్తుండడం వల్ల స్తూపారాధనకు తమకు దొరికిన వాటినే స్తూపాలుగా చేసుకుని బుద్ధునికి ప్రతీకగా నమస్కరించేవారు.పూలు, ఇసుక, మట్టి,పేడ స్తూపాలను నీటిలో కలిపేసేవారు మర్యాదగా.వాళ్ళు తిరుగాడిన ప్రదేశాల్లోని ఎన్నో వాగులు,ప్రవాహాలు భిక్కేరులుగా పిలువబడుతున్నది ఒక్క తెలంగాణలోనే.అందువల్లనే తొలుత బౌద్ధులైన గిరిజనులు,

వనజనులు ఈ ఆచారాన్ని కొనసాగించివుంటారు.దానికి వారి కోరికలు మన్నించిన అమ్మదేవతకు ప్రతీకగా తర్వాత చేసుకుని ఉంటారు. పిదప కాలాల్లో వచ్చిన మత పరిణామాలవల్ల ఈ దేవతలను తమ,తమ మతదేవతలుగా చేసుకున్నారు.ఆ దేవతలే బౌద్ధంలో హారీతిగా,జైనంలో ఆమ్రకూష్మాండినిగా, హిందూమతంలో అంబికగా పూజింపబడ్డారు.తెలంగాణాలో అతిప్రాచీనమైన అమ్మదేవతల ఆరాధనమే తల్లుల రూపంలో ఏ దేవత వచ్చినా తమ దేవతల్లో కలుపుకున్న సంప్రదాయమే బతుకమ్మ జాతరగా నిలిచిపోయింది.దసరా పండుగతో బతుకమ్మను కలుపడం,అమ్మదేవతలను కాకుండా పితృదేవతలను పూజించే ఆచారంగా మారడం 'పెత్రామాస' (పితృ అమావాస్య)ను ఈ పండుగలో చేర్చడం తర్వాతి కాలాల్లో వచ్చిన పరిణామమే.

జనపదుల ఆచారాలు చాలా ప్రాచీనమైనవి. అవి వేలయేండ్ల పూర్వపువి.ఒక్కో జాతికి, ప్రాంతానికి పరిమితమైనవి. బతుకమ్మ మనకు,మన తెలంగాణాకే పరిమితమైంది. ప్రపంచంలో మరెక్కడా లేని పూలపూజ మన సంస్కృతి. బతుకమ్మ జానపదుల పండుగ.బతుకమ్మ ఆటలో గుస్సాడి నృత్యం,చప్పట్లలో జానపదుల పాట,ఆటల కలయిక మనమూలాలను ఎరుకపరిచే మంచి సంప్రదాయం.బతుకమ్మ అచ్చతెలుగు మాట.దాన్ని సంస్కృతీకరించి పౌరాణికం చెయ్యొద్దు.

## బతుకమ్మ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో మహిళా ప్రతినిధులతో బతుకమ్మ ఆటలు,తెలంగాణ సంగీత నాటక అకాడమీ సారథ్యంలో దేవి వైభవ్ నృత్యోత్సవాలు,అధికార భాషా సంఘం సారథ్యంలో గన్ పార్క్ వద్ద అమరవీరులకు నివాళిగా బతుకమ్మ ఉత్సవాలు తదితర కార్యక్రమాలు ఎల్‌బీ స్టేడియం నుంచి వేలాదిమంది మహిళలతో,బతుకమ్మలతో వెయ్యి మందికిపైగా జానపద, గిరిజన కళాకారులతో ఊరేగింపుగా వెళ్ళి ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం ఉత్సవాలు నిర్వహించబడుతాయి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్నిచోట్ల అంతగా జరగనప్పటికీ గుంటూరుజిల్లా పల్నాడు ప్రాంతాలలోని కొన్ని గ్రామాలలో ఘనంగా జరుపుతారు.వాటిలో మాచెర్ల, కంభంపాడు,కారెంపూడి గ్రామాలలో జరుగుతుంది. తెలంగాణాలో మాత్రమే విశేష ప్రచారాన్ని పొంది బతుకమ్మ పండుగ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి మహర్నవమి వరకు తొమ్మిది రోజులు ఈ పండుగ జరుగుతుంది.దీనిలో భాగంగా మొదటి ఎనిమిది రోజులూ,పెళ్ళికాని ఆడపిల్లలు ఆడుకుంటారు.దీనిని బొడ్డెమ్మ అంటారు.తొమ్మిదవ రోజున మాత్రం చద్దుల బతకమ్మ అంటారు.బకతమ్మ పండుగ ఆశ్వయుజ మాసంలో రావడం వల్ల వర్ష రుతువుతో నిండిన చెరువులు,తొణికసలాడుతూ వుంటాయి.పండి ఒరిగిన జొన్న చేలూ,పచ్చగా పెరిగే పైరు సంపద, విరబూసిన చెట్లతో ప్రకృతి సౌందర్యమయంగా వుంటుంది. ఈ పండుగ రోజుల్లో పుట్ట మన్నుతో ఒక బొమ్మను చేసి, బహుళ పంచమి నాడు దానిని ప్రతిష్ఠించి దాని పైన,ఒక కలశాన్ని ఉంచి,కలశంపైన పసుపు ముద్దతో గౌరమ్మను నిలిపి పూలతోనూ, పసుపుతోనూ అలంకరిస్తారు. ఈ విధంగా ప్రతి ఇంటిలోనూ చేయకపోయినా,గ్రామానికి ఒక గృహంలో చేసినా సరిపోతుందని వారి అభిప్రాయం.బొడ్డెమ్మను నిలిపిన తరువాత ఆ వాడలో వున్న ఆడపిల్లలందరూ అక్కడ గుమికూడుతారు.ఈ వినోదాన్ని చూడడానికి పెద్దలందరూ వస్తారు.ఇలా ఎనిమిది రోజులూ కన్నె పడచులు ఆడుకుంటారు. తరువాత నవమి రోజున కోడి కూసే సమయాన స్త్రీలు లేచి, పరిసరాలన్నీ తిరిగి రకరకాల పూలు సేకరించి,గోరు వెచ్చని జీడిగింజల నూనెతో తలంటి పోసుకుని, నూతన వస్త్రాలు ధరించి,అలికి ముగ్గులు వేసిన ఇంట్లో చాపు వేసి,

బతకమ్మలను పేర్చి,గుమ్మడి పూవు అండాశయాన్ని తుంచి పసిడి గౌరమ్మగా పెడతారు. పసుపుతో ముద్ద గౌరమ్మను చేసి పెట్టి అగరవత్తులు వెలిగించి పసుపు కుంకాలతో అలంకరించి పగలంతా అలాగే ఉంచుతారు. సాయంత్రం పిన్నలు,పెద్దలు, నూతన వస్త్రాలు ధరించి స్త్రీలు,వివిధ అలంకారాలను అలంకరించుకుని బతకమ్మలను చేత బట్టుకుని చెరువు కట్టకో,కాలువ గట్టుకో దేవాలయానికో వెళ్ళి బతకమ్మలను మధ్య ఉంచి, బాలికలు,కన్నె పడుచులు, స్త్రీలు వాటి చుట్టూ తిరుగుతూ చప్పట్లు చరుస్తూ, గొంతెత్తి ఒకరు పాడగా వలయాకారంగా తిరుగుతున్న వారు ఆ పాటను అనుసరిస్తూ పాడుతారు.

ఆ దృశ్యాన్ని గ్రామస్తులందరూ ఆనందిస్తూ ఉంటారు.

మగపిల్లలు కొయ్య గొట్టాలలో, కాగితపు అంచులను కన్నెపిల్లల పైనా స్త్రీల పైనా ప్రయోగిస్తారు.బతకమ్మ పాటలు,ఒకో ప్రాంతంలో ఆయా మాండలిక పదాలతో ప్రతి చరణాంతం లోనూ, ఉయ్యాలో అని,కోల్ కోల్ అనీ,చందమామా అనీ, గౌరమ్మ అనీ పదాలు పాడతారు. పాటల్లో లక్ష్మీ సరస్వతుల స్తోత్రాలేగాక,అనేక పౌరాణిక గాథలైన,శశిరేఖ,సతీ అనసూయ,కృష్ణలీల, సీతా దేవి వనవాసం మొదలైనవే గాక,సారంగధర, బాలనాగమ్మకు

సంబంధించిన పాటలు కూడా పాడుతూ ఉంటారు.బతుకమ్మ పండగ వస్తూందంటే తెలంగాణా పల్లెల్లో నూతన వుత్సాహం వెల్లి విరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్రపరుస్తారు.చక్కగా అలంకరించు కుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకు వస్తారు.కొత్తగా పెళ్ళైన ఆడపిల్లలకు అత్తగారి ఇంటి నుంచి కాగితపు పూలతో చేసిన బతకమ్మను వాయినంగా పంపుతారు. అత్తగారింట్లో వుండే ప్రతి ఆడపిల్లా ఎప్పుడు కన్న వారింటికి వెళ్ళాలా? కన్నవారి పిలుపు ఎప్పుడు వస్తూందా? తనను తీసుకువెళ్ళడానికి అన్న ఇంకా రాలేదే అన్న బాధను వ్యక్తపరుస్తారు.

ఉదాహరణకు పండుగ వస్తుందంటే,ప్రియుని రాకకై ఎదురు చూసే ప్రియురాండ్లు పాడుకునే పాట ఈ విధంగా ఉంది.

**"బతకమ్మ బతకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో**
**నానోము పండింది ఉయ్యాలో నీనోము పండిందా ఉయ్యాలో**
**మావారు వచ్చిరి ఉయ్యాలో మీవారు వచ్చిరా ఉయ్యాలో.."**

అంటూ బతకమ్మలను పిల్చుకుంటూ పాడే పాటను చూద్దాం.

**"ఒక్కొక్క వుప్వేసి చంద మామ ఒక జాము అయే చంద మామ**
**రెండేసి పువ్వు తీసి చంద మామ రెండు జాము లాయె చంద మామ"**

ఈ విధంగా ఎన్నో పాటలు పాడుతారు.తొమ్మిదవ నాడు బొడ్డెమ్మ చర్చించి కలశంలో ఆవాడ పిల్లలు ప్రతిదినం చెచ్చి పోసే బియ్యం పరమాన్నం వండి పంచి పెట్టి ఒక బావి దరి చేరి

**"బొడ్డెమ్మ బొడ్డెమ్మ బిడ్డలెందారే బవిల పడ్డ వారికి వారిద్దరమ్మా**
**చెర్ల బడ్డవికి చేరిద్దరమ్మా కుంట్ల బడ్డ వారుకి కోరుద్దరమ్మ**
**నిద్రపో బొడ్డేమ్మ నిద్రబోవమ్మ నిద్రకు నూరేండ్లు నీకి వెయ్యేండ్లు**
**నిను గన్న తల్లికి నిండ నూరేంళ్ళు"** అంటూ బొడ్డెమ్మను నీటిలో వదులుతారు.బొడ్డెమ్మ పండుగలో పాడబడే పాటలు ఇంకా కొన్ని వందలున్నట్లు బి. రామరాజుగారు తమ జానపద గేయ సాహిత్యంలో తెలియచేసారు.

**"కోసలాధీశుండు ఉయ్యాలో దశరథ నాముండు ఉయ్యాలో**
**కొండ కోనలు దాటి ఉయ్యాలో వేటకే బోయెను ఉయ్యాలో**
**అడవిలో దిరిగెను ఉయ్యాలో అటు ఇటు జూచెను ఉయ్యాలో**
**చెట్టు గుబురుల చాటు ఉయ్యాలో చెరువొకటి కనిపించె ఉయ్యాలో**
**శబ్దమేదొ వినెను ఉయ్యాలో శరమును సంధించె ఉయ్యాలో**
**జంతువేదొ జచ్చె ఉయ్యాలో అనుకొని సాగెను ఉయ్యాలో**
**చెంతకు చేరగా ఉయ్యాలో చిత్తమే కుంగెను ఉయ్యాలో**
**కుండలో నీళ్ళను ఉయ్యాలో కొనిపో వచ్చిన ఉయ్యాలో**
**బాలుని గుండెలో ఉయ్యాలో బాణమే గ్రుచ్చెను ఉయ్యాలో**
**ఎవ్వరు నువ్వనె ఉయ్యాలో ఏడ్పుతో దశరథుడు ఉయ్యాలో**
**శ్రవణుడు నేనని ఉయ్యాలో చచ్చేటి బాలుడు ఉయ్యాలో**
**తప్పు జరిగెనంచు ఉయ్యాలో తపియించెను రాజు ఉయ్యాలో**
**చావు బతుకుల బాలుడుయ్యాలో సాయమే కోరెను ఉయ్యాలో**
**నా తల్లిదండ్రులు ఉయ్యాలో దాహంతో ఉండిరి ఉయ్యాలో**
**ఈ నీళ్ళు గొంపోయి ఉయ్యాలో ఇచ్చి రమ్మనెను ఉయ్యాలో**
**ఆ నీళ్ళతో రాజు ఉయ్యాలో అడవంతా వెదికె ఉయ్యాలో**
**ఒకచోట జూచెను ఉయ్యాలో ఒణికేటి దంపతుల ఉయ్యాలో**
**కళ్ళైన లేవాయె ఉయ్యాలో కాళ్ళైన కదలవు ఉయ్యాలో**
**వృద్ధ దంపతుల జేరి ఉయ్యాలో వేదన చెందుతూ ఉయ్యాలో**
**సాష్టాంగ పడె రాజు ఉయ్యాలో సంగతి జెప్పెను ఉయ్యాలో**
**పలుకు విన్నంతనే ఉయ్యాలో పాపమా వృద్ధులు ఉయ్యాలో**
**శాపాలు బెట్టిరి ఉయ్యాలో చాలించిరి తనువులుయ్యాలో**
**శాపమే ఫలియించి ఉయ్యాలో జరిగె రామాయణం ఊయ్యాలో**
**లోక కల్యాణమాయె ఉయ్యాలో లోకమే మెచ్చెను ఉయ్యాలో"**

"రామ రామ రామ ఉయ్యాలో రామనే శ్రీరామ ఉయ్యాలో...." అంటూ మరొక పాటలో

"ఒక్కేసి పువ్వేసి సందమామ వొక్కా జములయే సందమామ..

సిక్కుడు సెట్టుకింద సిరి సపలేసి రామన్న ఉయ్యాలో శ్రీహరి దేవన ఉయ్యాలో..." అంటూ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు నిలువుటద్దం మన పూల పండగ 'బతుకమ్మ'.దీనితోపాటు ఆరాధ్యదైవంగా భావిస్తున్న ఒడ్డెరాజుల దైవతత్వం ఎంతగొప్పదో మన తెలుగువారి చరిత్ర కూడా ఘననీయమైనది.



సాహిత్య రిపోర్ట్

# వైభవంగా డాక్టర్ సంధ్యా విప్లవ్ "దాల్చ" అను అసాధారణ మహిళల కథల సంపుటి ఆవిష్కరణ..!!

**ఎ. రజాహుస్సేన్..!!**



ఈరోజు సాయంత్రం హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ కమిటీహాల్లో జరిగిన సమావేశంలో డాక్టర్ సంధ్యావిప్లవ్ రచించిన "దాల్చ" కథల సంపుటి... ఆవిష్కరణ జరిగింది.!

1930 దశకం నుండి 2000 వరకు సుమారు70 సంవత్సరాల కాలంలో సమాజంలోని అణగారిన, వెనుకబడిన జాతుల స్త్రీల త్యాగాలను, మానవ ప్రేమలను విపులంగా చిత్రించిన కథలివి. తనకు తెలిసిన త్యాగధనులైన మహిళల కష్టాలను వడబోసి రాసిన కథలివి..అందుకే ఈ కథల్లో మానవతా పరిమళం గుప్పుమంటోంది.!!

సభకు ఆత్మీయ అతిథిగా హాజరైన గోరటి వెంకన్న మాట్లాడుతూ..'దాల్చ' కథాసంపుటిలోని కథల్లో మానవ సంవేదనల్ని మిళితంచేసిన తీరు గొప్పగా వుందన్నారు..ఈ సంపుటిలోని కలువతార(ఏక్ సోనికి కహానీ) చాలా గొప్ప కథ...కంటతడిపెట్టి స్తుందన్నారు..బహుజన జీవితాన్ని ఈ కథల్లో దృశ్యమానంచేసిన తీరు రచయిత్రి అస్తిత్వ నేప థ్యాన్ని,ప్రతిభను తెలియజేస్తుందన్నారు...!

కథా రచయిత్రి సంధ్యా విప్లవ్ సభకు స్వాగతం పలికారు...ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..

'తన చిన్నతనంలో ఎదురైన అసాధారణ బహుజన మహిళల జీవితాలను సమ్మక్క సారక్కల స్ఫూర్తితో "కథలు" గా అక్షరబద్ధం చేశానన్నారు..ఆన్ లైన్ గేమింగ్,చాట్లకు అలవాటుపడిన చిన్నపిల్లలకి, విద్యార్థులకి,కాలేజీ పిల్లల వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే విధంగా ఈ కథలను రాసినట్లు... ఆమెచెప్పారు..ఇందులో వున్న ఆరు కథలుకూడా బహుజనుల జీవితాల్లోంచి పుట్టుకొచ్చినవేనని ఆమె వివరించారు..!

సభకు అధ్యక్షత వహించిన ఆచార్య సూర్యాధనుంజయ్ మాట్లాడుతూ..ఈ సంపుటిలోనిఆరుకథలు దేనికవే గొప్పవి.. రెండు కథలైతే నవలికల్లా అనిపించాయన్నారు..ఈ సంపుటి శీర్షిక "దాల్చ"భిన్నమైన శీర్షిక. అన్నిరకాల వస్తువులమేళవింపే ఈ దాల్చా.. రచన అన్నారు. సమాజంలోని వాస్తవికతను కథల్లో నిక్షిప్తంచేసిన సంధ్యా విప్లవ్ ను ఆమె అభినందించారు. ఇవి కాలం మలిచిన కథలు. తప్పక చదవాల్సినవని కితాబు చెప్పారు..!

విశిష్ట అతిథి డాక్టర్ ముదిగొండ సుజాతారెడ్డి మాట్లాడుతూ.. ఓ డాక్టర్ రచయిత్రి, కవయిత్రి కావడం విశేష మన్నారు. "సంధ్యావిప్లవ్"సాహిత్యానికికొత్తవా రేం కాదు.ఇంతకు ముందు పోలవరం బాధితుల గురించి ఆద్యంతం(2022) కవిత రాశారు. 2014 లోనే .. "నా తెలంగాణ నేల"శీర్షికతో దీర్ఘకవిత రాశారు.. ఇప్పుడీ "దాల్చ"తొలి కథా సంపుటితోమనముందు కొచ్చారు. త్వరలోనే సంధ్య ఓ నవల కూడా రానుందన్నారు..

బహుముఖీన ప్రతిభ కలిగిన సంధ్య విప్లవ్ మరిన్ని రచనలు చేయాలని కోరారు. ఈ సంపుటిలోని..... 'దాల్చా'కథ విశిష్టమైందన్నారు. ఈ కథలో హిందూముస్లింల సఖ్యతను చక్కగా వివరించారన్నారు.

ఈ కథల్లో సంధ్య రాసిన భాష ఎంతో సరళంగా... వుందన్నారు.ఏకబిగిన చదివించే శైలి సంధ్య సొంతమన్నారు..ఈ కథల్లో తెలంగాణ యాస, భాష, మట్టివాసన కనిపిస్తుందన్నారు. సంధ్య సమాజాన్ని అర్థం చేసుకున్న తీరు గొప్పగా వుందన్నారు.!

గౌరవ అతిథి బి.ఎస్. రాములు మాట్లాడుతూ... సాహిత్యరంగంలో తాజా గుబాళింపు 'సంధ్యా .. విప్లవ్' అన్నారు. బాల్యంలోకి వెళ్ళి జ్ఞాపకాలను ఒంపుకోవడం ఈ రచయిత్రి ప్రత్యేకత...కొత్త సాహిత్య వస్తువును తీసుకొని,అద్భుతమైన కథలు రాసిన వారి జాబితాలోకి సంధ్యావిప్లవ్ కూడా చేరారనిఅన్నారు. తెలుగు సాహిత్యంలో దాల్చా కథలు... ఓ కొత్త ధోరణికి దారితీస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.!!

డాక్టర్ కోయి కోటేశ్వరరావు "దాల్చ" కవితా సంపుటిని సమీక్షించారు..ఈ సందర్భంగా మాట్లాడుతూ సంధ్యా విప్లవ్ తన సామాజిక అస్తిత్వం లోంచి, ఉద్యమ నేపథ్యంలోంచి సాహిత్య సృజన చేస్తున్నారని అన్నారు. మనకు అష్టవిధ నాయికలున్నారు.. ఈ కథల్లో 'కష్టవిధ' అంగార నాయికలున్నారని... ఆయన చెప్పారు.. ఈ కథల్ని విద్యార్థులు చదివితే వారి జీవన శైలికి మార్గదర్శకమవుతాయన్నారు.

ఈ కథల్లోని పాత్రలన్నీ సమాజంలోని అట్టడుగు వర్గాలకు చెందినవారే, పేదవారేకావడం విశేషం.. అన్నారు. ఈ కథల్లో పాఠక విధేయతను రచయిత్రి పాటించడం బాగుందన్నారు. మానవ సంబంధమైన కథలకు రచయిత్రి పూర్తి న్యాయం చేశారన్నారు.

సభ ఆద్యంతం కథా పరిమళంతో గుబాళించింది..

కవిత

# మేలి ముసుగులు



**వనితారాణి నోముల**
**కరీంనగర్**

నిజమే.
జడివానని ప్రేమించటం అలవాటు చేసుకోవాలి..
సుడిగుండాలను ఈదటం
ఊతంగా మలచుకోవాలి..

నిజమే..
వెలుతురు లో ఏముంది..
నిజస్వరూపాలు ,
కనిపించటం తప్ప..
అందుకే..
చీకటిని అచ్చంగా
హత్తుకోగలగాలి..

నిజమే..
తుఫాను గాలిలో
ఎగరటం నేర్చుకోవాలి..
విషన్న హృదయానికి
ప్రతికూలతలను సైతం
ఆస్వాదించే అవకాశం ఇవ్వాలి..

నిజమే...
కష్టాలు అపుడపుడు మంచే చేస్తాయి మరీ..
మంచితనమన్న మేలి ముసుగులు తొలగించి..
మేక వన్నె పులులెవరో
చూపిస్తాయి కదా..

సాహిత్య వ్యాసం

# నవీకరించుకోవడం అవసరమే..!!



నాంపల్లి సుజాత

9848059893

చావూ పుట్టుక మన చేతుల్లో లేకపోవచ్చు..! కానీ మనకు నచ్చినట్టు జీవించడం మాత్రం ముమ్మాటికి మన చేతుల్లోనే,చేతల్లోనే..!

అందుకు నిరంతరం మనల్ని మనం సాన పెట్టుకుంటూ నవీకరించుకోవడమే..

కాలం వేగంగా మారుతుంది, దానికి అనుగుణంగానే ప్రతిదీ మారాకు వేస్తూనే ఉంది.

ఓ ఇరవై సంవత్సరాలను లేదా మనం పుట్టినప్పటి రోజులని ఓ సారి వెనక్కి తిప్పి చూస్తే, గతం లోని ప్రతీ అడుగు నమ్మశక్యం కానంత మార్పు రవాణా సమాచార సాంకేతిక రంగాల్లోనైతే విభ్రమ గొలిపేన్ని ఆవిష్కరణలు.

అప్పటి కాలంలో సమాచార సంబంధాలకు ఏకైక వారది లేఖలే. వాటి అంతర్గత అనుభూతులను,

అనుబంధాలను బేరీజు వేయడం లేదు కానీ, అత్యవసర సమాచారం నాలుగు రోజులకు కానీ అందుబాటులోకి వచ్చేది కాదు..

మరిప్పుడో శరవేగంగా ప్రవహింప చేసే సమాచార మాధ్యమాలను వాడుతున్నాం,

వాటి వల్ల ఎంత కాదన్నా అమూల్యమైన సమయం సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది..!!

నేడు సూర్య చంద్ర మండలాల మీది కదలికలను అప్పటికప్పుడే లైవ్ లో చూసేంత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నాం..!

అందుకే నేటి వేగవంతమైన చలనశీలమైన జీవితాలకు మనల మనం నవీకరించుకోవడం, కొత్త నైపుణ్యాలని అందిపుచ్చుకోవడం,శాస్త్రీయ అవగాహనతో మెలగడం, ఇన్నోవేషన్ మరియు క్రియేటివిటీలను కలిగి ఉండడం, ఆ సౌలభ్యాలను వినియోగించుకోవడం మనిషి కి అవసరమే..!

అందుకే నిత్య విద్యార్థి అయి, నిరంతరం నేర్చుకుంటే తప్పా మనల మనం ముందుకు తీసుకెళ్లలేం..! ఇంత టాస్క్ మన ముందున్నా కొందరింకా పాకురు బట్టి, కుళ్ళు కుట్రలు కలబోసిన అమానవీయ సీరియల్లను చూస్తూ..హూంకరిస్తూ వాటినే అనుకరిస్తూ బావుల్లో కప్పల్లా అక్కడే ఆగిపోతున్నారు.

పాత తొవ్వల్లోనే కళ్ళు మూసుకొని అడుగులు వేసుకుంటూ గొర్రెల్లా నడుస్తున్నారు.

ఎప్పుడూ,ఎందుకూ ఎవరూ, ఎట్లా, ఏదీ,

ఎక్కడ అని తర్కించుకోకుండానే తలలూపి మోసగించ బడుతున్నారు. వీళ్లను చూసే జాతకాలు, గ్రహ శాంతి, రంగు

రాళ్లు,హస్త సాముద్రికలు, స్వామీజీలు,బాబాలు ఇంకా ఏవో ఏవేవో.. కల్పితాలకు ప్రాణం పోస్తూ పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్నారు..!

వాళ్ల పొట్టతిప్పల కోసం నీ చెవుల్లో పువ్వులు పెట్టి ఆనందిస్తూ రోజులు గడుపుతూ ఉంటారు..!

నీ మెదడుకి పని కల్పిస్తూ, నీకు నువ్వుగా ఆలోచించి, నవీకరించుకుంటే తప్పా నిన్ను నువ్వు కాపాడుకోలేవు..!

మొన్నటికి మొన్న ఓ వింత దృశ్యం ఎపిలెప్సీతో స్పృహతప్పి పడిపోయిన ఓ చిన్నారి చేతుల్లో తాళపు చెవుల గుత్తి పెట్టి, ఇంకేవీ చేయకుండా తగ్గుద్ది..తగ్గుద్ది..

(ఎలాగూ ఓ రెండు నిమిషాల్లో తగ్గుతుంది ) హమ్మయ్య తాళపు చేతులు చేతుల్లో పెట్టడం వల్లే తగ్గింది అంటున్నారు.. విజ్ఞాన శాస్త్రాన్ని బోధించే విద్యావంతులు..

ఇక పల్లెల్లో అయితే కడుపు నొప్పికి మంత్రం,కాలు నొప్పికి మంత్రం,పాము కాటుకి తేలు కాటికి మంత్రాలు తాయెత్తులు.! ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్ని అంధవిశ్వాసాలో లోకం ఎటువైపు ప్రయాణిస్తుందో ఎవరు బాగుపరచాలో.. ఎంతకూ అంతు చిక్కదు.విద్య విజ్ఞానము లేని వాళ్ళు సరే..

విద్యావంతులమని పట్టాలు పుచ్చుకున్న వాళ్ళు అదే తంతును అనుకరిస్తున్నారు.

అదే తొవ్వన అడుగులు వేస్తున్నారు..

అందుకే అందరమూ ఎప్పటికప్పుడు అప్డేట్ అవ్వాల్సిందే కాలంతో..

భూగోళంతో కలిసి నడవడమే అప్డేట్ అవ్వడమంటే..!

ఆకులు రాలాయనో సాయంసంధ్య ఎదురొచ్చిందనో ముడుచుకోక తాజాగా చివుర్లను మొళిపించుకోవడం అవసరమే ఎవరికైనా రాగంలో రాగమై వర్ణంలో వర్ణమై అడుగు కలపి సాగితేనే సరికొత్త కాంతులమై ప్రజ్వలించేది.

పరిణామక్రమాన్ని అంగీకరించిన ఒకనాటి అగ్నిశకలమే ప్రాణిని ఆవిష్కరింప చేసిన జీవగ్రహం కదా తనను తాను సంస్కరించుకోకుంటే ఇంకేముందీ పుట్టలు పెరిగి పాకురుపట్టి పోమూ.!?

గొంగళి పురుగు తనను తాను నవీకరించు కుంటేనే రంగుల సీతాకోకై రెక్కవిచ్చేది.

అన్నట్టు రాగి పాత్రలని రుద్ధి మెరిపించకుంటే బొగ్గుల మయమే కదా ఎప్పటికీ ముట్టని మంచిల్లబాయి మర్లబడి తెర్లయిపోదూ.!?

భూకేంద్రక సిద్ధాంతమే సరియైందంటూ ఆదిమయుగాల్లోనే జీవిస్తుంటారు కొందరెందుకో.. వాడకుంటే మెదడుకూడా కుంచించుకు పోతుంది..!నవీకరించుకోవడం అంటే..రంగుల రెక్కలతికించుకొని శూన్యం లోకి విహరించమని కాదు.రంగు వెలిసిపోకుండా నీకు నువ్వు పరిమళించమని..

మనుషులకే కాదు సర్వోపకరణాలకు నవీకరణ ఆవశ్యకమే..!

మానవ సృష్టి యైన మన చరవాణీ కూడా ప్రాధేయపడుతోంది అప్డేట్ అయ్యేందుకు అనుమతి నియ్యమని.! ప్రాణం లేని పరికరమే అదేపనిగా ఆరాటపడుతుంటే మనల మనం నవీకరించుకోవడం అత్యంత ఆవశ్యకమే..!!

కథ

# కాల మహిమ



డా.బండారి సుజాత
9959771229

"ఇది విన్నావా? వదినమ్మా అని వంటింటి గోడ దగ్గరికి వచ్చింది" అలివేలు.

"ఏమైందొదినా? పొద్దు పొద్దున్నే ఎవరు ఏ ముచ్చటందించిండ్లంటూ పరుగు పరుగున వచ్చింది" పక్కింటి ప్రమీలమ్మ.

అయ్యో! వదిన మన చింతకాయల సునీత లేదా? అని అంటుండగానే....

"అయ్యో !ఆమెకు ఏమైంది. పాపం మొగుడుపోయిన కాడినుండి పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. పాపం మంచోళ్ళకే వస్తాయి కష్టాలన్నీ" అన్నది ప్రమీలమ్మ.

"అబ్బా! నేను చెప్పీ చెప్పక ముందే అందుకుంటావ్. ఇదే నీతోటి వచ్చిన చిక్కంతా" అన్నది అలివేలు.

"ఆమెకు ఏమైనా అయిందేమోనని ,అసలేమైంది వదినా" అన్నది ప్రమీల.

"అట్లా! అడుగు చెప్తానని, పాపం వాళ్లకు ఇద్దరు బిడ్డలే కదా! అనగానే, అవును అయితే ఏమైందన్నది ప్రమీల.

"పెద్దబిడ్డకు పెళ్లి చేసిన ఆరు నెలల లోపే చింతకాయల శీను కాలం చేసిండు కదా! అన్నది

"ఏం చెప్తాం వదిన ఎవరి రాతలుఎట్లుంటాయో, బాగా తాగుతుండేవాడుకదా!ఎప్పుడు ఏమౌతదోనని,పెద్ద దానికిపెళ్ళి చసింది.ఇద్దరాడపిల్లలాయె ఒకరు దాటిపోతే బరువు తగ్గుతుందని అనుకున్నరు కాని, ఆ పెళ్లి వాని చావు కొత్తదని ఎవరనుకున్నారు" అన్నది ప్రమీల.

"అది కాదు వదినా! పెళ్లికి సావు కు ముడి పెట్టొద్దు. శీను బాగా తాగి తాగి లివర్ పాడు చేసుకునే. పాపం తిరుగని ఆస్పత్రి లేదాయె.ఆసూపత్రిలో ఉన్నన్ని రోజులు మంచిగుండె. ఇంటికి తీసుకొస్తే మళ్ళ అదే తాగుడాయె.మళ్ళీ ఇట్లనే తాగితే బతకవని కూడా చెప్పిండట డాక్టరు.అయినా ఆమె బాధలు పోయినయిలే, తాగొచ్చు వాడు కొడుతుంటే దాని మొర దేవునికి ముట్టేది. అడ్డం పోయిన పిల్లలను కూడా కట్టాటోడు. అప్పుడప్పుడు నేనడ్డం పోతే , నా పెళ్ళాం. నా ఇష్టమనెటోడు. సునీత పెయ్యంత తట్లు తేలేటివి.లివర్ చెడిపోయి చనిపోయిండు కదా! అన్నది అలివేలు.

"అమ్మా! నేను ఆఫీసుకు వెళ్తున్నాను. తలుపులు వేసుకో నాన్న బయటకు పోయిండు. ఇంకా రాలేదన్నది" శిరీష.

సరే సరే నువ్వు పో.అత్తమ్మ మాట్లాడుతుంటే ఈడ నిలబడ్డ అన్నది అలివేలుబిడ్డతో.

'ఆ గోడ కాడ ముచ్చట్లకు కొదువే లేదు. ఊరు ముచ్చట్లన్ని వీళ్ళకే కావాలి.కాళ్ళు ఎందుకు నొప్పిపెట్టవో. అలా వేరేవాళ్ళ ముచ్చట్లు వద్దని నేను, నాన్న చెప్పినా వినది కదా! అమ్మ. ఆమె, ఈమె దందుదొందే అనుకుంటూ బయట తలుపులు వేసి వెళ్ళింది 'శిరీష.

"అవును వదినా! వంట అయిందా" అన్నది ప్రమీలమ్మ.

"అయింది వదినా! ఇప్పుడే కదా శిరీష పోయింది.

అన్నయ్య ఇప్పుడేవస్తానని పోయిండు .ఇంకొక గంటకొస్తాడు "అన్నది అలివేలు.

"మరి నీ వంట అయిందా! వదినా అనగానే అయింది .చింత చిగురు పప్పు చేసి వడియాలు వేయించి పెట్టిన మీ అన్నయ్య కూడా ఇప్పుడే వస్తానని ఎటో పోయిండు ఆయన వచ్చినంకనే భోజనం "అన్నది ప్రమీల.

" సరేగాని అటు నుండి రారాదు. నిలబడి నిలబడి కాళ్ళు గుంజుతున్నయి"అన్నది అలివేలు.

"ఎట్లాగు ,ఈయన ఇప్పుడే రారు వస్తున్నానంటూ, ఇంటికి తాళం పెట్టి పక్కింట్లోకి పోయింది ప్రమీలమ్మ. కాఫీ

రెండు గ్లాసుల్లో పోసుకొని తీసుకొచ్చింది అలివేలు. అట్లనే కొన్ని మంచినీళ్లుతే వదినా అనుకుంటూ వచ్చి కూర్చున్నది" ప్రమీలమ్మ.

"ఏ మాటకామాటే చెప్పుకోవాలి నువ్వు చేసిన కాఫీ గుమగుమలాడుతూ బాగుంటుంది వదినా "అన్నది ప్రమీలమ్మ.

"ఫిల్టర్ కాఫీ కదా! వదినా బాగుంటుంది .సరే కానీ ప్రొద్దున ఏదో చెప్పబోయి ఆగిపోయినవు.ఏం ముచ్చట తెలిసింది సునీతది "అన్నది ప్రమీల."

"నీకు తెలవదా? తెలిసి కూడా అడుగుతున్నావా? మీకు పనిమనిషి ఏమి చెప్పలేదా" అన్నది అలివేలు.

అయ్యో వదిన చెప్తే మళ్లీ మళ్లీ నిన్ను ఎందుకు అడుగుతా అది ఏమీ చెప్పలేదు అన్నది ప్రమీల.ఒకవేళ అదినోరు విప్పిందంటే మీ అన్నయ్య కోప్పడుతడు. వాళ్ళ,వీళ్ళ మాటలు చెప్పకు.నీ పని నువ్వు చూసుకొని పొమ్మని కోప్పడతారు అన్నది ప్రమీల.

సునిత చిన్న బిడ్డ ఎవరినో పెళ్లి చేసుకున్నదట అన్నది అలివేలు. అయ్యో ! దీనికేం పోయేకాలం .పిల్లకు పెళ్ళిచేస్తాను. మంచి సంబంధం ఉంటే చూడమని కూడా చెప్పింది .పోరి గిట్ల చేసింది అన్నది ప్రమీల. కాలేజీలో చదువుకునేటోడేనట సధువుకునేటోల్లకు ఈ రోగాలేందో .లేనోన్ని పెళ్లి చేసుకొని ఏం బతుకుతారో ఏందో అన్నది ప్రమీలమ్మ. పోరగాండ్లకు ఏం తెలుస్తలేదు వదినా! మరి ఏ ఊరట అన్నది ప్రమీల.ఏ ఉరో ఎక్కడిది వీళ్ళింటికి దగ్గరేనట. రోజు ఇద్దరూ కాలేజీకి కలిసే పోయొస్తరట అన్నది అలివేలు. మరైతే సునీతకు తెలిసే ఉంటది కావచ్చు అన్నది ప్రములమ్మ.

"లోగుట్టు పెరమాల్ల కెరుక" అంటరు. నాకేం తెలవదని ఏడుచుకుంటూ నేల పట్టిందట" అన్నది అలివేలు. అవునా !అయితే ఎన్ని రోజులే గింత కూడా తెలియకపాయె, ఏదైనా ముచ్చట ఉంటే నువ్వు చెప్తేనే తెలిసేది నాకు ఎవరు చెప్తారు వదినమ్మ అన్నదిప్రమీల. మరి ఇయ్యాల సాయంకాలం ఇద్దరం పోయి కలుసొద్దామా అన్నది అలివేలు.

అంతలో గేటు తీసిన చప్పుడుకాగానే ,అన్నయ్య వస్తున్నట్లున్నాడు నేను పోతున్నానంటు బయటకు వెళ్ళింది ప్రమీలమ్మ. రామయ్య ఎదురుపడగానే ,బాగున్నావా? అన్నయ్య అంటూ పలకరించుకుంటూ వెళ్లిపోయింది ప్రమీలమ్మ .

గ్లాసులు వంటింట్లో సింకులు వేసిభర్తకు ఎదురుగా వచ్చింది అలివేలు.

'ఏం సంగతి గోడమీద ముచ్చట్లు అయిపోయినాయా? తీరుబడిగా ఇంట్లో కూర్చొని ముచ్చట్లు పెట్టుకుంటున్నారా అన్నాడు రామయ్య .ఇంటి పనులైన తరువాత మంచి చెడు మాట్లాడుకోవడం కూడా తప్పేనా? అయి నా మీలాగా మేము బయట తిరగలేము కదా!ఏవో ఇరుగు ,పొరుగు ముచ్చట్లంతే అన్నది అలివేలు.

"మీరు,మీరు మాట్లాడుకుంటే చాలు "అన్నాడు రామయ్య.

"అంటే, మీరేమంటున్నారు అన్నది అలివేణి .నేను అనేది ఏమీ లేదు ఒకరి మీద ఒకరికి చాడీలు చెప్పుకుంటూ ఇండ్లల్ల కుంపట్లు పెట్టకండి .మంచి మర్యాద ముఖ్యం. మాట్లాడుకోవడం మంచిదే మంచితనంతోనే ఉండాలన్నాడు రామయ్య.

"చాల్లే మీరు బాగానే మాట్లాడుతారు .అట్లాంటి వాటి జోలికి పోనని మీకు తెలుసు కదా! అన్నది అలివేలు.

ఆ సాయంకాల అలివేలు, ప్రమీలమ్మ, సునీతను పరామర్శించడానికి పోయింద్రు.

వీళ్లను చూడగానే కౌగిలించుకొని ఒకటే ఏడుపు మీకు కూడా చెప్పినాను కదా వదినా!మంచి సంబంధం ఉంటే చూడమని.అగో అటువాడ వాళ్ళది. పిల్లగాండ్లు కలిసిపోయి కలిసి వస్తారు.చిన్నప్పటినుండి పక్కపక్క ఉన్నోళ్ళమాయె గీసుంటి ఆలోచన వాళ్లకు ఉన్నదని తెలియక పోయె.నాకు ఏ ఆస్థిపాస్తులు లేవాయె.ఆయన పోయిన కాన్నుండి .కిరాణం కొట్టు పెట్టుకొని ,బట్టలు కుట్టుకుంటూ వాళ్లను సాదుకుంటున్న. పెద్దదాన్ని పెళ్లి చేస్తి, వాళ్లకొకకొడుకాయె.గట్లనే దీనికి పెళ్ళి చేయకపోదునా? గిట్లజేసె. " గాడిద గాడిద రాసుకుంటే బూడిదరాలినట్లు".

వాళ్ళకు ఏమీ లేదాయె,

సదువులు పూర్తిగా చదవకపోయినా తొందరపడి పెళ్లి చేసుకొనిరి అని ఏడుస్తుంటే ,సునీత వాళ్ళ అమ్మ వాళ్ళు ఏమంటున్నారు అనగానే. వాళ్ల కొడుకు మంచోడే నట నా

బిడ్డే మందో, మాకో పెట్టి పెళ్లి చేసుకున్నదని పొద్దున లేస్తే తిడుతూనే ఉన్నారు.నేనైతే తలెత్తుకోలేకపోతున్నానంటూ ఏడుస్తున్న సునీతను ఓదార్చిండ్లు ఇద్దరు. పాపం ఎవరిఖర్మకు ఎవరుబాధ్యులంటు ఆలోచనలో పడిపోయింది అలివేలు.

శీను, సునీతలకు ఇద్దరు పిల్లలు.శ్వేత, ధాత్రి.

అలివేలు,సునీతది ఒకటే ఊరు.అలువేలు వాల్లింట్లో ఇంటి పనులు వ్యవసాయ పనులు చెసేవాడు శీను. చీకటి పడిందంటే గుడుంబాలలో మునిగి తేలుతుంటాడు. తాగివచ్చిండంటే సునీతకు దెబ్బలు తప్పేవి కావు. వెనక ముందు ఆసరాలేని కుటుంబం. సునీత థన బాధలు చెప్పుకుంటుంటే రామయ్య శీనును పిలిచి మంచి మాటలు చెప్పినా వాడి బుద్ధి మారలేదు. సునీత మిషన్ నేర్చుకున్నది మిషన్ కుట్టడం మొదలుపెట్టింది .పిల్లలు ఎదుగుతున్నారు వాళ్ళని చదివించుకోవాలి. తనలాగే పిల్లలు కష్టపడవద్దనేది ఆమెబాధ. ఆడపిల్లలను ఎన్ని కష్టాలైనా పడి చదివించుకోవాలనుకునేది. అప్పుడప్పుడు అలివేలు దగ్గర డబ్బులు తీసుకని మళ్ళీ ఇచ్చేది .చెప్పొద్దు కానీ బట్టలు అద్దినట్లు కుడుతది అందుకని ఇరుగుపొరుగును పరిచయం చేసి నాలుగు డబ్బులు వచ్చేటట్టు చేసింది అలివేలు. అందుకే ఆమెకు కృతజ్ఞతగా

ఆమెకు బట్టలు కుట్టినప్పుడు కొంత తగ్గించి తీసుకునేది. సునీత పెద్ద బిడ్డ ఇంటర్ సదువు కాగానే పెళ్లి చేసింది. భర్త చూస్తే తాగుబోతు ఆస్తిపాస్తీలు లేవు. దగ్గర బంధువులు వీళ్ళ పరిస్థితి చూసి అమ్మాయి బాగుందని పెళ్లి చేసుకున్నారు. పాపం అదేం ప్రారబ్దమో పిల్ల పెళ్ళయి అత్తింట్లో అడుగుపెట్టింది. హాయిగా ఊపిరి తీసుకుందామనుకున్న సునీత ఆస్పత్రి పాలాయె అనుకొని నిట్టుర్చింది.

అలివేలుకు ఆ రోజు సంగతి గుర్తుకొచ్చింది బిడ్డను ఆ సాయంత్రం అత్తవారింటికి పంపిండ్లు.అలివేలక్కా ప్రమీలక్కా మీరిద్దరు రేపునాబిడ్డను తీసుకరావడానికి పోదాము. రావాలన్నది సునీత. సరేలే వస్తామని చెప్పారు. పొద్దున పెట్టిన టీ వేడి చేసుక రమ్మని చిన్నబిడ్డ ధాత్రికి చెప్పింది. ఇంటి ముందు కూర్చొని టీ తాగిందట .తాగిన దగ్గర నుండి ఒళ్ళు తిరుగుతూ ఉంటే నిద్ర లేదుకదా! అనుకున్నది. అప్పటికే వాంతులు మొదలైనవి. ఎందుకు ఇట్లా అవుతుందోననుకొని పడుకున్నదట.

అంతలోకే శీను రాగానే ఉన్నటీ నాన్నకు తీసుకరమ్మనదట.

టీ గ్లాసులో వడ పోస్తుంటే టి పొడి తో పాటు ఉడికినపబల్లి పటిందట.ఆ పిల్ల అరిచిన అరుపుకు, పక్కింటోళ్ల ఎదిరింటోళ్ళు అందరం ఉరికినం .టీలో బల్లి పడిందని తెలియగానే సునీతతో పాటు అందరం భయపడ్డం.

వాంతులు విరోచనాలతో రెండు రోజులు ఆస్పత్రిలో ఉండి కోరుకున్నది సునీత .

తల్లికిటైనదని తెలియగానే శ్వేతతో పాటు అత్తగారి వాళ్ళందరొచ్చి చూసిపోయిండ్లు. ఓ పది రోజులకు సునీత కోలుకున్నది.

శీను హటాత్తుగా చనిపోయిండు. ఆ ఇంట్లో పెళ్లి చేసిన సంబరం లేకుండైంది.

ఎందుకో ఇంట్లో అన్ని అపశకునాలే, అనవసరంగ పిల్లపెళ్ళిచేసి కష్టాలపాలైతిని అనీఅనుకునేది సునీత.

'బిడ్డొచ్చినయాళ్ళ ,గొడ్డొచ్చినయాళ్ళ '.అంటరు. అదే మగపిల్లవానింట్ల జరిగితే ఆడపిల్ల మీదికే పోయేవన్ని. కానీ, శీను చనిపోగానే పాపం సునిత ఆగం కాకుండా దేవుడు అల్లున్ని తోడుగా పంపిండన్నారందరు.

"ఏంది వదిన ఏదో ఆలోచనలో పడితివి" అన్నది ప్రమీలమ్మ ."ఏం లేదొదినా పాపం దేవుడు సునీతకు మల్లో కష్టం తెచ్చి పెట్టిండు కదా!సునీతతో అమ్మా! ఇది ముచ్చట అని చెప్తే దాని ముల్లేం పోయింది.ఇప్పుడు నలుగురు నాలుగు మాటలనబట్టిరి. అందరితోటి మాటలు పడుతుండే "అన్నది అలివేలు.

అవును వదిన అన్నది ప్రమీల.ధాత్రి పెళ్ళిచేసుకున్న వారం రోజులుతరువాత ఇంటికి వచ్చింది. పిలగాని తల్లి సునీతను అనరాని మాటలంటుంటే ఏడ్వే సమాదానమైంది సునీతకు .సునీత బాధను చూసిన రామయ్య వాళ్ళను ఒక కంట కనిపెట్టిచూడకుండాఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూ ఉంటిరి.వాళ్ళను చూస్తూ విషయాలు తెలుసుకుంటే ఇంతదురం పోయేవాళ్ళు కాదుకదా! మీరు ఒప్పుకుంటరోలేదోనని మీభయానిక పెళ్లి చేసుకొని ఇంటికి వచ్చిండ్లు. పెద్దమనసు చేసుకొని వాళ్ళను ఆశీర్వదించండి .ఎందుకంటే ఇండ్ల మీ

తప్పు కూడా ఉన్నది. ఒక ఆడ మగ కలిసి మాట్లాడుకుంటేనే నిందలేసే రోజులివి .అటువంటిది వాళ్లను చిన్నప్పటి నుండి వదిలేసిండ్లు.

వాళ్ళేమనుకున్నారో

మీకు చెప్తే పెళ్లి చేస్తరో ,చేయరోనని ,వాళ్ళే పెళ్ళి చేసుకున్నరు.మీకు ఒక్కగానొక్కకొడుకు. సునీత బిడ్డలు చాలా మంచి పిల్లలు.ధాత్రికీ ఏ వంకా పెట్టలేరు . అయిందేదో అయిపోయింది. అందరూ కలిసి ఉండండి. పిల్లలను చదివించుకోండని పెద్దలు చెప్పిన మాటలు వినమని అందరూ చెప్పడంతో అందరు సరేనన్నరు.

ఆనందంగా ఐదేళ్లు గడిచిపోయినవి.సునీత పెద్దబిడ్డ శ్వేతకు ఒకకొడుకు ,కూతురు.చిన్న బిడ్డధాత్రికి కూడా ఒక కొడుకు,కూతురు. మనుమలు, మనుమరాల్ల పుట్టినరోజులు,బిడ్డల పెళ్ళిరోజులు జరిపించేది సునీత. పండగలు,పబ్బాలకు వచ్చిన పిల్లలతో ఇల్లు ఎల్లప్పుడూ సందడిగా ఉండేది. ఆ కుట్టు మిషన్ విరామం లేకుండా తిరుగుతూనే ఉండేది. శునున్నపుడు అప్పుడప్పుడు శీనుతో స్నేహితుడు దేవయ్య వచ్చేవాడు.శీను చనిపోయిన దగ్గర నుండి ఆ ఇంటికి కావలసిన అవసరాలు తీరుస్తు స్నేహితుని కుటుబాన్ని కష్టాల్లో ఆదుకుంటూ, సునీతకేవైన పనులు అవసరమైతే చేసి పెడుతు. మిషన్ పాడైతే చేయించేవాడు.ఆపదలో ఆదుకున్న దేవయ్యను ఇంట్లో వాళ్ళందరు ఆత్మీయంగా పలకరించేవారు.స్నేహితుడు చనిపోయిన దగ్గర నుండి కుటుంబానికి ఆసరాఅయిండు .

ఒకరోజు ఆ ఇంట్లో కుట్టు మిషన్ చప్పుడు ఆగిపోయింది. వేసిన తలుపులు వేసినట్లే ఉన్నవి.

ప్రతిరోజు పొద్దున్నే ఫోన్ చేసి పిల్లలను పలకరించిన తర్వాతే సునీత పనులు మొదలు పెట్టుకునేది.అటువంటిది తల్లి రెండు రోజులుగా ఫోన్ చేయలేదని పెద్ద బిడ్డ .అమ్మ ఇంకా లేవలేదా చప్పుడు చడిలేదని చిన్నబిడ్డ తల్లిదగ్గరకు వచ్చిండ్లు. ఇల్లంతా ఎప్పటిలాగ శుభ్రంగా ఎక్కడివి అక్కడే ఉన్నవి. తల్లి చెప్పులు సూట్కెసు కనపడలేదు. చెప్పకుండా ఏ వూరుకు పోయిందనుకుంటూ ,ఇంట్లో తిరుగుతున్న పెద్దకూతురుకు మిషన్ మీద కత్తెర బరువు పెట్టి పెట్టిన ఉత్తరం కనపడింది. అది చదువుకుంటూ బిడ్డలు ఒకటే ఏడుపునాకుచిన్నప్పుడే పెళ్లయింది. అప్పటినుండి నేనుఏరోజు సుఖపడిందిలేదు. ఎన్నో

కష్టాలు పడ్డ. మీ నాన్న తాగొచ్చి ,ఎన్ని దెబ్బలు కొట్టిన నా బతుకు ఇంతే అనుకున్న. అతని చనిపోయిన తర్వాత బాధ్యత పెరిగి రెక్కలు ముక్కలు చేసుకొని మీకొక దారి చూపించిన. మీ పిల్లలు పెద్ద వాళ్ళు అవుతున్నారు. ఇక నా బాధ్యత తీరింది అనుకున్న. ఇప్పుడు నేను వెళ్ళిపోతున్నాను.నా కష్టాలు చూడలేక ఎప్పటినుండో నాకు తోడు,నీడగా ఉంటానన్న దేవయ్య ఎన్ని సార్లు చెప్పినా నేను పట్టించుకోలేదు. ఆయన భార్య ఎప్పుడో చనిపోయిందట ఒంటరి వాణ్ణి. నన్ను పెళ్ళి చేసుకుంటే పిల్లల బాధ్యతలుకూడా తీరుస్తానన్నాడు. మీ నాన్న పోయినప్పటినుండి మనింట్లో అతనిని మన స్వంత మనిషిలా చూస్తున్నాము. ఆయన ఎంతనచ్చ చెప్పినా ,నా మనసు అంగీకరించలేదు. నా పిల్లలతో కాలం ఇలా వెళ్ళిపోతే చాలనుకున్నాను.కాని ఈ మధ్య మా ఇద్దరి గురించి వినబడుతున్న మాటలతో నేనెంతో బాధ పడ్డాను.ఎప్పటినుండో బతుకునిస్తానన్నాకూడా వినలేదు. లోకం కాకులు.వారి మాటలు కాదని మనిషి,మనిషికి చెప్పలేను. ఏదైతే అదైతదని అతన్ని పెళ్ళిచేసుకొని వెళ్ళిపోతున్నాను.

మీకు ఒకదారి చూపించాను. అమ్మగా బాధ్యతలు చచ్చేవరకు తీరవని నాకు తూలుసు.మీ పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. ఇంటిని చెరిసగం పంచుకోండి. బీరువాలో" లక్ష రూపాయలు" పెట్టిన .చెరి యాభైవేలు తీసుకోండి. మీ నాన్న చనిపోయిన దగ్గర నుండి కష్టాల్లో సుఖాలలో తోడు ,నీడ గాఉన్నానాకు అట్లాంటి ఆలోచన అసలు లేకుండే, నా పిల్లలందరితో నా ఇల్లు ఎప్పుడు ఇట్లా సందడిగా ఉంటే చాలు అనుకున్న .కాని వినపడుతున్న మాటలు నాలో లేని ఆలోచనలకు దారి తీసినవి. నా కష్టాలు పంచుకున్న దేవయ్యను పెళ్లి చేసుకోవాలని చాలా ఆలోచించి తీసుకున్నాను. పిల్లలు జాగ్రత్త మీరిద్దరూ ఒకరికొకరు తోడుగా ఉండండి. అందరికీ ఆశీర్వాదాలు .మీ నాన్న లాగా నేను లేననుకొని బతకండి. ఎవరు ఎన్ని మాటలంటారో నాకు తెలుసు. నేను వేసిన అడుగు తప్పు అనుకుంటూ లేను.

ఇట్లు మీ అమ్మ

అని రాసిన ఉత్తరాన్ని అలివేలు,ప్రమీలమ్మ కూడా చదివి జీర్ణించుకోలేకపోయారు. ఆమెకు ఒక్కనాడు అట్లాంటి ఆలోచన ఉన్నట్లు కనపడలేదన్నది అలివేలు.

"పోనీలే వదిన పిల్లలందరు పెద్దోళ్ళయిండ్లు. పిల్లలకు పిల్లలైండ్లు ఇంకా ఎన్నాళ్ళు మోయమంటారో ఆ కష్టం. పాపం ఎప్పుడు సుఖపడలేదు కష్టాలు రాసుకొని వచ్చింది. ఇప్పుడైనా ఆ దేవయ్యతో సుఖంగా ఉంటే అంతే చాలు అన్నది ప్రమీలమ్మ.

ఎన్నిచూస్తలేము. మోసం చేసెటోల్లను అన్నది అలివేలు.

బహుశా వెళితే దేవయ్య ఊరికే వెళ్ళ వచ్చురన్నది ప్రమీల.

పిల్లలను దగ్గరకు తీసుకొని మీ అమ్మ చాలా కష్టపడింది. మీకోసం ఇన్ని చేసిన అమ్మ బాధను అర్థం చేసుకోండీ మీకెలాంటి అన్యాయం చేయలేదు. ఒకవేళ మీకు అమ్మా, నాన్న కావాలనుకొంటే వెతికి తీసుకొచ్చుకోని అందరు కలిసిఉండవచ్చు. ఆలోచించుకోండి.నాన్నతో ,అమ్మ లేదనుకుంటే ఆమెను మరచిపోండి అన్నది అలివేలు.

"గుండెలు తీసిన బంటు ఎన్నాళ్ళ నుండి సాగుతున్నదో ఈ రంకు అని ఒకరు .అందుకే బయటపడితే పరువు పోతుంది అని ఇట్లా పెళ్లి చేసుకొని వెళ్ళిపోయింది.

ఒక్కొక్కరూ ఒక్క మాటఅంటూ ఉంటే అవి విన్న పిల్లలు ఏడుస్తున్నారు. మీ అమ్మ మీకేం అన్యాయం చేయలేదు కదా! ఆమె ఒక దారి చూసుకున్నది .ఒకవేళ అన్నీ కుదుటపడితే తనే మళ్లీ వచ్చి మిమ్మల్ని అక్కున చేర్చుకుంటుంది. "కాలమహిమ" కాలంతో నడవాలి . ఇంకేం ఆలోచించకండి అన్నది అలివేలు .

రకారకాల మాటలు విననంత దూరంలో అన్నీమరచి కొత్త జీవితానికి నాంది పలుకుతూ దైవసన్నిధిలో దేవయ్య అడుగులో అడుగువేస్తు నడుస్తోంది సునీత

కవిత

# నల్ల కలువ

**ఆవుల వెంకటరమణ**
9494088110

అందరూ ఆ మురుగంటలోనే పుట్టినప్పుడు ఈ
అసమానతలెందుకు ...?
ఎర్రకలువల కందలం నల్ల కలువల కధోగతా..!
మీరుదాటిన నవమాసగర్భావధి కంటే పక్షం రోజులెక్కువ
దాటినోళ్ళం కదా...!
మీకు ఆకులూమాకు కంచాలా ...?
బట్ట కట్టింది మొదలు పడగ్గది దాకా ఉత్పత్తి కేంద్రాలుగా
మార్చి
యావజ్జీవ ఖైదీల్ని చేశారు
వీధిలో ,బల్లో, ఆఫీసులో ,బస్టాండ్లో ఎక్కడ బడితే అక్కడ
పశువాంఛ పెట్రేగి
మా ఆత్మవిశ్వాసం పై మాయని మచ్చ అయినారు.
అత్యాచారాలు, వరకట్నపు చావులు ,పరువు హత్యల
దాష్టీకాలు నాణ్యానికి మరో వైపు దృశ్యాలై సా.....
గుతున్నాయి .
ఇంక మీ పాదాల కింద నలిగిన చీమై
మీ వివక్షా మేధం భరించి వర్షించడానికి
మా కళ్ళల్లో భాష్ప ధారలు మిగల్లేదు.
ఫెమినిస్టు నల్ల కలువల పోరాట స్ఫూర్తితో
ఇప్పుడు నేను వ్రాస్తున్నా
సమ సమాజనవ మానవతా రాజ్యాంగం.
ఇప్పుడు నేను చెప్తున్నా ఆధునిక వేదం .
స్త్రీ పురుషుల సమతా భావాన్ని పాటిస్తారా సరే
లేకపోతే...
మా దారి మాది
మీ దారి మీది.

కవిత

# స్త్రీలోటు



సోని కట్కూరి
8374261002

అగ్రనాయకులకు
మొక్కి మొక్కి మొక్కిలి పోయిన
రాళ్ళకు రాకిన నొసలు
మూడు ముక్కలయ్యేదాక గూర్కలోలే తిరిగే
ఓటు రాబందులు దహనం కావాలి.
రాజ్యంగ వాదాలు చెప్తూ వేదాలు ఆచరించే
దౌర్భాగ్యపు మస్థిష్కాలు దహనం కావాలి
అధికార అర్థభాగమంటు సమానత్వం పేరుతో
లక్షలాది స్త్రీల ఓట్లను సతీసహగమనం చేయించిన
అహంకార పితృస్వామ్య తలలు
బూడిదయ్యే వరకు దహనం కావాలి

నెత్తురు ముద్దకు జీవంపోసే శక్తికి
ఓటు హక్కు నీచమన్న ఆలోచన నిలువున తగల
బడాలి.
స్త్రీల ఓట్లను సనాతనాలోచనలతో సతమత
సంపర్కంజేసే
రాజకీయ రంకు దహనం కావాలి
సజాతిని విజాతి చేసి స్వేచ్ఛా సంస్కృతని
పలికే ఉచితోపన్యాస నోర్లు తగలబడాలి.

విశ్వాసాల రొంపిలో మునిగి తేలుతూ
వేలతరాల మహిళల సర్వబానిస తీరు తగలబడాలి
కటికచీకట్లో నిలబడి పున్నమి వెన్నెలని భ్రమసే
బుద్ధి తగలబడాలి

మెదడుకు తాళమేసుకుని కాళ్ళకు చేతులకు
తాళ్ళుకట్టుకుని
కండ్లకు గంతలు కట్టుకుని దేహాన్ని పూడ్చిపెట్టుకుని
హక్కుల నాలుకల్ని తెగ్గోసుకొని పరాన్నజీవశవాలై
సమర్పించుకొని
సాగే స్త్రీల అసమర్ధత నిలువున తగలబడాలి

రిజర్వేషన్ సమానత్వ వాదాలు చెప్తు
అసమానత బిల్లులు ఆచరించే
చట్టసభలను సత్యనిప్పుల్లో నడిపించాలి
అదృశ్య నిర్మాణాలై దర్శనానికి కనపడని
అంతరాత్మ రహస్యాల తలల గుడిగోపురాలు
కూలగొట్టాలి
అందలమెక్కడమే కాదు మహిళ ఓటు భావజాల
తీరుమారాలి
అవమానల జీవంతీయాలి
ప్రజాస్వామ్య ఓటు చైతన్యాన్నిమహిళలే తేవాలి
ఆధిపత్యంతో తగలబడిన స్త్రీల జాతే తేవాలి
బానిస స్త్రీల అసలు ముఖాలు తేవాలి

తరాలుగా కడుపు నిండ కష్టాలను దాచుకున్నా
కరుణామూర్తులు తేవాలి
నిస్సహాయతననుభవించే ప్రతి మహిళ ఓటరే
చైతన్యాన్ని తేవాలి

కథ

# భార్య మనసు



తమ్మెర రాధిక

సెల్ : 94406 26702

"బాపనాయన వొస్తున్నాడు... ఏ రోజు మంచిగున్నదో ఆయనను చూడమనుండ్రి." నర్సయ్య లాల్చీ పెయిమీదకెల్లి తొడుక్కొని కిందికి గుంజుకుంట, మూలకున్న చెప్పులు తొడుక్కున్నడు బెటికెల్లనీకె.

ఇద్దరు కొడుకులు మొకమొకాలు చూసుకున్నరు. బాపనాయనతోని ఇప్పుడేం పనని.

"గింత పొద్దుగాల మీ అమ్మేడికి పోయిందిరా అవుపడత లేదూ?"

పెండ్లాము కనబడక పోయేసరికి కొడుకుల్ని అడిగిండు.

"ఇంట్లోనే వుండె, నాష్ట తయారు చేస్తున్నదేమో !"

రాజు లేచి...

"అమ్మా బాపుకవుపడలే నువ్వు పొద్దుగాల్నించీ?" అడిగిండు తల్లిని.

భాగ్యమ్మ ఉప్మ ప్లేట్ తెచ్చి మొగనికిచ్చుకుంటు...

"మరే.... పొద్దుగాల్నించి ఒక్కటే దేవులాడుతున్నడు పెద్దమన్షి..... నేం చెప్పిన పని ఏమయ్యిందీ? అంగీలాగేస్కోని ఏడికి పోతున్నవు?" నర్సయ్యని అడిగింది.

ఆ మాటకు నవ్విండ్రు ఇంట్లో వాల్లందరు. కోడళ్ళు వాళ్ళ పిల్లలకు జడలేసుకుంట అత్తమ్మ మాటలింటున్నరు. ఆమె ఎందుకట్లన్నదో వాల్లకు తెలుసు.

"అయ్యగార్ని రమ్మన్న, ఆయన గుల్లెకు పోవుకుంట మొట్టమొదట గిటే వస్తనన్నడు. అన్నింటికి ఉరుకులాడ్తె ఎట్లనమ్మా ! ఇగో గీ నాష్ట తిన్నంక షాపుల పంజూసుకోని, కంసాలాయన కాడికిపోయి బటువు పట్టుకొస్త కొంచెం నిమ్మకాయ తొక్కుపెట్టు."

భాగ్యమ్మ వైపు ఉప్మా పల్లెం చూపించి అన్నడు నర్సయ్య.

పెద్దకొడుకు రవి తను తొడుక్కున్న బూట్లు నేలమీద కొట్టి అటిటు అనుకొంటూ....

"బేబీని తయ్యారు చేసినవా? నే జల్దిపోవాలె.... ఆఫీసుల మీటింగ్నున్నది." భార్య దగ్గరికొచ్చి అన్నడు.

"టిఫిను చెయ్యి, ఈలోపన బేబి బాక్సు సదిరిస్త." అనుకుంట లత దబదబ బాక్సు సదిరి, రవికి టిఫిని పెట్టి పంపింది.

రోజు తొమ్మిది గంటల దాక ఉదయం పూట అందరు హడావిడిగా వుంటరు. ఇల్లంత ఆగమాగంగుంటది. నర్సయ్య బట్టల దుకాణం చూసుకోవడానికి పోతడు. రవి ఫైనాన్సు కంపెనీలో ఉద్యోగానికి పోతడు. రాజు సొంతంగ పెట్టుకున్న బేకరీని చూసుకుంటడు. మొగోళ్ళు పిల్లలూ వెళ్ళిపోయినంక అత్తా కోడళ్ళు ఆడబిడ్డా ఎవరి పన్లు వాళ్ళు చక్కబెట్టుకుంటరు.

భాగ్యమ్మ స్నానం చేసి దేవుని దగ్గర ఊదిబత్తీ ముట్టించి బిడ్డని తయారై రమ్మన్నది. పెద్ద కోడలు లత, చిన్నకోడలు గిరిజ అత్త ఆరాటం చూసి నవ్వుకున్నరు.

"అవ్వే .... లతా.... ఒక పళ్ళెంల బియ్యం, కుడుకా, పస్పు, కుంకం పెట్టుకోని రా...." అన్నది భాగ్యమ్మ పెద్దకోడల్ని.

"బిడ్డని అత్తగారింట్లో తోలి రాను తొందర పడ్తున్నరేందత్తమ్మా ! పాపం విజ్జమ్మకు ఇక మా లెక్కనే

చాయ్‌లు చేసుడు, కూరలు తరుగుడూ, వంట చేసుడూ తప్పదేమో !'' లత నవ్వుకుంటన్నది.

''చాయ్‌లు నేనెందుకు చేస్త? బాసండ్లెందుకు తోముత? మీ లెక్క తిని కూసోని చీరెలు కుట్టుడు, బమ్మలు చేసుడు చెయ్యను. కాలేజీల లెక్చరర్ పోస్టు చూస్తన్నడు బావ....'' మురిపెంగ మూతి తిప్పింది విజయ.

''విజయమ్మని ఆమె ఇంట్ల ఏం పని చెయ్యనియ్యరు.... సదువుకున్నోళ్ళు కదా.... ఎంతైనా వాల్ల విల్వ వేరే వుంటుంది.''

చిన్న వదినె గిరిజ పూలు తెచ్చి ఆడబిడ్డ తలల పెట్టుకుంట అన్నది. వాళ్ళు మాట్లాడుకుంట వుండగనే అయ్యగారొచ్చిండు.

ఆయనను కూర్చోమని సోఫా చూయించి మంచినీళ్ళు, చాయ్ తెచ్చింద్రు. ''నర్సయ్య గారు రెండు మూడు సార్లు ఫోన్ చేసింద్రు. కొద్దిగ ఇంటికి పోయి పంచాంగం చూసి మంచిరోజు ఆడోళ్ళకు చెప్పుంద్రి అని. ఈ నెలంతమంచిగనే వున్నది. శుక్రవారం మటుకు అమ్మాయిని పంపొద్దు. గురువారం పంచమి బాగుంది. అమ్మాయిని మీరే తోలస్తరా, వాళ్ళెవరన్న వస్తున్నరా?'' అన్నడాయన విజయను చూసుకుంట, భాగ్యమ్మతోని

''విజ్జమ్మ అత్తగారి వాండ్లకు పనులు వున్నయట మమ్మల్నే తోల్కరమ్మన్నరు. చూద్దాం వాళ్ళస్తనేమో ఏమీలేదూ... లేకుంటే మేమే అత్తగారింట్లో దింపొస్తము. అటునుంచి వాండ్లు కొడుకింటికి తీస్కపోతరు. మరి మీరు మంచి రోజు చూసి చెప్తే పలారాలు చెయ్యాలని అనుకుంటున్నము. గందుకే మిమ్మల్ని తొందరపెట్టినం రమ్మనమని.... తాగుంద్రి చాయ్'' అన్నది భాగ్యమ్మ ఆయనెదురుంగ కూర్సుంట. లత ఇచ్చిన చాయ్ కప్పు అందుకుంటూ....

''పిలగాడు ఎందుల పంజేస్తున్నడమ్మా?'' ప్రశ్నించిండు అయ్యగారు.

''టెల్కోలో మేనేజర్‌గా !'' సిగ్గు గా చెప్పింది విజయ.

''జీతం గీతం బాగానే వొస్తుండొచ్చు'' అన్నాడు.

''అవు... లక్షపైన వస్తయ్యట... కారు, ఇల్లూ అంత కంపెనీ ఇస్తదట. ఒక్కతే బిడ్డని జరపైసలు పోయినా మంచి సంబంధం చేసినం. విజ్జమ్మ కూడా ఇంజనీరింగ్ సదివింది. ఆమె మొగనికి ఇష్టమైతే నౌకరీ చేయించు కుంటడు లేకుంటే లేదు.'' చేతులున్న యాభయి రూపాయలూ, ఆకూ వక్క పండ్లు అయ్యగారి చేతుల పెట్టుకుంట అన్నది భాగ్యమ్మ.

అయ్యగారు పోయినంక ఏమేం పలహారాలు చెయ్యాల్నో నలుగురు కలిసి లిస్టు రాసింద్రు.

''విజ్జమ్మా మా మాటకేం గానీ మా తమ్మునికేం గావాల్నో ఫోన్ చేసి కనుక్కోరాదు. అవ్వే చేద్దాం.'' పెద్ద వదిన లత మాటకు నవ్వింది విజయ.

''అయ్యో నవ్వుతవేందమ్మా ! భాస్కర్ నచ్చకుంటే చేస్కపోయినవన్నీ వేస్తుగాదూ !''

''ఆయనకు నచ్చకుంటే వాపస్ పంపుతడులే మీరందరు కూసోని తినొచ్చు'' చురక వేసింది విజయ.

అరిసెలూ, మనుగులూ, బూందీ, సకినాలూ, లడ్డూలు అన్ని ఖరారు చేసినంక సామాను రాసుడు, చేసిన అప్పాలు పెట్టేందుకు డబ్బాలు కావాల్నని అనుకునుడు అయ్యింది. పనులు చేస్తున్నా భాగ్యమ్మకు మటుకు లోపల గుండెంత భారంగ అయి బరువు వోపలేనట్టున్నది బిడ్డ అత్తగారింటికి పోతున్నదనుకుంటె. ఇద్దరు మగపిల్లలెన్క ఒక్కతే బిడ్డని గార్వంగ పెంచుకున్నరు. సదువులల్ల కూడా కొడుకుల కంటే మంచిగ చదువుతున్నదని ఇంజనీరింగ్ చేయించింద్రు. పెద్దకొడుకు రవి డిగ్రీ చదివి చాలని ఫైనాన్స్ కంపెనీల జాబ్ చేస్తున్నడు. చిన్నకొడుకు రాజు ఎంబీయే చదివి బేకరీ పెట్టుకున్నడు. భాగ్యమ్మ యిద్దరు కొడుకుల పెండ్లిల్లు చేసి వాల్లను ఇంట్లనే పెట్టుకున్నది. బిడ్డ అత్తగారింటికి పోయినంక కాలమెట్ల గడుస్తదోనని బెంగటిల్లుతున్నది. విజయ పెండ్లి చేసి నాలుగు నెలలైతున్నది. పెండ్లయిన వారం రోజులకే భాస్కర్ నౌకరికి పోయిండు.

ఆషాఢమాసం, మూఢాలు అడ్డం వచ్చి విజయ అత్తగారింటికి పోవుడు కాలేదు. ఇప్పుడు మంచిరోజు చూసి కోడల్ని పంపుమని వియ్యపురాలు ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నది. బిడ్డను పంపాల్నని నర్సయ్య తొందరపెడుతున్నా భాగ్యమ్మ మటుకు మంచి ముహూర్తాలు కుదురాలె గదా అని కాలం ఎల్లదీస్తున్నది. మంచి సంబంధం అని దూరమైనా ధైర్నం చెడకుండా పిల్లనిచ్చింద్రు గని ఇప్పుడు పంపాలంటే గుబులుగున్నదిద్దరికి.

''విజ్జమ్మకు వంటలు వండుడు నేర్పు.... రేపు అందర్ల అవుసరం పడ్డప్పుడు నాకు వంట రాదని అదన్నప్పుడు మన ఇజ్జతు పోతది. ఆడపిల్లకు వంట నేర్పరా అనంటరు.''

పెండ్లయినసంది నర్సయ్య వీలయినప్పుడల్ల భాగ్యమ్మ చెవిల ఏస్తనే వున్నడామాట.

''పిల్లను పొద్దుగాల లేసుడల్వాటు జెయ్యి... వదినెలతోని లేస్తది'' రోజు గొణిగేటోడు.

''లేస్తది తియ్యరాదు... రేపత్తగారింట్ల పొద్దుగాల లేచి సగబెట్టద్దా... ఇప్పుడు లేచీ అత్తింట్ల లేచీ... ఏందీ నీ రామాయనం !'' బిడ్డ మీది ప్రేమతో మొగన్ని కసిరేది.

అందరు కల్సి భోజనానికి కూసున్నప్పుడు...

''విజ్జమ్మా నేతిబట్టు గంతొద్దు కొద్దిగ ఏసుకో'' అని నర్సయ్య వారించబోయేటోడు.

''కారంగున్నది బాపూ.... పెద్దవదిన మక్కబుట్టలల్ల కొత్త కారం ఏసేవరకు నువ్వు తిని చూడరాదు, నోరు మండుతున్నది'' అని నేతిపావు అందర్ల నుంచి తీసి పక్కకు పెట్టుకునేది విజయ. బిడ్డ గురించి ఆలోచిస్తున్న అత్తమ్మ కండ్లల్ల నీల్లు తిరుగుడు చూసి ఇద్దరు కోడండ్లు నవ్వింద్రు.

''విజ్జమ్మ ఇవ్వాలనే అత్తగారింటికి పోతలేదత్తమ్మా ! అప్పుడే కండ్లల్ల నీల్లు తీసుకుంటెట్ల ! మేమందరం గట్ల వచ్చినోల్లమే గదా! మా అమ్మలు ఇంకెక్వ బాదపడ్డరు ఊకోండి... ఎందుకు బాదపడ్తరు?''

పెద్దకోడలు లత భాగ్యమ్మ భుజాల సుట్టు చేతులేసి దగ్గరికి తీసుకున్నది. లతకూ గిరిజకూ తెల్సు అన్నలూ అత్తమావలూ ఎంత గారాబం చేస్తరో ! అన్నలకైతే విజయ తరువాతనే తమ బిడ్డలు. పండుగొచ్చినా, పబ్బమొచ్చినా విజయ ఏది చెప్తే అది నడుస్తదానాడు.

''పెద్దన్నా మీ పదో మ్యారేజి డేకు వదినకు పట్టుచీర కొనియ్యమను అమ్మను'' అని విజయ అంటే...

''వద్దమ్మా నేనే తెస్త దానికి పట్టుచీర కావాల్నంటె... మల్ల అమ్మకెందుకు'' రవి బలవంతాన వారించినా తల్లితోనే పట్టుచీర కొనిపించి, హోటలుకు పోదామని అందర్ని తయారుచేసిన సంగతి లత మరువలేదు.

గిరిజనైనా అంతే చూసేది. చిన్నన్న బేకరీ షాపు పెట్టిన్నాడు తను దాచుకున్న డబ్బులతోని పాపికొండలు పోవడానికి అందిరికీ టికెట్లు తెప్పించింది. పిల్లలకు బట్టలు అవీ కొన్నది.

''విజ్జమ్మా మీ అన్న షాపు పెట్టే మేం పార్టీ ఇయ్యాలెగని నువ్వు గివన్నీ తీస్కొనుడు ఏందమ్మా'' అని గిరిజ అడ్డుకోబోతే....

''వదినలు బడే హుషారుగున్నరు... గీ చిన్న చిన్న పార్టీలు నాకెందుకు పెద్దపెద్ద ఫంక్షన్లకు మిమ్మల్ని ఊకుంచుతానా? అని నవ్వించేది.

విజయ నాలుగు రోజులల్ల అత్తగారింటికి పోతున్నదని తెల్సినంక ఇంట్ల అందరి గుండెలు గుబులైనయి. భాగ్యమ్మ కండ్లు ముసురుబట్టినట్లున్నయి. మొకమంత మబ్బులు గమ్మినట్లున్నయి. అత్తగారింట్ల ఎన్ని రోజులుంచుతారో? ఆడంత పల్లెటూరి యవ్వారం.. జీతగాళ్ళు నాతగాళ్ళు యవసాయం పన్లతోని అరిగోస వుంటది కావొచ్చు. అల్లుడే వచ్చి తీస్కపోతడో, అత్తగారోళ్ళే ఆయన కాడికి తోలస్తరో ఎటూ వివరం తెల్వక తకబికి అయితున్నది భాగ్యమ్మ.

విజయ రెండు మూడు రోజులు షాపింగ్ చేసుకోవాలన్నది. అత్తగారింటి దగ్గర ఏం దొరుకుతయ్యో ,

దొరకవోనని,

"విజ్జమ్మా మా దోస్తు కొత్తగ షాపు పెట్టిండు. అందులకుబోయి నీకు కావల్సినయి తెచ్చుకో వానికి నేను ఫోన్ చేస్త !" రాజు జేబుల్నించి పర్సు తీసి విజయ ముందుంచిండు.

"అది పొయ్యేది పట్నం. ఆడలేనివేం వుంటయి? గింతల్నే అక్కరకొచ్చేవేం వుండవీడ" తేల్సేబోయిండు నర్సయ్య బిడ్డ దుబార ఖర్చు పెట్టుడు ఇష్టం లేక.

"బాపు చూడొదినా కొడుకు పైసలు ఖర్చయితయని భయపడుతున్నడు" నవ్వింది విజయ.

భాగ్యమ్మతోని తర్వాత అన్నడు నర్సయ్య

"విజ్జమ్మకు ఏం కావాల్నో, ఏది కావాల్నో సరింగ తెలుస్తానట్టు లేదు. షాపింగ్ చేస్తనని ఒక్కటే దుంకులాడు తున్నది. జర పుర్సత్‌గ కూసోబెట్టుకోని డబ్బు ఎక్కువ తక్కువ ఆగం చెయ్యకుంట చూసుకోమని చెప్పు" అన్నడు భార్యతోని.

"అది చిన్నపిల్లనానయ్య ! దానికి ఏం అక్కరో అంతవరకే కొంటది. విజ్జమ్మ సుత పొదుపే చేస్తది అన్ని విషయాలల్ల. ఊకె పిల్లని గులిగి యాష్ట పెట్టకు." చిన్నంగ చెప్పింది భాగ్యమ్మ.

మొగనికి నచ్చ చెప్పినా రందిగనే వున్నడు.

అయ్యగారు చెప్పిన ముహూర్తానికి విజయ అత్తగారూ ఆడబిడ్డా వచ్చిండ్రు.

తెల్లారగట్లనే విజయకు మాడకు నూనె బెట్టి మంగళార్తి ఇచ్చి తలంటిపోసిండ్రు. వదినెలిద్దరూ జుత్తు ఆరబెట్టి పొగ ఏసిండ్రు. ఇంటెనుక జాగ శుభ్రం చేసి గాడిపొయ్యి తవ్వి వంటలు చేయించుడు మొదలుబెట్టిండు నర్సయ్య తమ్ముడు మంచాలరావు. వచ్చిన ముత్తయిదులకు ఇచ్చెటందుకు భాగ్యమ్మ వదినెలు సారెలు కవర్లల్ల సదుర్తున్నరు. వచ్చిన సుట్టాలకు ఇంటి ముందర కుర్చీలు వేసిండ్రు.

హాల్లో తివాసీలు పర్సి ఆడోళ్ళు కూర్చొనే ఏర్పాటు చేసిండ్రు. హాల్లనే ఒకప్రక్క బల్లమీద వెండి పళ్ళాలల్ల పూలూ, స్వీట్లూ, పసుపు, కుంకుం సదిరి పెట్టిండ్రు. వెండి స్థాంబాళంలో చీరల దొంతి సదిరిండ్రు.

వీడియో ఆయన వచ్చే వరకు ఆయింట్లకు ఈ అర్రలకు తిరుక్కుంట అన్ని సగబెట్టుకున్నరు.

నర్సయ్య తేపకొకసారి....

"ఏమాయెనమ్మా... ముహూర్తం దగ్గర పడుతున్నది.... సదురుడే కాలేదు మీకు" అని కోప్పడుతున్నడు. భాగ్యమ్మను.

రవీ, రాజు వచ్చిన చుట్టాలని కూసుండబెట్టి మాట్లాడుకుంటనే.... అప్పుడప్పుడు వంటల కాడికి పోయి ఎంతవరకు అయిపోయిందో చూసి వస్తున్నారు. అయ్యగారు వచ్చి తివాచీ మీద వేసిన పీటమీద కూర్సోని కార్యక్రమం ప్రారంభించగనే విజయని తీసుకొచ్చి పీటమీద కూర్చోబెట్టారు.

కొద్దిసేపు మంత్రాలు సదివినంక

"అమ్మా భాగ్యమ్మగారూ... అమ్మాయి అత్తగారి వారికి కట్నం పెట్టాలి. అవన్నీ రెడీ చేసారా? నర్సయ్య గారేరీ వార్ని కూడా రమ్మనండీ" అన్నాడు అయ్యగారు.

ఆ మాటలకు భాగ్యమ్మ వియ్యపురాలిని చెయ్యిపట్టి తీసుకొచ్చి కుర్సీల కూర్చుండబెట్టింది.

"అప్పుడే కట్నం బెట్టిస్తున్నవు భాగ్యా... ఒడి బియ్యం పొయ్యరే పిల్లకు ముందుగాల" ఆమె అక్క పాన్‌దాన్ల నుంచి వక్కలు తీసుకుంట అన్నది. భాగ్యమ్మ అయ్యగారి దిక్కు చూసింది ఏమంటరన్నట్లు.

"అమ్మా.... అది మీ యిష్టం... మీ విధి విధానం ఎలా వుంటే అలా కానిచ్చెయ్యండి" అన్నడు అయ్యగారు.

దాంతో భాగ్యమ్మ స్టీలు బేసిను తెప్పించి దాంట్ల బియ్యం, పోకలు, కుడుకలు, కర్జురాలు, పసుపుకొమ్ములు ఆడోళ్ళతోని వియ్యపురాలుతోని వేయించి తనూ వేసి పచ్చబియ్య కలిపించి ఒక కుడకలో వెండి కుంకుంకాయ పెట్టి విజయకు వొడిబియ్యం కోడండ్లూ తనూ కల్సి పోసినంక, విజయ తన

ఒడిలోని బియ్యపు గింజలను తీసి స్థాంభాళంల పోసింది. కొద్దిగ బియ్యం విజయ కొంగుల పోసి దాన్ని నడుము చుట్టు చుట్టి ఆమెను లేపింది భాగ్య.

లత వచ్చి విజయ చెయ్యి పట్టుకొని బంధువులందరి దగ్గరికీ దండాలు పెట్టించడానికి తీసుకుపోయింది. అక్షింతల గిన్నె పట్టుకొని, వదిన అందిరికీ అక్షింతలు ఇస్తుంటే విజయ దండాలు పెడ్తు పోయింది. ఒక గంటసేపు ఆ కార్యక్రమం అయిపోయినంక బంగ్లా మీద భోజనాల కార్యక్రమం కాంగనే భాగ్యమ్మ విజయ అత్తనీ, ఆడబిడ్డనీ కూర్చుండబెట్టి కట్నాలు పెట్టింది.

''ఇది సారె పెట్టె వదినా'' అని తొమ్మిది చీరలున్న సూట్‌కేసు ఆమెకందించింది. భాగ్యమ్మ కండ్లు తడి తడి అయితున్నయి. బడ్లో దోపుకున్న దస్తితోని ముక్కు పిండుకుంట...

''ఒక్కతే బిడ్డ అయ్యేపట్కి జర గార్వంగనే సాదినం.... అన్నల కింద లాడు చేస్తది. అయినా అన్ని అర్థం చేస్కుంటది... మీ చేతుల బెడుతున్న.'' దుఃఖపు జీర భాగ్యమ్మని మాట్లాడనియ్యలేదు. ఆమె చీరలపెట్టె కిందబెట్టి భాగ్యమ్మని దగ్గరికి తీస్కోని....

''నా బిడ్డని గూడ గిట్లనే పంపిన్నమ్మా ! ఆడపిల్లలు గళ్ళోళ్లం.... విజయ గూడ నాకు బిడ్డ లెక్కనే... ఇన్నవా కండ్లల్ల నీల్లు రానీయకు.... ఊకో వదినా !'' భాగ్యమ్మని సంజాయించింది.

అత్తగారు వాండ్లు వెళ్ళాలని తొందర పడుతున్నరు. చిన్న వదిన మూడు పళ్ళాలు తెచ్చి ఒక దాంట్లో పసుపు నీల్లు, ఒక దాంట్ల కుంకుం నీల్లు, మరో దాంట్లో గంధం నీల్లు కల్పింది. వదిన చేస్తున్న పనిచూస్తుంటే విజయకు దుఃఖం ఆగలేదు.

నడుముకున్న వడ్డానం జరుపుకుంట కొంగుతోని కాటిక చెరగకుంట కండ్లు అద్దుకున్నది. ముందే సదిరిపెట్టిన సూట్‌కేసులూ, అప్పాల గంపలూ విజయ అత్తవారి కార్లల్ల పెట్టింద్రు. పండ్లు సదిరిన సంచులూ, వెండి సామాను వున్న కవర్లూ డ్రైవర్లకిచ్చి జాగ్రత్తగ లోపల బండిల సదురుమన్నరు.

''ఇంకేమన్న మర్చిపోయినవా విజ్జమ్మా !'' లత గదిలకు పోయి గట్టిగ పిల్సింది. విజయ గదిలకు పోంగనే గట్టిగ కౌగలించుకుంట...

''పదిలం మరి!!'' అన్నది, వెక్కిళ్ళు పడుకుంటా విజయకూ దుఃఖం ఆగలేదు. రవి లోపలికొస్తునే యిద్దర్ని వేరుచేసి చెల్లెను బైటికి తీసుకొచ్చుకుంట...

''అది చిన్నపిల్ల నువ్వుగట్ల ఏడిస్తే బయపడదానే!'' అని అంటున్నడు గని అతనికీ కండ్లల్ల నీల్లు దుంకుతనే వున్నయి. చెల్లె అన్నను అల్లుకపోయింది. కార్లల్ల సామాను సదిరించి వస్తున్న రాజు వాళ్ళను చూసి తను గూడ లోపలికి పోయిండు.

జేబుల్నించి దస్తి తీసి చెల్లె కండ్లు తుడుస్తూ...

''మల్లెప్పుడు వస్తవు బుజ్జమ్మా'' అన్నడు ఏడ్సుకుంట. భర్త ఏడుస్తుంటే గిరిజ వచ్చింది. వాళ్ళని చూసి కండ్లు తుడుచుకుంటు.... పిల్లలు బిక్కు బిక్కుమని గోడలకు అంటుకపోయి నిలబడ్డరు. అందరేడుస్తున్నరని వాళ్ళు ముక్కులు ఎగబీల్సుకుంట బీరుపోయి వున్నరు.

''ఏందిరా రాజూ చెల్లెను పంపుడు అట్లనేనా? దాన్ని ఊకుంచుతరు గని... నువ్వేందిరా?'' బైట అన్న జాడ లేక ఇంకా ఎల్తలేరేందో చూద్దామని లోపటికొచ్చిన మంచాలరావు అందర్నీ కోపం జేసిండు. అందర్ని జరిపి బిడ్డ చెయ్యి అందుకోని బైటికి వచ్చిండు ఆయన.

అన్నలు వదినలు చిన్నాయనలు పెద్దమ్మలు పెదనాయనలు వెంటరాంగ ఒడిబియ్యం తడుముకుంటూ గలుమ దాటింది విజయ.

''విజ్జమ్మ ఆగు బిడ్డా !'' భాగ్యమ్మకు దుఃఖపు జీర గొంతుకు అడ్డం పడుతుంటే బంగురుగా వచ్చింది.

గిరిజ గంధం పళ్ళెం తెచ్చి ఆడబిడ్డ ముందు పెట్టింది. విజయ ఆ గంధంల ఐదు వేళ్ళు ముంచి దర్వాజ మీది

మామిడాకులు జరిపి ముద్రలు పడేటట్టు అద్దింది. ఆ చేతిని వదిన కొంగుకు తుడిచింది. పసుపు కుంకుం కూడా అద్ది ఆ చేతులను ఇద్దరి వదినల కొంగులకు తుడిచింది. తల్లి భుజంమీద చెయ్యివేసి గేటు దాంక నడిచి అందిర దిక్కు చూసి రోడ్డు దాంక నడిచింది.

బిడ్డ మర్చిపోయిన కుడుక గుర్తొచ్చి....

''ఇగోనయ్యా పిల్ల కుడుక మర్చిపోయింది. ఇచ్చిరావాలె... కొంటబోయి ఇచ్చిరాపో!'' నర్సయ్యకు ఇచ్చుకుంట అన్నది. అట్లనన్న విజ్జమ్మకు అప్పగింతలు చెప్తదని ఆమె ఆలోచన.

విజయకు కొబ్బరి కుడుక ఇస్తూ...

''విజ్మమ్మా పైలం బిడ్డా.... అత్తగారింట్ల లాసిగ మాట్లాడకు. అల్లుడి దగ్గరికి వాల్లెప్పుడు తీస్కపోతే అప్పుడే పోవాలె. నువ్వు ప్రత్యేకం మాట్లాడి తీస్కపోదువు రమ్మని ఆయనకు ఫోన్ కొట్టకు. పెద్దన్న వదినె నీ పక్కవర్ల కార్ల వస్తరు. మంచి గుండు బిడ్డా.... ఎవ్వలకు ఎదురాడకు. నాకేం చెప్పాల్నో తోస్తలేదు.''

భుజంమీది తువ్వాలుతో కండ్లు తుడ్సుకున్నడు నర్సయ్య.

''బాపూ నేను మంచిగనే వుంట. నువ్వాకె రంది పడకు. అమ్మని గిట్ల మంచిగ చూస్కో.''

విజయ తడి కండ్లతో తండ్రిని ఊకుండ బెట్టింది. కార్లు ఎల్లిపోయినవి.

★ ★ ★

విజయ రోజూ ఫోన్ చేస్తనే వుంటది. భాగ్యమ్మకు విజయతోని మాట్లాడతుంటె ఇంట్ల తిరుక్కుంట మాట్లాడినట్టే వుంటది. పిల్లలు బడికి పోయి రాంగనే...

''విజ్జమ్మత్త ఫోన్ చేసిందా ఇవ్వాల?'' అని అడుగుతనే వుంటరు.

''విజ్జమ్మ నీల్లు పోసుకుందటనయ్యా !'' ఒకనాడు ఫోన్ చేసిన భాగ్యమ్మ మొకం నిండు పున్నమి లెక్కన వెలిగిపోతున్నది.

నర్సయ్య ఫోన్ అందుకోని ''విజ్జమ్మా బాగున్నావా బిడ్డా.... ఆ.... మీ అమ్మ చెప్పింది రా ఈ సంగతీ ! పండ్గకు తోలమని అల్లునితోని చెప్తమమ్మ.... చిన్నన్న వస్తడు యిద్దరు రాండ్రి సద్దులకు !'' అంటున్నడు నర్సయ్య.

వింటున్న భాగ్యమ్మ మురిసిపోయింది. సద్దుల పండుగకు బతుకమ్మెలే బద్దెమ్మను ఎత్తుకోని వస్తున్న బిడ్డ కండ్లల్ల మెదులుతుంటే సంతోషంగ నవ్వుతున్నది నర్సయ్య మాటలు ఇనుకుంట.

★ ★ ★

''ఇగో నీతోని మాట్లాడతదంట విజ్జమ్మ'' ఫోన్ భాగ్యమ్మకిచ్చిండు పండుగ రెండ్రోజుల ముందు నర్సయ్య.

''ఏంది బిడ్డా ! ఏమన్న చేసి పెట్టాల్నా... జల్ది ప్రయానమై రాండ్రి నీకేదిష్టముంటె అది చేస్తం.... అందరం కండ్లల్ల పానాలు పెట్టుకుని చూస్తానం నీ కోసం'' గలగలా మాట్లాడిరది భాగ్యమ్మ.

''అమ్మా సద్దుల రేపనంగనే వొస్తనే ! ముందుగాల నేనొస్తే, ఈడ మా ఆయనకు తిండి కష్టమైతది. అందుకని యిద్దరం కల్సి సద్దులు రేపనంగ వస్తం... మల్ల పోవుడు కూడ వెంటనే పోవాలె... ఒక్కడు చేసుకోలేడు'' గునుస్తున్నట్టు అంటున్న బిడ్డ మాటలకు చేష్ట దక్కి వినుకుంట నిలబడ్డది భాగ్యమ్మ.

ఏందీ ఏడ్సుకుంట పోయిన విజ్జమ్మేనా! ఒక్కడు వుండలేడు, తినలేడు అంటున్నది. ఆశ్చర్యంగ విజ్జమ్మలోని భార్య మనసును గమనించుకున్నది భాగ్యమ్మ.

# ఒక విజేత కథ

సేకరణ- తనూజ



మిత్రులారా.. ఇవాళ మీకు ఒక అద్భుతమైన వ్యక్తి గురించి చెపుతాను. ఈవిడ గురించి నాకు తెలిసినపుడు నాకు చాలా ఆశ్చర్యం అంతకు మించి ఆనందం కలిగాయి.

ఆవిడ పేరు ప్రీతి శ్రీనివాసన్. తమిళనాడుకు చెందిన ప్రీతి చిన్నప్పటి నుండి చాలా తెలివి గల విద్యార్థిగా ఉంటూ అందరి మెప్పు పొందుతూ, చాలా అంటే చాలా గొప్ప జీవితం అనుభవించేది. ఆవిడకు ఎన్నో విదేశీ విద్య సంస్థలు కూడా ఉచిత విద్య అందించడానికి ముందుకు వచ్చాయి. కానీ ప్రీతి అన్నిటిని కాదనుకున్నారు. అప్పటికే తనకు ప్రావీణ్యం ఉన్న క్రికెట్ రంగంలో రాణించాలి అనుకుంది. క్రికెటులోనే కాక ప్రీతి స్విమ్మింగ్ లో కూడా ప్రావీణ్యురాలే. ఆవిడ జాతీయ స్థాయి ఈతగత్తె, రాష్ట్ర స్థాయి క్రికెట్ క్రీడాకారిణి. కానీ విధి చిన్న చూపు చూసింది. స్నేహితులతో కలిసి ఆడుకుంటూ కిందపడిన ప్రీతికి వెన్ను ఎముక విరిగి శరీరంలో తల తప్ప ఏ అవయవం పని చేయకుండా అయిపోయాయి. అప్పటి నుంచి ఆవిడ దాదాపు పది సంవత్సరాలుగా ఒక గదికె అంకితం అయిపోయింది.

ఒకసారి తన లాగే కేరళలో ఇద్దరు అక్క, చెల్లెళ్ళకు ఇలాగే జరగడం వాళ్ల ఇద్దరికి తల్లితండ్రులే విషం ఇచ్చి చంపిన వార్త పేపర్ లో చదివి తనకి కోపం వచ్చింది. ఇందులో మా తప్పు ఏమి ఉంది, మేము ఎందుకు ఇలా చనిపోవాలి అని అలోచించి ఇంకెవరూ ఇలా ధైర్యం కోల్పోకూడదు అనే ఉద్దేశ్యంతో 'సోల్ ఫ్రీ'(soulfree) సంస్థ స్థాపించి దాని ద్వారా ఎందరికో అవగాహన కలిపిస్తుంది. ఊరు ఊరు తిరిగి తనలాంటి వాళ్లలో చైతన్యం నింపుతుంది. ఆమె సేవలకు గుర్తింపుగా "కర్మవీర్ చక్ర " అవార్డు తో పాటు మరెన్నో గుర్తింపులు పొందింది.

తల తప్ప ఏమి పనిచేయని ప్రీతి ఇన్ని చేస్తే అన్ని బాగున్న మనం ఎంత చేయచ్చు?

"నా జీవితం ఇంతే, నా రాత ఇంతే, దేవుడు నాకు ఎందుకు ఇలా చేశాడో, ఆ రోజే నేను అమెరికా వెళ్ళిపోయి చదువుకున్నా బాగుండు" అని ఏడుస్తున్నంత కాలం ప్రీతి గదికె అంకితం అయింది. పది సంవత్సరాల తర్వాత కలిగిన తన కోపమే తనని తన డిప్రెషన్ లో నుంచి బయటికి తెచ్చి ఇవాళ ఎందరికో స్ఫూర్తిగా నిలబడేలా చేసింది.

మనకు కలిగిన నష్టానికి ఇతరులనో, వేరే పరిస్థితులనో నిదించడం మాని, ఉన్న సౌకర్యాలను అవకాశాలుగా మార్చుకోవాలి అనడానికి ఈ ప్రీతి కథే మనకు ఆదర్శం.



ప్రీతి శ్రీనివాసన్

కవిత

# మహిళా బిల్లు...!

డాక్టర్మ. హమ్మద్ హసన్
సెల్ :9908059234

"వరకట్న నిషేధ చట్టం" అచ్చి
కట్నం రూపుమాపిందా...?
"గృహహింస చట్టం" అచ్చి హింసను తగ్గించిందా..?
"నిర్భయ చట్టం" అచ్చి
"స్వేచ్ఛ"ను ప్రసాదించిందా...?
నేతి బీరకాయలో నెయ్యి కోసం వెతికినట్లు...!
"మహిళా బిల్లు"తో
చట్టసభలలోమహిళకు రక్షణ సాధ్యమేనా..?
సమాజంలో లేని రక్షణ
చట్టసభలలో దొరుకుతుందా..?
"ఎన్నికలు "ఖరీదైన ప్రహసనం అయినప్పుడు..
"సగటు మహిళకు" చట్టసభలలో స్థానం దక్కేనా...!
"ఓటరు" అవినీతిపరుడైతే
"పాలకుడు" హరిశ్చంద్రుడౌతా డా ..?
ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టనట్లు..
హింసించేవాడు ఇంట్లోనో, బజారులోనో పాగా వేసినప్పుడు..
మణిపూర్ లో "మానం" మంట కలిసినప్పుడు..
"ఉజ్జయిని "లో అర్ధనగ్నంగా ఆర్తనాదాలు చేసినప్పుడు..
"ఢిల్లీ దర్బార్ "లో కూర్చుని ఏం చేస్తాం..?
సమాజంలో లేని రక్షణ
చట్టసభలలో దొరుకుతుందా...?

కవిత

# ఇన్ని రోజులు



సుజాత రామానుజం
కరీంనగర్, 9014478998

శిశిరానికి దొరక్కుండా మట్టిలో ఒదిగిన
విత్తనం ......ఓ రెండు చిన్ని చిగురుటాకులేసుకుని
తొంగి చూస్తోంది ఆనందం తో విప్పారిన కళ్ళల్లే
వర్షాన్ని ఒలికిన మేఘం వైపు........
ఇంతకుముందేమో
తడి లేని తనువును చూసుకుని దిగులుతో
నిరారుగా నిలబడ్డ తరువులేమో
తనపై కురిసిన వాన జల్లుకు
చంటి బిడ్డ కిలకిలా నవ్వినట్టుగా
అమ్మ జోల పాట చల్లదనాన్ని హాయిగా
ఆస్వాదిస్తున్నట్టుగా..........కొమ్మ కొమ్మ జలదరిస్తూ.......
ఎడతెరిపి లేని జడివాన కాలువలై పారుతుంటే
సాగుకై రైతన్న ప్రాణం లేసొచ్చినట్టుగా
నాగలేమో సంబ్రంగ అతడి భుజాన్ని అట్టి
పొలం వైపు సాగుతూ.........ఇన్ని రోజుల
దిగులుని హొచ్చిపిట్ట ఎత్తుకుపోతుంటె
భూమిని నమ్మిన మనిషి కోసం
పొలం గట్టేమో అతడి అడుగుల ఒత్తిళ్లకై
దారిని సవరిస్తూ
పిలిచిన..... ప్రియమైన అతిథిలా వచ్చిన
నీరంతా చెరువుల్లో చేరుతుంటె
గట్టుకాడి చెట్టు కింద గొడుగేసుకుని
పొగలు పొగల చాయ్ వేడి వేడి పకోడీల
కాంబినేషన్లో ఆస్వాదిస్తూ నేను వర్షం వర్షం నేను మాటలులేని
మౌనం లోని ఆత్మీయతను
అనుభవిస్తూ...........

# బాల బహుళ






సాన్వి కలిత,
4 వ తరగతి
బెంగళూరు





శ్రేష్ఠ సాయి తుంగతుర్తి,
7 వ తరగతి
విశాఖపట్టణం






ఇషిక సిద్ది
3వ తరగతి
హైదరాబాదు





ఏవ సిద్ది
1 వ తరగతి U.S.





Diva Pre School

## కొత్త పుస్తకాలు



దాల్చ
(అసాధారణ బహుజన మహిళల కథలు)
రచయిత్రి: డా. కె.బి. సంధ్యావిప్లవ్
మొదటి ముద్రణ: 2023
వెల: రూ. 200/-
ప్రతుల కొరకు: 8978677018 / 9494555141



మిణుగురులు
(వ్యాసాలు).
రచయిత: చల్లపల్లి స్వరూపరాణి
పుటలు: 184
వెల: 200, మొదటి ప్రచురణ:2023
పర్ స్పెక్టివ్స్ ప్రచురణ



హోమ్ మేకర్
పుటలు -152, వెల-100/-,
మొదటి ప్రింట్ - 2023,
ప్రతులకు: నాంపల్లి రాములు, ఇం.నెం. 3-13-105/2,
శ్రీనివాస పురం, రామంతపూర్, హైదరాబాద్- 500013.
ఫోన్ : 9848059893, 9948319633



తర్కం (కవిత్వం)
కవయిత్రి: సోనీ కట్కూరి
మొదటి ఎడిషన్: జూలై 2022
ముద్రణ: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్
వెల:రూ. 150/
ప్రతుల కోసం: సోనీ కట్కూరి
+91 83742 61002 visitsonyjohn123@gmail.com

Printed at JD Publications, Hyderabad

Price : 100/-